
భారతి

సాహిత్య మాసపత్రి
నవంబరు 198



జనాభా విద్య
డా॥ బి. ఆర్. కె. రావు

రెక్కలు
డా॥ సి. నారాయణరెడ్డి

వేంపలి చెట్టుకు నిశ్చ్వసలు
పులికంటి కృష్ణారెడ్డి

పూసపాటి రాజులు
డా॥ కొర్లపాటి శ్రీరామమూర్తి

తెలుగు వాల్మీకి
దాశరథి

కృష్ణశాస్త్రి నిర్వేదం
ఆర్. ఎస్. సుదర్శనం

స్వేచ్ఛా సమ సమాజమై
మాదిరాజు రంగారావు

ఇంకా వెంకటేశ్వరరావు, లక్ష్మారెడ్డి - నాగమణి - సుదర్శన్, రామమోహనరాయ్, సూర్యప్రకాష్, కిశోరుబాబు—అశోకుబాబు, కేశవరావ్, మహేంద్ర, దిలావర్, రామకృష్ణమూర్తి, రెడ్డి, అప్పలస్వామి ఇతరుల రచనలు

వ్యవస్థాపకులు
దేశోద్ధారక నాగేశ్వరరావు పంతులు

భారతి

మాసపత్రిక

శివలెంక శంభుప్రసాద్

సంపాదకుడు

(1938-1972)

నవంబరు 1982

సంపుటము : 59 సంచిక : 11

విడిపత్రిక వెల నాలుగు రూపాయలు

విషయానుక్రమణిక

నవంబరు 1982

రెక్కలు

డా॥ సి. నారాయణరెడ్డి

సృష్టికి భూమ్యాకాశాలు రెక్కలు
కాలానికి దివారాత్రాలు రెక్కలు
సాగరాలకు తరంగాలు రెక్కలు
పర్వతాలకు శిఖరాలు రెక్కలు
చెట్లకు కొమ్మలు రెక్కలు
పూలకు రేకులు రెక్కలు.
అగుపించని రెక్కలవి.

అవి విచ్చుకుంటాయి
రోదసిని ఊదుకుపోయే పక్షులుగా.
అవి తెరలు విప్పుకుంటాయి
ఎదురుగాలిని చించుకుపోయే పడవలుగా.

కవి మస్తిష్కాన్ని చీల్చుకుని
ఎగిసేమంటలు ఆ రెక్కలే.

ఋషికంటి మూతల్ని ఒరుసుకుని
మెరిసే చూపులు ఆ రెక్కలే.

నడుం విరిగిన రోడ్లమూల్గులను
హోరు గొంతుకలుగా ఎగరేసే ఊరేగింపులూ
ఆ రెక్కలే.

తూట్లుపడిన పిక్కలను తూటాలుగా పేల్చేసి
ఉవ్వెత్తుగా గర్జించే ఉద్యమకంఠాలూ ఆ రెక్కలే.

చురుకెత్తిన సూర్యకిరణాలు
కొరడాలవుతాయి.
నిద్రించే నీళ్ళ వీపులమీద
ముద్రిస్తాయి మేలుకొలుపులను.

మగత చిట్లిన అలలగుర్రాలు
ఎగిరిపోయి ఆకాశం అడవుల్లోకి
కురిపిస్తాయి గర్జనలను
కొరడాలు కుంచించుకుపోయేటట్టుగా.

కొయ్యల రాపిడిలో పుట్టిన అగ్ని
వెయ్యి నాల్కలు సాచి
అరణ్యాలను కబళిస్తుంది.

భూగర్భం చెరల్లో నొక్కినా
చక్రటాళ్ళ పొరల్లో తొక్కినా
రెచ్చిపోయిన ఆ చిచ్చు
పెళ్లున ఎగిరొస్తుంది
విచ్చుకున్న మంటల రెక్కలతో.

అడుగుతుంది గాలి
'అగుపిస్తున్నానా' అని.
లేదంటే -
చెట్లజుట్లు విరబోసుకుని
శివమెత్తి ఆడుతుంది.
అప్పటికీ గమనించకుంటే
గుప్పున జడలు విదిల్చి
నేలమీద కునుకు తీసే ఎండుటాకులను
గాలిపడగలుగా
ఋసకొట్టిస్తుంది.

అడుగుతుంది గాలి
'వినిపిస్తున్నానా' అని.
లేదంటే -
వెదుళ్ళ పెదవులతో పాడి
గుహల నోళ్ళతో కహకహలాడి
తలుపుల చెవులను తట్టి పిలుస్తుంది.

అప్పటికీ వినిపించకుంటే -
ఉప్పొంగే సముద్రాలను వెంటబెట్టుకుని
ఉప్పెనల తప్పెట్లు మోగిస్తూ
తుఫాను భాషలో
బెదిరింపులను ఘోషిస్తుంది.

అడుగుతుంది గాలి
అసలు నేనంటూ ఉన్నానా అని.

ప్రశ్నించే గాలిని
పట్టించుకోకుంటే -
చలివేళ్ళతో ఒళ్ళంతా గిల్లుతుంది.

ఎండచేతులతో ఎడా పెడా వాయిస్తుంది.
అప్పటికీ గుర్తించకుంటే -
ఊపిరి పాయలను ఆపేసి
పీపుతట్టి చెబుతుంది
శ్వాసకోశాల్లో కదిలేవి తన రెక్కలేనని.

గడ్డికుప్పల్లా పడిఉన్న గుడిసెల్లో
గుడ్డపేలికల్లా చెదిరిపోయిన వాడల్లో
కళ్ళల్లో గుడ్డిదీపాలు పెట్టుకుని
నిట్టూర్పుల చింకిపాతలు చుట్టుకుని
తమ శరీరాలను తామే
శవాల్లా ఈడ్చుకుపోయే బతుకుల్లో
ఒక అడుగు కెరటంలా పొరలివస్తే
ఒక పిలుపు మెరుపులా పొడుచుకొస్తే
గుడిసెలు పిడికిళ్ళవుతాయి
వాడలు వజ్రధారలవుతాయి.


ప్రశ్నలను గొంతుల్లో పూడ్చేసుకున్న
బతుకులకు
హక్కుల రెక్కలొస్తాయి.

ఆ రెక్కల పుక్కిట్లో పుట్టే
ప్రభంజనం ధాటికి
ముక్కలు ముక్కలై కూలుతుంది
ముష్కరత్వం మరిగిన చీకటికోట.

ఈ నరాలు పారవేమిటి ?
ఈ స్వరాలు ఎగరవేమిటి ?
కొండ అంచుదాకా సాగిన
జలపాతం మడమలు తిరిగిపోతున్నా యేమిటి ?

క్షణం విశ్రమించని గాడ్పు
తననుతానే కొరుక్కుతింటూ
కుంటుతూ ఉందేమిటి ?
ఎందుకు పుట్టిందీ వ్యాధి
కాలం కట్టిందా
జ్వాలాముఖులకు సమాధి ?
ఒక సంచలనం -
మంచు గడ్డలు ఆవులించే శిరస్సులో
ఒక సంజ్వలనం -
పొగల సంకెళ్ళలో ఒగర్చే మనస్సులో.

నాభి ఉరుముతుంది
నాడి ఉరుముతుంది
కాలానికి ఎదురీదే ఆలోచన
ఎగురుతుంది దిక్కుల రెక్కలతో -
చీల్చే ఎల్లలను చెరిపేస్తూ
విశ్వాన్ని ఒకే అద్దంలో వీక్షిస్తూ.



క్షయాధికమాస నిర్ణయము

(గత సంచిక తరువాయి)

(3) "సంక్రాంత యస్స్యు ర్మేషాద్యాః చైత్రాదిషు యథాక్రమమ్
నియమో నభవేత్సోయం మలమాసే సమాగతే"
మలమాసే, క్షయమాసే -
"చైత్రాది మాసేషు యథాక్రమేణ మేషాదయో ద్వాదశ
రాశయస్స్యుః
శూన్యాధిమాసేషు సమాగతేషు చలంతి తేభ్యో నియతిం
వినాపి"

ఇత్యాది వచనములు, క్షయమాసము మేతత్పూర్వము నందు వచ్చు అసంక్రాంత మాసము అనగా సంసర్ప మాసము వీనికి - ఆ సంక్రమణము కలదే ఆ మాసము అగును అను నియమము లేదని ఘంటాపథముగ చెప్పుచున్నవి, కనుక తులా సంక్రాంతి లేకున్నను భాద్రపదానంతర మాసము సంసర్పాశ్వయుజమే గాని అధికాశ్వయుజము కాదు. తులా సంక్రాంతి అమావాస్య నతిక్రమించి శుక్ల ప్రతిపత్తులో కలిగినను సంసర్పాశ్వయుజానంతరము - ఆ మాసము కార్తికమే కాని, నిజాశ్వయుజము కాదు. నిర్ణయ సింధువులో -

శ్లో॥ ఊర్జే శుక్ల ద్వితీయాయాం తిథిషు స్వాతిఋక్షనే
మానవో మంగళ స్నాయీ నైవలక్ష్మ్యా వియుజ్యతే"

అను వచనముచే శుక్ల ద్వితీయ యందు స్వాతీ నక్షత్రముగల మాసము కార్తికమే యని స్పష్టముగ చెప్పబడినది. ఇది నిజాశ్వయుజ మనినచో పై వచనము విరుద్ధ మగుచున్నది. దీనికి తగిన సమాధాన మేమున్నది.

(4) "మాసద్వయేబ్ద మధ్యేతు సంక్రాంతి ర్నయదాభవేత్
ప్రాకృత స్తత్రపూర్వస్స్యా దధిమాస స్తధోత్తరః"

ఇత్యాది వచనములు, సంవత్సర మధ్యములో సంక్రాంతి రహిత మాసములు 2 వచ్చినప్పుడు పూర్వాసంక్రాంతము, ప్రాకృత మాసము, అనగా త్రింశద్దినాత్మకమగు సంసర్పమాస మనియు, క్షయ మాసము తరువాత వచ్చు అసంక్రాంతమాసమే అధికమాస మనియు తెలుపుచున్నవి.

(5) సర్వజ్ఞ మానవాచార్యులు ఈ విషయమును "అసంక్రాంతత్వ మాత్రేణ అధికత్వ ప్రసక్తి రయుక్తా, సంక్రాంతి రహిత యోర్ద్వయోర్మధ్యే పూర్వస్యాధికమాసత్వ నిషేధాత్" అని స్పష్టముగా చెప్పిరి, మరియు సంసర్ప శబ్దమును "అసంక్రాంతత్వేన, ఇతరాధిమాసవ త్కర్మానర్హతాయాం ప్రాప్తాయాం సత్యాం తదపవాదత్వేన కర్మార్హస్సన్, సమ్యక్సర్పతీతి సంసర్పః" అని నిర్వచించిరి. ఇది అధికమాసమే కానప్పుడు, దీని తరువాత మాసము నిజమాసము ఎట్లగును.

(6) శ్వేత వరాహాది కల్పములు, స్వారోచిషాది మనువులు, కృతాదియుగములు, ప్రభవాది సంవత్సరములు, 2 అయనములు, 6 ఋతువులు. చైత్రాది ద్వాదశమాసములు శుక్ల ప్రతిదాది త్రింశత్తిథులు ఆదిత్యాది వారములు, అశ్వన్యాది నక్షత్రములు మొదలగు కాల విభాజ కోపాధులన్నియు పౌర్వాపర్య నియమయుక్తములై ఒకటి పిమ్మట మరియొకటి రావలసి యున్నవేగాని ఏ రెండింటికి సమానకాలమున, ఆరంభ సమాప్తులు సంభవించవు, ఒక సంవత్సరములో బృహస్పతికి రాశిద్వయ సంక్రాంతి కలిగిన క్షయాబ్దము. ఒకమాసములో రవికి రాశి ద్వయ ప్రవేశము కలిగిన క్షయమాసము ఒక పక్షములో 2 అవమ తిథులు కలిగిన క్షయపక్షము ఒక దినముననే ఉదయా నంతరం ప్రవేశించిన తిథి మరుదినమున ఉదయాత్పూర్వమే సమాప్తమైన క్షయతిథి యనబడుచున్నది. క్షయాబ్దము వచ్చినను ప్రభవానంతరమే విభవ సంవత్సర మగుచున్నది. క్షయ పక్షమునందును-క్షయతిథియందును, తిథులకు పౌర్వాపర్య భంగములేదు. ఇట్టి స్థితిలో మార్గశీర్షానంతరము ఇదియే పుష్యమాసము ఇదియే మాఘమాసము అంట ఎట్లుకుదురును. పుష్య నక్షత్రము మఘానక్షత్రము ఒకటి కానంతవరకు పుష్యము మాఘము ఒకటి కాజాలవు. సంక్రాంతులు మాసములకు అనగా చాంద్రమాసములకు ఉపలక్షణములే కాని, లక్షణములు కావు, సూర్యసిద్ధాంత ప్రకారము

"కార్తికాదిషు మాసేషు కృత్తికాది ద్వయం ద్వయమ్
అంత్యోపాంత్యే పంచమశ్చ తధా మాసత్రయం త్రియమ్
"ద్వేద్వేబత్రాది తారాణాం పరిపూర్ణేందు సంగమే
భవేత్యబ్దే చాంద్రమానాః చైత్రాద్యా ద్వాదశ స్మృతాః

ఇత్యాది వచనములచే, "తత్తన్న క్షత్రయోగ యోగ్య పూర్ణిమాంతత్వం తత్తన్మాస లక్షణమ్" అని స్మృతి కౌస్తుభ, వాచస్పతి 2 శకృత ద్వైత నిర్ణయ వర్షకృత్యదీపక, కృష్ణభట్టీయ తిథి కృత్సమణి ప్రదీపిక, పితృమేధ సారసుధ విలోచనాది గ్రంథ పరిశీలనముచే స్పష్టమగుచున్నది. ఇది మా యొక్క సంక్షిప్తాభిప్రాయము. మా పంచాంగమునందలిక్షయమాసనమీక్షయు, మాచే పంపబడిన క్షయమాస తత్త్వ వివేకమును పరికించి ఇచట వ్రాయబడిన ముఖ్యాంశములను గ్రహించ ప్రార్థన.

(అయిపోయింది.)

శ్రీ చింతలపాటి వీర నీలకంఠ కుటుంబరామశాస్త్రి
శ్రీ చింతలపాటి వెంకట సోమదీక్షితులు

డాక్టర్ బి. ఆర్. కె. రావు

జనాభా విద్య అర్థము, అవసరము అధికారుల కర్తవ్యము

జనాభా ఘాత వృద్ధి

1976 మధ్యలో ప్రపంచ జనాభా 4.1 బిలియన్లని (1 బిలియన్ = 1000 మిలియన్లు) అంచనా వెయ్యబడింది. జనాభా పెరుగుదల వేగం 20వ శతాబ్దం మొదటి భాగంలో ఎక్కువయ్యింది. గత రెండు దశాబ్దాల్లోను జనాభా పెరుగుదల మానవ చరిత్రలో అంతకు ముందెన్నడూ లేనంత వేగంగా జరిగింది. 30 వేల సంవత్సరాల క్రిందట మానవుని ఆది స్వరూపమైన "క్రోమేగ్నన్ మాన్ కన్పించింది." ప్రపంచ జనాభా క్రైస్తవ శకం ప్రారంభంలో 250 మిలియన్లుంది. ఆ జనాభా 1830 నాటికి - అనగా ఒక మిలియన్ సంవత్సరాల్లో ఒక బిలియన్ అయ్యింది. ఆరోగ్య పరిస్థితుల మెరుగుదల, విజ్ఞాన శాస్త్రంలో వచ్చిన అభివృద్ధి కరమైన మార్పులు 1930 నాటికి జనాభాను 2 బిలియన్లకు పెంచినవి. తరువాత 30 సంవత్సరాల్లో 1960 నాటికి జనాభా 3 బిలియన్లయ్యింది. తదుపరి పదిహేను సంవత్సరాల్లోనే 1975 నాటికి జనాభా 4 బిలియన్లయ్యింది. నేడున్న జనాభావృద్ధిరేటే కొనసాగితే 1980 చివరి నాటికి - ఇంతవరకు చనిపోయినట్లు చరిత్రలో కన్పించే జనసంఖ్య కంటె, జనాభా ఎక్కువగా ఉంటుంది. ప్రతి సంవత్సరం 140 మిలియన్లు, అనగా 14 కోట్లబిడ్డలు ప్రపంచంలో పుడుతున్నారు. చనిపోయే పెద్ద, చిన్నను ఇందులో నుండి తీసివేస్తే ప్రతి సంవత్సరం ప్రపంచ జనాభాకు 75 నుండి 80 మిలియన్ల వరకు అదనంగా చేరుతున్నారు. ఏదో ఒక విచిత్ర సంఘటన జరగకపోతే, మనలో చాలమంది బ్రతికి ఉండగానే 20 సంవత్సరాలలో 2 వేల సంవత్సరం నాటికి ప్రపంచ జనాభా 7 బిలియన్లు అవుతుంది. అప్పటికి ఆసియా జనాభా 4 బిలియన్లుగా ఉంటుంది. ఇంత పెద్ద జనాభాను పోషించడానికి సకమతం కావలసి వస్తుంది. 2030వ సంవత్సరం నాటికి అప్పటికుండే జనాభాను ఇప్పటి కున్న జీవన ప్రమాణంతో సరితూగేటట్లు పోషించడానికి ఇప్పటి అహార రాశికి రెట్టింపు పండిస్తే గాని సరిపోదని ప్రముఖ ఆహారోత్పత్తి శాస్త్ర నిపుణుడు నార్మన్ బోర్‌లాగ్ చెప్పాడు.

భారత జనాభా పెరుగుదల

తృతీయ ప్రపంచంలోని ఏదేశంలోకంటె కూడా ఇండియా వనరులమీద జనాభా వత్తిడి ఎక్కువగా ఉన్నది. మనవి అతి పరిమిత వనరులు. అవసరాలు మాత్రం అపరిమితంగా ఉన్నాయి. ఈ రెంటికి సర్దుబాటు కావడంలేదు. మొదట్లో భారత జనాభా నెమ్మదిగానే పెరిగింది. కొంతకాలం స్థబ్దస్థితిలో కూడా ఉంది. గత అర్ధ శతాబ్దంనుండి మాత్రమే వేగంగా పెరుగుతోంది. క్రీస్తుశకానికి ముందు 3 వందలవ సంవత్సరం నాటికి భారత జనాభా 100 నుండి 140 మిలియన్ల వరకు ఉన్నది. క్రీస్తుశకం 1వ సంవత్సరం నాటికి ప్రపంచ జనాభా 250 మిలియన్లు మాత్రమే ఉన్నప్పుడు క్రీ॥ పూ॥ 300వ సంవత్సరంలో భారత జనాభా 140 మిలియన్ల వరకు ఉండటము చాలాఎక్కువేననక తప్పదు. కాని రెండు వేల సంవత్సరాలు అనగా క్రీ॥ శ॥ 1600వ సంవత్సరం వరకు మరణ రేట్లు జనన రేట్లకంటె ఎక్కువగా ఉండి జనాభాను పెరగనివ్వక పోవడంవల్ల జనసంఖ్య స్థబ్దస్థితిలో పడిపోయింది. క్షామము, అంటురోగాలు ఈ స్థితి రావడానికి తోడ్పడినవి. క్రీ॥ శ॥ 1600వ సంవత్సరం నాటికి బర్మా శ్రీలంకలతో కలిసిన భారత ఉపఖండంలో జనాభా 100 నుండి 130 మిలియన్ల వరకు ఉన్నది. అప్పటికి ప్రపంచ జనాభా 500 మిలియన్లు మాత్రమే. భారత జనాభా 2½ శతాబ్దాలలో 1850 నాటికి 150 మిలియన్లయ్యింది. అనగా 250 సంవత్సరాల్లో భారత ఉపఖండం జనాభా 20 మిలియన్లు పెరిగింది. 1920 నుండి జనాభావృద్ధి ప్రవృత్తి మారింది. 1920 వరకు నెమ్మదిగా జరిగిన భారత జనాభావృద్ధి 1921 నుండి వేగంగా జరగనారంభించింది. 1872 నుండి 1921 వరకు 60 మిలియన్లు పెరిగిన భారత జనాభా 1921 నుండి 1971 వరకు 296 మిలియన్లు పెరిగింది.

అనగా శతాబ్దం మొదటి భాగంలో ఉన్న పెరుగుదలకు అయిదు రెట్లన్నమాట. 1971లో జరిగిన మనజనాభా లెక్కల ప్రకారం భారత జనాభా 547.9 మిలియన్లు. 1961 లో 439.20 మిలియన్లున్న భారత జనాభా 1971 నాటికి 547.90 మిలియన్లుకాగా ఒకదశాబ్దంలో 108.70 మిలియన్లు అనగా ఆదశాబ్దంలో 24.8 శాతం పెరిగిందని తెలుస్తోంది. 1951 కి 1961 కి మధ్య ఈ పెరుగుదం 21.64 శాతం మాత్రమే. మరల భారత జనాభా 1971 లోని 547.90 మిలియన్ల నుండి 1976 కు అనగా 7 సంవత్సరాల్లో 600 మిలియన్లకు పెరిగి 53 మిలియన్లు లేదా 2.5 శాతము సాలీనా పెరుగుదల రేటును చూపింది. 1985 నాటికి భారత జనాభా 807 మిలియన్లను మించ గలదని అంచనా. అనగా దాదాపు దశాబ్దంలో 207 మిలియన్లు పెరుగుతుందని అంచనా. ఈ భారతదేశ జనాభా 2001వ సంవత్సరం నాటికి ఒక బిలియన్ అనగా వెయ్యి మిలియన్లు కావచ్చని జనసాంఖ్యక శాస్త్రజ్ఞుల అంచనా.

ఆర్థిక పరిస్థితి క్షీణింపు

850 నుండి 900 మిలియన్ల వరకు ఉన్న చైనా జనాభా ప్రపంచంలోని మొదటి పెద్ద జనాభా - కాగా 600 మిలియన్లను మించిన భారత జనాభా రెండవ పెద్దది. 1971 నాటి కున్న 548 మిలియన్లలో, అయిదు సంవత్సరాల వయస్సుకు తక్కువ ఉన్న వారిని తీసివేయగా మిగిలిన వారిలో 33.8 శాతం మాత్రమే అక్షరాస్యులు. కాగా మగవారిలో 45.3 శాతము, ఆడవారిలో 21.5 శాతము మాత్రమే అక్షరాస్యులు. మనలో 1968-69లో గ్రామీణులలో 48 శాతము, పట్టణ వాసుల్లో 50 శాతము మాత్రమే అక్షరాస్యులు. భారతప్రజల్లో చాలమంది ఒకరోజుకు కావలసిన 2250 కేలరీల శక్తినిచ్చే ఆహారాన్ని కొనలేని పేదరికంలో ఉన్నారు. అమెరికా సంయుక్త రాష్ట్రాల్లో ప్రతి ఒకరికి సగటున 3110 కేలరీల ఆహారం ప్రతిరోజు అందుతోంది.

ప్రపంచంలో వర్షపాతం తగ్గుతోంది. పెరుగుతున్న జనాభాకు త్రాగడానికి, పంటలు పండించడానికి, పరిశ్రమలను నిర్వహించడానికి తగినంత నీరు చాలని స్థితి ఏర్పడుతోంది. ఇళ్ల కట్టడంవల్ల పంటభూమి తరిగిపోతోంది. అడవులను - వంటచెరుకు గాను నరికివేయడంవల్ల వర్షాలు తగ్గుతున్నవి. సాంప్రదవ్యవసాయ నిర్వహణకుపయోగించే రసాయనిక ఎరువులవల్ల, పరిశ్రమలు, వాహనాలు వదిలే పొగవల్ల, మలిన పదార్థాలవల్ల, మరుగుదొడ్ల వసతిలేని మనుష్యులు విసర్జించే మలమూత్రాదులవల్ల, విచ్చల విడిగాతిరిగే పశుపక్ష్యాదులువదిలే మలమూత్రాదులవల్ల, అణుధార్మిక శక్తి వదిలే మాలిన్యం వల్ల వాతావరణ కాలుష్యం బాగా పెరుగు తోంది. ఎన్ని గృహాలు నిర్మించినా పెరుగుతున్న జనాభాకు వాటి కొరత తీరటంలేదు. ఆదాయం తక్కువగా ఉన్న ప్రజలు వైద్య, విద్యా, సాంకేతిక శిక్షణ సదుపాయములు పొందలేకపోతున్నారు. వైద్య, రవాణా, వార్తా వాహక సౌకర్యాలు అందడం కష్టమై పోతోంది. ప్రజలందరికీ కావలసిన వస్తువుల్ని తయారుచేయడానికి పరిశ్రమలు పూనుకోవడంతో ప్రపంచ వనరులు వేగంగాతగ్గిపోయి శూన్యస్థితికి వచ్చే ప్రమాదం ఏర్పడుతోంది. పట్టణాల్లో, పల్లెల్లో ప్రజలు క్రిక్కిరిసి పోవడంవల్ల మురికి, అపరిశుభ్రత ఏర్పడు తున్నవి. జనాభా పెరుగుదలవల్ల మాతా శిశు మరణాలు హెచ్చే ప్రమాదంకూడా ఏర్పడింది. ముంచుకొస్తున్న జనాభా పెరుగుదల, దానివృద్ధి రేటు పెరుగుదలవల్ల వచ్చే ప్రమాదాన్ని గురించి ప్రజలకు నచ్చజెప్పి జననరేటును, జనాభా పెరుగుదలను తగ్గించేందుకు జనన నియంత్రణ, కుటుంబ నియంత్రణ, తద్వారా జనాభా నియంత్రణ చేసేటట్లు పూనుకోవడానికి కావలసిన రీతిలో ప్రజలనుజనాభా విషయ విజ్ఞుల్ని చేసే విద్యను ఇస్తే మినహా మనం ప్రమాదం నుంచి బయట పడటానికి వీలుండదు. ముఖ్యంగా శాస్త్ర సాంకేతిక విజ్ఞానాలు మరణ రేటును తగ్గిస్తున్నప్పుడు, పెరిగే జనాభాను తగ్గించడానికి జనన రేటును తగ్గించితే మినహా జనాభా వృద్ధిరేటు శూన్యంకాదని ప్రజలలోని అన్ని వయస్సుల వారికి - ముఖ్యంగా పునరుత్పత్తి చేయగల వయస్సులో ఉన్న స్త్రీ పురుషులకు - నచ్చజెప్పి జనాభా పెరుగుదలను అరికట్టించాలి.

ఆదాయ సంక్షేమాల పతనం

భారతదేశంవంటి అల్పాభివృద్ధి దేశాల ప్రజలకు తెలియ జెప్పవలసింది ఇంకా చాలా ఉంది. ఈ దేశాల్లో జనాభా పెరుగు తున్నకొలది జాతీయాదాయంలోని గణనీయమైన భాగం పెరుగు తున్న జనాభాను పోషించడానికి 'జనసాంఖ్యక పెట్టుబడి" క్రిందికిపోయి ఆర్థికాభివృద్ధికి పెట్టుబడి చేయడానికి మూలధనం చాలదు. అందువల్లఆర్థిక రంగాలను అభివృద్ధి, చెయ్యలేమిసరికదా, నిరుద్యోగాన్ని తొలగించే అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం

కష్టము. ఇలాంటి స్థితిలో తలసరి ఆదాయము పెరగదు సరికదా, పడిపోతుంది కూడా. అందువల్ల వ్యక్తి ఆదాయము, కుటుంబ ఆదాయము తగ్గినారు చేసే వినియోగాలు తగ్గి, వ్యక్తి సంక్షేమాలు తరిగి, దేశ సంక్షేమము పెరగదు. అంతేగాక వారికి వైద్య, విద్యాభ్యాస సౌకర్యాలు అందకపోవడంవల్ల వారి ఆరోగ్యము, కార్య నిర్వహణ నైపుణ్యము, కార్యనిర్వహణ సామర్థ్యము తగ్గి, ఉత్పత్తి పెంపుచెందక, జాతీయాదాయం పెరగక దేశప్రజలు పేదరికంలో పడగా, జనసంక్షేమానికి పూర్తిగా దెబ్బతగుల్తుంది. అందువల్ల జనన రేటును, మరణరేటు మేరకు దించి, జనాభావృద్ధి రేటును శూన్యంచేసి, జనాభాను స్థిరసంఖ్యకు తేవలయునని, ప్రజలకు జనాభా విద్య బోధింపవలసిన ఆవశ్యకత ఉన్నది. భారతదేశంలో జనాభావృద్ధి వేగంగా సాగడం వల్లనే ప్రణాళికల నిర్వహణకు మూలధనము కొరత కావడము, ప్రణాళికా లక్ష్యాలు సిద్ధించక పోవడము, నిరుద్యోగ సమస్య పరిష్కారం కాకపోవడము, పేదరికము తగ్గక పోవడము జరుగుతోంది.

జనాభా విద్య

కుటుంబంలోను, సమాజంలోను, జాతిలోను, ప్రపంచంలోను ఉన్న జనసంఖ్య స్థితిని అధ్యయనం చేయడానికి, ఈ స్థితి ఎడ విద్యార్థుల్లో సహేతుక, బాధ్యతాయుత వైఖరిని, ప్రవర్తనను ఏర్పరచడానికి, తోడ్పడే విద్యాభ్యాస కార్యక్రమాలను ఏర్పరచినట్టి విద్య జనాభా విద్యఅని చెప్పబడుతున్నది. ఇకముందు చెప్పబోయే విషయాలో విద్యార్థికి జ్ఞానాన్ని అందించడము జనాభా విద్య ఆశయము. 1) ప్రాతిపదిక జనసాంఖ్యక భావనలు, ప్రక్రియలు, అధ్యయన పద్ధతులు. స్థానిక, ప్రాంతీయ, జాతీయ, ప్రపంచ, జనాభా దత్తాంశాలను సేకరించి, విశ్లేషించి, మదింపుచేయుట. జనన, మరణ, ప్రవాస వృద్ధిరేట్లను, వయోచక్ర వివరాలను, వివిధ సారవత్వ సూచికలను, జనాభా దత్తాంశాలను గుణాత్మక లక్షణాలను వివరించుట. 2) సూక్ష్మ స్థూలస్థాయిలలో జనాభాస్థితికి స్థిర, గతిశీల వివరణ నిచ్చుట. తగ్గుతున్న మరణ రేట్ల మీద నొక్కిపెడుతూ, కుటుంబం, సమాజం, జాతి, ప్రపంచాలలో జనాభావృద్ధి ప్రవృత్తి ఎలా ఉందో చెప్పుట. ఆ ప్రవృత్తుల ననుసరించి స్థానికంగాను, జాతీయంగాను, ప్రపంచమంతటా జనసంఖ్యలలో వచ్చే మార్పుల చరిత్రను తెలియజేయుట. 3) జనాభావృద్ధిని నిర్ధారించే శక్తుల వివరణ. కుటుంబ పరిమాణానికి సంబంధించి అసలులో ఉన్న సాంఘిక నియమాలను వివరించుట. ఒక బిడ్డకు, తరువాత కలిగే బిడ్డకు మధ్య జననకాలవ్యవధిని నిర్ణయించడానికి ఆచరణలో ఉన్న సాంఘిక నియమాలను తెలియజేయుట. స్త్రీ యొక్క సారవత్వ ప్రవర్తనమీద ఆర్థిక, మానసిక కారకాలుచూపే ప్రభావాన్ని విశదీకరించుట. ఈ మానసిక, ఆర్థిక కారకాలు మరణాలను, ప్రవాసాన్ని ఎలా ప్రభావితం చేస్తాయో తెలియజేయుట. ఇదే కారకాలకు పశు, వృక్ష జనాభాలమీద ఉండే ప్రభావాన్ని గురించి కూడ విపులీకరించుట. 4) జనాభా వృద్ధివల్ల వచ్చే వివిధ రకాల ఫలితాలను వివరించుట. జనాభావృద్ధికి సాంఘిక, ఆర్థికాభివృద్ధి స్థూల స్థాయికి మధ్య ఉండే సంబంధాన్ని తెలియజెప్పుట. 5) తల్లికి పిల్లలకు ఆరోగ్య సంక్షేమాది సేవలు, గృహవసతి లభ్యం కావడం మీద జనాభావృద్ధి వేగం ఎట్టి ప్రభావాన్ని చూపుతుందో తెలియపర్చుట. 6) హెచ్చు జనసాంద్రత ఏర్పర్చే మానసిక, సామాజిక ఫలితాలను విపులీకరించుట. పెద్ద పరిమాణంలో ఉన్న జనాభాలు వేగంగా వృద్ధిచెందుతూ, వనరుల్ని వేగంగా ఉపయోగించడంవల్ల పరిసరాలలో కలిగేమార్పులను వివరించుట. 7) జనాభా వేగంగా పెరగడంవల్ల కుటుంబ జన సంఖ్యలోను, సమాజ జనవృద్ధిలోను, ఆహార లభ్యతలోను వచ్చే మార్పులను ఎరుకపర్చుట. 8) జనాభావృద్ధికి, సహజ వనరుల లభ్యతకు మధ్యనుండే సంబంధాన్ని తెలియజేయుట. 9) మానవ సారవత్వాన్ని అర్థం చేసుకోవడానికి మానవ పునరుత్పాదన ప్రక్రియ ప్రాతిపదికం ఎలా అవుతుందో తెలియపర్చుట. 10) జాతీయ, అంతర్జాతీయ జనాభా విధానాలను, నియంత్రణ కార్యక్రమాలను వివరించుట. స్వదేశ జనాభా విధానాలు ఎలా మారుతున్నవి ? దేశం లోపల, సమాజం లోపల కుటుంబ నియంత్రణ కార్యక్రమాలు ఎలా పనిచేస్తున్నవి ? ఇతర జనాభా కార్యక్రమాలెలా అమలుజరుగుతున్నవి ? జనాభా కార్యక్రమాలలో అంతర్జాతీయ సంస్థలు ఎటువంటి పాత్రను నిర్వహిస్తున్నవి ? అనే విషయాలను తెలియజెప్పుట. 11) కుటుంబ పరిమాణం ఎడ, జాతీయ జనాభా కార్యక్రమాల ఎడ సహేతుకమైన బాధ్యతాయుత వైఖరులుండవలసిన అగత్యాన్ని విశదీకరించుట. 12) అప్పటి పరిస్థితుల్లో ఉండదగిన సంతాన సంఖ్యను, ఒకబిడ్డకు తరువాత బిడ్డకు మధ్య ఉండవలసిన జననకాలవ్యవధిని బాధ్యతతో సహేతుకంగా నిర్ణయించాలని తెలియజెప్పుట. బాధ్యతకల్గి, సహేతుక ప్రవర్తనతో జనాభా కార్యక్రమాలను అమలు జరపవలసిన

అవసరాన్ని విశదీకరించుట 13) కుటుంబ జీవన వైశిష్ట్యాన్ని, వ్యక్తి వికాసాన్ని కుటుంబ పరిమాణం ఎలా ప్రభావితం చేస్తుందో వివరించుట 14) కుటుంబ నియంత్రణ, జనాభా నియంత్రణలను జనాభా విద్యలో బోధించినప్పటికీ అవి మాత్రమే పూర్తి జనాభా విద్యకావు. 15) జీవన గుణవిశిష్టతకు, లైంగిక విషయాలకు ఉన్న సంబంధాన్ని వివరించినప్పటికీ, జనాభా విద్య లైంగిక విద్య అని చెప్పడం సబబు కాదు.

జనాభా సమస్య భారత దేశానికి పెద్ద తలభారం కల్గిస్తోంది. జనాభా విద్య ఈ సమస్యా పరిష్కారానికి తోడ్పడగలదు. అయినా తగినన్ని విద్యాలయాలీ విద్యా బోధనకు, వ్యాప్తికి పూను కోక పోవడము నిర్లక్ష్య వైఖరిని తెలియజేస్తోంది. జనాభా సమస్యను జనాభా విద్య జయప్రదంగా పరిష్కరించడానికి ఈ పరిస్థితులు కావాలి. 1) పక్షపాతం లేకుండా ఉపాధ్యాయులకు ఆ రంగంలో శిక్షణ ఇచ్చి; తగిన ప్రవీణుల్ని తయారుచేసి, వారిని జనాభా విద్యా బోధనా పరిశోధనలకు నియమించాలి. 2) తగిన జనాభా విషయ గ్రంథాలను ఇంగ్లీషులోను, ప్రాంతీయ భాషల్లోను ప్రభుత్వం ప్రచురించాలి. తెలుగులో జనాభా విద్యపై పాఠ్యగ్రంథ ప్రచురణ జరగకపోవటం వల్ల కళాశాలల్లో జనాభా విద్యను పాఠ్య విషయంగా ప్రవేశ పెట్టడానికి అంతరాయం కల్గింది. తెలుగు ఎకాడమి ఈ విషయంలో కృత కృత్యం కాలేక పోయింది. జనాభా విద్యలో తెలుగు గ్రంథాల ప్రచురణకు అడ్డుతగిలే మానవ భౌతిక ఆటంకాలను తొలగించాలి 3) ప్రభుత్వం శ్రద్ధ తీసుకుని జనాభా విద్య రంగంలో తగిన ఉపాధ్యాయ, అధ్యాపకుల్ని నియమించేటట్లు చెయ్యాలి. తగిన స్థాయికి రాని వారిని ఈ రంగంలో ఉంచరాదు. 4) విద్యార్థులకు, సంతానాన్ని కనేవయస్సులో ఉన్న దంపతులకు, జన సామాన్యానికి వారికి తగిన స్థాయిల్లో, విడివిడిగా, జనాభా విద్యను బోధించడానికి అందుకు తగ్గ శక్తిగల ఉపాధ్యాయుల్ని నియమించాలి. ఈ మూడు స్థాయిల్లోను జనాభా విద్యను బోధిస్తూ, పరిశోధనను సాగించగల ప్రవీణులకు తప్పక ప్రాధాన్యత నివ్వాలి. 5) ప్రస్తుతము పనిచేస్తున్న జనాభా విషయాధ్యయన శాఖలను బల పర్చడానికి, ప్రయోజనం లేని శక్తుల్ని త్రోవనుండి తొలగించి గుణ వైశిష్ట్యంగల ఉపాధ్యాయుల్ని నియమించాలి. ఇందువల్ల ఇందుపై పెట్టుబడి చేస్తున్నధనం నిరుపయోగంకాకుండా ఉంటుంది. 6) ప్రతి తరగతిస్థాయిలోను జనాభావిద్యను ఎంతోకొంత బోధించుట అవసరము. తెలుగుదేశంలో తెలుగుభాషకు చెందిన విద్యాప్రవీణులే జనాభా విద్యారంగాన్ని పటిష్టం చేయగలరనుట నిర్వివాదాంశము.



డాక్టర్ కోర్లపాటి శ్రీరామమూర్తి

పూసపాటి రాజుల పూర్వ చరిత్ర

విజయనగర సంస్థానమునకు అధిపతులు పూసపాటి రాజులకు మూలపురుషుడు అమలరాజు. విజయనగర సంస్థానమునకు మొదటి అధిపతి రఘునాథరాజు. అమలరాజు మొదలు రఘునాథరాజు వఱకు పూసపాటి రాజవంశ వర్ణనము పూసగ్రుచ్చినట్లు పూసపాటి తమ్మిరాజు కృష్ణవిజయము నందు కలదు. అందు అమలరాజునకు, రఘునాథరాజునకు నడుమ పది తరములు కలవు. అమలరాజు మొదటితరమైన, రఘునాథరాజు పదకొండవతరము. నాల్గవ తరములోని రాచిరాజు గుఱించి, అయిదవ తరములోని తమ్మిరాజు గుఱించి, ఆఱవతరంలోని రాచిరాజు గుఱించి, ఎనిమిదవతరములోని కృష్ణరాజు గుఱించి చరిత్ర విషయములు కలవు. నాల్గవతరములోని రాచిరాజును మొదటి రాచిరాజు అని, ఆఱవ తరములోని రాచిరాజును రెండవరాచిరాజు అని వ్యవహరించుట కలదు. అది ప్రామాణికము. అయిదవ తరములోని తమ్మిరాజును రెండవ తమ్మిరాజు అని వ్యవహరించుట కలదు. ఇది ప్రామాణికము. రెండవ తరమునందు ఒక తమ్మిరాజు, మూడవ తరము నందు మఱొక తమ్మిరాజు కలరు. కనుక అయిదవ తరములోని తమ్మిరాజు మూడవతమ్మిరాజు.

మొదటి రాచిరాజు గుఱించి కృష్ణవిజయము నందు ఇట్లు కలదు—

'చాళుక్య వీరరాజ్య స్థాపనాచార్య
        బిరుదంబు పూను బంధురయశుండు
ప్రౌఢదేవేంద్రభూపాల సన్మాన్యుడై
        రాజ్యపట్టముగన్న రాజనుతుడు
ధృతిదామెరాధీశు తిమ్మన నోడించి
        యరికాపుఁజేసిన పురుషవరుడు
మ్లేచ్ఛరాజులఁ గెల్చి మేలు బల్ దుర్గంబు
        లాక్రమించిన విక్రమాధికుండు

ధార్మికాగ్రణి షోడశ దానకర్త
మన్నెరాయ సురత్రాణమాళవాధి
పతి శిరశ్శూల సకలార్యబాంధవాంక
సహితుడగు తమ్మవిభు రాచశౌరివెలయు' (ప. 111, 1 ఆ.)

ఇందు మొదటి రాచిరాజు 1. చాళుక్య వీర రాజ్యస్థాపనాచార్య. మన్నెరాయ సురత్రాణ, మాళవాధిపతి శిరశ్శూల బిరుదములు కలవాడని; 2. దామెర తిమ్మనను ఓడించిన వాడని; 3. మ్లేచ్ఛరాజులను గెలిచి అనేక దుర్గములను ఆక్రమించినవాడని, 4. ప్రౌఢదేవరాయలచేత సమ్మానితుడై రాజ్యపట్టము గన్నవాడని కలదు. ఇట్లు పదునేడవ శతాబ్ది నుండి పూసపాటి రాజకవుల, తదాస్థానకవుల ఇతర గ్రంథము లందును కలదు.

ప్రౌఢ దేవరాయలు విజయనగర సామ్రాజ్యాధిపతి. అతని చేత సమ్మానితుడై రాజ్యపట్టముగన్న మొదటి రాచిరాజు మొదట ప్రౌఢదేవరాయల సేనాధిపతిఅగును. అతడు మ్లేచ్ఛరాజులను గెలిచి అనేక దుర్గములను ఆక్రమించినట్లు కలదు. అందు ఒక దుర్గమునకు తర్వాత ప్రౌఢదేవరాయలు పట్టము గట్టును. మ్లేచ్ఛరాజులన బహమనీసుల్తానులు. బహమనీసుల్తానులను గెలిచి బహుదుర్గములను కైవసము చేసికొన్న ప్రౌఢదేవరాయలు రెండవదేవరాయలు. అతని రాజ్యకాలము నందు 1443వ సంవత్సరము నాటికి విజయనగర సామ్రాజ్యము సుదూరము విస్తరించినది.[1] కనుక మొదటి రాచిరాజు ప్రౌఢదేవరాయలచేత సమ్మానితుడై రాజ్యపట్టము గన్న కాలము 1445 వ సంవత్సరము కావచ్చును.

ఇక దామెర తిమ్మన. ఇతడు కటక సామ్రాజ్యాధిపతి కపిలేంద్ర గజపతికి సామంతరాజు. ఇతని గుఱించి ఒక చాటుపద్యము కలదు.[2]

'కటకంబులోపలి గజవాడ బెజవాడ
        యొద్ది బండారిల్లు యోరుగల్లు
తోటకూరంగళ్ళు తొండమూరయగుళ్ళు
        పెరటి బచ్చలితోఁట బెడద కోట
వీరపుంగవులకు వేటలు మాడెలు
        మణికి విహారంబు మాహురంబు
గజయూధములఁగట్టుఁగంబాలు గంబాలు
        పట్టణంబు గురాలపల్లె ఢిల్లి

ఇట్టి గజరాజు శౌర్యంబు లెన్నిచూడ
కొలది మీఱిన దేవరకొండ కొండ
సీమ కోగ్గంటి సింహంబు నిఖిల బిరుదు
దిశల ములుసూపు దామెర తిమ్మభూప'

ఇందు గజపతి శౌర్యమునకు నిదర్శనములైన బెజవాడ, ఓరుగల్లు, తొండమారయగుళ్ళు, బెడదకోట, మాడెలు, మాహూరము, కంబము, ఢిల్లి, దేవరకొండ దామెర తిమ్మన వంక ముల్లు చూపునని కలదు. అనగా కపిలేంద్రగజపతి అవి జయించుటకు దామెర తిమ్మన ముఖ్యకారణమని అర్థము.

కపిలేంద్రగజపతి 1458వ సంవత్సరమునందు ప్రకటించిన వెలిగలని శాసనము నందు విజయనగర సామ్రాజ్యము కంపించినట్లు మాత్రమే కలదు.[3] (హంపాకంపమగాత్) అప్పటి విజయనగర సామ్రాజ్యాధిపతి మూడవ ప్రౌఢదేవరాయలైన మల్లికార్జునరాయలు. అతనికాలము నందు గంగాధరుడు రచించిన గంగాదాసప్రతాపవిలాసము నందు మల్లికార్జునరాయలు కపిలేంద్రగజపతితోడి యుద్ధము నందు గెలిచినట్లు కలదు.[4] అప్పుడు, రెండవ దేవరాయలచేత రాజ్యపట్టము గన్న మొదటి రాచిరాజు దామెర తిమ్మనను ఓడించుట అనుకూలము. కనుక మొదటి రాచిరాజు దామెర తిమ్మనను ఓడించిన కాలము 1456వ సంవత్సరము కావచ్చును.

మఱి, చాళుక్య వీరరాజ్య స్థాపనాచార్య, మన్నెరాయ సురత్రాణ, మాళవాధిపతి శిరశ్ఛేద బిరుదములు కపిలేంద్రగజపతికి సంబంధించినవి. దామెర తిమ్మన ముఖ్యకారణముగ, కపిలేంద్రగజపతి మాహూరమును జయించినట్లు కలదు. కనుక బహమనీ సుల్తాను అలాఉద్దీనుతోపాటు కపిలేంద్రగజపతి మాళవాధిపతి మహిమూద్‌ను 1455వ సంవత్సరము నందు జయించినట్లు నేలటూరి వేంకట రమణయ్యగారి సమన్వయము.[5] కనుక మాళవాధిపతి శిరశ్ఛేద బిరుదము 1455వ సంవత్సరము నందు కపిలేంద్రగజపతికి లభించును. దామెర తిమ్మన ముఖ్యకారణముగ కపిలేంద్ర గజపతి జయించినట్లు కల మాడెములు సప్తమాడియములు. అవి గంజాముజిల్లాలోని మన్యప్రాంతములు.[6] అవి కపిలేంద్రగజపతి 1443వ సంవత్సరము నాటికే జయించినవి.[7] కనుక మన్నెరాయ సురత్రాణ బిరుదము 1443వ సంవత్సరము నందు కపిలేంద్రగజపతికి లభించును. ఇక ఎలమంచిలి రాజధానిగ ఏలిన తూర్పు చాళుక్యుల కళింగరాజ్యమును కపిలేంద్రగజపతి 1443వ సంవత్సరము నాటికే జయించినది.[8] జయించిన కళింగరాజ్యమునందు ఒక చాళుక్యవీరుని సామంతరాజుగ కపిలేంద్రగజపతి స్థాపించుట సహజము. కనుక చాళుక్య వీరరాజ్యస్థాపనాచార్య బిరుదము కూడ 1443వ సంవత్సరము నందు కపిలేంద్రగజపతికి లభించును. రాజ బిరుదావళి మంత్రి సామంత ప్రభృతులకు మాత్రము రాజలాంఛనములుగ సంక్రమించుట సంప్రదాయము. రెండవ దేవరాయలచేత రాజ్యపట్టము గన్న, కపిలేంద్రగజపతి సామంతరాజైన దామెర తిమ్మనను ఓడించిన, మొదటి రాచిరాజునకు కపిలేంద్రగజపతి బిరుదములు సంక్రమించిన, అతడు కాలక్రమమున కపిలేంద్రగజపతి సామంతుడు కావలయును. కనుక మొదటి రాచిరాజునకు చాళుక్య వీరరాజ్యస్థాపనాచార్య' మన్నెరాయ సురత్రాణ, మాళవాధిపతి శిరశ్ఛేద బిరుదములు సంక్రమించిన కాలము 1457 వ సంవత్సరము కావచ్చును.

మొదటిరాచిరాజు మూడవకొడుకు మూడవతమ్మిరాజు 1458వ సంవత్సరము నందు సకుటుంబ బంధుమిత్ర పరివారముగ బెజవాడ వచ్చినట్లు ఒక శాసనము కలదు.[9] అంతేకాదు. మూడవ తమ్మిరాజు 1458వ సంవత్సరము నందు శౌర్యోన్నతిని పొందుచున్నట్లు ఒక చాటుపద్యమును కలదు.[10] ప్రౌఢ దేవరాయలచేత రాజ్యపట్టము గన్న మొదటి రాచిరాజు 1457వ సంవత్సరము నందు కపిలేంద్రగజపతికి సామంతరాజు అగుట వలన 1458వ సంవత్సరము నందు మొదటి రాచిరాజునకు ప్రాణభంగము, మూడవ తమ్మిరాజునకు రాజ్యభ్రంశము కలుగుట సంభవము. అందుకు మూడవ తమ్మిరాజు 1458వ సంవత్సరము నందు సకుటుంబ బంధుమిత్ర పరివారముగ బెజవాడ వచ్చుట సంగతము. కనుక మొదటి రాచిరాజు అవసానకాలము 145 వ సంవత్సరము.

మొదటి రాచిరాజు ప్రౌఢ దేవరాయలచేత సమ్మానితుడై రాజ్యపట్టము గన్న కాలము స్థూలముగ 1415వ సంవత్సరము కావున, అప్పటికి మొదటి రాచిరాజు అధమపక్షము ముప్పది సంవత్సరములవాడైన కావలయును. అయిన మొదటి రాచిరాజు జనన కాలము స్థూలముగ 1415వ సంవత్సరము.

అనలరాజు జననకాలము స్థూలముగ 1350వ సంవత్సరము. అతని పెద్దకొడుకు మాధవరాజు జననకాలము స్థూలముగ 1370వ సంవత్సరము. కనుక మూడవకొడుకు అయ్యపరాజు జననకాలము స్థూలముగ 1372వ సంవత్సరము. ఇతని అయిదవకొడుకు రెండవ తమ్మిరాజు జననకాలము స్థూలముగ 1396వ సంవత్సరము. రెండవ తమ్మిరాజు మూడవకొడుకు మొదటి రాచిరాజు జననకాలము స్థూలముగ 1418వ సంవత్సరము. అది 1415వ సంవత్సరమును అగును.

కనుక మొదటి రాచిరాజు జననకాలము స్థూలముగ 1415వ సంవత్సరము, జీవితకాలము స్థూలముగ 1415-1458.

ఇక మూడవ తమ్మిరాజు గురించి కృష్ణవిజయము నందు ఇట్లు కలదు.

"అరిబలంబుల నందపురపు శైలము నొద్ద
మర్దించి గజపతి మాన్యుడయ్యె
భూరి సైన్యములతోఁ బొదివి బెల్లముకొండ
సాధించె నిశ్శంక సాహసమున
ఘట్టించి లగ్గలు పట్టించి చేకొనెఁ
బ్రబలుడై శ్రీరంగరాజు కొండ
బల్లిదుడై యోడపల్లి గైకొనియె వి
పక్షులందఱు పటాంచలులుగను

త్రిభువనీ రాయ బిరుద ప్రదీప్త రావు
సింగన జయించెఁ బెదవీటిచెంతఁ బొదివి
కలన శరణన్న బాహాదిఖానుఁ గాచె
రాచభూపాలు తమ్మధరావరుండు" - 117ప., 1 ఆ.

ఇందు మూడవ తమ్మిరాజు 1. నందపురము కొండ దగ్గఱ శత్రుసేనలను మర్దించి గజపతి మాన్యుడయ్యెనని, 2. బెల్లము కొండ, శ్రీ రంగరాజు కొండ, ఓడపల్లి వశపఱచుకొనియెనని, 3. త్రిభువనీరాయ బిరుదాంకితుడైన రావుసింగనను పెదవీటిచెంత జయించెనని, 4. యుద్ధము నందు శరణుఁ జొచ్చిన బాహాదిఖానును కాపాడెనని కలదు.

ఇది పూసపాటి వేంకటపతి ఉషాభ్యుదయము నందు ఇట్లు కలదు -

"అని నందాపుర శైలసన్నిధి గజేంద్రానీకమున్ గూర్చి యం
దెనసెన్ శ్రీ గజపత్యభిఖ్య గుడశైలేంద్రుంపు శ్రీరంగరా
జనరేంద్రుండల యోడపల్లివిభుఁడున్ జన్యంబులందోడఁగై
కొనియెన్ వారల పట్టణంబుల సిరుల్ ఘోరప్రతాపంబునన్

త్రిభువనీరాయ బిరుదప్రదీప్తుడైన
రావుసింగని సంగర రంగమందు
దుడుమెఁ బెదవీటిచెంత సద్వినుతుఁడగుచు
కలన శరణన్న బాహాదిఖానుఁ గాచె"

ఇందు మూడవ తమ్మిరాజు నందాపురము కొండ దగ్గఱ గజేంద్రానీకమును గూర్చి గజపతి పేరు పొందెనని ఇతోధిక విశేషము కలదు. నందాపురమున జయపూరు గజేంద్రానీకమన గజపతుల సమూహము. కనుక మూడవ తమ్మిరాజు జయపూరు లోని గజపతులను గెలిచి, గజపతి మాన్యుడై, గజపతి బిరుదు నందెనని కరతలామలకము. ఇది గమనార్హమైన విశేషము.

ఇక మంత్రి చిట్టి కామేశ్వరశాస్త్రి మార్కండేయపురాణము నందు ఇట్లు కలదు -

"దక్షుడై వీరప్రతాపరుద్రాహ్వయ
గజపతీంద్రుని పుత్రగణమునెల్ల
నవలీల నందాపురాచలో పాంతంబు
నందు జయించి సనాతనముగ
గజపతి బిరుదు నాకర్షించి హర్షించె
గడిమి బెల్లంకొండ ఘడమిరేని
రణమున నణచి శ్రీ రంగరాట్సైలేంద్రు
వాడపల్లీ పురవరుని దున్మె

మరి త్రిలోక రాజమహనీయ బిరుదాంకు
రావువంశ్యు సింగరాయ విభుని
గీటణంచె పెద్దవీటిపురప్రాంత
మందు సింహమిభము నడచినట్లు"

ఇందు మూడవ తమ్మిరాజు నందాపురము కొండ దగ్గఱ ప్రతాపరుద్ర గజపతి పుత్రగణమును జయించి గజపతి బిరుదము నందినట్లు కలదు. కనుక మూడవ తమ్మిరాజు నందాపురము కొండ దగ్గఱ మర్దించిన గజపతులు ప్రతాపరుద్ర గజపతి పుత్రగణము కావలయును. కాని ప్రతాపరుద్ర గజపతి పుత్రగణమును మూడవ తమ్మిరాజు జయింపవలసిన ఆవశ్యకము కానరాదు. అంతేకాదు. కపిలేంద్ర గజపతి పుత్రగణమును జయింపవలసిన అవశ్యకము కలదు.

ఒరియా భాషలోని 'మాదలాపాంజి' అను గ్రంథము నందు ఇట్లు కలదు.11

'కపిలేంద్ర గజపతికి పద్దెనుమండుగురు కొడుకులు. వారిలో ఒకరిని తన అనంతరము వారసునిగ నిర్ణయించుట కష్టమై, కపిలేంద్ర గజపతి పూరీ జగన్నాథస్వామిని ప్రార్థించెను. స్వామి కలలో సాక్షాత్కరించి పురుషోత్తమ గజపతిని నిర్ణయించెను. కపిలేంద్ర గజపతి తన స్వప్నవృత్తాంతమును మంత్రిమండలికి నివేదించెను. అప్పటికి పురుషోత్తమ గజపతి కృష్ణానదీతీరమున ప్రతినిధిగ ఉండెను. కపిలేంద్ర గజపతి కృష్ణాతీరమునకు వచ్చి అచటనే స్వర్గస్థుడయ్యెను'.

ఇది తెలుగు భాషలోని జగన్నాథం కైఫీయతు నందును ఇట్లు కలదు.[12]

“అంతట తమకు విస్తరించి కొమాళ్లు వున్నందున ఎవరికి రాజ్యాధిపత్యం యిచ్చేనని శ్రీ స్వామివారిని ప్రార్థన చేసేవరకు అపుడు ఆజ్ఞ అయినది ‘సానిదాని కొడుకు పురుషోత్తమరాయడికి అవుతుంది’ అని. ఆ చిన్నవాడిని తీసుకోని కుండయురి అనేదేశానికి వెళ్ళినారు”. అక్కడ కృష్ణాతీరమందు ఆ రాజుగారు పరలోకగతు డాయెను’.

మఱి సంస్కృత భాషలోని కటక రాజవంశావళి యందు ఇట్లు కలదు.[13]

“అనన్తరమస్యపుత్రః పురుషోత్తమదేవో రాజా బభూవ । తత్రైవ కృష్ణవేణీతీరే రాజపదమ్ప్రాప్య భగవద్దర్శనార్థమ్ శ్రీ పురుషోత్తమ క్షేత్ర మాగత్య దర్శనమ్ కృత్వా కటకస్థ రాజ ధాన్యామ్ స్థిత్వా రాజ్యమ్ కృతవాన్. అనన్తరమ్ జ్యేష్ఠాః కులీన రాజపుత్రాః శ్రుత్వా ఉత్కవన్తః। యద్యస్మదీయ సావలీనామకైకస్మి ప్రహారం సహిష్యసి తదా రాజ్యం భోక్ష్యసే ఇత్యుక్త్వా ఖడ్గమ్ అష్టా దశభ్రాతరః। ప్రహారితవన్తః । భగవదనుగ్రహవశాత్తదజే కిమపి నలగ్నమ్। అస్మదీయ ప్రహారాదికమ్ విఫలితమ్। అయమ్ భగవ దనుగ్రహీత ఇతిమత్వా సర్వే దేశాన్తరమ్ సమాశ్రితవన్తః”

పయి సంగతులను పరికించిన, కపిలేంద్ర గజపతి అనంతరము పురుషోత్తమ గజపతి అలవోకగ రాజ్యాధిపతి కాలేదని అర్థమగును. అంతేకాదు. కపిలేంద్ర గజపతి స్వప్నవృత్తాంతము సత్యదూరము కాకపోయినను, పురుషోత్తమ గజపతి సానిదాని కొడుకు కాకపోయినను, జ్యేష్ఠుని కాదని కనిష్ఠుని రాజ్యాధిపతిని చేయుట వలన భ్రాతృకలహము బాహాటమని వ్యక్తమగును. ఉపరి రాజధానీ నగరమైన కటకము నందు గాక, కృష్ణానదీతీరము నందు అనగా బెజవాడయందు పట్టాభిషేకము చేయుట గూడ భేదభావము లకు సావకాశమని స్పష్టమగుచు. పురుషోత్తమ గజపతి బెజవాడ యందువలెనె కపిలేంద్ర గజపతి కడపుత్రులును వివిధప్రాంతము లందు ప్రతినిధులుగ కలరు.[14] అందు జయపూరులోని ప్రతినిధి, పురుషోత్తమ గజపతి కంటె పెద్దవాడైన, మిగిలినవారిలో కొందఱైన అపటికి చేరి పురుషోత్తమ గజపతి రాజ్యాధికారమును ప్రతిఘటించుట సహజము. అది బెజవాడ యందు పట్టాభిషిక్తుడైన పురుషోత్తమ గజపతి కటకము చేరగానే కాకపోయినను, బెజవాడ యందు కపిలేంద్రగజపతి స్వర్గస్థుడు కాగానే జరుగుట అంతకంటె సహజము. కపిలేంద్రగజపతి బెజవాడ శాసనముబట్టి బెజవాడకు వచ్చిన కాలము 1464వ సంవత్సరము.[15] పురుషోత్తమ గజపతిని పట్టాభిషిక్తుని చేసినకాలము 1465వ సంవత్సరము.[16] స్వర్గస్థుడైన కాలము 1468వ సంవత్సరము.[17] కనుక జయపూరులోని కపిలేంద్ర గజపతి పుత్రగణము కటకములోని పురుషోత్తమగజపతి రాజ్యాధికారమును ప్రతిఘటించిన కాలము 1468వ సంవత్సరము కావచ్చును.

మూడవతమ్మిరాజు కపిలేంద్రగజపతి రాజ్యధుర్యుడని ఒక చాటుపద్యము నందు కలదు.[18]

“మెండెండరాజుల గుండెలో గాలాము
విరసించు రాజుల వెన్నుతరటు
కలహించు రాజుల కడుపులోపల కత్తి
గర్వించు రాజుల కాలయముడు
మార్కొన్నరాజుల మత్తేభసింహంబు
మదవైరి రాజుల మగలమగడు
క్రోధించు రాజుల కొనమీసముల మిండ
నిరసించు రాజుల నెత్తి పిడుగు

సకల సౌజన్యరాజన్య చక్రవర్తి
రాజు కబళేశ్వరస్వామి రాజ్యధుర్య
ధూసురారాయ తరువాటి హూనపాటి
రాచవిభుతిమ్మ యుద్దండరాచమూన”

ఇందు కబళేశ్వరస్వామి అనగా కపిలేంద్ర గజపతి. బెజవాడ వచ్చిన మూడవ తమ్మిరాజు కటకములోని కపిలేంద్ర గజపతికి రాజ్యధుర్యుడు అగుటకంటె, బెజవాడ వచ్చిన కపిలేంద్ర గజపతికి రాజ్యధుర్యుడు అగుట సహజము. కపిలేంద్రగజపతి 1464వ సంవత్సరమునందు బెజవాడ వచ్చినట్లు శాసనము కలదు.[19] కనుక మూడవ తమ్మిరాజు కపిలేంద్రగజపతి రాజ్యధుర్యుడైన కాలము 1464 - 1468 కావచ్చును. అంతకుముందు మూడవ తమ్మిరాజు కపిలేంద్రగజపతి బెజవాడ ప్రతినిధి పురుషోత్తమ గజపతి సేనాధిపతి అగును. మూడవ తమ్మిరాజు పురుషోత్తమ గజపతి సేనాధిపతి అయినకాలము 1458 కావచ్చును. 1458వ సంవత్సరము నందు పురుషోత్తమ గజపతి సేనాధిపతి, 1464వ సంవత్సరము నుండి కపిలేంద్ర గజపతి రాజ్యధుర్యుడు అయిన మూడవ తమ్మిరాజు, కపిలేంద్ర గజపతి పట్టాభిషేకము చేసిన పురుషోత్తమగజపతి రాజ్యాధికారమును ప్రతిఘటించిన జయపూరులోని కపిలేంద్రగజపతి పుత్రులను జయించి పురుషోత్తమ గజపతి ప్రశంస నందుట సంగతము. కనుక మూడవతమ్మిరాజు నందాపురము కొండ దిగ్గజ గజపతుల సమూహమును మర్దించి, గజపతి మాన్యుడై, గజపతి బిరుదము నందిన కాలము 1468వ సంవత్సరము.

ఓడించిన, పెదపీటి చెంత సర్వజ్ఞసింగభూపాలుని జయించిన, 1484వ సంవత్సరము నందు కలన శరణన్న బహమనీసుల్తాను ప్రతినిధి జాహాదిఖానును కాపాడిన చారిత్రిక పురుషుడు. 1484వ సంవత్సరము నందును జైత్రయాత్రలో పాల్గొన్న మూడవ తమ్మిరాజు అప్పటికి సుమారు ఏబది సంవత్సరముల నడివయస్కుడు కావలయును. కనుక మూడవ తమ్మిరాజు జనన కాలము స్థూలముగ 1484 - 48 = 1436వ సంవత్సరము.

ఇక మూడవ తమ్మిరాజు బెజవాడ వచ్చినట్లుగల శాసన మిది:32

'శ్రీమన్మహామండలేశ్వర మహిమండలరాయ మన్నెసుల్తాన్ శ్రీ పూసపాటి రాచిరాజయ్యదేవు మహారాజులుంగారి కుమారుడగు శ్రీ తమ్మిరాజులుంగారు స్వస్తిశ్రీ జయాభ్యుదయ శాలివాహనశక వర్షంబులు వేయిన్ని మున్నూట యెనభైయగు నా.... యన్ తమ పూజ్యస్థానమైన బెజవాడకు తమ బంధువులైన సూర్యసోమ వంశపు రాజులున్ను తామున్ను వచ్చి అక్కడ యింద్రకీలాద్రి యందున పాండవులగుళ్ళ దక్షిణ భాగమందు కృష్ణవేణీమల్లిఖార్జున నరశింహాలు సాక్షిగాను విజయశాసన శిలాస్తంభంబు వేయించిరి.'

ఇందు మహామండలేశ్వర, మహీమండలరాయ, మన్నె సుల్తాన్ అను బిరుదావళి 'పూసపాటి రాచిరాజయ్యదేవు మహారాజులుంగారి'ది. అతడు మొదటి రాచిరాజు. అతనికి మన్నెసురత్రాణ బిరుదము, ప్రౌఢదేవరాయలు పట్టముగట్టిన రాజ్యము కలదు. ఆ రాజ్యము ఒక దుర్గము. కనుక 'మహారాజులుంగారు' అనుట మాట వరుస కావలయును. అతనికి తమ్మిరాజు కుమారుడని మాత్రమే శాసనము నందు కలదు. సేనాధిపతి అనిగాని రాజ్యాధిపతి అనిగాని శాసనము నందు లేదు. కనుక తమ్మిరాజు వేయించిన విజయ శాసన స్తంభము తండ్రికి సంబంధించినది కావచ్చును. తమ్మిరాజు 'బంధువులైన సూర్యసోమవంశపు రాజులతో' వచ్చినట్లు మాత్రమే గాక, 'తాముస్సు', వచ్చినట్లు శాసనమునందు కలదు. కనుక మూడవ తమ్మిరాజు సకుటుంబ బంధుమిత్రి పరివారముగ బెజవాడ వచ్చినట్లు కన్పట్టును. శాలివాహన శకవర్షములు 'వేయిన్నిమున్నూటయెనభై' అనగా 1380 + 78 = 1458వ సంవత్సరము. అప్పటికి మూడవ తమ్మిరాజు వయస్సు 1458 - 1436 = 22 సంవత్సరములు. అది మూడవ తమ్మిరాజు సకుటుంబ బంధుమిత్ర పరివారముగ బెజవాడ వచ్చుటకు అనుకూలము.

మరి మూడవతమ్మిరాజు శౌర్యోన్నతిని తెలుపు చాటుపద్యమిది:33

'అతిశౌర్యుండగు పూసపాటి కులరాచాధీశు తమ్మయ్యకు
న్నతి గావించుచు నాశ్రయింతురిల వర్ణాటీపరిచ్ఛేదికా
కితకోట ప్రభులాత్మ బాంధవతనో గెల్వంగలేకో మహా
చతురుండంచునీ ఖద్విపాగ్ని శశభృచ్ఛాకాబ్దకాలంబునన్'

ఇందు మూడవతమ్మిరాజు అతిశౌర్యుడని కలదు. అంతే కాదు. వర్ణాటీ పరిచ్ఛేదికాకితకోటప్రభులు ఉన్నతి గావించుచు ఆశ్రయింతురని కలదు. అనగా మూడవతమ్మిరాజు అప్పటికి మిక్కిలి ఉన్నతుడు కాలేదని అవగాహనమగును. ఆశ్రయించుటకు హేతువు ఆత్మబాంధవత, గెల్వలేమి, మహాచాతుర్యము మాత్రమేగాక అతడు కపిలేంద్రగజపతి బెజవాడ ప్రతినిధి పురుషోత్తమగజపతి సేనాధిపతి అగుట కూడ అగును. 'ఖద్విపాగ్ని శశభృత్' అనుచోట 'షట్ద్వీపాగ్ని శశభృత్' అను పాఠాంతరము కలదు.34 కాని 'షట్' అను సంఖ్యానిర్దేశము అక్షరసంఖ్యను సహజముకాదు. కనుక ఖద్విపాగ్ని శశభృత్ అను పాఠమే సరియైనది. ఖద్విపాగ్ని శశభృత్ సంఖ్య 1380 + 78 = 1458వ సంవత్సరము. ఆ సంవత్సరము నందే మూడవ తమ్మిరాజు బెజవాడ వచ్చినట్లు శాసనము కలదు. అప్పటికి 22 సంవత్సరములవాడైనను, అతిశౌర్యుడు, మహాచతురుడు కావున సేనాధిపతి కావచ్చును.

ఇక మొదటి రాచిరాజు జననకాలము స్థూలముగ 1415వ సంవత్సరము. అతని రెండవ కొడుకు మూడవ తమ్మిరాజు జనన కాలము స్థూలముగ 1436వ సంవత్సరము.

కనుక మూడవతమ్మిరాజు జననకాలము స్థూలముగ 1436వ సంవత్సరము. జీవితకాలము స్థూలముగ 1436 - 1500.

ఇక రెండవ రాచిరాజు గురించి కృష్ణవిజయమునందు ఇట్లు కలదు -

'నవభారతాఖ్యాన నవ్యకావ్యమునకు
నాయకుండయ్యెనే నరవరుండు
కటకేశ్వరునిచేతఁ గని కేతవరమాత్మ
పురముగాఁజేసెనే భూవిభుండు
నిలిపె బాహుహమన్నె నృపగండపెండేర
మెపుడు డాకాల నేన్నృపతిమౌళి
యఖిలసద్గుణవతి యక్కమాంబాదేవి
ప్రాణేశుఁడయ్యె నేపార్థివుండు
ప్రథితగజపతి రాజవీరప్రతాప
రుద్రతనయాధినాయకారూఢతమ్మి
రాజ జనకతగాంచె నేరాజతిలక
మతడలయ తమ్మవిభురాచయ ప్రభుండు' - 121 ప., 1ఆ.

ఇక మూడవ తమ్మిరాజు బెల్లముకొండ, శ్రీరంగరాజు కొండ, ఓడపల్లి విజయములు 1453-54వ సంవత్సరమునాటి కపిలేంద్రగజపతి విజయములని ఒక సూచనము కలదు.[20] అంతే కాదు. దుగ్గుపల్లి దుగ్గన నాసికేతోపాఖ్యానము, దూబగుంట నారాయణకవి పంచతంత్రము, నందిమల్లయ ఘంటసింగన వరాహ పురాణములకు సంబంధించిన బసవభూపాలుడు పూసపాటి బసవ భూపాలుడని, అతని తండ్రి తమ్మభూపాలుడు మూడవ తమ్మి రాజని ఒక ప్రతిపాదనము కలదు.[21] తమ్మభూపాలుని ఉదయగిరి శాసనము నందు అతడు 'మాధవవర్మ మనుమండు' అని కలదు గావున, అట్టి భ్రమకు అవకాశము కలదు. కాని తమ్మ, బసవ భూపాలురు పూసపాటి వంశీయులు కాజాలరు. కంటమరాజు వంశీయులు కావలయును. 'కంటమరాజు వలభయ్య కుమారుండు తమ్మరాయనింగారు' అని తమ్మభూపాలుని ఉదయగిరి శాసనము నందే కలదు.[22] అంతేకాదు. పూసపాటి రాజవంశము నందు బసవ నామధేయుడు లేడు. కనుక కంటమరాజు తమ్మభూపాలుడు పూస పాటి తమ్మిరాజు కాడు. కనుక 1453-54వ సంవత్సరము నాటి కపిలేంద్రగజపతి విజయములు మూడవ తమ్మిరాజు విజయములు కావలసిన అవశ్యకము లేదు. కంటమరాజు తమ్మభూపాలుని విజయములు కావలసిన ఆవశ్యకము కలదు. కంటమరాజు తమ్మ భూపాలుని 1430వ సంవత్సరమునాటి ఉదయగిరి శాసనమునకు ముందు 1453-54వ సంవత్సరము నాటి కపిలేంద్రగజపతి విజయ యాత్రలందు కంటమరాజు తమ్మభూపాలుడు పాల్గొనుట సంభవము. తమ్మభూపాలుని కొడుకు బసవభూపాలుడును కపిలేంద్ర గజపతి సామంతుడు. పురుషోత్తమ గజపతి 1465వ సంవత్సరము నందు పట్టాభిషిక్తుడైనను, 1468వ సంవత్సరము నందు జయపూరు లోని కపిలేంద్రగజపతి పుత్రులను జయించినను, కపిలేంద్ర గజపతి జ్యేష్ఠకుమారుడైన హంవీరుడు బహమనీసుల్తానుల సహా యము నంది 1472వ సంవత్సరము నందు పురుషోత్తమ గజపతిని రాజ్యభ్రష్టుని చేసినట్లు, పురుషోత్తమగజపతి మరల 1476వ సంవ త్సరమునందు రాజ్యాధిపతి అయినట్లు కలదు.[23] కనుక 1472-1476 సంవత్సరముల మధ్యకాలమునందు బెల్లముకొండ, శ్రీరంగ రాజు, ఓడపల్లి ప్రతినిధులు హంవీరుని అనుయాయులు అగుదురు. వారిని మరల పురుషోత్తమగజపతి విధేయులను చేయుటకు మూడవ తమ్మిరాజు బెల్లముకొండ ప్రతినిధిని సాధింపవచ్చును. శ్రీరంగరాజు కొండ ప్రతినిధిని లగ్గలు పట్టించవచ్చును. ఓడపల్లి ప్రతి నిధిని ఓడించవచ్చును. కనుక మూడవ తమ్మిరాజు బెల్లముకొండ, శ్రీరంగరాజుకొండ, ఓడపల్లి జయించిన కాలము 1476వ సంవ త్సరము కావచ్చును.

మరి మూడవ తమ్మిరాజు పెదవీటిచెంత జయించిన త్రిభువనీరాయ బిరుదప్రదీప్తుడైన రావుసింగన సర్వజ్ఞసింగభూపా లుడు అగును. అతడు 1425వ సంవత్సరము నందు రాచకొండ రాజ్యాధిపతి అయ్యెను.[24] 1453వ సంవత్సరమునందు బెల్లము కొండ వచ్చినట్లు సర్వజ్ఞసింగ భూపాలుని బెల్లముకొండ శాసనము కలదు.[25] సర్వజ్ఞసింగభూపాలుని చరమకాలము 1455వ సంవ త్సరమని నేలటూరి వేంకట రమణయ్యగారి అభిప్రాయము.[29] 1475వ సంవత్సరమని మల్లంపల్లి సోమశేఖరశర్మ గారి అభిప్రా యము.[27] 1475వ సంవత్సరమునందు సర్వజ్ఞ సింగభూపాలుని తిరుపతి శాసనము కలదు.[28] అందు సింగభూపాలుని వంశావళి, బిరుదావళి కలదు. సర్వజ్ఞ బిరుదము కలదు. కనుక సర్వజ్ఞసింగ భూపాలుడు 1453వ సంవత్సరమునాటికి రాచకొండ వదలి బెల్లము కొండ వచ్చి, 1453-54వ సంవత్సరమునందు బెల్లముకొండ వదలి పెదవీడువచ్చి 1475వ సంవత్సరమునందు తిరుపతియాత్ర చేసినట్లు తెలియును. మూడవ తమ్మిరాజు బెల్లముకొండ, శ్రీరంగరాజుకొండ ఓడపల్లితోపాటు పెదవీడును జయించుట సంభవము. కనుక మూడవ తమ్మిరాజు త్రిభువనీరాయ బిరుదప్రదీప్తుడైన రావుసింగనను పెద వీటి చెంత జయించిన కాలము 1476వ సంవత్సరము కావచ్చును.

1476వ సంవత్సరము నాటికి రాచకొండ, దేవరకొండ, ఓరుగల్లు, కొండవీడు, కొండపల్లి, రాజమండ్రి మొదలైన రాజ్య ములు బహమనీ సుల్తానుల పాలైనవి.[29] పురుషోత్తమ గజపతి 1476వ సంవత్సరము నందు రాజమండ్రి మీదికి దండెత్తివచ్చినను, రాజమండ్రి ప్రతినిధికి సహకరించుటకు బహమనీ సుల్తాను మూడవ మహమ్మదుషా కదలివచ్చి ఎదిరించుట వలన గెలుచుట సాధ్యము కాలేదు.[30] కాని 1484వ సంవత్సరము నందు మహమ్మ దుషా కొడుకు మహమ్మదుశాహు బహమనీ సుల్తాను కాగానే పురు షోత్తమగజపతి రాజమండ్రి, కొండవీడు, వినుకొండ, అద్దంకి మొదలైన రాజ్యములను వశపఱుచు కొనెను.[31] ఆ జైత్ర యాత్రలో బహమనీ సుల్తాను ప్రతినిధి అగు బాహాదిఖాను శరణం బొచ్చిన మూడవ తమ్మిరాజు కాపాడుట సంభవము. కనుకమూడవ తమ్మిరాజు 'కలన శరణన్న బాహాదిఖాను గాచిన' కాలము 1484వ సంవత్సరము కావచ్చును.

మొత్తముమీద మూడవ తమ్మిరాజు 1464వ సంవత్సరము నందు కపిలేంద్రగజపతి రాజ్యధుర్యుడైన, 1468వ సంవత్సరము నందు నందాపురము కొండ దగ్గఱ కపిలేంద్రగజపతి కొడుకులైన గజపతుల సమూహమును మర్దించి పురుషోత్తమగజపతి మాన్యు డైన గజపతి బిరుదాంకితుడైన, 1476వ సంవత్సరము నందు బెల్లముకొండ, శ్రీరంగరాజుకొండ, ఓడపల్లి రాజప్రతినిధులను

ఇందు రెండవ రాచిరాజు 1. కటకేశ్వరునిచేత కేతవరమును గని ఆత్మపురముగ చేసికొనెనని, 2. బారహమన్నె నృప గండ పెండారపు దాకాల నిలిపెనని, 3. ప్రథిత గజపతి రాజవీరప్రతాప రుద్రతనయాధి నాయకారూఢ తమ్మిరాజ జనకతను గాంచెననికలదు.

'ప్రథితగజపతి రాజవీరప్రతాపరుద్రతనయాధినాయకారూఢ తమ్మిరాజ జనకత(గాంచె ... తమ్మవిభురాచయప్రభుండు' అను పంక్తినిబట్టి 'పూసపాటి రాచిరాజు ప్రతాపరుద్రగజపతి యల్లుడగుటవలన శ్రీకృష్ణదేవరాయల తోడియల్లుడని తూమాటి దోణప్ప గారి అభిప్రాయము.35 సమాసార్థమును కారక విధానమును సరిగా గ్రహించిన ఇట్టి అభిప్రాయము కలుగుటకు ఏపాటి అవకాశమును లేదు. అధినాయకుడన భర్త. ఆరూఢుడన ఉన్నతుడు. ప్రతాప రుద్రగజపతి తనయ భర్తగ తమ్మిరాజు ఉన్నతుడని సమాసార్థము. అతనికి తమ్మవిభురాచయ ప్రభుండు అనగా రెండవ రాచిరాజు జనకతను గాంచెనని అన్వయము. అనగా ప్రతాప రుద్రగజపతి అల్లుడైన తమ్మిరాజునకు రెండవరాచిరాజు తండ్రి అని తాత్పర్యము. ఇది చాగంటి శేషయ్యగారు గ్రహించినది.36 సరియైనది. పూసపాటి రాజవంశమునందు రెండవ రాచిరాజునకు సంతానము కానరాదు. కాని, రెండవ రాచిరాజు తమ్ముడు తిప్పరాజు మూడవ కొడుకు పేరు మలల తమ్మిరాజు. అతడు నాల్గవ తమ్మిరాజు. సంతానములేని రెండవ రాచిరాజు తమ్మునికొడుకైన నాల్గవ తమ్మిరాజును దత్తత చేసికొనవచ్చును. అది జనకతను గాంచుట అగును. కనుక రెండవ రాచిరాజు ప్రతాపరుద్ర గజపతి అల్లుడు కాడు. శ్రీకృష్ణదేవరాయల తోడియల్లుడును కాడు. రెండవ రాచిరాజు దత్తుడగు నాల్గవ తమ్మిరాజు ప్రతాపరుద్ర గజపతి అల్లుడు. అతడు శ్రీకృష్ణదేవరాయల తోడల్లుడు. కనుక రెండవ రాచిరాజు ప్రతాపరుద్రగజపతి వియ్యంకుడు. శ్రీకృష్ణదేవరాయలకు తండ్రి వరుస.

ప్రతాపరుద్రగజపతి పరిపాలనకాలము నందు అతని కుమారుడు వీరభద్ర గజపతి మొదలైన వారితోపాటు పూసపాటి రాచిరాజు తగిన సైన్యముతో కొండవీటి దుర్గము నందు ఉన్నట్లు సామర్లకోట కైఫీయతు నందు కలదు.37 అంతేకాదు. శ్రీ కృష్ణదేవరాయలు కొండవీటి దుర్గమును జయించి, వీరభద్ర గజపతి మొదలైన వారితోపాటు పూసపాటి రాచిరాజును కూడ జీవగ్రాహముగ పట్టుకొని అభయదాన మిచ్చినట్లు శ్రీ కృష్ణదేవరాయల 1515వ సంవత్సరమునాటి తిరుపతి శాసనము నందు కలదు. 38 అంతకుముందే శ్రీ కృష్ణదేవరాయలు కేతవర దుర్గమును జయించినట్లు ఆ శాసనమునందే కలదు. కనుక శ్రీ కృష్ణదేవరాయలు కేతవరమును జయించుటకు ముందే, రెండవ రాచిరాజు ప్రతాపరుద్ర గజపతిచేత కేతవరమును గని ఆత్మపురముగ చేసికొనవలయును.

శ్రీ కృష్ణదేవరాయలు కొండవీటి దుర్గమును జయించిన కాలము 1515వ సంవత్సరము. కేతవర దుర్గమును జయించిన కాలము 1514వ సంవత్సరము. కనుక రెండవ రాచిరాజు ప్రతాప రుద్ర గజపతిచేత కేతవరమును గని ఆత్మపురముగ చేసికొన్న కాలము 1514వ సంవత్సరముకంటె పూర్వము కావలయును.

ఇక బారహమన్నెనృప గండపెండేరము. ఇది బారహమన్నె నృప గండపెండేరమునకు అపపాఠము. బారహ అనగా విశాఖపట్టణము, గంజాము జిల్లాలకు సరిహద్దు నందలి ఉత్కళదేశములోని మధ్యప్రదేశములోని పండ్రెండు చిన్నరాజ్యములు.39 మన్నె అనగా సప్తమాడియములు. గంజాము జిల్లాలోని మన్నెరాజ్యములు. బారహ ద్రోంతి రాజులను, సప్తమాడియరాజులను గెలిచి, వారి బొమ్మలను చెక్కించి ధరించిన దాకాలి ఆభరణము బారహమన్నెనృప గండ పెండేరము. ప్రతాప రుద్రగజపతి కటక సామ్రాజ్యాధిపతి అయినకాలము 1497వ సంవత్సరము.40 విజయనగరసామ్రాజ్యము మీద దండయాత్ర సాగించిన కాలము 1500వ సంవత్సరము.41 అంతకుముందే అవిధేయులైన బారహద్రోంతి రాజులను, సప్తమాడియరాజులను గెలిచి, ప్రతాపరుద్ర గజపతి విజయనగర సామ్రాజ్యము మీద దండయాత్ర సాగించుట సహజము. ప్రతాప రుద్రగజపతి ప్రతినిధిగ రెండవ రాచిరాజు బారహద్రోంతిరాజులను, సప్తమాడియరాజులను గెలిచిన, అతడు వారి బొమ్మలు చెక్కించిన గండపెండేరమును ధరించుట సంగతమగును. కనుక రెండవ రాచిరాజు బారహమన్నెనృప గండపెండేరమును పడసిన కాలము 1499వ సంవత్సరము కావలయును.

అయిన రెండవ రాచిరాజు అప్పటికి కనీసము నలభై సంవత్సరములవాడైన అగును. కనుక రెండవ రాచిరాజు జనన కాలము 1499 – 40=1459వ సంవత్సరము.

మూడవ తమ్మిరాజు జననకాలము స్థూలముగ 1436వ సంవత్సరము. అతని పెద్దకొడుకు రెండవ రాచిరాజు జననకాలము స్థూలముగ 1456వ సంవత్సరము. అది 1459వ సంవత్సరమును కావచ్చును.

కనుక రెండవ రాచిరాజు జననకాలము స్థూలముగ 1459వ సంవత్సరము. జీవితకాలము స్థూలముగ 1459 – 1530.

రెండవ రాచిరాజు తమ్ముడు తిప్పరాజు. కనుక తిప్పరాజు జననకాలము స్థూలముగ 1460వ సంవత్సరము. తిప్పరాజునకు ఇద్దరు భార్యలు. ద్వితీయ భార్యవలన తృతీయ పుత్రుడు నాల్గవ తమ్మిరాజు. కనుక నాల్గవ తమ్మిరాజు జననకాలము స్థూలముగ

1493వ సంవత్సరము. ఇతడు ప్రతాపరుద్ర గజపతి అల్లుడు. కనుక నాల్గవ తమ్మిరాజు ప్రతాపరుద్రగజపతి అల్లుడైన కాలము స్థూలముగ 1513వ సంవత్సరము. జీవితకాలము స్థూలముగ 1493-1560.

మరి స్థూలముగ 1460వ సంవత్సరము జననకాలముగు తిప్పరాజునకు ద్వితీయభార్య వలని ద్వితీయపుత్రుడు మూడవ రాచిరాజు. కనుక మూడవ రాచిరాజు జననకాలము స్థూలముగ 1492వ సంవత్సరము. మూడవ రాచిరాజు ఏకైక పుత్రుకు కృష్ణ రాజు. ఇతని గురించి కృష్ణవిజయము నందు ఇట్లు కలదు:

'ధీని కృష్ణరాయగజపతి యుగ్రకరాగ్ర ఖడ్గముల్
వైరులు గాంచి యెంచ సమవర్తియయన్నది సత్యమౌ
తనుం
జేరిన వారలం జెదిరి చెట్లకుఁ జేరిన యట్టివారలన్
జేరియుఁ జేరకుండియును జేయు నభోగుల చిత్రపై ఖరిన్
132 ప.

....

తనయుల గాంచె నుత్తమ వధూమణు లందు
ధనము నిక్షేపించె ధర్మయుక్తి
నగ్గ జన్ములకు మహాగ్రహారము లిచ్చె
నర్హపై ఖరి వివాహములు చేసె
వితతాంబుపూర పూరిత తటాకంబులు
నద్యానములు నిల్పె నుర్వియందు
భాసుర రుక్మిణీ పరిణయాఖ్య ప్రబం
ధమునకు నాయకత్వము వహించె
నర్థులకుఁ గోర్కెలొసఁగెఁ బ్రత్యర్థులైన
దండిమన్నీలఁ దలచూపకుండఁ దరిమె
భువిని కీర్తుల విలసిల్లె పూసపాటి
రాచభూపాలకుని కృష్ణరాయనృపతి - 134 వ.

ఇందు కృష్ణరాజు రుక్మిణీపరిణయమను ప్రబంధమునకు నాయకత్వము వహించెనని కలదు. అనగా రుక్మిణీపరిణయ ప్రబంధమునకు కృతిభర్త అని అర్థము. కృష్ణరాజు కృతిభర్త మాత్రమే కాదు, సప్తసంతానములను పడసినట్లు కలదు. కనుక కృష్ణరాజు కనీసము దుర్గాధిపతి కావలయును.

శ్రీకృష్ణదేవరాయల కాలము నందు పూసపాటి రాచిరాజు వలె, వీరవేంకటపతి రాయల కాలమునందు పూసపాటి కృష్ణమరాజు కలడని వెలుగోటి యాచమ నాయకుని గురించి కల సీసమాలిక యందు కలదు:42

'బళి ! వీరవెంకటపతిరాయ లిచ్చిన
పెరిమేటిసీము నిబ్బరముతోడఁ
గైకొని మదురాంతకమునఁ బాళెమునిల్పి
దండయాత్రా సముద్దండవృత్తి
* * * *
శకవత్సరములు వైశ్వానరలోచన
శరసుధాకర సముజ్జ్వలత మించి
సన్నుత ప్లవనామ సంవత్సరంబున
సురుచిరంబుగ జ్యేష్ఠశుద్ధదశమి
భానువాసరమునఁ బగలంత నుత్తర
మల్లారి తూర్పున బల్లిదముగఁ
గనుపట్ట
* * * *
వెలుగోటి రంగభూవిభుని యాచన్నృపాలుఁ
డవరక పరబలం బధికమనక
* * * *
బలుమూరి వెంకటప్పను ద్రుంచి మరి పూస
పాటి కృష్ణమరాజు గీటణంచి-'

ఇందు వైశ్వానరలోచన శరసుధాకర సంఖ్య 1523 + 78 = 1601వ సంవత్సరము. అప్పటి ప్లవనామ సంవత్సర జ్యేష్ఠశు. దశమీ భానువారము సరిగా 31-5-1601వ తేదీ.43 అది రెండవ వేంకటపతిరాయల రాజ్యకాలము.44 (1586-1614) కనుక 1601వ సంవత్సరము నందు వెలుగోటి యాచమ నాయకునిచేత ఓడిపోయిన పూసపాటి కృష్ణమరాజు, దుర్గాధిపతి అగు మూడవ రాచిరాజు ఏకైక పుత్రుడు కృష్ణరాజు అగును. అతడు 'ప్రత్యర్థులైన దండిమన్నీలఁ దలచూపకుండఁ దరిమి'నను, అతని 'ఉగ్రకరాగ్రఖడ్గముల్ వైరులుగాంచి యెంచ సమవర్తియ యన్నది సత్య' మైనను, వెలుగోటి యాచమనాయకునిచేత ఓడిపోవుటకు హేతువు, అప్పటి కృష్ణరాజు అధిక వయస్కుడగుట కావచ్చును. అయిన కృష్ణరాజు అప్పటికి సుమారు అరవైయైదు సంవత్సరములవాడైన అగును. అయిన కృష్ణరాజు జననకాలము స్థూలముగ 1601 – 65 = 1536 సంవత్సరము.

మూడవ రాచిరాజు జననకాలము 1492వ సంవత్సరము అతని ఏకైక పుత్రుడు కృష్ణరాజు జననకాలము 1536వ సంవత్సరమును అయిన, తండ్రి కొడుకుల నడుమ 1536 – 1492 = ...

సంవత్సరముల అంతరము కలదు. ఏకైక పుత్త్రుడు లేకలేక పుట్టిన వాడు కావచ్చును. అయిన 44 సంవత్సరముల అంతరము విపరీతము కాదు.

కనుక కృష్ణరాజు జననకాలము స్థూలముగ 1536వ సంవత్సరము. జీవితకాలము స్థూలముగ 1536 - 1605.

ఇక విజయనగర సంస్థానమునకు మొదటి అధిపతి మాధవవర్మ అని కలదు.**45** అంతేకాదు. అతడు 1632వ సంవత్సరము నుండి గోల్కొండ దర్బారులోనికొండపల్లి సర్దారు అని కలదు.**46** ఉపరి 1652వ సంవత్సరము నందు విశాఖ మండలమునకు వచ్చి, శ్రీకాకుళము నందు ఫౌజుదారైన షేర్‌మహమ్మద్‌ఖాన్ దగ్గఱ కుమిలె, భోగాపురము ఇజారా చేసినట్లు కలదు.**47** అది విజయనగర సంస్థానమునకు ఆదిమదశ. మాధవవర్మ అసలు పేరు రఘునాథరాజు. రఘునాథరాజు విజయనగర సంస్థానాధిపత్యకాలము**48** 1652-1685. ఆ రఘునాథరాజు కొండరాజు కొడుకు రఘునాథరాజు అని తూమాటి దొణప్పగారి అభిప్రాయము.**49** గోపాలకృష్ణరాజు కొడుకు రఘునాథరాజు అని ఆరుద్రగారి అభిప్రాయము.**50** ఉభయులును ఉపపత్తులు చూపలేదు. ఆకరములు తెలుపలేదు.

కొండరాజు కొడుకు రఘునాథరాజు గుఱించి కృష్ణవిజయము నందు ఇట్లు కలదు.

"కొండభూపతి గాంచెఁ గుసుమాస్త్రసుందరా
కృతి రఘునాథుండు కృష్ణరాయ
జనవరుండును నన్న తనయరత్నంబుల

* * * *

వీర లభివృద్ధిఁ గాంతురు విబుధ వర్ణి
తాగ్రియౌదార్య శౌర్య సామగ్రి వెలయ" - 240 ప.

ఇందు కొండరాజు కొడుకు రఘునాథరాజు అందగాడని కలదు. అంతేకాదు. అభివృద్ధిని గాంచునని కలదు. అనగా కృష్ణవిజయ రచనాకాలమునాటికి అభివృద్ధి కాంచలేదని అర్థము. కృష్ణవిజయ రచనాకాలము 1650వ సంవత్సరము. కనుక 1650వ సంవత్సరము నాటికి కొండరాజు కొడుకు రఘునాథరాజు గోల్కొండ దర్బారులోని కొండపల్లి సర్దారు కాఁజాలడు.

మఱి గోపాలకృష్ణరాజు కొడుకు రఘునాథరాజు గుఱించి కృష్ణవిజయము నందు ఇట్లు కలదు;

"కమలబాంధవవంశ కలశపారావార
చంద్రుడై తనరు నేజనవరుండు
శరణన్నఁ బగవారిఁ గరుణతోఁ జేఁపట్టి
రక్షించనేర్చు నేరాజమౌళి
సకల భూమీసుర సంరక్షకుండయి
రిపుల ఖండించె నేనృపవరుండు
తమ్ములు మువురునుం దనుభక్తి సేవింప
ధరణిఁ బాలించె నేధార్మికుండు
వెలయు నిలఁ దనపేరిటి విశ్వభరణ
దక్షుడగు సామి వలెనె యా రక్షితాఖి
లాగ్రజుండైన యట్టి మదగ్రజుండు
నీతిబలశాలి రఘునాథనృపతిమౌళి - 191 ప.

* * * *

— — శూరాగ్రగణ్యులు వినుతిసేయ
సంగ్రహించె దిగంత విశ్రాంతకీర్తి
ఘనుడు గోపాలకృష్ణరాయని కుమార
రత్నమైనట్టి రఘునాథరాజమౌళి" - 192 ప., 1 అ.

ఇందు గోపాలకృష్ణరాజు కొడుకు రఘునాథరాజు శత్రువులను శిక్షించిన, శరణన్న రక్షించిన రాజమౌళి అని కలదు. అంతేకాదు. 'ధరణిఁ బాలించె' అని ఇదమిత్థముగ కలదు. పూర్వపద్యము నందు రాజశేఖరుడని కలదు (190 ప.). ఉత్తరపద్యమునందు మహావీరుడని కలదు (193 ప.). కనుక గోపాలకృష్ణరాజు కొడుకు రఘునాథరాజు కొండపల్లి సర్దారు కావచ్చును. అంతేకాదు. పయి సీసపద్యము నందు తొలి రెండు పాదము లందును తద్ధర్మార్థక క్రియలు కలవు. మఱి రెండు పాదములందును భూతార్థక క్రియలు కలవు. కనుక గోపాలకృష్ణరాజు కొడుకు రఘునాథరాజు కృష్ణవిజయ రచనా కాలమునకు (1650) పూర్వము గోల్కొండ దర్బారులోని కొండపల్లి సర్దారు కావలయును. తర్వాత విజయనగర సంస్థానమునకు మొదటి అధిపతి అగును. బహుశః 1648వ సంవత్సరము నందు కొండపల్లి సర్దారు పదవిని వదలి, 1652వ సంవత్సరము నందు కుమిలి, భోగాపురము ఇజారా చేయవచ్చును. కనుక గోపాలకృష్ణరాజు కొడుకు రఘునాథరాజు విజయనగర సంస్థానమునకు మొదటి అధిపతి కావచ్చును.

గోపాలకృష్ణరాజు కొడుకైన రఘునాథరాజు ఏకోదరుడు ఆరవ తమ్మిరాజు. ఇతడు కృష్ణవిజయకర్త. ఆరవ తమ్మిరాజు కవులు, పండితులు, మంత్రులు, పరరాష్ట్రపతులు, భటులు, వీర

శటులు, నముల కొలువ, వివిధావధానములు వినుచు, విద్యావినోదములు కనుచు, సత్కావ్యసారములు కనుచు వినుచు, నీతియోగములు ఉపాయనధనాభోగములు వినుచు కనుచు, కప్పములు కట్టు దొరల పలుకులు నసుపుచు తనుపుచు పేరోలగమున్నట్లు కృష్ణ విజయము నందు కలదు (18-20 ప., 1 ఆ.) అది ఎంత అతిశయోక్తి విలసితమైనను కొంత నిజము కాకపోదు. సొంత అన్న రఘునాథరాజు కొండపల్లి సర్దారు అయిన కొంత నిజమే. అంతే కాదు. విజయనగర సంస్థానమునకు మొదటి అధిపతి అయిన రఘునాథరాజునకు మాధవవర్మవలె తమ్మిభూపాలుడను వ్యవహారమును కలదు.51 అది తమ్ముడైన ఆరవతమ్మిరాజునుబట్టి కల్గుటయే సహజము.

రఘునాథరాజు తర్వాత సీతారామచంద్రరాజు విజయనగర సంస్థానాధిపతి. ఇతడు రఘునాథరాజు సవతి తమ్ముడైన అన్నమరాజు కొడుకు సీతారాముడని కలదు.52 సీతారాముడు 'సితపక్షచంద్రుడు వైఖరిం బ్రతిదినమును వృద్ధిగాంచు భాగ్యవిశేషోన్నతుడై' అని కృష్ణవిజయము నందు కలదు (202 ప., 1 ఆ.) కనుక, కొండరాజు కొడుకు రఘునాథరాజు కాక, గోపాలకృష్ణరాజు కొడుకు రఘునాథరాజు విజయనగర సంస్థానమునకు మొదటి అధిపతిగ బహువిధభాసమానము.

రఘునాథరాజు 1632 - 48 సంవత్సరముల నడుమ గోల్కొండ దర్బారులోని కొండపల్లి సర్దారు అగుటకు, 1632వ సంవత్సరము నాటికి అధమపక్షము పాతిక సంవత్సరములవాడైనను కావలయును. అయిన రఘునాథరాజు జననకాలము స్థూలముగ 1632 - 25 = 1607వ సంవత్సరము. అది 1605వ సంవత్సరమును కావచ్చును.

మఱి స్థూలముగ 1538వ సంవత్సరము జననకాలమగు కృష్ణరాజునకు నలుగురు భార్యలు. ఏడుగురు కొడుకులు. తృతీయ భార్య వలన కనిష్ఠ పుత్రుడు వేంకటపతిరాజు. కనుక వేంకటపతిరాజు జననకాలము స్థూలముగ 1576వ సంవత్సరము. వేంకటపతిరాజు పెద్దకొడుకు గోపాలకృష్ణరాజు. కనుక గోపాలకృష్ణరాజు జననకాలము స్థూలముగ 1598వ సంవత్సరము. గోపాలకృష్ణరాజునకు ఇద్దరు భార్యలు. పెద్దభార్య పెద్దకొడుకు రఘునాథరాజు. కనుక రఘునాథరాజు జననకాలము స్థూలముగ 1630వ సంవత్సరము. ఇది 1605వ సంవత్సరము కావచ్చును.

కనుక రఘునాథరాజు జననకాలము స్థూలముగ 1605వ సంవత్సరము. జీవితకాలము స్థూలముగ 1605-1685.

కృష్ణవిజయము రచనాకాలము 1540వ సంవత్సరమని కలదు.53 అది 1640వ సంవత్సరము కావచ్చునని గురజాడ శ్రీరామమూర్తిగారి అభిప్రాయము.54 కృష్ణవిజయము నందు కుమిలి, భోగాపురముల ప్రసక్తిలేదు. కొండపల్లి సర్కారు ప్రశంస లేదు. బెజవాడ వర్ణన మాత్రము సుదీర్ఘముగ కలదు (77-86 ప., 1 ఆ.) కనుక కృష్ణవిజయము రచనాస్థలము బెజవాడ కావచ్చును. అంతేకాదు. కృష్ణవిజయము రచనాకాలము రఘునాథరాజు కొండపల్లి సర్దారు పదవి వదలిన తర్వాత, కుమిలి, భోగాపురము ఇజారా చేయుటకు పూర్వము కావలయును. అది స్థూలముగ 1648, 1652 సంవత్సరముల మధ్యకాలము. కనుక పూసపాటి తమ్మిరాజు కృష్ణవిజయము రచనాకాలము స్థూలముగ 1650వ సంవత్సరము. అప్పటికి తమ్మిరాజు నలభై సంవత్సరములవాడైన అగును. అయిన తమ్మిరాజు జననకాలము స్థూలముగ 1650 - 40 = 1610వ సంవత్సరము.

మఱి రఘునాథరాజు జననకాలము స్థూలముగ 1605వ సంవత్సరము. అతని ఏకోదరుడైన (ఆరవ) తమ్మిరాజు జననకాలము స్థూలముగ 1608వ సంవత్సరము.

కనుక పూసపాటి తమ్మిరాజు జననకాలము స్థూలముగ 1608వ సంవత్సరము. జీవితకాలము స్థూలముగ 1608 - 1680. కృష్ణవిజయము రచనాకాలము స్థూలముగ 50వ సంవత్సరము. కృష్ణవిజయము రచనా స్థలము ప్రాయికముగ బెజవాడ.

ఇంతవఱకు అమలరాజు వంశవృక్షమిది.

1. అమలరాజు
2. మాధవరాజు (1419) — తమ్మిరాజు — అయ్యరాజు — బొబ్బిలరాజు — సింగరా[జు]
3. పెదమాధవరాజు — చినమాధవరాజు — దేవరాజు — అమలరాజు — తమ్మిరాజు II
4. తిప్పరాజు — మాదిరాజు — రాచిరాజు I
5. తిప్పరాజు — తమ్మిరాజు III (1458) — కృష్ణరా[జు]
6. రాచిరాజు II (1515) — తిప్పరాజు
7. పెదకృష్ణరాజు — రాచిరాజు III — తమ్మి[రాజు]
8. కృష్ణరాజు (1601)
9. తమ్మిరాజు V — గోపాలరాజు — అన్నమరాజు — రఘునాథరాజు — రాచిరా[జు]
10. కృష్ణరాజు — వేంకటపతిరా[జు]
11. గోపాలకృష్ణరాజు
12. రఘునాథరాజు (1632, 1656-85) — అన్నమరాజు — తమ్మిరాజు VI — గో[పాల...]
13. సీతారామచంద్రరాజు (1685-1697)

సూ చి క లు

1. జీర్ణవిజయనగర చరిత్రము, పుటలు 103_4
2. ఫర్దర్ సోర్సెస్ ఆఫ్ విజయనగర ఎంపైర్, సంపుటము 2, పుటలు 86_7
3. ది సూర్యవంశి గజపతీస్ ఆఫ్ ఒరిస్సా, పు. 44
4. అదే
5. భారతి, నవంబరు 1941, పు. 515
6. హిస్టరీ ఆఫ్ రెడ్డి కింగ్‌డమ్స్, పు. 138
7. ది సూర్యవంశి గజపతీస్ ఆ ఒరిస్సా, పు. 36
8. అదే
9. ఆంధ్ర కవితరంగిణి, ఎనిమిదవ సంపుటము, పుటలు 57_8
10. చాటుపద్య మణిమంజరి, ద్వితీయ భాగము, పుట 79
11. ది సూర్యవంశి గజపతీస్ ఆఫ్ ఒరిస్సా, పు. 65
12. ఫర్దర్ సోర్సెస్ ఆఫ్ విజయనగర ఎంపైర్, సంపుటము 2, పుటలు 85_6
13. అదే పు. 94
14. ది సూర్యవంశి గజపతీస్ ఆఫ్ ఒరిస్సా, పు. 136
15. దక్షిణహిందూదేశ శాసనములు, సంపుటము 4, పు. 761
16. ది సూర్యవంశి గజపతీస్ ఆఫ్ ఒరిస్సా, పు. 66
17. అదే, పుట 67
18. ఆంధ్రకవి తరంగిణి, ఆరవ సంపుటము, పుటలు 256_7
19. దక్షిణ హిందూదేశ శాసనములు, సంపుటము 4, పు_761
20. ది సూర్యవంశి గజపతీస్ ఆఫ్ ఒరిస్సా, పు. 43
21. అదే_పుటలు 6, 163, తెలుగు విజ్ఞానసర్వస్వము, మూడవ సంపుటము, పు. 305
22. దక్షిణ హిందూదేశ శాసనములు, సంపుటము 4, సంఖ్య 789
23. ది సూర్యవంశి గజపతీస్ ఆఫ్ ఒరిస్సా, పు. 75
24. వెలుగోటివారి వంశావళి, పీఠిక, పు. 43
25. అదే_పుట 44
26. అదే
27. తెలుగు విజ్ఞానసర్వస్వము, మూడవ సంపుటము, పు. 301
28. అదే, పు. 304
29. అదే, పు. 365
30. అదే, పు. 276
31. అదే, పు. 367
32. ఆంధ్రకవితరంగిణి, ఎనిమిదవ సంపుటము, పుటలు 57_8
33. చాటుపద్య మణిమంజరి, ద్వితీయభాగము, పు. 79
34. ఆంధ్రకవితరంగిణి, ఆరవ సంపుటము, పు. 256
35. ఆంధ్రసంస్థానములు_సాహిత్య పోషణము, పు. 411
36. ఆంధ్ర కవితరంగిణి, ఎనిమిదవ సంపుటము, పు. 61
37. ఫర్దర్ సోర్సెస్ ఆఫ్ విజయనగర ఎంపైర్, సంపుటము 2, పు. 154
38. తిరుపతి_తిరుమల దేవస్థాన శాసనములు, సంపుటము 3, సంఖ్య. 80
39. హిస్టరీ ఆఫ్ రెడ్డి కింగ్‌డమ్స్, పుట 139
40. తెలుగు విజ్ఞాన సర్వస్వము, మూడవ సంపుటము, పుట 278
41. అదే
42. ఫర్దర్ సోర్సెస్ ఆఫ్ విజయనగర ఎంపైర్, సంపు 2, పుటలు 339_347
43. వెలుగోటివారి వంశావళి, పీఠిక, పుట 57
44. తెలుగు విజ్ఞాన సర్వస్వము, మూడవసంపుటము, పుట 412
45. విశాఖపట్నం జిల్లా వృత్తాంత సంగ్రహము, పు, 501
46. విశాఖమండల చరిత్రము, పుట
47. విశాఖపట్నం జిల్లా వృత్తాంత సంగ్రహము, పుట 501
48. విశాఖమండల చరిత్రము, పుట
49. ఆంధ్ర సంస్థానములు_సాహిత్య పోషణము, పుట 404
50. సమగ్ర ఆంధ్ర సాహిత్యం, పండ్రెండవ సంపుటం, పుటలు 256_57
51. కృష్ణవిజయము, మెమొరాండం, నెం. 1, పుట 5
52. అదే, పుటలు_1921
53. విశాఖపట్నం జిల్లా వృత్తాంత సంగ్రహము, పు. 500
54. కృష్ణవిజయము, మెమొరాండమ్, నెం.1, పుట 6

ఆగని పయనం

డాక్టర్ పురిపండా అప్పలస్వామి

రాత్రయినా ఆగలేదు _
ఆగదు ఆగదు సయనం
నేనే చేరాలా
నాదగ్గిరికే వస్తుందా గమ్యం !

రేయి వాలినా
రెప్ప మూసినా
కనిపించేది కటిక చీకటే
వెలుగు చీకట్లలో
కోరినప్పుడు చిక్కేది చీకటే

చీకటి నా పుట్టిల్లు
గమ్యం చీకటూ వెలుతురా ?
ఏమిటీ దారి ?

తుది లేదా ?
మొదలిదేనా అసలు !

ఆగదా ?
తుదీ మొదలూలేని దానికి
ఆగడమే కాని ఆగడమెక్కడ ?

నవ్వుతున్నారు

శ్రీ యస్. యస్. రెడ్డి

కవిత గుండె విప్పితే
'ఆహా ! ఓహో !' అనాలి
కాని 'ఊహీ ! ఊహు !'
అంటున్నారు నేడు

వెర్రి సర్రియలిజం
కంపుగొట్టు సింబాలిజం
ఆంగ్ల కవిత్వం ఆరగించి
సీసాను మార్చేతత్త్వం

కల్పనలకు సలాంగొట్టి
వాస్తవాన్ని కరపత్రంగా నిలబెట్టి
అలంకార ధ్వనులు
ఆటోమ్యాటిగ్గా త్రుప్పుపట్టి
నిష్పత్తులు తెలియని
కవితా కెమిస్టు లుండబట్టి
"ఊహీ ! ఊహు' అంటున్నా
కవిత్వమంటె నవ్వుతున్నారు.

శ్రీ పాలడుగు వెంకటేశ్వరరావు

అన్పించాడు!

రావమ్మ పొరుగూళ్ళల్లో వుంటూవున్న కూతురుకీ ఇద్దరు కొడుకులకీ వుత్తరాలురాసింది; రాసింది అనటముకంటే రాయించిందీ అనటమే కరక్టు. రాఘవయ్య మేష్టారు ఆమెకి వుత్తరం రాసి పెట్టారు. రావమ్మ చిన్నకొడుకు, భార్యతోసహా పొరుగూరికి వెళ్ళి ఆ రాత్రికి తిరిగి వచ్చాడు. ఆరోజు పగలు ఆపని జరిగింది; ఆసంగతి మాధవరావుకి తెలియదు.

ఇపుడు రావమ్మకి ఎనభయి సంవత్సరాలుంటాయి. ఆమెకి ముగ్గురు కొడుకులు. పెద్దవాడు కాంతారావు, పెద్ద కంట్రాక్టరు. భార్య తెచ్చిన కట్నాన్ని పెట్టుబడిగా పెట్టి కంట్రాక్టులు చేసి, ఇప్పుడు కాంతారావు లక్షలు సంపాదించాడు. బెజవాడలో పెద్ద ఇల్లు కట్టాడు. కారు మెయింటెయిన్ చేస్తున్నాడు. అతనికి ఇద్దరు పిల్లలు. ఒకడు మెడిసినూ, రెండవవాడు ఇంజనీరింగూ చదువుతున్నారు. రెండవవాడు రాఘవరావు. ఒక ప్రయివేటు కంపెనీలో పెద్ద వుద్యోగం చేస్తున్నాడు. అతని పనీ బాగానేవుంది. హైదరాబాదులో ఇల్లు కొన్నాడు. కారూ మెయింటెయిన్ చేస్తున్నాడు. ఆ ఇద్దరు పెద్ద కొడుకుల తరవాత రావమ్మకి ఒక కూతురు. ఆమె భర్త ఇంజనీరు. ఇద్దరు పిల్లలతో ఆమె సంసారం పచ్చగా సాగిపోతున్నది. ఆవిడపేరు అంజని. ఆమె భర్త హనుమంతరావు. రావమ్మ మూడో కొడుకు పేరు మాధవరావు.

రావమ్మ కాపురానికి వచ్చేసరికి ఆ సంసారానికి పదెకరాల మాగాణి పొలమూ, పెంకుటిల్లూ, దొడ్లూ, మామిడి తోటలూ వుండి, పచ్చపచ్చగా వుండింది. సుమారు ఇరవయ్యయిదేళ్ళ సాగిన పచ్చని ఆ సంసారం, పిల్లలు రెక్కలు వచ్చి ఎగిరి పోయే దశకి వచ్చేసరికి, చితికి పోయింది. పెద్దకొడుకులు ఇద్దరికీ చదువులూ, కూతురి పెళ్ళి, పెట్టుపోతలూ, ఇతర ఖర్చులూ ఘనంగా జరిగాయి. రావమ్మ భర్త ఇటీవల పరలోక గతుడయ్యేనాటికి ఆ సంసారానికి ఒక ఎకరం పొలమూ, చితికిపోయి శిథిలావస్థలో వున్న పెంకుటిల్లూ, మాత్రమే మిగిలాయి!

రావమ్మ సంతానం అందరి పనీ బాగానే వుంది గానీ, చిన్నవాడు మాధవరావే ఎందుకూ పనికిరాని వాడుగా మిగిలి పోయాడు అతనికి చదువు వంటబట్టలేదు. అందువలన అతను రెక్కలు రాని పక్షిలాగా ఆ ఇంటినే ఆశ్రయించుకుని వుండి పోయేడు. అతనికి నలుగురు పిల్లలు. -

అన్నలూ, అక్కా ఎవరిదారి వారు చూసుకోగా, పండిముగ్గిన ఎనభయి సంవత్సరాల వయసు గలిగిన తల్లి రావమ్మను కనిపెట్టి వుండవలసిన బాధ్యత మాధవరావు పైన పడింది. అన్నలిద్దరికీ మాధవరావు అంటే చాలా తేలిక భావం వుంది. బయటి ప్రపంచంలోనికి వెళ్ళి ఒక రూపాయి సంపాదించుకు రావటం తెలీని మాధవరావు కేవలం అప్రయోజకుడనీ, మూర్ఖుడనీ, ఎందుకూ పనికిరాని వాడనీ, వాళ్ళ అభిప్రాయం!

రాఘవరావు నోరు చాలా పెద్దది. అతను నోరు పెట్టుకుని అరిస్తే గజగజ లాడతాడు మాధవరావు. కాంతారావు మొహం ఎప్పుడూ ముటముట లాడ్తూ వుంటుంది. అతను నోరు విప్పి ఏనాడూ మాధవరావుని ఆప్యాయంగా పలకరించిన సందర్భంలేదు. తన భర్త ఇంజనీరని అంజనికి బోల్డు గర్వం! లొడ లొడ వాగుతుంది. ఆమె నోరు విప్పితే అంతా స్వోత్కర్ష తప్ప మరేమీ వుండదు. ఆ పైన ఆవిడకి కోపం చట్టెడంత.

రావమ్మ సంతానానికి అందరికీ, తల్లి అంటే ఎంతో ప్రేమ వుంది. అభిమానంవుంది. గౌరవం వుంది. రావమ్మ పెద్ద కోడళ్ళు ఇద్దరూ, ఆ మిగిలిన ఆస్తిపాస్తులను పంచుకొని అమ్ముకుని వచ్చేయమని, తమ తమ భర్తలకి హితవు చెప్పారు. కానీ, మాతృభక్తి ఇంకా ఇగిరి పోని, ప్రయోజకులుగా చలామణీ అవుతున్న ఆ ఇద్దరు కొడుకులూ, ముసలావిడ బ్రతికి వున్నంతవరకూ ఆ పని జరిగేది కాదని ఖండితంగా చెప్పేశారు. అయినా ఇప్పుడు తమకేం తక్కువయిందని, పుష్టి ఎకరం పొలం కోసం వీధిన పడాలీ అని చెప్పి వాళ్ళ నోళ్ళు మూయించారు.

అందువలన, రావమ్మ సంసారం ఇప్పటికీ మూసి వుంచిన గుప్పెట లాగానే వుంది. ఎవరి దారిన వాళ్ళు దర్జాగా సంపాదించుకుని సుఖంగా సంసారాలు చేసుకుంటున్నారు. సూరయ్య కొడుకులు బుద్ధిమంతులు, బాగా పైకి వచ్చారు, వాళ్ళకి ఏ నాటికీ, తల్లి

అంటే ఎంతో భక్తి, గౌరవమూ – అన్న పేరు ప్రతిష్ఠలూ గడించుకున్నారు.

ఎన్ని వ్యవహారాలున్నా, వీలుచూసుకుని వచ్చి, అప్పుడప్పుడూ, తల్లిని చూసి వెళ్తూ వుంటాడు కాంతారావు. పం, పాం – అంటూ కారు మోగిందంటే చాలు ఆ పెంకుటింట్లో సంచలనం మొదలవుతుంది. ఎక్కడ ఏ పనిలో వున్నా సరే, పరుగు పరుగున వచ్చి వరుసలో నిలబడతారు మాధవరావూ, అతని పిల్లలూ. 'మాధవరావు భార్య' గబగబా పొయ్యి వెలిగించి, బావగారికి మర్యాదలు చేసే ప్రయత్నంలో వుంటుంది. కారు డ్రయివరు పళ్ళబుట్టలు తెచ్చి లోపల పెడతాడు. గ్లాస్కో పంచెనీ, లాల్చీనీ, సిల్కు కండువానీ సవరించుకుని, గోల్డు ఫ్రేం రింలెస్ కళ్ళజోడు తగిలించుకుని దర్జాగా, హుందాగా, గంభీరంగా అడుగులు వేసి వస్తాడు కాంతారావు. రావమ్మ కూర్చుని వున్న మంచం ప్రక్కన – అ సమయానికి ప్రక్కింటినుంచి తెచ్చిన కుర్చీ, వేయబడి సిద్ధంగా వుంటుంది.

కాంతారావు వచ్చి ఆ కుర్చీలో కూర్చుని ఆప్యాయంగా తల్లిని పలుకరిస్తాడు. ఆమె ఆరోగ్యం గురించి పరామర్శిస్తాడు. ఆమె యోగక్షేమాల్ని గురించి విచారిస్తాడు. తల్లి మీద తనకు వుండిన ప్రేమాభిమానాల్నీ, భక్తి గౌరవాల్నీ మాటల్లో వెల్లడిస్తాడు. మరదలు – మాధవరావుభార్య – తెచ్చి ఇచ్చిన కాఫీతాగి, లెక్చరు యిస్తాడు, తీరిగ్గా.

ఈ ప్రపంచంలో ప్రతీ జీవీ, అంతిమ శ్వాస తీసేవరకూ నిల్పుకోవలసింది, విశ్వాసమనీ, విశ్వాసం అనేది లేనివాడు అసలు మనిషే కాదనీ, నవమాసాలూ మోసి, కని, పాలిచ్చి పెంచిన, మాతృమూర్తి దైవంతో సమానమనీ, తల్లి ఋణం మనం ఏమి చేసినా తీర్చుకోలేనిదనీ, తల్లిని పువ్వుల్లో పెట్టి చూసుకున్న వాడి జన్మ సార్థకమనీ అందువలన తల్లిని ఆదరాభిమానాలతో చూసుకుని పూజించవలసిన బాధ్యత పిల్లలదనీ, ఎంతో ఆవేశంగా చెప్పి, ఆ పారవశ్యంలో కన్నులు చెమ్మగిల్లగా – తల్లిపాదాలు అంటి ప్రణామం చేసి – తన భక్తి ప్రపత్తులను వెల్లడించి –

'అమ్మా! నిన్ను తమ్ముడు జాగ్రత్తగా చూసుకుంటున్నాడా?!' అని రావమ్మని గద్గద స్వరంతో అడుగుతాడు కాంతారావు. అప్పుడు రావమ్మ ఉబ్బి, పొంగిపోయి, తన బాధల్ని ఏకరువు పెడుతుంది.

తన కాళ్ళల్లో నీరు పట్టిందనీ, అప్పుడప్పుడు కళ్ళు తిరుగుతున్నాయనీ, వంట్లో నీరసంగా వుంటూందనీ, తిన్నది అరగటం లేదనీ కాంతారావుకి చెపుతుంది.

అప్పుడు –

మొహం మొట మొట లాడించిన కాంతారావు, తమ్ముడు మాధవరావు వంక పురుగుని చూసినట్లు చూసి – పళ్ళు పటపటమనిపించి –

'కాస్తయినా శ్రద్ధ అనేది వుండాలి. ముసలామె అంత బాధ పడ్తూ వున్నప్పుడు, అలా నిశ్చింతగా తిరగటానికి అసలు మనస్సెలా వొప్పుతుందీ? డాక్టరుకి చూపించవచ్చు గదా' – అని తమ్ముడికి అన్యాపదేశంగా ఆదేశాలు జారీచేసి, ఇకనైనా తల్లిని జాగ్రత్తగా చూసుకొమ్మని తీవ్రంగా హెచ్చరించి, అర్జంటు పని వుందనిచెప్పి కారులో వెళ్ళగా, అప్పుడు ఆ ఇంట్లో గాలివాన కురిసి, వెలిసినట్లవుతుంది! అప్పుడప్పుడు, కంపెనీ పని మీద ఆ వయిపు వచ్చినపుడు రాఘవరావూ, కారుమీద తప్పకుండా వచ్చి తల్లిని చూసి వెడతాడు. నోటితోపాటు అతని ఆకలీ పెద్దదే! రావటమే అతను, పెద్ద నోరు పెట్టుకుని, అరుస్తూ దిగుతాడు. చిన్నప్పుడు మాధవరావు అతనిచేత పిడిగుద్దులు తిని పెరిగాడు. రాఘవరావుది ఆరడుగుల పెద్ద శరీరం. కండలు బట్టిన వళ్ళు. కోడిలేనిదే అతను ముద్ద ఎత్తడు! అందువలన రాఘవరావు కారు రాంగానే, మాధవరావు, కొడుకుని కోడిని కొనుక్కు రమ్మని ఊరి మీదకి తోలుతాడు. బింకగా అరుస్తూ, వీలయినప్పుడల్లా మాధవరావుని తప్పుపట్టి తిడుతూ, నలుగురి ఎదుటా కించపరుస్తూ, తల్లి ఎడల తనకుగల అపారమయిన భక్తి గౌరవాలు వెల్లడించి, అలిసి కాస్సేపు గుర్రుకొట్టి నిద్ర పోతాడు రాఘవరావు. అతను నిద్ర లేచేసరికి కోడికూరతో భోజనం సిద్ధంగా వుంటుంది. అప్పుచేసి కొని తెచ్చిన వెన్న కరగ బెట్టిన నెయ్యి నిండినగిన్నె, ఆ ప్రక్కన వుంటుంది. రాజఠీవితో భోజనం తృప్తిగా కానిస్తూ –

'అమ్మా నువ్వుకూడా వచ్చి నాతోపాటు కూర్చుని కోడికూరతో ఒక ముద్ద తినరాదటే?' అని ఆప్యాయంగా పిలుస్తాడు రాఘవరావు, తల్లిని.

అప్పుడు రావమ్మ మొత్తుకుంటుంది. తనకష్టాలన్నీ ఏకరువు పెడ్తుంది.

'నాన్నా! నాకేదీ అరిగి చావటంలేదురా. ఏదయినా మోజుపడి తిని చచ్చానా, వెంటనే కడుపులో త్రిప్పి, ఆయాసం వస్తుంది! నీరసం బాబూ! గుండెదడకూడా!'

అప్పుడు రాఘవరావు పెద్దగా అరుస్తాడు. మాధవరావుని కోపంగా చూస్తాడు.

'ఒరేయ్ ! జన్మనిచ్చిన తల్లిని ఇట్లా ఆరడిపెడ్తే నీకు ఇక పుట్టగతులు వుంటవురా ! ఏం ? డాక్టరుకి తీసికెళ్ళి చూపిస్తే నీ సొమ్మేం పోయిందీ ? మేమేనాడన్నా నిన్ను లెక్కాలూ, డొక్కాలూ అడిగామా ?! తల్లి కోసం ఖర్చు పెట్టవద్దన్నామా ? కన్నతల్లిని ఇట్లా ఏడిపించినవాడు, వాడు అసలు కొడుకేగాదురా ? మనిషి అన్నాక కాస్త బుద్ధీ జ్ఞానం వుండాలిరా. ఇదుగో. నేను చెప్తున్నాను విను. నువ్వు గనక ఇట్లా పిచ్చవేషాలు వేసావంటే తిక్క రేగుతు న్నొస్తే, నేనేం చేస్తానో నాకే తెలియదు ! ఛ. ఛ. ఏం పన్లురా ఇవీ ?' అని నానావిధాల చీవాట్లు పెడతాడు.

దోషిలాగా నిలబడి నోరెత్తకుండా చీవాట్లు తింటున్న తండ్రినీ, చకచక భోజనం కానిస్తూనే అరివీర భయంకరుడులాగా నోటితో విజృంభిస్తూవున్న పెదతండ్రినీ, చకచకా మాయమవు తున్న కోడి కూరనీ, గిన్నెడు నెయ్యినీ, అన్నాన్నీ నోర్లూరగా చాటునుంచీ చూస్తూ నుంచున్న మాధవరావు పిల్లలు, ఆశ్చర్యంతో కళ్ళు టపటపలాడిస్తారు. నోళ్ళువెళ్ళబెట్టి, సోంబేరుల్లాగా, ముడ్డిమీద నుంచి కిందకి జార్తూవున్న చెడ్డీల్ని పైకి లాక్కుంటారు. ముక్కు లెగుర్చుకుంటారు !

ఇకనయినా, తల్లిని జాగ్రత్తగా చూసుకొమ్మని మాధవ రావుకి తీవ్రమయిన హెచ్చరికలు జారీచేసి, బూట్లు టకటక లాడించుకుంటూ వెళ్ళి, కారు ఎక్కుతాడు రాఘవరావు. దుమ్ముని వెనకాలే వినజిమ్ముకుంటూ దూసుకుపోతున్న ఆ కారునే అందరూ నోళ్లు తెరిచి చూస్తారు !

తన పెళ్ళయిన కొత్తల్లో అంజని, కన్నవారిని నానావిధాలా సాధించింది. పెట్టుబడులూ, కానుకల విషయంలో, అలిగి నానా రాద్ధాంతాలూ చేసింది ! ఇంజనీరయిన భర్తకి రోజెక్కువాటీ, సూట్కేసుకాడి ఇస్తేగానీ వల్లగాదని శలించి వాటిని పుచ్చుకుంది. అప్పుడప్పుడూ తాలి మళ్ళీనప్పుడు, అంజని, ఆటాటోపంతో హంగా మాగా, పట్టుచీరెలు గరగర లాడించుకుంటూ, మెడనిండా నగలతో బోలెడు భేషజంతో పుట్టింటికి వస్తుంది. ఆ నాలుగు రోజులూ అంజనికి సకల మర్యాదలూ జరగాలి. ఎక్కడ ఏ లోపం జరిగినా అంజని పెద్దనోటితో ఎన్నో చదువులు చదువుతుంది. ఇన్డయిరెక్టుగా నిష్ఠూరపు బాణాలు వదులుతుంది.

మెట్టినింట ఎన్ని భోగభాగ్యాలున్నా, ఆడపిల్లకి, పుట్టింటి మీద ఎంతగా మమకారం వుంటుందో ఆమె నొక్కి వక్కాణి స్తుంది ! ఆడపడుచు సంతోషంగా వుంటేనే ఆ ఇంటికి జయమని లెక్చరిస్తుంది ! తల్లి, రావమ్మని లాలించుకుని, ఆవిడ దుస్థితికి రాగాలు తీస్తుంది. దాంతో, కడుపు చెరువయిన రావమ్మ, నిజమేగదా అనుకుని, తనూ రాగాలు దీస్తుంది. ఆ ఇద్దర్నీ ఆ స్థితిలో చూసి కడుపులో దాగిన బాధలు చెరువయిన మాధవరావు భార్య, తనూ కళ్ళనీళ్ళు పెడుతుంది ! ఒక ప్రక్కన బంధువులకు చేయవలసిన మర్యాదలతో విరుగుతున్న నడుమూ, వడ్డీలు పెరుగుతున్న అప్పులూ, చాతగానివాడిలాగా, దోషిలాగా, దుర్మార్గుడిలాగా, నర కానికి పోయేకన్న తల్లిని నానాయాతనలకూ గురిచేసే - పాపాత్ము డిలాగా, ఆరోపణలకి గురి అవుతూవున్న భర్తా, ఏదో మిగిలి పోయిందనీ, అంతా తామే తిని పోతున్నారనీ, పిత్రార్జితాన్ని తమ హక్కు భుక్తంగా చేసుకుని తామేమింగివేస్తున్నారనీ నలుగుర్తోనూ నానా విధాలుగా నిందారోపణలు చేసే తోడికోడళ్లూ, అన్నిటినీమించి, వేధిస్తూ వున్న దుర్భరదారిద్ర్యమూ, నలుగురిలోనూ పలచనయిన ప్రతిష్ఠ స్థితిగతులూ, లేకిచూపులు చూస్తూ పిచ్చిపెథవల్లాగా పెరిగి వస్తూవున్న పిల్లల, అయోమయంగా అనిపించిన భవిష్యత్తూ-

కారణాలు తెలీకపోయినా, విశ్లేషణ చెయ్యటం ఎరక్క పోయినా, ఇవన్నీ తలపుకి వచ్చి మాధవరావు భార్యకి, కడుపు చెరువవుతుంది ! ఒక విధమయిన డిప్రెషన్కి లోనయిన ఆమె మనసు వేదనాలోలితమవుతుంది !

ఈ మనిషి శరీరం యంత్రం వంటిది. దానికీ అరుగుదల వుంది. వయస్సులోవున్నప్పటి తిండి పుష్టీ, కండపుష్టీ, నవం జీవం వయస్సుమీరిన తరువాతకూడా వుంటాయని ఆశించటం, అసహజం. వయసు మళ్ళిన, శరీరం కొంత నష్టానికి గురవక తప్పదు. ఎన్ని జాగ్రత్తలు తీసుకుని కాపాడబోయినా, ఆ శరీరం మరి కొన్నాళ్ళ పాటు మనుగడను పెంచుకొనగలదేమోగానీ, శిథిలమయి, నశించి పోవటాన్ని తప్పించుకోజాలదు ! జరా పీడితమయి శిథిలావస్థకు గురయిన, శరీరాన్ని చికిత్సలు పునరుజ్జీవింప చేయలేవు. ఆహార విహారాల్లో తగు కట్టుబాట్లు ఏర్పర్చుకుంటే, ఆ శిథిల శరీరాలు కొంత మెరుగయిన స్థితిని అందుకోగలవు. కానీ, వయస్సులో వున్నప్పటిలాగా, ప్రతిదీ తినాలనీ, అరగించుకోవాలనీ, సులువుగా సుఖంగా నడవాలనీ, ఏ విధమయిన రుగ్మతలూ తమ దరిచేర రాదనీ, వయసు పండిన వృద్ధులు ఆశించటం, అత్యాశే అవుతుంది: అందువలన, ఈవిడ, పులుపూ, కారం తినరాదు. నూనె పదార్థాలు తినటం మానెయ్యాలి. తేలిగ్గా జీర్ణమయ్యే పదార్థాల్నే తీసుకోవాలి. విశ్రాంతి, బాగా కావాలి. పళ్లూ ఫలాలూ పుచ్చుకోవాలి. అంతేగాని మందులూ మాకులూ వాడినందువలన ఎనభయి సంవత్సరాల వయసుగల ఈ శరీరానికి ఏమీ ప్రయోగంలేదు - అని రావమ్మని పరీక్షించిన డాక్టరు చెప్పాడు.

'ఆc. ఆడిబొంద ! మందులివ్వవయ్యా అంటే మాటలు చెప్పే ఇతను ఏం డాక్టరూ ?! ఇంకో డాక్టరుకి చూపించు, నన్ను' అని ఆజ్ఞాపించింది రావమ్మ కొడుకుని.

ఆ ఇంకో డాక్టరు ఆమెని పరీక్షించి నీళ్ళ ఇంజెక్షన్లుపొడిచి మందులు రాసిచ్చి, వందరూపాయలు గుంజుకున్నాడు. కొన్నాళ్ళ తరువాత - 'ఆ మందులు పనిచేయటం లేదు. కొత్త మందులు కావాల'న్న ఘోష. వృద్ధాప్యంలో పసితనం ఆవహించిన వృద్ధురాలి మందుల మానియా ! చెపితే అర్థంకాదు. కాదంటే అపార్థాలు. కన్నతల్లి.

రెండు సంవత్సరాల క్రితం - 'అమ్మని మంచి డాక్టరుకి చూపించి, నాలుగు నెలలు వుంచుకుని పంపిస్తామ'ని తీసుకెళ్లాడు కాంతారావు. నెల తిరక్కుండానే - నేనక్కడ వుండలేనే !- అంటూ తిరిగి వచ్చింది రావమ్మ. పెద్దకోడలు ఎంతో ప్రేమగా చూసిందట ! తనని కన్నతల్లిలాగా ఆదరించిందట ! కానీ తనే అక్కడ వుండలేక పోయిందట ! అలాగే, రెండో కొడుకు దగ్గర వుండివస్తానని ఆ మధ్యవెళ్ళింది రావమ్మ. రెణ్నెల్లు వుండివస్తానని చెప్పి వెళ్ళిన పెద్దమనిషి, పదిహేను రోజులకే, వూళ్ళో బస్సు దిగింది ! ఆ నీళ్లు తనకి పడలేదట ! ఇంకా కొన్ని నాళ్ళు వుండి పొమ్మని రెండవ కోడలు ఆమెను ఎన్నో విధాలుగా ప్రతిమాలిం దట ! లోగుట్టు పెరుమాళ్ళకెరుక ! ఏం గొడవలు పడిందో ఏమో గాని, ఆమె తన పెద్దకోడళ్ళు ఇద్దరి గురించీ చాలా ఘనంగా చెప్పింది. వాళ్ళ భోగభాగ్యాల ముందు, ఆమె కళ్ళకి చిన్నకోడలు ఒక పనికిరాని దానిలాగా, ముసలావిడకి అన్పించింది. ఒకసారి, అంజని కూడా, తల్లిని కొన్నాళ్ళ తనవద్ద వుంచుకుని పంపిస్తానని తనతో తీసుకెళ్ళింది. కాని, వారం రోజులు తిరగకుండానే, కూతురితో ఏవో గొడవపడి, తిరిగి వచ్చేసింది, రావమ్మ.

ఈ మధ్యన ఒకరోజు, తనకి పకోడీలు తినాలని వున్నదని చిన్న కొడుకు మాధవరావుతో చెప్పింది, రావమ్మ. అవి ఆమెకు పడవు. అజీర్ణం చేస్తుంది. కడుపుఉబ్బరం వస్తుంది. వద్దని చెప్పాడు మాధవరావు. తనకి తినాలని కోరికగా వుంది. ఏమయినా సరే తినాల్సిందేనని, పట్టుబట్టింది రావమ్మ. గొడవ చేసింది; నిష్ఠురాలు ఆడింది; ఆ బాధపడలేక, పకోడీలు తెచ్చిపెట్టాడు మాధవరావు. శుభ్రంగా తిని సంతృప్తిపడి కొడుకుని ఆశీర్వదించింది. కానీ-

మర్నాటికి గుడగుడమంది, కడుపులో. విరేచనాలుతగుల్కు న్నాయి. వారం రోజులు మంచం దిగలేదు రావమ్మ. నీరసం, ఆయాసం ముంచుకుని వచ్చాయి. నరాలు తెగలాగులు పెట్టాయి. కీళ్ళల్లో ఒకటే నొప్పులు ! మాధవరావు భార్య ఉచ్చ గుడ్డలు కూడా ఉతికింది. మాధవరావు ఆమె దొడ్డి పళ్ళెం శుభ్రం చేసాడు. కన్నబిడ్డలాగా ఆమెని కంటికి రెప్పలాగా చూసుకున్నారు. డాక్టర్ని తీసుకొచ్చి చూపించాడు. మందులు వాడటం చాల జాగ్రత్తగానే జరిగింది. కాని, రుగ్మత అంత తేలిగ్గా తగ్గలేదు. నెలా తరబడి పట్టుకుని, అది రావమ్మ ముసలి శరీరాన్ని వదిలి పెట్టలేదు ! ఒక దాన్తరువాత మరొకటి !

రావమ్మ గోల పెట్టింది, బాధ పడింది.

ఏడ్చింది. మొత్తుకుంది. దిగులు పెట్టుకుంది.

ఈ బాధ తను పడలేనని గొడవ చేసింది. పుల్లలాగా అయి పోయింది.

సరిగ్గా అప్పుడే ఆ కబురు వచ్చింది ! 'మాధవరావు అత్త గారు' గుండెపోటు వచ్చి తనువు చాలించిందన్న కబురు తెచ్చాడు, ఆవచ్చినతను. తప్పలేదు. తల్లిని జాగ్రత్తగా చూడమని రాఘవయ్య మేస్టారికీ, పక్కింటి పున్నమ్మకీ చెప్పి, ఏడుస్తూవున్న భార్యనీ, పిల్లల్నీ తీసుకువెళ్ళి ఆమె పుట్టింట్లో వదిలేసి, తను ఆ రాత్రికి రాత్రే తిరిగి వచ్చాడు !

ఆవాళ్నే రాయించింది ఉత్తరుకీ, కొడుకులకూ, పుత్రరాలు రావమ్మ !

'ఇక్కడ నాకేమీ బాగా జరగటంలేదు ! నేను మంచం మీదనే అవసాన దశలో కష్టంలో వున్నాను. నేను పోయేలోగా ఒక సారి వచ్చి చూసి పోవలసింది' - అంటూ సారాంశం.

ఆ మూడు రోజులూ తల్లిని కంటికి రెప్పలాగా చూసుకు న్నాడు మాధవరావు. తనే స్వయంగా ఆమె పుచ్చగుడ్డలు వుతికాడు. ఆమె దొడ్డి పళ్ళెం శుభ్రం చేశాడు. ఆమెకు మందులు తాగించాడు. పళ్ళరసాలూ, గ్లూకోజు నీళ్ళూ పట్టాడు. ఆమెను అనునయించీ, బుజ్జగించీ, ధైర్యం చెప్పాడు. ఆమె ఏడిస్తే తనూ ఏడ్చాడు. ఆమె నవ్వితే తనూ నవ్వాడు! నిద్రాహారాలు మాని, ఆమెని కంటికి రెప్పలాగా చూసుకున్నాడు. మాటిమాటికి డాక్టర్ను పిలుచుకునివచ్చి చూపించాడు. అప్పుడుచేసి మందులు తెప్పించి, వాడాడు !

ఉత్తరం లేసిన మూడో నాడు పుదయమే, రెండు కార్లూ, ఒక టాక్సీవచ్చి ఆ పాడుపడిపోయిన పెంకుటింటి ముందు ఆగాయి. మొహం మొట మొట లాడించుకుంటూ, కాంతారావూ అతనిభార్యా వచ్చారు. బండగా మాట్లాడ్తూ రాఘవరావూ, అతని వెనుక అతని భార్యా, దిగారు. బులి బులి ఏడ్పులూ ఏడుస్తూ అంజనీ, ఆమెతోపాటు ఆమె భర్తా టాక్సీ దిగారు.

అప్పటికే - రావమ్మ శవాన్ని తీసుకొచ్చి, బయట వాకిట్లో గడ్డి మీద పడుకో బెట్టారు. మాధవరావు చేసిన సేవలు అన్నీ వుప యోగం లేకుండా పోయాయి.

గొల్లున ఏడ్పులూ ! అరుపులూ !

శాపనార్థాలూ ! సాధింపులూ, పెల్లుబికిన దుఃఖాలూ.

చురచుర చూసి, కళ్ళనుంచి నిప్పులు రాల్చాడు కాంతారావు. పిచ్చి ఎత్తినట్లుగ అయి బండబూతులు తిట్టాడు, రాఘవ రావు.

అంజని ఏడుస్తూ ఎన్నో చదువులు చదివింది. అన్నిటికీ టార్గెట్ ఆ మాధవరావే ! అది చూసిన వాళ్ళందరూ, అయ్యో అని నిట్టూర్చారు ! మాధవరావు ఎంత క్రూరంగా, కర్కశంగా, రాక్షసుడిలాగా ప్రవర్తించి, కన్నతల్లినే చంపుకున్నాడూ ! అతనికి ఇక అసలు పుట్టగతులుంటాయా? అని అనుకున్నారు. ఆ తరువాత జరుగవలసిన పనులను గురించి, నిర్లిప్తంగా ఏర్పాట్లు చేయటంలో మునిగిపోయిన, మాధవరావు, అందరి కళ్ళకీ ఒక ఘోర దుష్ట భయంకర రాక్షసుడిలాగా కన్పించాడు. ఎర్రబడిన కళ్ళూ, రేగిన జుట్టూ, అలసిన శరీరంతో, అతనొక భయంకర పిశాచిలాగా అన్పించాడు, అన్పించాడు, అంతే !

~~~~~~

నిస్వాగతము

శ్రీ రాపోలు పరమేశ్వరరావు

నిష్ఠుర నిర్ఘాత నిర్ఘోషలతో నిండి
విఘూర్ణితమైన విషవలయాలతో
వచ్చిన - దీపావళికి
స్వాగతం చెప్పలేను ....

సున్నిత సుకుమార స్వాంతములో
శాంతిని, క్షాంతిని ప్రేల్చుతూ
సాక్షాత్కరించిన దీపావళికి
స్వాగతం చెప్పలేను ....

నిర్మల నిశ్చల సుందర
మందార సరస్సులో
భీకరాకార బడభాగ్నులు
రేపుతూ
అవతరించిన దీపావళికి
స్వాగతం చెప్పలేను ....

సుధచిలికి, సుఖము నిలిపే
అధరాల మురళి -
కరాళి అయినపుడు !

దివ్వెల
దీపావళికి
స్వాగతం చెప్పలేను !!
~~~~~~

కవిత

శ్రీ అవనిగడ్డ సూర్యప్రకాష్

"ఇదేమిటి ?
ఇలా నీడలా నన్నంటి ....
ఎన్ని కోణాల నుంచో
దర్శిస్తూ
వెలుతురులా తాకుతూ ....

మెలకువలో
కలల తోపుల్లో
నెరజాణలా కవ్విస్తూ ..
నిర్వీర్యపు కొలనులో
చైతన్య పుష్పంలా ..

యధేచ్ఛగా దూకే జలచ్ఛటలా
అణువణువులోనూ పులకితమై ....

'జన్మతోనే హక్కుగా
వేదనా శ్రుతులాలపిస్తూ
ఇరుల ఒడిలోకి జారిపోయి
జీవచ్ఛవాల్లా బతికే బతుకుల్లో'
తూర్పు వాకిలి తెరుస్తూంది
నా మనో నేత్రంనుంచి .... !

మీటు

శ్రీ దిలావర్

ఏకాంతపు చీకటి వర్తులాలలో
గిరికీలు కొట్టే శూన్యంలోకి
మండే కవిత్వపు కాగాడాను
గురి చూచి విసిరేస్తే చాలు —
అంటుకున్న మస్తిష్కారణ్యంనుండి
పరిక్రమించే సాయుధ ఆలోచనాదళాలు
అదనుచూచి మీట నొక్కుతాయి ....
బలిసిన నిస్తబ్ధపు కొండల గుండెల్లో
చైతన్యపు డైనమైట్లు పేలుతాయి ....

ఆదికావ్యం

కడుపులో ఆకలి బడబాగ్ని రగిలి
గావుకేక పెట్టింది కడలి.
దిక్కులు చెక్కలై పోయాయి -
చుక్కలు బిక్కు బిక్కు మన్నాయి.

ఆకాశపుటంచున ఆడుతున్న జాబిల్లికూన
హడలిపోయి అగాధాల్లో పడ్డాడు.
కలలు కంటూ నిద్రపోతున్న సూర్యశిశువు
ఉలిక్కిపడిలేచి ముఖం కందేలా ఏడ్చాడు!

మరో కేక .... మళ్ళీ కేక !
మరణం లేని ఆకలి కేక !

గ్రహాలను సైతం నెత్తురు కక్కించగల కేక !
కాలిపోతున్న సజీవ జీవం తాలూకు పొగలాంటి కేక

గడ్డకట్టిన కొండల గుండెలన్నీ కరిగి
కన్నీటి కబళాలు కడలినోటికి అందించాయి
అసలు అగ్ని అలాగే ఉంది
అరచి అలసిన కడలి మూల్గుతూనే ఉంది ..

భావియుగాల; చరిత్రల
పరిణామ చరణాలకు
అప్పుడే ఆవిర్భవించింది పల్లవి
ఆనాటినుంచీ ఆకలి చిరంజీవి !

అసూర్యంపశ్య

పగటి సెగలు చల్లారగానే
పాదం కదుపుతుందనటానికి గుర్తుగా
తారామంజీరాలు
ఘల్లున మ్రోగుతాయి !

వెన్నెలల వెన్నముద్దమీద
సుతారంగా నడుస్తూ -
గుప్పిళ్ళతో లోకంమీద
కస్తూరి వెదజల్లుతూ -
ఆమెరాక
ఎక్కడి నుంచో ఎవరికెరుక ?

* * * *

ప్రాచీన వేదనాదాలూ
పాశ్చాత్యదేశాల చిలిపి సంగీతాలూ
కలిసిపోయినట్లుండే
మహాద్భుత సౌందర్యానికి
'చీకటి' అని -
'పరుషం'గా పేరుపెట్టారు.

నేత్ర పాత్రికల్లో
ఆ నిశిత సౌందర్యాన్ని నింపుకోలేక
నిద్రపోవటం నేర్చుకున్నారు !

* * * *

ఈ చల్లని వేళ
పన్నీటి కెరటంలా
కేరింతలాడుతూ
మౌనంగా నవ్వుతున్న రజని

అజ్ఞాత గాయకమణి
గళద్వారాలు తెరచుకొని
దుమికి వస్తున్న శివరంజని !

* * * *

హేలగా - లీలగా
పూలను దూసుకుంటూ
దోసిలి నిండగానే
ఒకచోట గ్రుమ్మరిస్తుంది.

అప్పుడొక హృదయంలో
స్వప్నామృత వర్షం
జలజలా కురుస్తుంది !

ఒక్కొక్క చోట -
పువ్వులాంటి ఆమె పాదానికి
ఏ జీవిత కఠోర సత్యమో
ఎదురు గొప్పులా తగుల్తుంది
అప్పుడొక మెత్తని నిద్రలో
పీడకల "ముల్లు"లా గ్రుచ్చుకుంటుంది.

* * * *

వేడి, వాడి - అంటే
విచలించి పోతుందామె.

కుక్కుట రావానికే బెదరిపోయి -
వడివడిగా వెళ్ళిపోతుంది.

ఆ హడావిడిలో
ఆమె సువర్ణ చేలం
ఘూర్పు డొంకకు చిక్కుకుంటుంది !

శ్రీ కొంపెల్ల రామకృష్ణమూర్తి

శ్రీ ఆర్. ఎస్. సుదర్శనం

కృష్ణశాస్త్రి నిర్వేదం

కృష్ణశాస్త్రి వ్రాసిన ఖండికలను ఒక వరుసలో అమర్చి, 'కృష్ణపక్ష' కావ్యంగా దానికి ఒక స్వరూపం దిద్ది, 'సింహావలోకనం' పేర వ్యాఖ్యానించి లోకానికి నివేదించిన వారు తల్లావఝ్ఝుల శివశంకర శాస్త్రిగారు. ఆ విషయాన్ని స్మరిస్తూ 1975లో స్వర్ణోత్సవ సంపుటాలకు వ్రాసిన పీఠికలో కృష్ణశాస్త్రిగారు యిలా అన్నారు: "అప్పటికి ఆయనకు అందిన పద్యాలన్నీ - కొన్నిటిని వదిలి వేయాలని నేనంటున్నా వినక - ఒక రశిలో కూర్చి, తమ సింహావలోకనంతో ముద్రింపించేసేరు. 50 ఏళ్లు అయింది. అలాగే నా సోదరుడు ముద్దుకృష్ణ 'ప్రవాసము - ఊర్వశి' అనే గ్రంథాన్నీని, 1929లో. 'కృష్ణపక్షం'లో వస్తువు రీత్యాయిముడని ఆ కొన్ని రచన లేమిటో మనం సులంభంగానే గుర్తించ వచ్చును. అవి 'మహాకవి గురజాడ', 'మా బాబయ్య, నాన్నగారు - ఏడు భాగాలూ'. ఈ ఎనిమిది సంస్మరణ రచనల్ని మినహాయిస్తే (ఇవి గ్రంథానికి అనుబంధంగా ముద్రించ దగినవి) 'కృష్ణపక్షం' ఏక కావ్యంగా, కవి హృదయ పరిణామాన్ని సూచించే వస్త్వైక్యంగల రచనగా పరిశీలనకు నిలుస్తుంది. అంతేకాదు; 'కృష్ణపక్షం' తరువాయి భాగాలుగా 'ప్రవాసము - ఊర్వశి' రచనలు నిలుస్తాయి. మూడూ కలిపి ఏక కావ్యం యొక్క మూడు భాగాలుగా దర్శించడానికి వీలున్నది.

"సాహిత్య వ్యవసాయమూ, సత్యాన్వేషణమూ జీవితంలో ఒకటైన కవి లేక నవలా రచయిత తన దృక్పథంలో సమన్వయం సాధించటానికి ప్రయత్నిస్తాడు. రచయితకు సంబంధించిన ఆ ఆత్మకథను అతని సాహిత్యకృషి ప్రతిబింబిస్తుంది." ఇది ఏనాడో నా 'సాహిత్యంలో దృక్పథాలు' వ్యాసాలకు (1968) ఉద్దేశించిన ప్రాతిపదిక. ఆ ప్రాతిపదిక మీదే కృష్ణశాస్త్రి తొలినాటి సాహితీ వ్యాసంగం (1925-29) నిలుస్తున్నదని నా పరిశీలన. "తనకీ, ప్రపంచానికీ సామరస్యం కుదిరిందాకా కవిచేసే అంతర్, బహిర్ యుద్ధరావమే కవిత్వమంటాడు చలం.... కృష్ణశాస్త్రిబాధ ప్రపంచానికి బాధ ...." అన్నాడు చలం 'మహాప్రస్థానం' పీఠికలో. అది చలం రచనలకూ వర్తిస్తుంది. 'ప్రపంచంతో సామరస్యం కుదరటం', అంటే 'తనతో తాను సమాధానపడటం' (బుచ్చిబాబు) జరిగాక, తర్వాత కవి వ్రాసే రచనల్లో అతని ప్రతిబింబం, అభినివేశం వుంటే వుండవచ్చు గాని సత్యాన్వేషణ తాలూకు స్వారస్యం వుండదు. కృష్ణశాస్త్రి రేడియోకు వ్రాసిన రచనల్లో అందం, ఆనందం, అక్షర రమ్యత ఉన్నాయి. కాని పైె చెప్పిన ఆత్మ కథ లేదు.

భావోద్వేగమే వస్తువు కావటం భావ కవిత్వ లక్షణం. కాని భావోద్వేగాన్ని ఎప్పటికప్పుడు వెలువరిస్తూ, ఒక కాల పరిధిలో విడివిడిగా వ్రాసిన ఖండికలను కూర్చి పరిశీలిస్తే, అందులో కవి హృదయ గత పరిణామ క్రమం ఒకటి అన్వేషణగా, దృక్పథ విన్యాసంగా గోచరిస్తుంది. 'కృష్ణపక్షం-ప్రవాసం-ఊర్వశి' కావ్య సంపుటిలో లభ్యమయ్యే వస్తు విదే.

"కృష్ణపక్షం"లోని ఖండకావ్యాలను ఏర్చి కూర్చిన శ్రీ శివశంకరశాస్త్రి "అన్నియునొక్క కవి ఆత్మలోనుండి ఉద్భవించిన వనుదాని కంటె నన్య విధమగు నైక్యమీ సంపుటిలో గానరాలేదు" అంటూనే మళ్ళీ "కాని కొంచెము పరిశీలించినవారు కృష్ణశాస్త్రిగారి భావతరంగిణి ప్రధానముగా చతుర్విధముల ప్రవహించుచుండునని తెలిసికొనగలరు" అని కూడా అన్నారు. ఆ నాలుగు 'పాయల్ని' సమన్వయించే ప్రయత్నం కూడా ఆయన చేశారు. అయితే దాన్ని ఒక క్రమ పరిణామంగా వారు నిరూపించలేదు. ఆయన గుర్తించిన కవి ప్రవృత్తులు నాలుగు — 1. స్వతంత్ర బుద్ధి లేక స్వేచ్ఛాప్రియత్వము 2. దుఃఖము, దుఃఖమందలి సౌఖ్యము 3. దుఃఖోపశాంతి కలిగించే ప్రేమ 4. ఆత్మ తిరస్కృతి, ఈశ్వరార్పణము. ఇది స్థూలమైన పరిశీలన. సూక్ష్మంగా పరిశీలిస్తే కవి హృదయం చెందిన పరిణామం తీరు ఎలా వున్నదంటే - స్వ - పరభేదంలేని ఒకానొక స్నిగ్ధ మనస్కృత లోకాన్ని గూర్చిన ఎరుకతో చెదరి, స్వార్థభావనతో భగ్నమై, ప్రేమలో నిలకడ సాధించబోయి, వలపులోనికి దిగజారి, విరహంతో వేగి, అమలిన శృంగారాన్ని ఆశ్రయించి, పతనమై, నిర్వేదంలో కృంగి, లజ్జానుతాపంలో కూరుకుపోయి, ఈశ్వరభావం ఆలంబనంగా పునరుత్థానంపొందే ప్రయత్నం చేస్తూ, సౌందర్యాన్వేషణలో నిరంతర ప్రయాణంగా పర్యవసించి 'కృష్ణపక్షం'లో ఒక స్థితికి వచ్చింది. 'ప్రవాసం'లో కవి

హృదయ మనుభవించిన ప్రవాసమూ, 'ఊర్వశి'లో కవి అన్వేషణ ఫలించిన తీరూ నిక్షిప్తమయ్యాయి. మూడూకలిస్తే ఒక కావ్యమే. తెలుగు కవిత్వంలో అజరామరంగా నిలిచే అపూర్వ రచనగా యిది గోచరిస్తుంది. కావ్యంలోని ఏకత్వాన్ని గ్రహిస్తే" అందుకే యీ వ్యాసం.

*   *   *   *

క్రొత్తగా సృష్టిని దర్శిస్తున్న ఆనందోద్వేగంతో స్వేచ్ఛనూ, ఆనందాన్నీ ప్రకటిస్తాడు కవి. స్వ-పర భేదంలేని తన్మయత్వంతో కూడిన హృదయస్నిగ్ధత యిది. "ఆకులో ఆకునై పూవులో పూవునై ఈ యడవి దాగిపోనా" అంటూ "జగము నిండ స్వేచ్ఛాగానఝురులు"నింపే ప్రయత్నం చేస్తానంటాడు ఉద్వేగంతో (స్వేచ్ఛాగానము - 1) అంతలోనే ఒక్క-క్షణం సంశయానికిలోనై,- యితరులు చూస్తున్నారన్న స్పృహతో "నవ్విపోదురుగాక నాకేటి సిగ్గు ?" అంటాడు. (స్వేచ్ఛాగానము - 2). అలా అనడంలోనే లోకాన్ని గూర్చిన ఎరుకతో ఒకమెట్టు దిగటం ఉన్నది. కాని లోకాన్నీ, లోకం ఆరాధించే దైవాన్నీ గట్టిగా నిరాకరించి, 'భావోద్వేగంతో ప్రకృతితో తాదాత్మ్యాన్నీ, సౌందర్యాన్వేషణంలో స్వేచ్ఛానందాల్నీ నిలబెట్టుకోవటమూ ఉన్నది. అయితే జీవిత వైచిత్రిని గూర్చి సందేహాలు పొటమరిస్తాయి. "విసమమృతమట్టు లమృతంబు విసమురీతి చిత్రవిచిత్రగతుల మానవ జీవితంబు." ఆ సంగతేమిటి ? 'తేటివలపు' ఒక సమస్య. తేటి సమాధానమిస్తుంది: "నిరంతరంబు పల్లికపనెయ్యుండె మునము గూర్పగ మాకొక్క పూవెచెపుమ !" మనోచాంచల్యాన్ని ప్రకృతి సహజమని సరిపెట్టుకోవడం, 'భావ నక్షత్రకాంతుల' కోసం హృదయాకాశానికి అర్రులుజాచి చూడటం కవి చేస్తున్నపని. బృందావన గాథలు (అన్వేషణము) ఆ భావశబలతను పోగొడిచేస్తున్నవి. ఆ భావోద్వేగ పరంపర వైకల్యాలన్నింటినీ అధిగమించి ఆనంద ప్రశాంతిస్థాయికి చేరుకున్న సూచన 'విశ్రాంతి' అనే రచనలో ఉన్నది: "సర్వేశ్వరుని హస్త జలజయుగ్మమున విశ్వమే హాయిగా విశ్రాంతి జెందె" సృష్టిని చూచి కవి పొందిన రసానందంలో సమాధ్యవస్థ యిది !

కాని లోకం పోకడ కవి మనోస్నిగ్ధత్వాన్ని భగ్నం చెయ్యక మానలేదు. సూర్యుణ్ణి చూచి అనుకుంటాడు: "పొడుపు మలపైని బంగరు ముగ్గులుంచి, సంజమబ్బుల కుంగరాల్ సంతరించి పోవుచున్నావు. నీవేమి పొందితోయి ? వెర్రి మిత్రుడ, లోకంపు విధము గనవో ?" అలాగే సెలయేరు "తోయముల తీయనైన పానీయ మొసగి" చివరకు "నైదాఘతీవ్ర తపంబువలన" తానేమొ ఎండిపోయింది ! సూర్యుడూ, సెలయేరూ ఏమి బావుకున్నట్లు ? (లోకము). స్వార్థాన్ని గూర్చిన యీ ఊహకు సమాధానంగా మళ్ళీ ఊహిస్తాడు : "సౌరభములేల చిమ్ము పుష్పవ్రజంబు ?" "పరుల దనియించుటకొ ? తనబాగుకొరకొ ? గాన మొనరింపక బ్రతుకు గడవబోకొ ?" (ఏల ప్రేమింతును ?). జగత్తులో ప్రతిఫలాపేక్షలేని స్వచ్ఛంద ప్రవృత్తియే 'ప్రేమ' అని గుర్తిస్తాడు.

'ప్రేమ' తన ఆదర్శం. ఈ ప్రేమకు లక్ష్యమైన ప్రేయసి (దివ్యభాగ్యము) "హేమ మణిరత్నగణాల్ని", "ముత్తియంపు సరాల్ని", "సార్వభౌమ భోగాల్ని" వాంఛించదు. కవిలాగే ప్రకృతి సౌందర్యంతో తృప్తిపడి, అతనిలో "ప్రవిమల ప్రేమసామ్రాజ్య పట్టభద్ర భాగ్యాన్ని" అనుభవిస్తుందని ఆశిస్తాడు.

అయితే శరీరవాంఛకు స్థానమేమిటి ? అనే ప్రశ్న ఉదయిస్తుంది. "విరిసి విరియని క్రొవ్విరినరయుటకును ఎంతొ సందియపడ, స్పృశయింపగలమె ?" రాయప్రోలు వారు 'అమలిన శృంగారాన్ని' ప్రతిపాదించారు. కవికి కలిగిన సందేహం ప్రణయము, ప్రేమ, వలపు, 'మలిన వాంఛ', యీ విభిన్న ఉద్వేగాలన్నీ యీ హృదయంలోనే కలుగుతున్నాయే, ఏమిటది ? "ప్రేయసీ ! శర్వరీతమో వీధులబడి చందురుడు రాడె పూర్ణతేజస్వియగుచు; అఘవిదూషిత మీ హృదయంబునందె ప్రేమ కోమల తమము పవిత్రమయ్యె" (నా ప్రేమ). అన్ని ఉద్వేగాల్లో పవిత్రమైంది ప్రేమ అని పరిష్కారం. శరీరవాంఛ మలినమనీ, నిషిద్ధమనీ నిర్ణయం చేసుకుంటాడు కవి.

శరీరవాంఛ నిషిద్ధంకాగానే విరహం, దాని తాలూకు వేదన క్రొత్తరూపం సంతరించుకుంటాయి. ప్రబంధాల్లో 'విరహం ఒక అవస్థ' దానికి గమ్యం ఉన్నది. భావకవి విరహానికి అలా ఒక అంతంలేదు : "ప్రణయ మలయానిలోర్మికా పటలి నూగు సౌరభమ, గానమా, నిండు శాంతి నిండు." (ప్రాణకాంత) విరహాన్ని వృద్ధిచేసే ప్రకృతి విలాసాలనే 'శాంతి' ప్రసాదించమని అభ్యర్థిస్తాడు.

మానవ హృదయం "అఘ విదూషితం" (నా ప్రేమ) మానవుడు పుట్టుకతో పాపి — ఈ భావాలు క్రైస్తవ సంస్కృతికి చెందినవి. వలపు సంబంధమైన శరీరవాంఛ 'అఘ'మన్ సిద్ధాంత ప్రాతిపదికమీద భావనాత్మక ప్రేమ మధ్య యుగాంతంలో ఇటాలియన్ సాహిత్యంలో డాంటే, పెట్రార్క్ కవులతో ప్రారంభమై, పాశ్చాత్యదేశాల్లో ప్రాచుర్యాన్ని పొందింది. దీన్నే 'పెట్రార్కన్ కాంప్లెక్స్' అని ఆధునికులు వ్యవహరిస్తారు. ఈ కాల్పనికవాదమనో వైఖరిని చలం నిరసించి, ఎదురు తిరిగాడు. సౌందర్యాన్వేషణలో,

ఆ స్వాదనలో మనస్సుకీ, శరీరానికీ అభేదం పాటించటమే, హృదయానికి అపం లేదనటమే చలం మార్గం. ఆధునిక ఆంగ్ల సారస్వతంలో డి. హెచ్. లారెన్స్ తొక్కిన మార్గమూ యిదే. కాల్పనిక వాద భంజకమైన తర్వాతి పరిణామం యిది.

ప్రణయం కలిగించే మానసికావస్థలనీ, వాటి అందాలనీ కవి వర్ణిస్తాడు. "జలనిధులు దాటి, ఉన్నతాచలములెక్కి, హృదయపది ఏమొ క్రింద మీదెరుగకుండ, పక్షివలె రెక్కలందాల్చి పరువులిడను, మాటి మాటికి వలపుల పేటికడకు" (మాటి మాటికి). ప్రేయసి 'వలపుల పేటి' కావడంతో, ప్రకృతి అందచందాలలో విహరించే మనస్సు ఎటు తిరిగీ ఆమె కడకే పరుగెత్తుతుంది. ప్రకృతిలోనూ ఆమెనే అన్వేషిస్తాడు. 'నల్లని మబ్బులనింగి నా సౌధ రాజమ్మునల్ల నవ్వే ప్రియురాలు నన్ను గోరకుమా" (ప్రేయసీ) అంటూ ఆమె తప్పిస్తుంది. భావనాత్మక ప్రేమలో ప్రేయసి ఆకాశందాకా ఎదిగిపోయింది; ప్రియుడునేలను కరచుకొని నిలిచిపోయాడు! "ఏనాడేన్నుడ నేనీవ్వైన నౌదిగి కాంచెదను నిన్ను కనులార, కరవు దీర" అంటూ, 'హృదయనేతవు, భవదీయ వనసరోజ మృదుర జోలేశ దివ్య సంపదను వలచి"న వాణ్ణి, "మోడునై రాయినై నిల్చిపోదునకట!" అని వాపోతాడు.

అటుపై ఒక మలుపు. విరహావస్థ విషమించి ఏవో సంఘటన కారణంగా దాటిపోయింది. "వలపె విషమైన తుచ్ఛ జీవనము విషము" (అరని దివ్వె). వలపు విషమైంది. ప్రణయము భంగమైంది. "హృదయనాళము తెగిపోయె" అంటాడు. కారణాలూ సన్నివేశాలూ సూచించడు. ఏం జరిగిందో చెప్పడు. 'అయ్యో' అన్న శీర్షిక క్రిందనున్న పద్యాలలో కొన్ని సూచనలున్నాయి: "పర్వత శ్రేణి విస్ఫుర పంక్తులట్లు ఆశయములెల్ల నడుగంటి అంతరించె" అంటాడు. ఎలా అంతరించాయి? "మత్తిలిన యొక్క చంచల మధుపమునకు గోలుపోయితి మకరందజాలమెల్ల; ఇంతలో పీచి ఎచటికో ఎగిరిపోవు మారుతము తోడ వలపులు మాయమయ్యె." వలపు ఉద్వేగం అంతా గాలికి కొట్టుకుపోయిందట. కవిలో తొలినాటి స్నిగ్ధత ఆ అనుభవంతో పోయింది. ఆదర్శం నిలబడలేదు. మిగిలింది నిర్వేదం. "చంచల మధుపము" అనీ "కోలుపోయితి మ రందజాలమెల్ల" అనీ అనడంవల్ల, బహుశా కవి పొందిన ఒకానొక శారీరకానుభవం అతనిలో తాను పతితుణ్ణయ్యాననే స్పృహకు కారణభూతమై నిర్వేదము ప్రారంభమైందని ఊహించడం అనుచితం కాదు. తనలో వచ్చిన మార్పుని తనే పునశ్చరణ చేస్తున్నాడు: "నా విరుల తోట పెంచి కొన్నాడ నొక్క నవనవ గులాబి మొక్క." ఇది తను నిర్దేశించుకొన్న ఆదర్శమైన ప్రేమ. "సుకుమార కుసుమ మొకటి నవ్వె కళకలమని నావనమ్ములోన" అంటే ప్రేమకు లక్ష్యభూతమైన ప్రేయసి లభించింది. "నా ప్రవసవమ్ము నేను, నన్ను మనసార నా ప్రసూనమ్ము, కనులు విచ్చి కాంచుచు కాలము పుచ్చినాము, ఎదల నిశ్శబ్దముగ బల్కరించు కొనుచు.' ఇది వారి మధ్య నడచిన అమలిన శృంగారము. ప్లేటానిక్ లవ్. కాని "అంత ఆకు సందుల దోవలో నల్ల దిగియె నొక్క క్రూరాక్క కిరణమ్ము; ఉర్విపాలి నా గులాబి సోలితూలి నన్ను వీడె." ఆ ప్రేమ, ఆ ఉదాత్త భావోద్వేగము, ఒక్క సంఘటనతో అంతరించాయి. "శూన్యమౌ మోడు మ్రానును జూచి యొక్క కోకిలమ్మ కోయని ఏడ్చె గొంతునెత్తి ... మందపవను డొకడు జాలిగ నిట్టూర్పు విడరె." ప్రకృతి నుంచి జాలి ఒక్కటే మిగిలింది, ప్రేమను కోల్పోయిన కవికి.

ఆదర్శప్రేమ భగ్నం కావడానికి 'వివాహం' కూడా ఒక కారణం. ప్రియుడుగాని ప్రేయసిగాని వివాహబంధంలో చిక్కువడటంతో భావనాత్మక ప్రేమభగ్నమౌతుంది. (ప్రేమికులే పెళ్ళాడినా యిది సంభవిస్తుంది.) కవి లోకాన్ని, వివాహవ్యవస్థను నిందిస్తాడు. "ప్రణయ మధురిమ మెరుగవు .... బంధింతు పంజరాన". అయితే లోకాన్ని ఎదిరించి, లోకాన్ని లెక్కచెయ్యని చలంకాదు కృష్ణశాస్త్రి! 'హృదయంపు స్వేచ్ఛనెటులు పంజరంబున బంధింతె? పాదపమున గూడియుందు మెల్లప్పుడు ప్రవిమల ప్రేమ దంపతుల మగుచు" అంటాడు. చెట్టెక్కి కూర్చుంటాము, లోకమా! నువ్వేం చేస్తావు? అంటాడు. ఇది చలం చెప్పేలా ఎక్కడికో చెట్టుమీదికో గుట్టమీదికో, నిజంగా లేచి పోవడంకాదు; మానసికంగామాత్రమే; హృదయాలతో మాత్రమే!; దీన్నే చలం నిరసించాడు. ఇది ఆత్మవంచన. నిషిద్ధమనుకున్న శారీరకానుభవాన్ని నివారించేందుకు ఒకవైపు భావనాత్మక ప్రేమకు శక్తి లేకపోయింది. మరొకవైపు అది వివాహవ్యవస్థనూ కాదనలేక పోతోంది. అయినప్పటికీ "ప్రవిమల ప్రేమ విహంగ దంపతులము" అంటూ స్వేచ్ఛను గురించి గొప్పలు పోవడం, ఇది ఆత్మవంచన అని కవికీ తెలుసు; ఎలా తెలుసు? పూర్వపు ఆనందం యిక్కడ లుప్తమై పోవడమే గుర్తు. తొలినాటి స్వేచ్ఛలో, హృదయ స్నిగ్ధతలో అనుభూతమైన ఆనందంగాని, నిప్పులాంటి విరహంలో పొందిన ఉదాత్తతగాని యిలా 'సరిపెట్టుకోవడం'లో లేదు! అందుకే యీ నిర్వేదంలో ఒక్కొసారి అనిపిస్తుంది కవికి — 'మింట చుక్కల దృశ్యమాయెను, చేతి కందెడు పూలువాడెను, సారహీనపు జీవితమునకు కోరికలె మిగిలెన్" (చుక్కలు). అటు ఆదర్శమూ పోయింది. యిటు సుఖమ్మూ దక్కలేదు. జీవితంలో కోరికలే మిగిలాయే! వ్రతం చెడ్డా సుఖం దక్కలేదే! "తళుకు బంగరు తారలేలా? తలకు మీరిన తలపులేలా? వలచి పొందగ గగన సుమములు కలయె జీవితము?" (చుక్కలు). ఏమిటీ ఆదర్శాలూ, భావో

ద్వేగాలూ, ఆవేదనలూ ? అందరిలా సామాన్యంగా వుండేవోలా ? అన్పిస్తుంది కూడా ఒక్కోసారి.

మనోద్వేగాలు కాదు, జీవితాను భవాలే కఠిన సత్యాలన్న గుర్తింపు కవిని అంతులేని నిర్వేదంలో ముంచేస్తుంది. అయినా హృదయంలో చెలరేగే తుఫాను సామాన్యమైనది కాదు. పైకి లోకానికి కన్పించేవి కవి 'కన్నీటి కెరటాలు' 'నిట్టూర్పు గాడ్పులు' మాత్రమే. కవి హృదయంలో అవే — 'ప్రళయ కాలమహోగ్ర భయద జీమూతోరుగళ ఘోర గంభీర ఘోర ఘోషార్భటులు'. అంతటి నిరాశా నిర్వేదాలలోనూ ఆశ చిట్టితలా మెరుస్తున్నదంటాడు. (ఆశ). ఏమిటీ ఆశ? సౌందర్యం ప్రసాదించే ఆనందభావన. అదే కన్నీటి కెరటాలపై తేలియాడే వెన్నెల. అదే మేఘగర్జనల్లో తోచే మెరుపు. ఈగాఢ ధ్వాంతం, కవి 'ప్రావృడంభోదరస్వామి' అంటూ సంబోధించే యీ మబ్బు కరిగి, అశ్రువులై స్రవించి పోతున్నది. కాని ఎప్పటి కప్పుడు మళ్ళీ దిగులు గూడు కట్టుకొంటున్నది. దుఃఖంతో ఆత్మైక్యాన్ని ప్రకటిస్తాడు: "ఏ ననంత శోక భీకర తిమిర లోకైక పతిని" అంటాడు. పక్షిలా పాడాలంటే (తొలినాటి స్వేచ్ఛా స్మృతులు) గొంతు పెగలదు. పాటకాస్తా "అంతులేని దారిలేని శోకంపు పెడావులందు" ఇంకిపోతున్నది. ఇక్కడ అంతలో మళ్ళీ ఒక మలుపు. కవి కొత్తగా ఒక మాట అంటాడు. "అంత లజ్జా విషాద దురంత భారవహనమున కోర్వ లేని ఈ పాడు బ్రదుకు" (నేనుకూడ) గాఢధ్వాంతానికీ, ప్రావృడం భోధరానికీ ఉదాత్తత లక్షణం. వాటితో ఆత్మైక్యాన్ని పొందే ప్రయత్నం చేసిన కవిలోని నిర్వేదం యిప్పుడు 'లజ్జా విషాద దురంత భారం'గా మారింది. కవిలో ఆత్మ హైన్యం పొడసూపి అంతస్సంఘర్షణ మొదలైంది. సృష్టికర్త నూహించి ఆయనకు నివేదించుకొంటాడు — "ఇమ్మహా విశ్వమల్లలాడించు నీదు బొమముడి కషాయ వీక్షణ స్ఫూర్తి జిహ్మ! బురదలో కుళ్ళి పొరలాడు పురుగునెత్తి, కాంత, చేర్పకు మోయి నీ కౌగిలింత!" స్వేచ్ఛను ప్రకటించిన తొలినాటి కవి దృష్టిలో భగవంతుడు "నిర్జీవ పాషాణ విగ్రహంబు" "క్షుద్ర మందిరాంతర జీర్ణకుడ్య తలములందు .... కులుకు దివాంధము," "తళుకు బంగరు సంకెళ్లు దాల్చి లోక పాలకుని బోలె మరియు బానిసీవు." దానికి ప్రతిగా కవి ఆనాడు "గగన విహార విహంగమపతి" వగైరాగా తన్నుతాను ప్రకటించుకొన్నాడు (నేను). తర్వాత తనను క్రమ్ముకున్న నిర్వేదం తోటి ఆత్మైక్యాన్ని భావించినాడ ఆస్థాయిలో నిలువలేక 'బురదలో కుళ్ళి పొరలాడు పురుగు' స్థితికి పతనమయ్యాడు. కారణాలు కావ్యంలో కనిపించవు. పరిణామం స్పష్టంగానే వున్నది. కవిలో అహంభావం దెబ్బతిన్నది. ముకుళిత హస్తాలతో స్వామిముందు నిలిచి "తారకారత్న భాసుర తారహార సుప్రభామాలికాజాల శోభితుడవు, రాజరాజేశ్వరుడవీవు, ప్రభుడవీవు, హృదయ పతివీవు!" అంటూ ప్రకృతిలో స్వామిని గుర్తించటమే కాదు, "కానుకగా ఏమొసంగగ గలను నీకు?" అని దైన్యాన్ని వెలిబుచ్చుతాడు. ఇది లొంగుబాటు. ఆత్మార్పణం మాత్రంకాదు! "గాఢ లజ్జాను తాప సంకలిత హృదయ నీరజ దళాంతరాలు కన్నీటిచుక్క" నేకానుకగా సమర్పిస్తానంటాడు (నా కానుక). ఇదిఆత్మ తిరస్కృతి. నివేదించినది పాపభారాన్ని మాత్రమే. ఈస్థితి 'పాపి' అనే రచనలో స్పష్టంగా అభివ్యక్తమైంది. "భరియింపగరాని లజ్జ శిరము వంగి క్రుంగినంత, తెరదాటి చందమామ నవ్వునురాపాపీ!' ఇది ఆత్మ ప్రక్షాళనకు ప్రయత్నం. "కలుషదుర్దాంత పంక సంకలిత కుహర ముల జనియించు మదీయాశ్రు మలినధార, స్వామి, భవదీయపాద దేశమునబారి పరమ జాహ్నవీప్రతిభ గాంచు" (కన్నీరు). అలా భావించుకుని ఊరడిల్లే ప్రయత్నం చేస్తాడు. ఇది కేవలం ఆకాంక్ష తప్ప దైవానుగ్రహం పొందడం కాదు!

'లజ్జాను తాపం' 'మలిన బాష్పాలు' అనే మాటలూ, 'పాపీ!' అనే స్వీయసంబోధనమూ-యివి క్రైస్తవ సంస్కృతి నుంచీ, బ్రహ్మసమాజంద్వారా సంక్రమించిన భావోద్వేగానికి చిహ్నాలు. హైందవ సంస్కృతిలోధర్మవ్యతిక్రమణము, పాపకర్మలుగుర్తింప బడలేదని కాదు. భావుకుడూ, మనస్వీ అయిన యీ కవి అలాంటి పాప కర్మలకూ, హింసాకృత్యాలకూ ఒడి గట్టిన దాఖలాలు లేవు! భావనాత్మక ప్రేమనుంచీ దిగజారటం ఎటువంటిపాపం? పాశ్చాత్య సంస్కృతిలో క్రైస్తవమతం నిర్దేశించే ఆజన్మపాప భారానికీ (ది బర్డెన్ ఆఫ్ ఒరిజినల్ సిన్.), మధ్యయుగం తర్వాత ప్రభూతమైన మానవ వికాసానికీ (ది రినేసెన్స్ మాన్) ఏర్పడిన ఘర్షణలో కుదిరిన ఒకరకం సమన్వయమే భావనాత్మక ప్రేమ రొమాంటిక్ లవ్. తుచ్ఛమైన శరీరంతో పాపీ, అల్పుడూ అయిన మానవుడు అమలిన శృంగారంలో, ఉదాత్త ప్రేయసీ భావనలో, వీరోచిత కార్యనిమగ్నతతో నిర్మల జీవనం గడపటమే అసమన్వయం. ఆ ఆదర్శాన్ని నిలబెట్టుకో లేకపోతే అక్కడ అది పతనమూ, పాపమూ అవుతుంది. హైందవ సంప్రదాయంలో గార్హస్థ్యం ధర్మమేగాని పతనంకాదు! కృష్ణశాస్త్రి 'లజ్జాను తాపం'గా వర్ణించిన నిర్వేదం, అది దాని నిజస్వరూపం కాదు!

కృష్ణశాస్త్రిని పీడని యీ నిర్వేదం యొక్క నిజస్వరూపం వేరుగా ఉన్నది. అది సౌందర్య తత్త్వాన్వేషణ. జీవితంలో తొలి అనుభూతిగా పొందిన స్వేచ్ఛా-ఆనందమూ, దానికి లక్ష్యభూతమై దర్శన మిచ్చిన ప్రేయసీమూర్తి అదృశ్యం కావడంతో ఏర్పడిన శూన్యమూ - ఏకాంతమూ, అక్కడనుంచీ ప్రేయసి క్రమంగా

ఒక అనుభూత భావన కావడమూ, కవిలో ప్రతీక్ష తీవరించి, అది అన్వేషణగా, తనంతగా కవిని అశాంతిలో ఆత్మవైఫల్యంలో ముంచెత్తడమూ - యిదీ కవి నిర్వేదం యొక్క నిజస్వరూపం. దీన్ని కవి 'కృష్ణపక్షం' చివరి ఖండికల్లో గుర్తించాడు. ఆ దుఃఖాన్నే ప్రేయసీమూర్తి యొక్క మరోరూపంగా అంగీకరించి అంతనిరాశలోనూ తనకు మరణమ్ము వలపంటున్నాడు. 'ఆ యగమ్య తమ స్సౌందర్యయవనికాంతరపు టేకాంతమున' అదృశ్యయైన ప్రేయసి "నూపురారవాహ్వానములను వెంటనంటి, నా హృదయము వెడలిపోయె" నంటున్నాడు. "ఎదురుచూతు నీకొరకు, నా ఎడద కొరకు" అని దీక్ష వహిస్తున్నాడు (ప్రతీక్ష). లజ్జ, ఆత్మ హైన్యము, స్వామి పాదాలకడ మోకరిల్లి క్షమనం కోసం ప్రార్థించడమూ లేఖిస్తాడు! "ఆవలిదరి నీపిలుపు పవలు రేలును మ్రోయ మిప్పల తొందర నసువు నవసి తపింతున్" అనీ, "శూన్యలోకము దాటి శుష్కదేహము దాటి అన్యోన్యనిబిడ నిత్యాశ్లేష కాంక్షతో" అనీ, పల్కడంలో కవి ప్రతీక్ష యొక్క పారమార్థికత, అనశ్వర అనుభూతి కోసం తపనా స్పష్టమౌతున్నాయి. 'కృష్ణపక్షం'లో చివరి ఖండిక 'నిర్యాణం'లో అలౌకిక ప్రేయసీమూర్తి అడుగుజాడల్లో కవి నిర్వేదాన్నే దినచిత్తంగా గ్రహించి పయనించే నిరంతర పథికుడుగా దర్శనమిస్తాడు. "ఎచటి కేగుచు నుంటినో ఏమొనేడు!" గమ్య నిర్దేశంలేదు!

* * * *

"ప్రేయసీ, ప్రేయసీ, వెడలిపోయితివేల ఆయగమ్య తమస్వినీ గర్భకుహరాల?" అంటూ ప్రారంభమౌతుంది 'ప్రవాసము'. ఇది కృష్ణపక్షం'లోని చివరి ఖండికల్లో ఒకటైన 'ప్రతీక్ష'లో అభివ్యక్తమైన యితివృత్తానికి ప్రతిధ్వనే. కవి అన్వేషణ స్వరూపం 'ప్రవాసము'లో చిత్రీకరించబడినది. ఇందలి ఖండికలకు విడిగా శీర్షికలులేవు. ఖండికలన్నీ ఒకే ఉద్వేగాన్ని-కవి నిర్వేదాన్నీ, దాని విశ్వరూపాన్నీ, పరిణామాన్నీ అభివ్యక్తం చేస్తాయి.

ప్రేయసి "అడుగు సందడులు నా యెడద త్రోవనే పడి నడిచినట్లయ్యె; నా యెడదలోననే మాయమైనట్లయ్యె!" అనడంతో 'అగమ్య తమస్వినీ' 'యవనికలు' గాని 'గర్భకుహరాలు' గాని కవికి వెలుపల వేరుగ లేవనీ, ప్రేయసి తనలోనే ఉన్నదనీ ప్రథమంగా గుర్తిస్తాడు. అందువల్ల "ఒరులేరయసేయంతరి' ఏకాంతంలో 'చూచికొని చూచికొని శూన్య హృదయములోనికి', 'ఓ చెలీ' అని ఆర్తితో పిలుస్తాడు - ఈ ఆర్తి, ఈ పిలుపు వ్యక్తి హృదయం నుంచీ విశ్వ హృదయాన్ని చేరి అన్ని దిశలా మార్మ్రోగి ప్రకృతిని కంపిల్లజేస్తుంది. చూడలేక తారకలు 'కన్నులల్లార్చికొనినవి', మొగిళ్ళు 'నిట్టూర్పు దొంతరలైనవి.' తిమిరాలు 'శిరాలు వాల్చికొనినవి'. గాలి అసిపారిలీల ఆకుల వెనుక నొదిగి 'చలియించి పోయినాడు.' విశ్వం విశ్వమే తన నిత్య యాత్రలో ఒక్కక్షణం ఆగి 'శ్రవణములు మూసికొనినది' .... అందుకే చలం 'కృష్ణశాస్త్రిబాధ ప్రపంచానికి బాధ' అని ఒక్క ముక్కలో అన్నారు!

ఒకనాడు ఆనందంతో 'ఆకులో ఆకునై పూవులో పూవునై' అనీ 'మోహన వినీల జలధరమూర్తి నేను' అనీ ప్రకృతితో ఐక్యాన్ని ప్రకటించి దాన్ని నిలుపుకోలేని కవి, ఈనాడు నిర్వేదంలో ఆ ఐక్యాన్ని మళ్ళీసాధించి, దాన్ని నిలుపుకోగలిగాడు! 'ప్రవాసము' లోని ఖండికలన్నీ దానికి తార్కాణ. కవి దుఃఖమే 'ప్రకృతిలో 'దారుణ ప్రభంజనం', అదే 'లోకేశు ఎడదవెడలు ఏడ్పు సందడి' కూడా! ఇది 'పాట' కాదు, 'ఏడుపు' అంటాడు కవి.

అయితే యిది ప్రయాణం, యాత్ర, అన్వేషణ కూడా! ఈ యాత్ర కవి ప్రకృత జన్మకే పరిమితమైనట్లు తోచదు! నిర్వేదం వ్యక్తిపరిధి నుంచీ విశ్వమంతా పరివ్యాప్తమైనట్లుగానే స్వాప్నికాలికమైన ఈ జన్మనుంచీ అసంఖ్యాక జన్మపరంపరలకూ అనంత కాలానికీ పరివ్యాప్తమైనట్లు తోస్తుంది కవి యాత్ర. 'అంతమేలేని నాయాత్రా పథావ పదచిహ్నములు వోలె పడియున్న వెన్నెన్నొ అడుగుజాడలు మదీయార్ద్ర హృదయమ్ములో, నిశి కడుపులో తారలై నిశ్శబ్దవాటిలో చిరుపాటలై'. ఆ 'అడుగుజాడలు', ఆ స్మృతులు కవి ప్రయాణం సాగించడానికి కొత్త బలాన్నిస్తున్నవి. కవి హృదయంలో వచ్చిన ఈ పరిణామంలో కవి చైతన్యం ఎలా విస్తరించిందో, 'కృష్ణపక్షం' నాటి అహంభావ కవిలోవచ్చిన మార్పేమిటో స్పష్టమౌతున్నది యిక్కడ.

ఆత్మ నిర్వేదాన్నీ, ప్రేయసి (సౌందర్యం)కోసం అన్వేషణనీ అభివ్యక్తం చెయ్యడంలోనే కవి ప్రకృతితో తాదాత్మ్యాన్ని నిరూపించుకుంటున్నాడు. ఇది తెచ్చిపెట్టుకున్న తాత్కాలికోద్వేగంకాదు అస్తిత్వపు లోతుల్ని మధించటం; అద్వైత శిఖరాల్ని అధిరోహించటం.

నిర్వేదంతో నిండిన యీ బ్రతుకొక కలత నిద్దుర. ఏదో కల మెరుపులా మెరుస్తుంది. దేనికోసమో ఆశతో చేతులు చాచినట్లుగా వాంఛతో కనులు తెరవగానే ఆ కల కరిగిపోతుంది. మళ్ళీ యథాస్థితి. అన్వేషణ, ఏకాంతం, నిర్వేదం మిగులుతవి.

నిశాంతము, ప్రొద్దుపొడుపు, 'ఉన్మిషిత జీవనాగమనోత్సవము' కేవలం 'రెప్పపాటు' మాత్రమే. నిర్జీవ నిశ్శబ్దము, రాత్రి,

చీకట్లు యథాప్రకారమే ఎడతెగనివి. అందుకే 'నాకుగాదులులేవు, నాకుషస్సులు లేవు ... నాకు కాలమ్మొక్కటే కారురూపు' అని ప్రకటిస్తున్నాడు. "నేను హేమంత కృష్ణానంత శర్వరిని" అంటాడు. అలా అనడంలో ఎంత గంభీర ధ్వనీ, ఔచిత్యమూ ఉన్నాయో ! కృష్ణశాస్త్రి సార్థక నామధేయత మేళవింపై !

అటుపైని విశ్వమంతా వ్యాపించిన ఆ నిర్వేద తమస్సు ఒక స్త్రీమూర్తిగా మెల్ల మెల్లగా రూపుదిద్దుకుంటుంది. 'నీ దీర్ఘ ధమ్మిల్ల నీలవల్లీచ్ఛాయ పొడిచికొని, నిదుర చెరవిడిచి, పూవులు నేడు" దృశ్యమానం కావడమేకాదు, 'తళతళలపాట' పాడుతున్నవట, 'సురభిళాహ్వానముల్' పలుకుతున్నవట ! ఏమిటీ ఆహ్వానం ? తనని వెర్రివాణ్ణి చెయ్యటానికా ? 'నీకై శిరధ్వాంత నిశ్శబ్దినంజీలి నాకొరకె ? నాకొరకె ? నా శర్వరీసతీ !' అంటూ ఆశ్చర్యాన్నీ, గట్టిగా నమ్మలేని ఆశనూ వ్యక్తం చేస్తాడు. ఈ ఉద్వేగాన్ని తను భరించగలడా ? ఆమెతో అంటున్నాడు: 'నటియించు అపూర్వలెటు నవ్వుచున్నవో ! తురిమి విసరుమువాని ఎరుగ నేరని దూర మారాలకో, రహస్య రాలకో, చెలీ! ... నేనైపగాలేను! ఆశల్ని పురికొల్పే ప్రేయసీ ధమ్మిల్ల కుసుమాలవంటి ఆ తారకల్ని తను చూడలేనంటూ కనులు మూసుకున్నాడు. ఇది 'అపూర్వ నరకయాతనా ఖర్వ తాపము' అంటున్నాడు విభ్రాంతిలో.

'విభావరీ వేలాశాలల' కవి ప్రతీక్ష కొనసాగుతూనే వుంది' 'పగలెపగని ప్రవాసమున కిక వేకువ రేకు విరియదో !' 'ఆకస మాలోకముగ లోకమెల్ల వీడుగ, కాలాంతము నకు కాచియుందునా !' (కృష్ణశాస్త్రి కవిత్వం యిలాంటి పాదాల్లో కైలాస శిఖరాల్ని తాకుతూ ఉంటుంది !)

నిర్వేదం కొంత విరిసి, అన్వేషణను గూర్చిన తలపోత ప్రాధాన్యం వహిస్తుంది ఇక్కడనుంచీ. "ఏనొక వియోగ గీతిక .... ఏనొక వియోగ శాలినీ హృదయరాగ వేదనారేఖ .... అదియె మొదలేను సకలదిశాంత రాళ మెల్లెడల నెందుకో పర్వులెత్తిపోవ!" అప్సరోంగనానురాగ వీధుల, కిన్నరీ రమ్య కంఠసీమలో, శ్రావణాంబు దాశ్లేషపాళి, తారకాలోక పంక్తుల, మారుతోరు పక్షముల" తిరిగాడుట – అంటే సౌందర్య తత్త్వాన్వేషణమే దీని స్వరూపం. కాని దీనికి అంతం, అర్థం వుంటుందని నమ్మకమూ లేదట ! "ఇది ముగియబోని, ఏయర్థ మెరుగరాని వేసటలేని వెర్రి యన్వేషణమ్ము !"

ఇక నిర్వేదం కాదు, అన్వేషణే తన నిజరూపం అంటున్నాడు. తాను 'ఏగూడేని లేని పులుగు రాయ'డట. తాను 'సంధ్యా మనోజ్ఞ చిత్రి సిందూరరేఖ' యట. తర్వాత తాను 'రిక్క'గా మారాడట. కాని అంత ఎత్తున పరిహాసినా పండగలడా ? లేదు, లేదు, తాను మళ్ళీ 'యిరుల చాయయై' కుర్రింగికుర్రింగి అలసి నిర్వేదంలో పడిపోతున్నాడు. సౌందర్యంలో లీనమైకూడా ఆ స్వేచ్ఛలో నిలువలేకపోతున్నాడు. తన అన్వేషణలో ఆర్తి, అర్థి రెండూ ఉన్నాయి. 'కంటగురిసిన కార్చిచ్చు మంటయేళ్ళు' ఉన్నాయి. బిచ్చగానివలె చేయిసాచుకొని ఉండగా 'వట్టి బయలున ఒక మోడు చెట్టువోలె, ఎత్తినది కరమెత్తినట్లే కృశించి' పోవడమూ జరుగుతున్నది. వెదకి, వెదకి, చూచి, చూచి "కన్నులు రెండును బండి చక్రమ్ములయ్యె". (ఇది ఎంత అందమైన అభివ్యక్తి!) ఆశయాలూ, ఆనంద లేశాలూ పొంత సూపినా ఫలితం శూన్యమే. "రేయి కడుపున చీకటి చాయవోలె....నా విషాదమ్ములో దాగినాడనేనె!" తనని ప్రేమించే వాళ్లు లేరు ! లేరనే ఆ నిరాశా, నిస్పృహా మరణానికి సన్నద్ధుణ్ణి చేస్తాయి. "నాకు మరణమ్ము వలదనినాను", దుఃఖమే నా ప్రేయసి అనడంతో ప్రారంభమైన కవి ప్రవాస దీక్ష చివరకు "ఏను మరణించుచున్నాను" అనే స్థితికి తెచ్చింది. కాని ఆ ముహూర్తంలోనే ఏదో పిలుపు వినిపిస్తుంది ! "ఎవరో హా, రజనిశీథి నెగసి, నీడవోలె నిలిచి, పిలుతురెవరొ, మూగకనులు మోయలేని చూపులతో, ఎవరోహో !" అంటూ ఆరకిస్తాడు. ఒక మూర్తి అదివరకే "కోటి నవమల్లికలు, కోటి కన్నులు" విచ్చి పలకరించినా, ఆహ్వానించినా, ఆ ఉద్వేగాన్ని తట్టుకోలేక "కప్పి కొందును కనులు" అంటూ, ఏమైపోతానో అని సందేహించిన కవే, యిప్పుడీ పిలుపువిని "ఎవరోహో ! ఎవరోహో ! ఇప్పుడా నను పలుకరింతురు ?" అంటూ స్పందిస్తున్నాడు. కాని ఆ పిలుస్తున్నది ఎవరు ? మృత్యువా ? ప్రేయసియా ?

ఆమె ప్రేయసి; ఆమె ఊర్వశి: ఇదే "ఊర్వశి" కావ్యం.

కవికి ఊర్వశి పిలుపు వినిపించింది. 'ప్రవాసం'లో కవి చేసిన తపస్సు ఫలితం అది. కాని కవిలో సంఘర్షణ అంతం కాలేదు. ఇక్కడ 'ఊర్వశి' అంటే ఎవరు ? ఏమిటి ? అని జిజ్ఞాస చేసి అర్థంచేసుకునే ప్రయత్నం పాఠకుడూ చెయ్యాలి. లేకపోతే 'ఊర్వశి' కావ్యం బోధపడదు. ఊర్వశి అంటే సౌందర్యతత్త్వం. రసాధి దేవత. ఇక్కడ వివరణ అవసరం. సౌందర్యోపాసనను గూర్చి విశ్వనాథ సత్యనారాయణ 'చెలియలికట్ట' నవలలో ఒక చోట (9వ అధ్యాయం) యిచ్చిన వివరణ – "మనస్సున్నది, బుద్ధి యున్నది. అంతఃకరణ మున్నది, వెనుక శుద్ధతత్త్వమున్నది. వస్తుతఃమే నాల్గుపొరలు తీసి కొందము. ఈ నాల్గొకదానికంటె ఒకటి లోతైనవి, అధికమైనవి. మనము న్ని వస్తువులను మనస్సుతో స్పృశింతుము. త్తో, బుద్ధితో అంతఃకరణము నిర్ణయింతుము.

ఆ నిర్ణయము శుద్ధతత్త్వము యొక్క సామీప్యముచే జరుగును. ....అంతఃకరణము నందు జాగ్రత్త స్థితియందున్నవాడు, మనో బుద్ధులతో గూడియే యుండును. మనసులేనిచో ఇంద్రియములు లేవు. ఏ ఉపాసన చేసినను ఆవరణ విశిష్టమైన యీ మనస్సును దాటిపోయినచో ఉపాసన ఫలోన్ముఖమైనట్లే, సౌందర్యము భ్రాంతియేయగును. భ్రాంతియందు పాసన ఎట్లని ప్రశ్నలేదు. ఉపాసన యనగా భ్రాంతి విషయము నాశ్రయించి భ్రాంత్యతీతమైన స్థితిని పొందుటయే." ఆవరణ విశిష్టమైన మనస్సును దాటిపోవటం అంటే ఎలా ఉంటుంది ? ఉపాసన ఫలోన్ముఖం కావటమంటే ఏమిటి ? దీనికి చలం నాటకం "పురూరవ" ఒక విస్తృత వ్యాఖ్యానం. అందులో ఊర్వశి చెబుతుంది: "నీ మనస్సనేది వేరుకాదు. నీ మనస్సునే వెయ్యి దిక్కుల వెయ్యి మనస్సుల్లో ప్రతిఫలింప జేసుకుంటావు. ఎన్నిజన్మలనుంచో నీలో నువ్వు అన్వేషించుకున్న శృంగారాన్నే, ఇదివరకు అనేక స్త్రీరూపాల, ఈనాడూ నారూపాన, నీ చేతుల్లోకి తీసుకుని అనుభవిస్తున్నావు. అంటే – నేను -యుగాల ఫలితమైన శృంగార వాంఛ-నీ రూపం ధరించి వచ్చిందన్నమాట," ఊర్వశిని దేవవేశ్యగా భావించి ఈర్ష్యకు లోనయ్యే పురూరవుడితో ఊర్వశి అంటుంది : "ఊర్వశి అంటే ఏమిటి ? మీలోకంమల్లే యోచించకు. ఊర్వశి అంటే ఒక అనుభవం. శరీరంకాదు .... శరీరమైనా ఒక అనుభవమే కదా ?" సౌందర్యోపాసనకు లక్ష్యమైన ఊర్వశి ఒక అనుభవం, ఎటువంటి అనుభవం ? "భ్రాంతి విషయము నాశ్రయించి పొందిన భ్రాంత్యతీతమైన స్థితిలో భ్రాంతి మూలకమైన విషయవాంఛ ఉన్నట్లా ? లేనట్లా ? "అంతఃకరణము నందు జాగ్రత్త స్థితియందున్నవాడు మనోబుద్ధులతో గూడియే యుండును. మనసులేనిచో యింద్రియములు లేవు." అని సమాధానము. "శరీరమైనా ఒక అనుభవమే కదా !" అనే వాక్యానికి వ్యాఖ్యానమూ అందులోనే ఉన్నది. శరీరవాంఛ అంటూ వేరుగా లేదు, అలా ఆలోచించటమే అజ్ఞానం అని.

ఇది రసవాదము, సౌందర్యోపాసనా మార్గము, పాశ్చాత్యుల 'భావనాత్మక ప్రేమ' (ప్లెటోనిక్ అర్ పెట్రార్కన్ ఆర్ రొమాంటిక్ లవ్) లో శరీరము తుచ్ఛము. శారీరకానుభవము మలినము, పాపభూయిష్ఠము. రస మార్గములో అలాకాదు. సౌందర్యోపాసన ఫలోన్ముఖము చెందిన వానికి శారీరకానుభవం కల్పించే భ్రాంతి నుంచీ విముక్తి లభించడం ద్వారా దాన్ని గూర్చిన పాప పుణ్యాల భీతికాని, దానికి (విషయ వాంఛకు) దాసుడవటంగాని ఉండదు. సర్వమూ రసమయమే !

పై జెప్పిన వివరణ "ఊర్వశి" కావ్యంలో మొదటి ఖండికను సరిగా అవగాహన చేసుకోవడానికి చాల అవసరం. ఈ ఖండికలో కవి విషయవాంఛాగ్రస్తమై నడచిన తన పూర్వానుభవాల్ని, నేటి ఊర్వశీ సాన్నిధ్యాన్నీ ఎలా సమన్వయించుకోవాలి ? అని ప్రశ్నించుకుంటున్నాడు – "నాకఠిన పాదశిలల క్రిందబడి నలిగిపోయె నెన్నెన్నియో మల్లెపూలు మున్ను .... నా కనులు క్రాగు చీకట్ల పాలికు చోటలేదు నెత్తావి, మధువేనిలేదు, లేదు ప్రాణ, మొక్క లావణ్య లవమ్ములేదు, ఏనుఋజునైతి, జరనైతి; మృత్యువైతి." విషయలాలసలో సౌందర్యానురక్తిలేదు. సౌందర్యానురక్తి, సౌందర్య దర్శనం ఎటువంటిది ? అది "ఒక తార, ఒక దివ్య మందార సుమము" "మోహినీహాస మల్లీ ప్రఫుల్ల రుచియె, శ్రీ లలిత వైజయంతీ పరీమళమ్మె, హర జటాపారిజాత లతాంత మధువె." కాని సౌందర్యం కోసం "నిర్దయా నిశితమ్మ లీ నీచ నఖరముల కొనలె కోరి పరవశమ్మున చలించె." విషయవాంఛ కూడా యిందులో ఉన్నదే ! ఏం చెయ్యాలి ; భ్రాంత్యతీతమైన స్థితిలో విషయవాంఛా కలితమైన స్పృహ ? దీనికి పరిష్కారమేమిటి ?

మొదటి ఖండికలోని యీ సమస్యనే రెండో దానిలోనూ మరోవిధంగా నిర్వచిస్తున్నాడు. "త్రిజగతీపతి కోటీరదివ్యరత్న రాజి రేలు వజ్రాల తురాయి వీవు ! ఏనొ పాతాళలోకంపు చీరుకు సందులందు దిగబ్రాకవెలుచు గాఢాంధరేఖను ! తారకాపూర్ణ చంద్ర మూర్తింబింబ మంచితమ్ము మహాకాశ మంటపమ్ము నందె కాదె, పాణిగ్రహణమ్ముదొరుకు; పతిత వెట్లాదు ? నేనెటు పతినౌదు !" భ్రాంత్యతీతమైన సౌందర్యానుభూతికీ, విషయవాంఛకూ సమన్వయం (పాణిగ్రహణం)కుదరాలంటే ఆదర్శమూర్తియైన ఊర్వశి 'పతిత' అన్నాకావాలి, కవి శరీరం 'పతి' అన్నాకావాలి ! అదెలా జరుగుతుంది?అది సాధ్యమా ?

అది జరగదు, సమన్వయం కుదరదు, అందుకే నాదుఃఖం నా ఏడ్పు ! అంటున్నాడు కవి తర్వాత ఖండికలో. నాదుఃఖం, నా కన్నీరు నీవే ఊర్వశీ ! అంటూ పరిష్కారంలేక అంతరంగక్షోభతో కుమిలే ఆ స్థితినే అంగీకరించే ప్రయత్నంచేస్తూ కవి మళ్ళీవెనక్కి వెడుతున్నాడు-"నీవె నిట్టూర్పు, నీవె కన్నీరు, విశ్వవేదనామూల్య భాగ్యమీవే, నిజమ్ము, నేగళమ్మార పాడుకొనిన అఖాత శోక గీతమ్ములందీవె శోకగీతివి ! ఊర్వశీ ! ప్రేయసీ !" కాని ఒక మార్పుగమనించాలి. నిర్వేదంలో శోకంతో తాదాత్మ్యం కాకుండా శోకగీతిలో ఊర్వశి తాదాత్మ్యం ప్రస్ఫుటమైంది, యిక్కడ. ఎడతెగని దుఃఖంలో విశ్వాంతటా తానై సౌందర్యాన్ని (ఊర్వశిని) దర్శించేస్థితికి చేరుకోవడం కవి చేసిన తపస్సు. అది 'ప్రవాసం'లో యితివృత్తం. కవి ఉపాసన ఫలోన్ముఖమై ఊర్వశి 'గీతి' గా గుర్తింప బడటం "ఊర్వశి" కావ్యంలో తొలిమెట్టు. ఇది కవికి

రసాధిదేవత సాక్షాత్కారం. కావ్యంలో రస సాక్షాత్కారంయొక్క రహస్యం కూడా యిదే ! కావ్యం కల్గించే దుఃఖంలో లీనమై స్పందిస్తూనే, ఆ దుఃఖానుభవంలో సౌందర్యాన్ని దర్శించే అలీన స్థితిలో ఆనందించడమే కావ్యరసానందము. అలా కాకపోతే కరుణ, బీభత్సం వంటి ఉద్వేగాలకు కావ్యంలో స్థానంలేదు. కావ్యం భ్రాంతి కలిగిస్తూనే భ్రాంత్యతీతస్థితిలో మనల్ని ఉంచుతుంది. జీవితంలో స్వీయ సుఖదుఃఖాలంట్లకూడ అటువంటి స్థితికి ఎదగడమే రసమార్గం, తరుణోపాయం. అదే కవి నడచిన మార్గం.

దుఃఖములో సౌందర్యంగా రసాధిదేవత దర్శనమిస్తోంది కాబట్టే తన కవిత్వం, 'తన కృపణ జీవన గళము' ఆ ఊర్వశికి సమర్పిస్తున్నాడు కవి. ఆమె కరుణా కటాక్షంతో తను రచించే కవిత్వంలో "మూడు లోకాల సుఖ మొక్కమూడినిమిచ్చి విసర లేనా కాలాంతమే వెనుకపాక !" అన్న ఆత్మ విశ్వాసాన్ని ప్రకటిస్తున్నాడు.

పై నాలుగు ఖండకల తర్వాత ఖండికలో ఊర్వశి పాట రూపంలో స్వయంగా కవి నుద్దేశించి పలుకుతుంది అందులో కవి సమస్యకు సమాధానం ఉన్నది. 'తొలి వియోగిని నేనె ! తొలి ప్రేయసిని నేనె, అనాటి కీనాటికేను నీదాననే !' దివికీ, భువికీ, భ్రాంత్యతీతమైన సౌందర్యాను భూతికీ విషయ వాంఛకూ, ఊర్వశికీ కవికీ ఎప్పుడూ వియోగమేనా ? సమాగమం లేదా ? ఆ ప్రశ్నకు ఊర్వశి సమాధానమిస్తున్నది — మున్నీటి తరగలకు, మిన్నేటి నురుగులకు, తడయు నెడబాటునె ! విడని కౌగిలి నేనె !' అంతేకాదు ఊర్వశి మానవుడైన కవి కోసం దిగిరావడంలోనే ఆమె 'మిసిమి వెన్నెల మేన మసి జాలిగానయ్యె' అన్నది. సుఖ దుఃఖాలూ, సంయోగ వియోగాలూ వేరుగా లేవు ; ఒక దానిలో ఒకటీ, ఒక దాని నుంచి ఒకటీ, రెండూ ఊర్వశీ విన్యాసాలే ! 'వాన చినుకుగ సొగసి, వలపు చూపుగ నెగసి, పడిపోదునునేనె ! పరువు లిడుదును నేనె ! .... అనాటి కీనాటికేను నీదాననే !' ఊర్వశి ఎప్పుడూ కవితోనే ఉన్నది. తనదిగానే ఉన్నది. పూర్వం కవి గుర్తించలేదు. ఇప్పుడు గుర్తించాడు. అంతే భేదం !

తర్వాత ఖండికలో కవి ఊర్వశి పాట నుద్దేశించి పలుకుతున్నాడు. ఆమె పాటలో కవిపరవశిస్తున్నాడు. కలలు కంటున్నాడు. పాటలో ఊర్వశి విస్పష్ట స్త్రీరూపాన్ని సంతరించు కుంటున్నది— 'ఊవు తేనియ గొంతెత్తి తేని, నీకపోలములు, చిరునవ్వు, నేత్రాలుకూడ, మరచి సర్వమ్ము, సొగసుగా శిరసు ద్రిప్పు చెందు లకొ పాడినట్లుండనేదొ ఏదొ !' కలలు ఆమె ముంగురులజారి, కనుబొమ్మ వంపులవాలి, చూపులదూరి, చెక్కిళ్ళజేరి, మందహాసమ మసకలో మాయమౌతున్నాయట ! అలా మొదట పిలుపుగా తర్వాత పాటగా, అనుభూతమైన ఊర్వశి యీ ఖండిక చివర స్త్రీమూర్తిగా ఎదుట నిల్చున్నది !

ఆ స్త్రీమూర్తి అప్సర. ఆ ఊర్వశి కన్నులలోకి చూస్తూ ఆమె కన్నుల నీలిమను ప్రత్యేకంగా ఒక ఖండికలో వర్ణిస్తాడు 'ఆమె కన్నులలో అనంతాంబరంపు నీలినీడలు కలవు' అని ప్రారంభించి 'అర్థమ్ముకాని భావగీతమ్ములవి' అంటూ ముగిసే యీ ఖండిక గొప్పరచన. భావకవిత్వంలో తలమానిక మనదగిన రచన ప్రకృతిపరె గంభీరమైన ఆమె సౌందర్యం క్రమంగా మా[illegible] వత్వాన్ని పొందుతుంది యిందులో.

అలాఊర్వశీ సాక్షాత్కారాన్ని పొందిన కవి అంటున్నాడు. 'నీయాజ్ఞకాడెనా, గొంతు ముడి వీడెనా, హాయిగా యుగ యుగ[illegible] బుల కలల్ పాడనా ! చిర గాఢనిద్ర మేల్కొలిపి సందేశాల బ[illegible] పనా దిక్కు దిక్కులకు చుక్కలకు?' 'ప్రవాసము'లో కవిపొంది[illegible] నిర్వేదం సౌందర్యోపాసనగా ఫలోన్ముఖం కావడమే ఈ ఊర్వ[illegible] సాక్షాత్కారం. అన్ని సందేహాలూ నివృత్తి అయ్యాయి. 'ఎద లోపలి యెదలో, నెమ్మదిలో, జీవిత రహస్య మార్గములలో, వద లని కోరిక వైనా బ్రదుకు బరువులెల్ల పాట పాడింతు సఖీ?' అ[illegible] ఊర్వశీమూర్తిని నిర్దేశిస్తున్నాడు, గుర్తిస్తున్నాడు.

తర్వాతి ఖండికలు ఏడింటిలో ఊర్వశీ స్త్రీమూర్తితో కవి తన సంయోగాన్ని వర్ణిస్తాడు. ఇక్కడ పురూరవుని గాథలో సామ్యమూ ఉన్నది. ప్రథమంగా కవి ఈ ఉర్వశీ స్త్రీమూర్తిలో ముగత్వాన్నీ, అమాయకత్వాన్నీ ఆస్వాదిస్తున్నాడు — ఆమె అనాథ బాలికయట, తనకు ప్రియురాలు, 'నవ సాంధ్య సమయ మల్లీ మనోజ్ఞ కుసుమకామిని. 'ఆమె సొగసు .... అమృతమధుర నటన వాసింపబోదు, గానమ్ము సేయదు. ఆమె ప్రాయంపు వాకిళ లందు వలపు తడబడి యడంగు సిగ్గుదొంతరల తెరల !' తర్వాత కవి కౌగిట్లో ఆమె ఆ ఘ్రాత పుష్పమైంది — 'తమి బిగిసిపోవ నొక్క సంధ్యావసాన సాంద్ర కాశ్మీర దృఢ పరిష్వంగ మంద నిమిడి, నిలువెల్ల ఒదిగి శోషిలిన యామె నేను తొలిసారి కాంచి కంపిలితినాడు.' ఇప్పుడు కవి పలినము, పతనము, లజ్జవంటి పద జాలాన్ని ప్రయోగించడం లేదు ! కాని హృదయం శారీరకానుభవాన్ని తలపోసి కరుణార్ద్రము, 'మృదుల కరుణా మధురము' కావడాన్ని చెబుతున్నాడు. అటుపై ఒక సన్నివేశము. ఒకనాటి నిశీథిని, 'సుకమ్ముగ నిద్రవోవు నీవేటికొ యెత్తిగిల్లి, తరళేక్షణ నూత్నవియోగ శోకపుం జాటున స్రుక్కు దీనుగసనా పనురాగము

మోసులెత్తగాన్' ఆమె అంతటి సన్నిధానవర్తి యైనప్పటికీ కవి 'పేరాకలి', 'కలగినమనమ్ము', శాంతి పొందలేదు. ఊర్వశి వీణ వాయించదు, గళమెత్తి పాడదు : కాని కవి బ్రదుకు 'నందన చైత్రవనమూ', 'ప్రాభాత గగన పూర్వ ప్రాంగణమూ' అయింది. 'ఓ వసంత విలాస మాధుర్యమా ! ఓ ఉషః కల్యాణ లావణ్యమా!' నా హృదయం ప్రేమతో, ఆనందంతో ఈరేడులోకాల్లో విస్తరించింది అంటున్నాడు. ఊర్వశి తెచ్చిన నవవసంతంలో కవి, కోకిల అయి 'గొంతు చెర' వీడి ప్రేమ గీతాలు పాడు తున్నారు. 'నాకు మాత్రము గాన మున్నంత వరకు చాలు చాలు నీ ప్రణయ విశ్వాస మొకటె' అంటున్నాడు. మళ్ళీ ఊర్వశికీ గానానికీ అభేదాన్ని గుర్తిస్తున్నాడు. ఆ గానం విశ్వవీణాసనదమై కవి హృదయంలో 'మ్రోత' పెడుతోంది. దశ దిశా తంత్రులూ, చుక్కల మెట్లూగల ఆ విశ్వ వీణమీద గానం 'నృత్యోత్సవముల' చలిస్తోంది, కవి హృదయమంతా నిండి, దాన్ని 'క్షీరసాగరము' చేసి వేస్తోంది. 'మోయలేనింక లోకాల తీయదనము; ఆలపింతు నానంద తేజోంబు నిధుల' అంటాడు. ఇప్పటికే ఊర్వశిలో సంయోగము శరీరపు పరిమళ్ళీ, మనస్సు ఆవరణనీ దాటిపోయింది. గానమై, ఆనంద ఝరియై, క్షీర సాగరమై, కవిని 'ఊహాపక్షాంచలముల'మీద ఏదో 'శీతా చల శిఖరోజ్జ్వల హిమ పీఠాగ్రా'నికి తీసుకువెళ్ళింది. 'ఊర్వశి : ఊర్వశి : నాతో వెరపెరుగని కనుమూయుము !' అంటూ సమాధ్యవస్థను కోరుకుంటాడు.

తర్వాతి ఖండికలు ఊర్వశిలో విరహాన్ని సూచిస్తాయి. ''కలువ పూబ్రదుకులో కనుమోడ్చు వెన్నెలే కాలానలంబైన గతి యేమి!" అని ప్రారంభమౌతుంది గీతిక. అటుపైన "ఘనడికిరేయి వెన్నెల యెద చలించు, పిలుపెదో నాసభాయని వేగిరించు, అనలమై కాల్చు నిశ్శబ్దమునె, కలంచి పరువులెత్తించు కడల నా బ్రతుకు నిపుడు !'' అంటాడు. ఊర్వశి తోడి యీ వియోగంలో ''ఊర్వశీ విషాదార్ద్రమూర్తి'' కవి హృదయాన్ని వీడలేదు ! ఊర్వశి తనలో తెచ్చిన మార్పుని కవి స్మరిస్తున్నాడు - "నరకలోకపుటింట నవ యుత తమస్సు వెలుగు నమృతమ్మయ్యె !'' నిజంగానే యిది వియోగమా ? కాదంటాడు ! ఊర్వశి జాలి చూపులు 'అమరనాథ కంఠమాలా సుమదళాలు' ఎంతదిగజారి దిగజారి కవిని ఎంతగా వెదకికొన్నా, 'వెలుగులేక ఎగరలేని వీనికనులెరెలలై' ఆ కాంతిని గ్రహించలేని స్థితి కలుగుతోందే కాని, నిజంగా 'కలుగునా నాకు నీ వియోగమ్ము సకియ ?' అంటూ ఊర్వశినే ధ్యానిస్తున్నాడు. తన అశక్తతనే వియోగభ్రాంతికి కారణంగా చెబుతున్నాడు.

ఊర్వశితోడి వియోగంలో ఏర్పడిన ఒకనిద్రావస్థ. అందులో ఒక స్వప్నం. అది సుఖ స్వప్నమే ! అందులో ఊర్వశీమూర్తితో కలిసి కవి 'నందన వీధులంట' నడుస్తున్నాడు. ఆనందనురామ మా వేళ నిదురిస్తోంది. అంతా నిశ్శబ్దం. దారిలో పూలరాసులూ, తావుల ఏరులూ నిద్రపోతున్న ఒక లతదగ్గర యిద్దరూ ఆగారు. ప్రేయసి కవి చెయ్యి పుచ్చుకున్నది. ''ఎదురుగానిల్చి ఎదనెద యదుము కొనెనొ, కనులు కన్నుల కౌగిలి కరగ గనెనొ'' కవి ''హృదయ పుటము దెరచి నిలిచినదొక బాష్పతరళకణము." అప్పుడు ప్రేయసి వంగి, మల్లెపూవును దోసిట్లో తీసి అర్పించి కవి 'చరణధూళులనే దలమంచి జాలిగా' యిలా అన్నది - "ఈ దాసి ప్రేమ సేవకీ పువ్వులు చాలుగాని, ఆకాశమంతా పందిళ్ళు పరచి తెలిమల్లె తోట వేయించినాను.'' అంతే ; ఎదుట ప్రేయసిలేదు ; కవి నిస్పృహలో నిలబడిపోయాడు. కవి నిల్చున్నపాటునే ''ఎటో వృథాశిశిర జీవిత భారము బుచ్చుచున్న భూమీరుహ'' మయ్యాడు. అతని "మొరడు మేన నవప్రసవాలజాలులే; ధారలు ధారలై నదముదాక హిమాంబు తరంగ పాతులే'' నట ! కలవరగిపోయి కన్నులు విచ్చినా పాదాల కడ పువ్వులూ కన్నులలో అశ్రుకణాలూ అలాగే వున్నాయి. నేటికీ ''నిలిచి నాడ .... తొలి వసంతకాలపు సిరిభాతి తరుణవృక్షమ్ము కరణి''అంటాడు. పురాణ గాథలో ఊర్వశి లత అయింది. ఇక్కడ కవి వృక్ష మయ్యాడు.

అంతటితో ఊర్వశితోడి సంయోగ వియోగాల కథ పూర్తి అయింది. ఇక్కడ కవి వృక్షంగామారి, అంటే చిగురుస్తూ మోడు వారుతూ కాలగతిలో నిలిచిపోవడం విశేషస్ఫూర్తి. అతని కరుణార్ద్ర హృదయంనుంచీ అశ్రువులే పువ్వులుగా - గీతాలుగా - రాలుతూవుంటాయి.

''ఊర్వశి'' కావ్యంలో చివరి మూడు ఖండికలూ తాండవ స్వామి శివుణ్ణి ఉద్దేశించినవి. కవివలెనే ఆయన'ఉన్మత్త భావశాలి,' 'పాట వదములకై నిత్యసాధకు'డైన వాడు. కాని ఆయనెక్కడ, కవి యెక్కడ : కవిపాట ఆ దేవుని నుండే మిడిసిపడు తున్నది, 'తేనె తేట చినుకు' తనలో లేక పోయినా ! కవి గళాన్ని బంధించే 'హేమంత శృంఖలాలా', కవి'బ్రతుకు జీరగోసి తీయదనమ్ములు

పోసే'నూన్న వసంతజీవనమూ ఆయనపెట్టేభిక్షే. కాని కవిపాటలన 'తగని ప్రయత్నింత వెలితి నృత్యాన్ని' మానలేదు? ఎందుకిలా జరుగుతోంది? సమాధానం చివరి ఖండికలో ఉన్నది. ఆయన నటరాజు. 'ప్రతి దినసాంతమందు నిత్యనూతన తాండవ నృత్యకేళి' అవధరిస్తాడు. అప్పుడు 'పొరలు అమృత రసంపు మాధురులలో' కవీ పరవశుడై, వెర్రియై, ఆయన వలెనే నాట్యం చెయ్యబోతాడు. భగవంతుడెలా సౌందర్య రసైకమూర్తియో, కవి అలా సౌందర్య రసైకజీవి. ఆ సౌందర్యోపాసన లేకపోతే కవి జీవితం లేదు. అందువల్ల "ఏనుకూడ నీవలె నటియింప నిత్తువా" అని నివేదించుకుంటాడు. జీవిత గమ్యం – "ఎట్లో నీ దర్శనమ్ము సాధించువరకు" అంటాడు.

కృష్ణశాస్త్రి నిర్వేదం ఒక తపస్సు. దాని ఫలితం ఊర్వశీ సాక్షాత్కారం. అంటే సౌందర్యోపాసనలో రససిద్ధి. అదే భగవంతుని చేరే మార్గం కూడా. కృష్ణశాస్త్రి దర్శించిన ఊర్వశీమూర్తి 'గానం'తో తాదాత్మ్యం కలిగి వుండడం ఒక విశేషం. కృష్ణశాస్త్రి కవిగా 'గాయకుడు'. అక్షరాలా 'లిరిక్ పొయెట్.' 'అక్షర రమ్యత' ఆయన నిబద్ధత (కమిట్‌మెంట్). కాని ఆయన 'కృష్ణపక్షం' – ప్రవాసము – ఊర్వశి' సంపుటాల్లో ప్రకటించిన విడి గీతాలు ఏక కావ్యంగా, మహాకావ్యంగా రూపొందడం 'నానృషి కురుతేకావ్యం' అన్నసూక్తికి తార్కాణం.

స్వర్గాదపి గరీయసి

శ్రీ కే. కిశోరుబాబు　　　　శ్రీ కే. అశోకుబాబు

ఏ వరదో,
ఏ సుడిగాలో
ఏ గువ్వో
ఓ విత్తనాన్ని తెచ్చి
అడ్డగోలుగా పారవైచిపోతే

దాన్ని తన దృఢమయిన మయిమడతల్లో
దాచుకొని కాపాడుతుంది !

మబ్బుల్నుడిగి స్వచ్ఛమైన నీళ్ళను తెచ్చి
పోసి పెంచి
దాని ఉసురును పెంపొందిస్తుంది !

తూగుతున్నట్లున్న దాని
క్రొంజిగురాకుల కళ్ళను తెరిపించి
దానికి ఇనావలోకన భాగ్యాన్ని
　　　　కల్పిస్తుంది !

పుష్టికరమయిన 'ఎరువు ముద్దల్ని
తినిపించి
దాన్ని అన్ని ఋతువులకి
అన్ని వేళలకి
తట్టుకొని నిలబడు జెట్టిగానూ
　　　　మలుస్తుంది !

దానికి అమృత ఫలాల్ని కాయించి
వాటిని బాటసారులకి
పంచిపెట్టు వితరణునిగానూ
తీర్చి దిద్దుతుంది !
అవనీమాత !
అనురాగమయి, త్యాగమయి అంటే
　　　　ఆమే !

తోటివాళ్ళకై సర్వస్వాన్ని అర్పించే
దయామయి అంటే ఆమే !
అందుకే ఆమె "స్వర్గాదపి గరీయసి"

యజ్ఞం

ఇది ఏ చరిత్ర చెప్పిన పాఠం చెప్పు !
ఏ జవనాశ్వాన్ని తీసుకొచ్చినా,
రుధిరాన్ని హవిస్సుగా హోమంలో వేసి
ఇంద్రాది క్రోధ దేవతల్ని సంతృప్తి పర్చినా -
ఋత్విజులెన్ని వైప్లవ్య మంత్రాల్ని చదివి
పగల సెగల్ని ప్రజ్వలింపజేసినా -
యజ్ఞఫలం అందరూ పంచుకున్నారా ?

బలివితర్దిపై పశువుల్ని నరుకుతోంటే
మహోత్సాహంతో గంతులేశావే తప్ప
ఫలితం నీకేమైనా ముట్టిందా చెప్పు !
రక్తపు మరకలతో మానవత్వం
మకిలి కావడం తప్ప -

చక్రనేమి క్రమాన చరిత్ర
ఆవర్తమౌతూనే వుంటుంది,
యజమానులు మారుతూంటారు -
వక్రోక్తిలోపడి నువు మాత్రం
ఆక్రందిస్తూనే వుంటావు.

వర్షంలో నీతో

భూమ్యాకాశాల మధ్య
సన్నని జరీ పోగులు పరిచి
ఇంద్ర ధనస్సుల రంగులది
తయారు చేసిన ఊకల నేత వస్త్రాన్ని
నిండారా కప్పుకుందాం, రా !

గాలికి రెప రెప లాడుతూ
మనకళ్ళని మూసేస్తుంది
ఈ ఏడువన్నెల జరీచీర !

తడిసిన వస్త్రంలోంచి
మెరుస్తోన్న సోయగాల్ని చూసినట్టు
తడిపేసే యీ వెండితీగెల ధారల్లోంచి
ప్రపంచపు అందాల్ని చూద్దాం.

శ్రీ దేశెట్టి కేశవరావ్

ఈ తొలకరి జల్లుల్లో...

1

నా అంతరంగ విశ్వంలో
ఊహాలు అంతరాళాన్ని నింపేస్తాయి
జ్ఞాపకాలు సముద్రాలై మనసును ముంచేస్తాయి
ఒక యాదృచ్ఛికమైన బిందువునుంచీ
బయలుదేరి
దారిలో లేచిన ఉద్వేగాల వృక్షాలను తప్పుకుంటూ
ముంగురులై ముసురుకుంటున్న స్మృతులను
వెనిక్కి త్రోసుకుంటూ
ఒక అనూహ్యమైన బిందువు వైపు వెళ్ళుతాను
నాలోకే నేను ఒక వృత్తంలా

2

ఎలాగైతేనేం
అన్ని మెట్లూ ఎక్కి చివరికి శిఖరం అధిరోహించాను
శిఖరంమీద ఒక సైన్ బోర్డు వుంది
క్రిందికి వెళ్ళేదారి యిదేనని తల్లక్రిందులుగా ఒక
బాణపు గుర్తు వుంది

3

ఒంటరిగా గదిలో కూచొన్నా
వెలుపల ఎవరో ప్రశ్నలు వేస్తున్నారు
'ఎవరునీవు ?' అని అరిచా !
జవాబుగా మళ్ళీ అదే ప్రశ్న విన్పించింది

4

విరాట్టుకైతే పూలమాల వేస్తావ్ !
పూలచెట్టుకు ఏం మాల వేస్తావ్ ?

5

జగతి దేవుని లీల
బ్రదుకు అతడికి పూజ

6

రేరాజు సభలోన నేడు -
నక్షత్ర బృందగానం
సూరీని యంత్రశాల -
కూలీల కండర జంత్ర గానం

7

ఐహేవ్ నో ఛాయిస్
ఐహేవ్ నో వాయిస్
నేనే నాకొక జైలు
విడుదలఐతే నేనేలేను

8

బల్బులో నిదురోతున్న కాంతి -
ప్రాణంలో మిత్తి
తుఫానును కప్పుకున్న శాంతి -
ఒరలోనా కత్తి

9

తమస్సరస్సులో స్వేత ఒక సమూహాల్లా
ఒంటికాలిమీద జపం చేస్తున్నాయి ఫ్లోరసెంటు
దీపాలు నగర శార్వరిలో
శివార్లలో వడ్రంగి పిట్ట
బౌద్ధ భిక్షువై ఊపిరి ఉలిగా హృదయం కొమ్మగా
ఆత్మను చెక్కుతోంది

10

వర్షం కురిసిన సాయంకాలం
వరండాలో కూచొని చాయ్ తాగుతున్నా
ప్రపంచం కడిగిపెట్టిన సాసర్లా వుంది
వీధిలో
చీరకుచ్చిళ్లు పైకెత్తుకుని
చినుకులు జాగ్రత్తగా అడుగులు వేస్తున్నచప్పుడు

11

ఆ వెన్నెల వేళ
ఎవడో పిల్లవాడు తన చూపు అనే కమ్చీతో
చంద్రుడనే చక్రాన్ని త్రోసుకుని పుంతదారిలో
పరుగెడుతున్నాడు
మోయలేని భారం మోసుకుని చీమ
రాళ్ళదారుల్లో సాహస యాత్రలు చేస్తోంది

12

విశ్వమనే పురాతన వృద్ధుడు
మళ్ళీ మరో బీడీ ముట్టించాడు
అరిందలా యిప్పుడు పుట్టిన నా పద్యమే
బుద్ధి చెప్పనొచ్చే సరికి వొళ్ళు మడింది

13

మనిషి
సమాంతర చూపులపై పరుగెత్తే జీవితం రైలు
కళ్ళు మూసినచోటే ఆగుతుంది.

14

నా
జీవితం
కేవలం
ఒక
తప్పొప్పుల
పట్టిక.

అగాధ తిమిర కూపంలో ఉంది జీవ జల

సత్యమూ లేదు
అసత్యమూ లేదు
ఉన్నది భ్రాంతి మాత్రమే
అసలు లేని ప్రశ్నకు
జవాబు వెదకడం మానుకో
జీవిక
ఒక అగాధ కూపం
అర్ధరాత్రి బావిలోకి తొంగిచూస్తున్నా
'ఈ బావి ఎంత లోతుగా వుంది'
'ఈ బావి ఎంత చీకటిగా వుంది'
ఈ కూపం అడుగున అయినా జలవుందా ?
ఈ కూపానికి అసలొక అడుగయినా వుందా ?

ఇంతలో ఒక స్వప్నం వచ్చింది
స్వప్నం మసక వెన్నెల్లా వుంది

బావిలో మసక మసకగా కన్పించింది జల
కన్పించింది జన్మిస్తూనే కోల్పోయిన నా తల

నా జీవితాంతం ఒక చేదవేసి
ఆ జలను పైకి చేదాను
విజయోత్సాహంతో తలమీద పోసుకున్నా

మళ్ళీ బావిలోకి తొంగి చూస్తే
వెక్కిరిస్తూ కన్పించింది నా తల
అంతే ! చెరిగిపోయింది నాకల

అట్టడుగున బావిలో
అంతులేని చీకటిలో
అసలు లేని అడుగులో భ్రాంతి మాత్రంగా వుంది
జీవజల.

శ్రీ మ హే ం ద్ర

శ్రీ రామమోహనరాయ్

ఉత్తమ సాంఘిక నాటకాలు

తెలుగులో సాంఘిక నాటకం ప్రారంభమై ఒక శతాబ్ది కాలమైంది. క్రీ. శ 1880లో శ్రీ వావిలాల వాసుదేవశాస్త్రి 'నందక రాజ్యము' అనే సాంఘిక నాటకం రచించారు. నూరేళ్ళ కాలంలో వేలాదిగా వచ్చిన నాటకాలను సింహావలోకనం చేసి చూస్తే సాధించినది తక్కువగా, సాధించవలసినది ఎక్కువగా కన్పిస్తుంది. ఆంధ్ర నాటకరంగం చాలా వెనకబడివుంది. నాటక ప్రదర్శనలో సాంకేతిక విలువల్లో, రచనల్లో ముఖ్యంగా సమాజాన్ని ప్రతిబింబించి, ముందుకు నడిపించటంలో కొన్ని దశాబ్దాలు వెనక వున్నాం.

మహానటులు బళ్ళారి రాఘవగారి శతజయంతి సాంఘిక నాటకరంగానికి శతజయంతి కావటం విశేషం. ప్రేక్షకుడిగా, పాఠకుడిగా నాటకాన్ని చూచి, చదివిన నేను, నాకు నచ్చిన పది ఉత్తమ సాంఘిక నాటకాలను ప్రస్తావిస్తాను. 1. కన్యాశుల్కం (1897) 2. కంఠాభరణం (1917) 3. వరవిక్రయము (1929) 4. మాభూమి (1947) 5. ఎన్. జి. ఓ (194) 6. పునర్జన్మ (1956) 7. కీర్తి శేషులు (1960) 8. నిజం (1962) 9. మరో మొహెంజదారో (1 64) 10. మాలపల్లి (నాటక ప్రతి అముద్రితం) — ఈ పది నాటకాలు ఉత్తమ రచనలుగా తలుస్తాను.

ఏ ప్రక్రియలోనైనా తొలిరచన ఉత్తమ రచన కావచ్చు, కాకపోవచ్చు. మొట్ట మొదటి సాంఘిక నాటకం 'నందక రాజ్యము'లో ఇతివృత్తం, నిర్వహణ రెండూ కూడ విశిష్టమైనవి కావు. చాణక్యుడు నందులకు సంబంధించిన కథ కాదిది. నందకుడనే జమిందారు కథ ఇది. ఆయన పరిపాలనలో నియోగులు వైదికులను బాధించినట్లు చెప్పటమే రచయిత లక్ష్యం. ఏమాత్రం ప్రాముఖ్యం లేని సమస్య. పరిశోధకుల పుణ్యమా అని ఇది మొదటి సాంఘిక నాటకంగా తెలిసిందేగాని ప్రదర్శనలవల్ల కాదు.

1880లోనే శ్రీ వీరేశలింగం పంతులు 'బ్రాహ్మవివాహము' రచించారు. పండు ముదుసలులు ముక్కుపచ్చలారని కన్నెపిల్లల్ని పెళ్ళి చేసుకోవటంవల్ల కలిగే అనర్థాలను తీవ్రమైన వ్యంగ్య రీతిలో యీ నాటకంలో చిత్రించారు. ప్రజలీ నాటకాన్ని బాగా ఆదరించారు. 'పెద్దయ్యగారి పెళ్ళి పుస్తకం' అని పేరు పెట్టుకొని పదేపదే చదివి ఆనందించారు.

ధార్వాడ నాటక సమాజ ప్రదర్శనలతో ఉత్తేజితులై వీరేశలింగంగారు నాటక రచనకు, ప్రదర్శనకు పూనుకోవటంతో నాటకరంగంలో ఆధునికయుగం ప్రారంభమైంది. శిల్పదృష్టితో చూచినప్పుడు వీరేశలింగంగారి రచనలు ఏమంత విశిష్టమైనవి కావు. దురాచారాలను హేళన చెయ్యటంలో పంతులుగారి వాక్కు పరుషమైనది, పదునైనది. సంస్కరించ వలసినచోట్ల ఆయన 'దుష్టాంగమును ఖండించి' అనే విధానాన్ని అవలంబించారు.

'గయోపాఖ్యానం' వంటి రసవంతమైన నాటకం రచించిన చిలకమర్తివారు, ఆంధ్ర నాటక పితామహులు ధర్మవరం రామకృష్ణమాచార్యులుగారూ. సాంఘిక నాటకాలపై వారి దృష్టిని ప్రసరింప జెయ్యలేదు. ధర్మవరం వారు పౌరాణిక నాటకాలలో స్త్రీవిద్య, యువతీ వివాహచర్య మొదలైన సంఘ సంస్కరణకు సంబంధించిన విషయాలను ప్రవేశపెట్టారు.

వేదం వేంకట రాయశాస్త్రిగారు నాటకాల్లో పాత్రోచిత భాషను ప్రవేశపెట్టటం సాంఘిక నాటక రచనకుబాగా తోడ్పడింది. 'ప్రతాప రుద్రీయము' కల్పిత చారిత్రక నాటకమైనా దానిలో సమకాలిక సంఘంపై విమర్శలున్నాయి. పేరిగాని దర్బారులో రాబోయే కవులు, వారి రచనల మీద కవి ప్రయోగించిన వ్యంగ్యం వాడియైనది.

తెలుగు నాటక రంగ చరిత్రలో 'కన్యాశుల్కం' ఒక మహత్తర పరిణామం. పూర్తిగా వాడుక భాషలో, మాండలికంలో రచింపబడిన మొదటి నాటకమిది. జీవితమంత గంభీరమైనది, ఉదాత్తమైనది కన్యాశుల్కం. "బీభత్సరస ప్రధానమై శిథిలీకృతమవుతున్న సమాజ వ్యవస్థ కరాళ నృత్యం" యీ నాటకంలో వున్నది. హృదయమున్న వేశ్య; కుహనా సంస్కర్తల బండారం; కన్నెపిల్లల్ని అమ్ముకోవటం; బాల వితంతువుల దుస్థితి–ఒకటేమిటి కన్యాశుల్కంలో సంఘమంతావున్నది. దేశదేశాల నాటక కర్తల ప్రభావం గురజాడవారి మీద కన్పిస్తుంది, కన్యాశుల్క సమస్య ఇప్పటి సంఘంలో లేకపోయినా నాటకం నిలిచి వుండటం దీని గొప్పదనం. అన్ని పాత్రలూ సంఘంలో నుండి నాటకంలోకి నడిచి వచ్చినవే. పాత్రల మనస్తత్వ పరిశీలనలో గురజాడమేటి.

అన్నిటికన్నా "ఐ యామ్ టెరిబిల్ యాజ్ ఐ వాస్ హ్యూమరస్. దో ఆర్ట్ ఈస్ మయి మాస్టర్ ఐ హేవ్ ఎ రెస్పాన్సిబిలిటీ టు సొసయిటీ" అన్న ఆయన దృక్పథం గొప్పది. కన్యాశుల్కం విశ్వ సాహిత్యంలో తెలుగు నాటకానికిచోటు కల్పించగలది. ఇంగ్లీషు, ఫ్రెంచి, సంస్కృతం, కన్నడ భాషల్లో అనువాదాలు వచ్చాయి.

కవిశేఖర పానుగంటి లక్ష్మీనరసింహారావు 'కంఠాభరణము' రచించటం ఒక అనుకోని సంఘటన. "మిగుల నవ్వువచ్చు నాటకమేదైనా రచింపుమని శ్రీశ్రీ పీఠికా పురాస్థాన ప్రభువులకు మ॥ రా॥ రా॥ శ్రీశ్రీ రాజా రావు వేంకటకుమార మహీపతి సూర్యారావు బహద్దరువారు నా కొసగిన యాజ్ఞ ననుసరించి 'కంఠాభరణము' అను పేర నీ నాటకమును 3-4-17 తేదీ నారంభించి 10-5-17 తేదీని ముగించితిని" అని పానుగంటి వారు తెలిపారు. కేవలం ఒక నెల రోజుల్లో రచించినా ఆనాటి సమాజమంతా 'కొండ అద్దంలో కన్పించినట్లు' కన్పిస్తుంది. కేవలం యాదృచ్ఛికమే అయినా కన్యాశుల్కంలో లాగ కథ కంఠాభరణము చుట్టూ తిరగటం ఆశ్చర్యంగా కనిపించే సాదృశ్యం.

కంఠాభరణములో అపరశ్రాద్ధపురుషుడు సోమావధాని, పిసినారి సుబ్బిశెట్టి, వేపారి పంతులు కృష్ణారావు, వేశ్యసుందరి, పిచ్చి రామశాస్త్రి, భర్తను సంస్కరించిన రుక్మిణి, రాచరికపు 'న్యాయాన్ని' నిలిపిన నవాబు-అన్నీ మరపురాని పాత్రలే. తెలుగు జాతిని, భాషను, దేశాన్ని ప్రాణాధికంగా ప్రేమించిన పానుగంటి నవాబు పాత్రచేత "తెలంగీ వట్టి గద్దె జాన. ఉస్మే రస్ నహీ, ఔర్ జీవ్ నహీ, జానే దేవ్" అనిపించడం చురుక్కుమనిపించే హాస్యం. కొన్ని కులాలను, వాళ్ళ ఆచారాలను హేళన చెయ్యటం చేత హాస్యం ఉత్తమ మార్గంలో నడవక పోయినా కడుపుబ్బ నవ్వు కోవటానికి మాత్రం పనికొస్తుంది. పానుగంటి వారికి వేశ్యల మీద జాలిలేదు. బాలవితంతువులపై సానుభూతి వున్నది. సాంఘిక పరిస్థితులను కళాత్మకంగా ప్రదర్శించిన కంఠాభరణము ఉత్తమ సాంఘిక నాటకమని చెప్పటానికి సందేహం అక్కరలేదు.

"చింతామణి, వరవిక్రయము, మధుసేవ" నాటకాలు రచించి సంఘ సంస్కరణకు తోడ్పడినవారు శ్రీ కాళ్ళకూరి నారాయణ రావు. వేశ్యావృత్తి, వరకట్నం, మద్యపానం ఇతివృత్తాలుగా రమణీయమైన నాటకాలు రచించిన కాళ్ళకూరివారి ప్రజ్ఞ మెచ్చదగినది. "చింతామణి" ప్రదర్శించని తెలుగుపల్లె, పట్నంలేదు. వేశ్యావృత్తి సంఘంలో ఇప్పుడు ఒక కులాన్ని ఆశ్రయించిలేదు. చింతామణి నాటకంలో కవి వ్రాయని సంభాషణలు అనేకం చేర్చి ప్రదర్శకులు మొరటు, అశ్లీల సంభాషణలతో డబ్బు చేసుకుంటున్నారు. ఆత్మ పరిశీలన చేసుకొని భక్తురాలిగా మారిన చింతామణి హృదయాన్ని ప్రేక్షకులు సరిగా అర్థం చేసుకోలేక పోతున్నారు.

ఇప్పటి సంఘాన్ని పీడిస్తున్న సమస్య 'వరకట్నం'. పెద్ద చదువులు చదివినా, సంస్కారం పెంచుకోక వరశుల్కం ఆశించి కట్నం తీసుకురాని వధువుల్ని కాల్చుకు తింటున్న నేటిసమాజానికి 'వరవిక్రయము' ప్రదర్శనలు అవసరం. వరవిక్రయంలో సింగరాజు లింగరాజు మరపురాని పాత్ర; మరపించినారు. కొడుకును విక్రయించి, డబ్బు చేసుకోవాలనే పన్నాగాన్ని ఎదుర్కోలేక 'కాళింది' అనే వధువు బావిలో పడి మరణిస్తుంది. ఆమె చెల్లి కమల భర్తను కొనుక్కున్నట్లు కాగితం రాయించుకుని, న్యాయస్థానానికి యీడ్చి లింగరాజుకు బుద్ధి చెప్తుంది. "అప్పోసంగినవాడును, అల్లుడు, అద్దెయింటి యజమానుడు, జీతమిచ్చువాడు. పన్నులు మార్చువాడు పుస్తెకట్టని మగలెపో పురుషులకు" అని కాళ్ళకూరి వారి హాస్యోక్తి. పెళ్ళిలో చీటికి మాటికి ఏదో వంకన అలిగి లేచిపోయే బంధువర్గపు దుర్మార్గాన్ని కాళ్ళకూరి సహజంగా వర్ణించారు. వరవిక్రయం సాంఘికమే అయినా పద్యాలున్న నాటకం. పద్యాలు సంభాషణలవలె తేలికగా అర్థమయ్యేలాగే వుంటాయి. "పెరవారి పిల్లకు వరుడేమపడెనన మనపిల్ల కెవ్వడో మగడటంచు" ఆతృతపడే తల్లిమనస్సును కాళ్ళకూరి చక్కగా వర్ణించారు. వరకట్న సమస్య తీవ్రరూపంలో వున్నకాలంలో యీ నాటకాన్ని అలక్ష్యం చేయటం బాధాకరం. గ్రాంథిక రచనా, పద్యాలూ ప్రగతి శీలకమైన నాటక సమాజాలకు నిజమైన అవరోధాలు కావు. కాలానికెదురీది నిలువగల ఉత్తమ నాటకం 'వరవిక్రయము.'

మద్యపాన నిషేధము అచరణలో సాధ్యం కానప్పుడు చట్టాల వలన ప్రయోజనం లేదు. ప్రజలవ్యసనంపై ఆదాయాన్ని పెంచుకోవాలనుకొనే ప్రభుత్వవైఖరి సమర్థనీయంకాదు.'మధుసేవ' నాటకమిప్పుడు ప్రదర్శించటం వలన చింతామణిలాగే అవినీతి ఆకర్షవంతమయ్యే ప్రమాదం వున్నది.

పుంభావ సరస్వతులు తిరుపతి వేంకట కవులు పాండవోద్యోగ విజయ నాటకాలతో ఆబాల గోపాలాన్ని ఆనందంలో ముంచెత్తారు. వారు రచించిన 'వ్యసన విజయము' అనే సాంఘిక నాటకం అసంపూర్ణం. సోమరాజు రామానుజరావుగారి 'రంగూన్ రౌడీ' ప్రదర్శనలో విజయవంతమైందిగాని ఇతివృత్తంలో, నిర్వహణలో, శిల్పదృష్టిలో విశిష్టమైనదికాదు.

జాతీయోద్యమ కాలంలో వచ్చిన దామరాజువారి నాటకాలు, శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రిగారి తిలక్ మహారాజు విజయం మొదలైనవి ఆ ఉద్యమ ప్రభావం సన్నగిలగానే మరుగున పడ్డాయి.

ఆంధ్రులకు ప్రత్యేకరాష్ట్రాన్ని కోరుతూ ఆంధ్రమాత, ఆంధ్రజ్యోతి మొదలైన నాటకాలు వచ్చాయిగాని శిల్పం విశిష్టమైనది కాకపోవటం చేత 1950 నాటికే తెరమరుగైనాయి.

1935 ప్రాంతాల్లో కాంట్రాక్టు నాటకాలు బయలుదేరాయి. నాటక ప్రదర్శనలో వ్యాపారదృష్టి, నిర్లక్ష్యం హెచ్చాయి. ఒకే పాత్రను ఒకే నాటకంలో ఇద్దరు, ముగ్గురు, నలుగురుకూడ ధరించసాగారు.

రెండవ ప్రపంచ యుద్ధానికి ముందే కవిత్వంలో ఎన్నో కొత్త సిద్ధాంతాలు వచ్చాయి. తెలుగు నాటక రంగంమీద వాస్తవిక వాదం ప్రభావం బాగా కన్పిస్తుంది. సన్నివేశ కల్పనల్లో, సంభాషణల్లో వాస్తవికతకు రచయితలు ప్రాధాన్యమియ్య సాగారు. 'స్వగతాలు' తగ్గిపోయాయి.

1929లో తెనాలిలో ఆంధ్రనాటక కళాపరిషత్తు స్థాపించబడింది. మొట్ట మొదటి పరిషత్తు పోటీల్లో వాస్తవిక వాదానికి నిలయమైన, కొండముది గోపాలరాయశర్మగారి 'ఎదురీత'కు బహుమతి లభించింది. అంతవరకు నాటక రంగాన్ని ఏలుతున్న కృతకభాషా, కృత్రిమసంభాషణలూ రంగస్థలం నుంచి తప్పుకున్నాయి. 'ఎదురీత' అప్పటి నాటక రంగంలో నిజంగా ఎదురీతే.'

1943లో ఆంధ్రలో అభ్యుదయ రచయితల సంఘం స్థాపించబడింది. ప్రజానాట్యమండలి అభ్యుదయ భావ ప్రచారానికి పూనుకొన్నది. సుంకర సత్యనారాయణ - వాసిరెడ్డి భాస్కరరావు గారలు జంటగా 'ముందడుగు' నాటకం రాశారు. కొన్ని ప్రదర్శనలు జరిగాక యీ నాటకాన్ని బ్రిటీషు ప్రభుత్వం నిషేధించింది. తర్వాత సుంకర - వాసిరెడ్డిగారలు రచించిన 'మాభూమి' తెలుగు నాటకరంగంలో చరిత్ర సృష్టించింది. జమీందారీ, భూస్వామ్య విధానాలకు వ్యతిరేకంగా యీ నాటకం రాజకీయ చైతన్యాన్ని పెంపొందించింది. దీన్నికూడ ప్రభుత్వం నిషేధించింది - కాని ప్రజల ఆందోళన ఫలితంగా నిషేధం తొలగిపోయింది. 125 నాటక సమాజాలు యీ నాటకాన్ని ఊరూరా ప్రదర్శించాయి. లక్షలాది ప్రజలు యీ నాటకంచూచి ఉత్తేజితులయ్యారు. విశ్వనాథ సత్యనారాయణ, పింగళి లక్ష్మీకాంతం వంటి సంప్రదాయ వాదులైన పండితులు కూడ యీ నాటకశక్తిని కొనియాడారు. శ్రీ సుంకర తెలంగాణ పోరాటం గురించి (గెరిల్లా) నాటకం రచించారు. కాని యిది ప్రదర్శనలో అంతగా విజయవంతం కాలేదు.

స్వభావ వాదాన్ని నాటకాల్లో సమర్థవంతంగా ప్రవేశపెట్టిన కవి శ్రీ బోయి భీమన్న. వ్యవసాయానికి పాలేరు ప్రాణాధారం. అయినా మోతుబరి ఆసాముల జీతగాడు పచ్చడి మెతుకులతోనే పొట్టనింపుకొంటూ, ఆసామి పొలాన్ని మూడు కాలాలా శ్రమపడి పండిస్తాడు. శ్రీ శేషేంద్రశర్మ అన్నట్లు "పచ్చన్నం తినని పాలేరు గొంతును మెతుకు తోలుకుపోయే నాగరకత మనది." శ్రీ భీమన్న రచించిన 'పాలేరు' కఠోర వాస్తవాలను కళ్ళకు కట్టించింది. ప్రజలీ నాటకాన్ని బాగా ఆదరించారు. కాని నాటక శిల్పంలో ధనవంతుని పేరు కుబేర్రావు అనీ, సంస్కారి అయిన బడిపంతుల పేరు ఉపకారి అనీ వుండటం చాలా "ప్రిమిటివ్ టెక్నిక్". కోపిష్టికి అగ్నిహోత్రుడనీ, పిసినారికి లుబ్ధావధానులనీ పేరుపెట్టిన గురజాడ చేసిన పొరపాటే భీమన్నా చేశారు. భీమన్నగారి "కూలిరాజు" కూడ ప్రసిద్ధికెక్కిన నాటకం.

సాంఘిక నాటకాలలో అపూర్వమైన విప్లవానికి కారకులైన వారు ఆచార్య ఆత్రేయ. వారి "ఎన్. జి. ఓ." నాటకం (1949) మధ్యతరగతి మనస్తత్వాన్ని నిజపుటద్దంలో చూపించింది. మధ్యతరగతి జీవితపు వెలుగు నీడల్ని యింత చక్కగా ప్రదర్శించిన నాటకం ఆ తర్వాత కూడ మరొకటి రాలేదు. కారు షెడ్డులో జీవితం గడిపే ఎన్. జి. ఓ. కథ యిది. దీనికి మరోపేరు "అద్దె కొంప". గుమాస్తా కష్టాలను, గుమాస్తాల కుటుంబాల్లో వ్యక్తుల మనస్తత్వాలను కాచి వడపోశారు ఆత్రేయగారు. ముప్పై ఏళ్ళు గడిచినా ఎన్జీవోల స్థితిగతులేమీ మారలేదు. ఆదాయంలో జీతపు రాళ్ళు పెరిగినా ధరలు మరింత పెరిగి బ్రతుకు మోయరాని భారమే అయింది. అయినా ఇప్పుడు ఎన్జీవో నాటకం ప్రదర్శించటం లేదేమని ఆలోచిస్తే నాటక సమాజాల అలసత తప్ప మరొక కారణం కన్పించదు. పరిషత్తు పోటీ నాటకాల్లో బహుమతులకోసం కృత్రిమమైన కష్టాలతో నిండిన కొత్త నాటకాలను-హైబ్రో కేస్టనుమాత్రమే సంతృప్తి పరచే పాశ్చాత్య నాటక ప్రయోగాలను మన ప్రేక్షకులకు చూపి ఆనాటకాలను ఆస్వాదించ లేకపోతే రచయితలు, ప్రయోక్తలు ప్రేక్షకుల అభిరుచిని తప్పుపడుతున్నారు.

ఆచార్య ఆత్రేయ ప్రతిభకు నిదర్శనంగా ఎన్జీవోనాటకంలో ఒక చిన్న ఘట్టం చూస్తేచాలు. గుమాస్తా తమ్ముడు గోపి నిరుద్యోగి. పొట్టగడవటానికి మార్గం వెదుక్కుంటూ బస్టాండులో శనగపొడి పొట్లాల అమ్మకం మొదలుపెడతాడు. అన్నగారికి తెలిసి పరువు పోయిందని మండిపడతాడు. అప్పుడు గోపి "కూలివాళ్ళు మనకంటే నయం. వాళ్ల నలుగురుంటే నలుగురూ పని చేస్తారు, తెస్తారు, తింటారు లేదా చస్తుంటారు. మనమలా కాదు; ఒక్కడూ సంపాయించాలి. ఇందరం బతకాలి. ఆడది యిల్లు వదలిపెట్టకూడదు. ఇంటిపనితప్పవేరింకేం చెయ్యకూడదు" అంటాడు. మధ్యతరగతి బాధలకు మూలకారణాన్ని సామాన్య సంభాషణలో సునాయాసంగా చెప్పటం గమనిస్తే నేటి రచయితలు ఆత్రేయ నాటకాల

౦డి నేర్చుకోవలసింది చాలా వుందనిపిస్తుంది. ఆత్రేయగారి రచల్లో 'భయం, కప్పలు' కూడ పేర్కొనదగ్గవి.

స్వభావవాదం ఆధారంగా వచ్చిన నాటకాల్లో పినిశెట్టి శ్రీరామమూర్తిగారి "కులంలేని పిల్ల, పల్లెపడుచు, అన్నా చెల్లెలు" పేర్కొనదగినవి. ఈ నాటకాల్లో పాత్ర చిత్రణలో మంచివాళ్ళు, చెడ్డవాళ్లు వేర్వేరుగా కన్పిస్తారు. శిల్ప దృష్టితో చూచినప్పుడు ఉన్నత విలువలు లేకపోయినా సామాన్య ప్రేక్షకులు యీ నాటకాలు చూచి సమాజపు నడవడిని తెలుసుకోగలిగారు. కథానాయకుడికిబీదరికంతో పాటు రోగిష్టి తండ్రి, పెళ్ళి చెయ్యవలసిన చెల్లెలు, పరీక్ష ఫీజు కట్టవలసిన తమ్ముడు - అన్ని కష్టాలను కల్పించి ప్రేక్షకుల నుండి సానుభూతిని రాబట్టగలిగారు. అనిసెట్టి సుబ్బారావుగారి "గాలిమేడలు మావూరు" కూడ విశిష్టమైనవి. కళావిలువల దృష్టితోచూచినప్పుడు "మావూరు" నాటకం చెప్పుకోదగినది.

పాతివ్రత్యపు విలువల్లో కల్లోలంకలిగించి, లోకం దృష్టిలో 'పతిత' అనిపించుకున్న స్త్రీ మంచికి మారినా గత జీవితం ఆమెను వెంటాడి వేధిస్తుందన్న నగ్నసత్యాన్ని కళాత్మకంగా, ఉత్తమ నాటకంగా తీర్చిదిద్దారు శ్రీ బెల్లంకొండ రామదాసు. వీరి 'పునర్జన్మ' నాటకంలో నాయిక శ్యామల పరిస్థితుల ప్రభావం వల్ల పడుపుగత్తె అవుతుంది. ఆదర్శ యువకుడు ఒక డాక్టర్ ఆమెను పెళ్ళిచేసుకోవటానికి సిద్ధపడతాడు. అప్పుడామె "నా జీవితాన్ని ఒక తివాచీలా పరిచాను. ఈ తివాచీమీద ఎందరు నడిచి వెళ్లారో నాకే జ్ఞాపకం లేదు" అని దీనంగా పలుకుతుంది. అయినా అతడామెను పెళ్ళిచేసుకుంటాడు. ఆమె గత జీవితంలో ప్రేమికుడు ఆమెను గుర్తించి, తనతో వచ్చెయ్యమని వేధిస్తే ఆమె భర్త అతన్ని తరిమేస్తాడు. కాని భార్య ఒకప్పుడు శీలవతి కాదన్న నిజాన్ని భరించలేక త్రాగుబోతౌతాడు. శ్యామల భర్తను కోప్పడి, చివాట్లేసి, బతిమిలాడుకుని త్రోవకు తెస్తుంది. తనపై అఘాయిత్యం చెయ్యబోయిన మాజీ ప్రేమికుణ్ణి హతమారుస్తుంది. ఆమె సంగతంతా తెలుసుకొన్న మామగారు "ఆ అమ్మాయి పాత జీవితం దగ్ధమైందనుకో. పునర్జన్మ ప్రారంభించిందనుకో" అని కొడుక్కి హితబోధ చేస్తాడు. టాల్‌స్టాయి నవల 'రిసరెక్షన్'నుండి శ్రీ రామదాసు ప్రేరణపొంది యీ నాటకం రచించినా, నాటకంలో తెలుగు దనానికెక్కడాలోపం రాలేదు. పదునైన సంభాషణలు, వాస్తవమైన సన్నివేశాలతోపట్టుగా సాగిపోయే నాటకం 'పునర్జన్మ'. ఆధునిక నాటకాల్లో పతిత స్త్రీకి గౌరవస్థానమిచ్చిన గురజాడవారి పద్ధతి రామదాసు గారిది.

కళాకారులు స్వతంత్రంగా జీవించలేని దౌర్భాగ్య స్థితి అలుముకుని వుంది మన సంఘంలో. జీవించి వున్నన్నాళ్లూ వేధించుకుతిన్న మనుష్యులే కళాకారుడు మరణించగానే బ్రహ్మరథం పడతారు, శిలా విగ్రహాలు స్థాపిస్తారు. వర్ధంతులు జరిపిస్తారు. సంస్థలు స్థాపిస్తారు. శ్రీ శ్రీ గారన్నట్లు తెలుగుదేశంలో గొప్పవాడవటానికి ఒకే ఒక్క మంచి ఉపాయం "వెంటనే చచ్చిపో". ఈ దుస్థితిని అవహేళనచేస్తూ, వ్యంగ్యప్రధానంగా, కరుణరసాన్ని కురిపిస్తూ శ్రీ భమిడిపాటి రాధాకృష్ణ 'కీర్తిశేషులు' రచించారు. ఈ నాటకం కళాకారుల దుస్థితిని మార్చలేకపోవచ్చు. కాని ఆత్మవిమర్శ చేసుకోవటానికి అవకాశం కల్పించింది, అంతేచాలు. ఇటువంటి పరిస్థితులున్నంతవరకూ ఇది ఉత్తమ నాటకమే. ఒకప్పటి మహానటుడు, ఇప్పటి తాగుబోతు 'మురారి' పాత్ర 'కీర్తిశేషులు' నాటకాన్ని చిరస్మరణీయం చేస్తున్నది.

జాతీయస్థాయిలో చెప్పుకోదగిన గొప్ప నాటకం తెలుగులో రావటం లేదనే వెలితిని పూర్తిచేసింది 'మరోమొహెంజదారో'. ప్రస్తుత సమాజంలోవున్న అస్తవ్యస్త పరిస్థితులను చూచి తీవ్రమైన ఆందోళనచెంది, పరిష్కారమార్గమేమిటని నిశితంగా ఆలోచించిన శ్రీ ఎన్. ఆర్. నంది గొప్ప ప్రయత్నం యీ నాటకం. తెలుగు నాటకరంగంలో అపూర్వమైన ప్రయోగం. ఇతివృత్త స్వీకరణలో, నిర్వహణలో, దక్షతతో కూడిన ప్రయోగంలో

సజీవమైన పాత్రల్ని 'కేరికేచర్స్'గా మిగిల్చి (సాధారణంగా తెలుగు నాటకాల్లో కేరికేచర్స్ కేరక్టర్సుగా కన్పిస్తాయి) మౌలిక సమస్యలపై దృష్టిని కేంద్రీకరించిన ఉత్తమ నాటకం 'మరో మహెూంజదారో'.

ఈ నాటకంలో ప్రజల సమస్యల్ని సానుభూతితో అర్థం చేసుకుని పరిష్కారమార్గాన్ని అన్వేషించిన శాస్త్రవేత్త ప్రధాన పాత్ర. 1) ఆధునిక మానవుడు 2) లేనివాడు 3) ఉన్నవాడు 4) దరిద్రుడు 5) సామాన్యుడు 6) విప్లవకారుడు 7) స్వార్థజీవి 8) మహా మేధావులు - ఈ స్వభావాలుగల వ్యక్తులు ఎవరైతేనేం - వాళ్ళ సమస్యలేమిటి? వాళ్ళిప్పుడు జీవిస్తున్నంత నికృష్టంగా ఎందుకు జీవిస్తున్నారు? స్త్రీని విక్రయ వస్తువుగా యీ ఆధునిక సమాజం ఎందుకు మార్చింది? అని చర్చించి శాస్త్రజ్ఞుడు పాత్రలతో మాట్లాడినట్లు మొదటి రంగంలో - ఆ తర్వాత వాళ్ళ స్వభావాని కనుగుణంగా - శాస్త్రజ్ఞుడికీ రచయితకీ సంబంధం లేనట్లు వాళ్ళకు వాళ్ళే ప్రవర్తించటం మిగిలిన రంగాలలో కన్పిస్తుంది. ఇది ఆలోచనలు ప్రేరేపించే నాటకం. సామాన్య ప్రేక్షకులకు ఒకంతట కొరుకుడు పడదు. అలాగని దాన్ని అర్థం చేసుకోవటానికి ప్రయత్నం చెయ్యకపోతే నష్టపోయేది ప్రేక్షకులే. కళతో ఏ మాత్రం రాజీపడకుండ, ఏ పాశ్చాత్య నాటకాన్ని, ఇతర నాటకాలను అనుకరించకుండ - ఉన్నట్టుండి అద్భుతమైన ప్రయోగంచేసి తెలుగు నటులు, ప్రయోక్తలు, విమర్శకుల్లో సంచలనం కలిగించారు శ్రీ నంది. బుద్ధి జీవులనే యీ నాటకం ఎక్కువగా నచ్చినా నాటక రంగంలో చరిత్ర సృష్టించి, ఇతర భారతీయ భాషలవారికి ఆదర్శ ప్రాయమైన యీ నాటకం ఉత్తమ నాటకంగా ఎన్నదగినది.

కథా రచయితగా సుప్రసిద్ధులై జీవిత నాటకాన్ని అతివాడుపుగా ప్రదర్శించిన శ్రీ రాచకొండ విశ్వనాథశాస్త్రి రచించిన నాటకం 'నిజం'. "ప్రస్తుతం మన దేశంలో ప్రతిరోజూ ప్రతిచోటా కూడా ఎందరో కొంద రమాయకులు వాళ్ళ చెయ్యని నేరాలకి శిక్షలనుభవించటం జరుగుతోందని నేను ఖచ్చితంగా, ఘంటా పథంగా, ఛాలెంజిచేసి చెప్పగలను. కాని ఆమాత్రం డబ్బు - పలుకుబడి, హెూదా, పదవి కలవాడెవడూ మాత్రం ఆ పరిస్థితుల్లో ఇరుక్కోడు; ఒకవేళ పడినా, ఇరుక్కున్నా పైకి తప్పించుకోగలడు. ఈ పరిస్థితులలో ఈ సంఘంలో పేదవాడికి న్యాయం దొరకదు కాక దొరకదు. తనకి న్యాయం జరిగితే ఎదుర్కొందికి పేదవాడికి సంఘంలో అవకాశం లేదుకాక లేదు. ఈపరిస్థితి మారాలని నాకుంది. అందుకే యీ నాటకం రాసేను" అని రచయిత తన లక్ష్యాన్ని వెల్లడించారు.

సంఘంలో డబ్బూ, పలుకుబడీ, పదవీ, హెూదావున్న సార్వభౌమరావు కుమారుడు సుందరం స్నేహితులతో కలిసి పిక్నిక్‌లో తాగుడు పార్టీలో మిత్రుడు సత్యాన్ని హత్య చేస్తాడు. పార్లమెంటు మెంబరు సార్వభౌమరావు తన ఇంట్లో తను చేరదీసి, పెంచి, అక్రమంగా అనుభవిస్తున్న సుశీల అనే అమాయకురాల్ని ప్రేమించిన రౌడీ సుందరం మీదికి ఆ హత్యానేరాన్ని తోసివేసి, ఆ రౌడీకి ఉరిశిక్ష పడేలాగ చేస్తాడు. సుందరం ఉరికంబమెక్కబోతూ "నిజమైన లోకం నిలబడాలంటే నిజం నిలబడాలి. లోకం అంతా నిజం పలకాలనేది నా ఆఖరి కోరిక" అంటాడు. అక్కడున్న వారెవ్వరూ నిజం పలకగలమని హామీయియ్యరు. సుందరం నిర్లిప్తంగా అందరికీ వీడ్కోలు చెప్పి మరణిస్తాడు - మరి యీ సంఘం మారేదెప్పుడు? అప్పుడప్పుడూ దుర్మార్గులైన పెద్దలు సామ్యవాద మంత్రం జపించి, "మేం మారతాం" అంటారు. కాని వారు మారరు. అస్సలు మారరా? అంటే యీ నాటకంలో సుశీల చెప్పినట్టు "ఎప్పుడో బాణం పట్టుకు ఏ శ్రీరాముడో, నాగలి పట్టుకు ఏ బలరాముడో, గొడ్డలి పట్టుకు ఏ పరశురాముడో వాస్తే" మారతారేమో కాని లేకపోతే మారరు. పేదవాడికి న్యాయం జరగాలంటే సాయుధ విప్లవం రావాలని రా. వి. శాస్త్రిగారు గాఢంగా నమ్మి యీ నాటకం రాశారు. సామాజిక ప్రయోజనాన్ని కోరే యీ నాటకం నిస్సందేహంగా ఉత్తమ నాటకం.

సంఘసంస్కర్త, మహారచయిత, నిస్వార్థత్యాగశీలి ఉన్నవ లక్ష్మీనారాయణ పంతులుగారు రచించిన 'మాలపల్లి' నవల మన జాతి గర్వించదగిన రచన. దీన్ని ఆనాటి బ్రిటీషు ప్రభుత్వం నిషేధించింది. 50 సంవత్సరాలు గడిచిన తర్వాతకూడ సమాజంలో పేద, ధనికవ్యత్యాసాలు మాలపల్లి నవలలో లాగే వున్నాయి. సమాజంలో మార్పుతీసుకు రావటానికి యీ నవలలో వున్న నాటకీయత పుష్కలంగా ఉపయోగించుకుని శ్రీ ఏ. ఆర్. కృష్ణ, నగ్నముని గారలు మాలపల్లి నాటకాన్ని సర్వాంగసుందరంగా, సమగ్రమైన జీవనాటకంగా తీర్చిదిద్దారు.

ఒకేసారి ప్రేక్షకుల ఎదుట వివిధ జీవన దృశ్యాలు - మాలపల్లి, భూస్వామి ఇల్లు, వీధి, దుకాణం, మందిరం, పోలీస్‌స్టేషను, కలెక్టరు కచేరీ, సెటిల్‌మెంటు, అడవి, కోర్టుగా అన్నీవుంటాయి. రంగస్థలం అంటూ వేరేవుండదు. ప్రేక్షకుడు ఏ మాత్రం పరాకు చిత్తగించటానికి వీలులేదు. నాటకం చూస్తున్నంతసేపు జీవితాన్ని కళ్ళెదుట చూస్తున్నట్లే వుంటుంది. అశక్తులు, నిస్సహాయులు ఎటువంటి బాధలనుభవిస్తున్నది- వాళ్ళ పరిస్థితి ఏమిచేస్తే మారుతుందీ అంతా తెలుస్తూనే వుంటుంది. ఆంధ్రనాటక రంగంలో ఇదొక

గొప్ప ప్రయోగం. నాటక చరిత్రలో ఇదొక విప్లవం. వందకు పైగా ప్రదర్శనలు జరిగినా యీ నాటక ప్రతి ముద్రింపబడలేదు. అసంఖ్యాకంగా వున్న నాటక సమాజాలు యీ నాటకాన్ని ఊరూ వాడా ప్రదర్శించి సమాజాభ్యుదయానికి తోడ్పడవలసిన అవసరం ఎంతైనా వున్నది.

టిక్కెట్టుకొని నాటకం చూడాలనుకొనే ప్రేక్షకులు కరవై పోతున్నప్పుడు, నాటకం సినిమాతో పోటీ చెయ్యలేనప్పుడు, నాటకానికి ప్రేక్షకుల్ని రప్పించటం కాక, నాటకమే ప్రేక్షకుల దగ్గరకు వెళ్ళవలసిన అవసరం వున్నది. శ్రీ బాదల్‌సర్కార్ బెంగాలీలో చేసిన అద్భుతమైన ప్రయోగాన్ని ఆసరాగా చేసుకొని శ్రీ అత్తిలి కృష్ణారావు, ఏ. గోపాలకృష్ణగారలు జనసమ్మర్దం వుండే కూడలులలో 'ఊరేగింపు' నాటకాన్ని విజయవంతంగా ప్రదర్శిస్తున్నారు. సమకాలిక సంఘాన్ని, సమస్యలను కళ్ళకుకట్టి, పరిష్కార మార్గాన్ని సూచిస్తున్న 'ఊరేగింపు' ఉత్తమ నాటక ప్రయోగం.

ఈ వ్యాసంలో ఇచ్చిన ఉత్తమ నాటకాల జాబితా సమగ్రం కాదనిమనవి. బుచ్చిబాబుగారి 'దారిన పోయేదానయ్య'; రావికొండల రావుగారి నాలుగిళ్ళచావడి; పూసల వెంకటేశ్వరరావు 'మండువా లోగిలి'; కొప్పరపాటి గంగాధరరావుగారి 'యథారాజా తథాప్రజా'; మోదుకూరి జాన్సన్‌గారి 'నటనాలయం'; కొడాలిగోపాలరావుగారి 'లంకెల బిందెలు'; అత్తిలి కృష్ణారావుగారి 'తూర్పురేఖలు'; దాసం గోపాలకృష్ణగారి చిల్లరకొట్టు చిట్టెమ్మ; సి యస్. రావుగారి ఊరుమ్మడి బ్రతుకులు' ఇంకా ఎన్నోవున్నాయి. రామదాసుగారి మాష్టర్జీ; మారుతీరావుగారి రాగరాగిణి; నరసరాజుగారి 'నాటకం' మొదలైనవి అనువాదాలు కాబట్టి ప్రత్యేకంగా పేర్కొనడం లేదు.

నూరేళ్ళ సాంఘిక నాటకాలను సింహావలోకనం చేసి చూచి, ప్రేక్షకుడిగా నాకు నచ్చిన పది ఉత్తమ సాంఘిక నాటకాలను ఎన్నిక చేశాను. రసజ్ఞులైన ప్రేక్షకులు యింకా బాగా ఆలోచించి ఉత్తమ నాటకాలను ఆదరిస్తే, తెలుగులో ఉత్తమ సాంఘిక నాటకాలకు ఇప్పుడున్న కొదవ తీరిపోతుంది.

వెంపలి చెట్టుకు నిచ్చెనలు

శ్రీ పులికంటి కృష్ణారెడ్డి

కాలుష్య వాతావరణాన్ని కడిగి వేయడానికి
కన్నీళ్ళతో నింపిన కలాన్నిబట్టిన కవిని నేను!
సిద్ధాంతాల రాద్ధాంతాలతో చిందులు త్రొక్కుతున్న
కపిని నేను!! -

నాగరకతా యవనికపై నగిషీల ఖుషిలో
శేముషీ ప్రాభవాలు నామూషీపడుతున్న నేటి సమాజంలో
కాలుష్య రహితమైన కన్నీరెక్కడ ?
అసలు కాలుష్యాన్ని కడగడానికి వలసిన పన్నీరెక్కడ??
కాలుష్యం! ..కాలుష్యం !! ..కాలుష్యం !!.:కాలుష్యం !!!..
చాపక్రింద నీరులా సర్వత్రా వ్యాపిస్తున్న కాలుష్యం
సాహితీ సామ్రాజ్యంలో అశ్లీలతలా అలుముకొంటున్న
కాలుష్యం

చట్టాల చట్రాల్లో యిమడని కాలుష్యం
సామాన్యుల మేధస్సులు తడమని కాలుష్యం
మాటల్లో కాలుష్యం మనస్సులలో కాలుష్యం
చూపులలో కాలుష్యం చేతలలో కాలుష్యం
తలపులలో కాలుష్యం వలపులలో కాలుష్యం
సందుల్లో మందుల్లో కామందుల్లో కంటి కగపడుతున్న
కాలుష్యం
కాలుష్యం !.. కాలుష్యం !!.. కాలుష్యం !!!.. కాలుష్యం!!!!
పవిత్ర గంగాజలాలలో పరమ కాలుష్యం
నారికేళ సలిల సదృశ గోదావరి నీళ్ళలో కాలుష్యం
నిర్మల జలపూరిత కావేరీ కృష్ణా తరంగాలలో కాలుష్యం
ఈనదీనదాల సంగమం సాగరగర్భంలో దుర్భరకాలుష్యం
నానావిధ ఓషధీ ప్రభావ సంభరిత హిమాలయ పవనాల్లో
కాలుష్యం
మనస్సును మధుకోహల్లో తేల్చే మలయ మారుతాల్లో
కాలుష్యం
పవిత్ర దేవాలయ ప్రాంగణాల్లో పొరాడుతున్న కాలుష్యం
భారతీయ ప్రశస్త శిల్ప కళా నైపుణీ ప్రాభవాలకు
దృశ్య కావ్యం
ఆధునిక విజ్ఞానాంధకారానికి ఆహుతి కానున్న శిథిల
కావ్యం
తరగని సౌందర్య నిధిని, తాజ్‌మహల్‌ని, పఠనకావ్యంగా
చరిత్ర పుటలకే పరిమితం చేయబోతున్న కాలుష్యం
కాలుష్యం !.. కాలుష్యం !!.. కాలుష్యం !!! కాలుష్యం !!!!
మానవ మనుగడకే ముప్పుదెస్తున్న కాలుష్యం
భయంకర మృత్యు స్వైరవిహారానికి ఉప్పు పెడుతున్న
కాలుష్యం

తరముగాని కాలుష్యం !.... తరగని కాలుష్యం !! ....
ఎంతనికడగడం? ఎట్లనికడగడం?? ఎక్కడనికడగడం???
తరముగాని తరగని కాలుష్య తరంగాలలో తగులుకొని
తరంగాని ఈతరంమనిషిగా తగుదునని కలంబట్టిన కవినిగా
తరతరాల వెనక్కు దృష్టిని సారిస్తే-
మొదట మానాన్న.. ఆ తరువాత వాళ్ళనాన్న ఎదుట
నిలబడినారు.
మానాన్న ఆరడుగుల ఎత్తు !- వాళ్ళనాన్న అంతకుపై
బెత్తెడు !!-

నేనూ ఉన్నాను -
అయిదడుగులకు అరడుగుపైబడి.
నా కొడుకూ ఉన్నాడు -
అయిదడుగులకు ఒక అంగుళం అటో యిటోగా సరిపడి.
వేరు ప్రక్కన పడి, పడి ప్రక్కన అరపడి,
అరపడి ప్రక్కన కాలుపడి క్రమం
తాత తరంనుండి నాకొడుకు తరానికిసంక్రమించిన వరం!
వేరు శెనగగింజల ఊరిబిండితోనే వేర్వేరు రుచులు
కోరకుండా
రెండుముద్దల సంకటికి రెండు నిముషాలని మానాన్నతో
పోటీపడితే
అదృష్టవశాత్తయినా గెలిచినవెధవ ఆ పాయకట్టులోలేడు.
కేవలం గురుగాకు పుల్లగూరతో ఆరెండు నిముషాల్లోనే
మూడు ముద్దలని
వాళ్ళనాన్నతో పోటీపడి గోళ్ళు గిల్లుకొన్న వాళ్ళు
కోకొల్లలు !
నేనూ ఉన్నాను -
మూడు పాలాళ్ళ కాఫీనీళ్ళను ముప్పావు గంటలో
త్రాగేస్తున్నాను.

నా కొడుకూ ఉన్నాడు -
నా 'స్పీడ్'ను చూచి తెగ మురిసిపోతుంటాడు.
అడుసు మడిలో అడుగుబెట్టి అంతగొట్టడానికి పారచేతబట్టి
కయ్యలో ఈమూల వంగినాడంటే మా అయ్య -
ఆ మూల చివరివరకు వంచిన నడుం ఎత్తితేఒట్టు !-
బానా తొండం పెట్టించాలని
కొత్తచర్మం కొనడానికని రెండామడలు చిత్తూరికి నడిచి
'చిత్తూరినుండి వేలూరికి రెండామడలే !-
వెల్లల్లో తేడా మాత్రం రెండురూపాయలు!'- అంతే
అటునుండి అటే వేలూరికి నడిచిన ఘనుడు-వాళ్ళ అయ్య!
నేనూ ఉన్నాను -
ఎప్పుడైనా రిక్షావాడితో పేచీపడి, పదిపైసలకు లాలూచీపడి,
బస్సుదిగి యింటికి నడిచివస్తే -
నా కొడుకూ ఉన్నాడు -
నన్ను చూచి నివ్వెర పడుతుంటాడు !
తాతలనాటి కాలాన్నిదాటి దర్శించలేని నా పరిజ్ఞానం
శిథిలావశేషాల ప్రదర్శన శాలలకే పరిమితం.
అక్కడ -
నా పొట్టికాలి ఎముక అలనాటి మానవుని ముంజేజి
ఎముక కొంకచుట్టు తక్కువ.
పరిణామదశలో ఈ పరిమాణాల తరుగుదలకు హేతువేమి?
పడిపోతున్న పరిమాణాలను పరిరక్షించుకోవడానికి
సేతువేది ?

అని ఆలోచిస్తే -
నా కొడుక్కి జన్మనిచ్చినది వాడితల్లి.
నాకు జన్మ నిచ్చినది నా తల్లి.
మా నాన్నకు జన్మ నిచ్చినది ఆయన తల్లి.
మా నాన్న నాన్నకు జన్మ నిచ్చినదాతని తల్లి.
అలనాటి మానవుని జన్మ కారకురా లాతని తల్లి.
ఇట్లా జన్మ జన్మలను గురించి ఆలోచిస్తూ ఆలోచిస్తూ
వెళ్ళ గలిగినంత దూరం వెనక్కు వెళ్ళితే -
జీవకోటి సృష్టికే కారణభూత మీ వాతావరణం !
ఈ వాతావరణం నెలకొన్న గోళమే భూగోళం
మన జన్మభూమి.
మనకు జన్మనిచ్చినది జనని. ఆ జననికి జన్మ నిచ్చినది
వాతావరణం.

అందుకే - 'జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ !
అన్నారు.
సమస్త జీవకోటి పుట్టి పెరిగి జీవించడానికి
అనువైన వాతావరణం ఈభూగోళంలో అమరడంఅపూర్వం
చేజేతులా దీనిని కలుషితం చేయడం అనర్థం.
జీవకోటి సృష్టికి మూలకారణం - వృష్టికి ప్రేరణం
మనుగడకు ఆధారం - ఈ వాతావరణం !
మనిషిలో నాగరికత పెరిగే కొద్దీ మేధస్సు ఎదిగే కొద్దీ
కాజొచ్చింది కొద్ది కొద్దిగా కలుషితం! విషపూరితం!!-
నాడే ప్రారంభమయింది పరిణామ దశలో పరిమాణాల
పతనం.

ఆధునిక యుగంలో సుఖమయ జీవితానికే మనిషిచూపు
యాంత్రిక వసతి సంప్రాప్తం అతని కొక్క ప్రాపు.
ఆ ప్రాపు వాతావరణ నైర్మల్యాన్ని రూపు మాపు !
నా కొడుకుకొన్న స్కూటర్, నేనుకొన్న కారు
నా ఎదురింటి ఏడంతస్థుల మేడ ప్రారంభించిన భారీ
పరిశ్రమ
మమ్మల్ని సుఖ డోలికల్లో ఊపుతున్నదని మురిసి పోతు
న్నామే కానీ,
ముందు తరాలకు వాటిల్లనున్న ముప్పును మరచి
పోతున్నాం!
పాళ్ళు దప్పిన ఔషధం ప్రాణానికే ముప్పు !
ఇది యిట్లానే ననలు సాగి కొనసాగితే -
నా మనుమడు ....మనుమడికి మనుమడు .... ఆ మను
మడికి ముని మనుమడు

ఏనాటికో ఒక నాటికి -
వెంపలి చెట్టుకు నిచ్చెన వేయడం ఖాయం !
కవి భవిష్యద్దర్శనం చేసి ప్రవచిస్తాడు.
మేధావులు నివారణోపాయ పథకాలు రూపొందిస్తారు.
మేధావుల పథకాలను ప్రభుత్వాలు ఆచరిస్తాయి.
ఇది నాటికీ నేటికీ రేపటికి జరుగవలసిన న్యాయం.
లేకుంటే -
వాతావరణ కాలుష్యానికి జీవకోటి సమస్తం
ఆహుతి కావడం ఖాయం !

శ్రీ ఎ. లక్ష్మారెడ్డి, డి. నాగమణి, శ్రీ జి. సుదర్శన్

గ్రామీణ బ్యాంకులు
గ్రామీణ పరపతి

పేదరికం, అసమానతలు, అల్ప, ప్రచ్ఛన్న నిరుద్యోగిత భారత దేశం ప్రధానంగా ఎదుర్కొనుచున్న సమస్యలు. దేశం మొత్తం జనాభాలో 80 శాతం గ్రామీణ ప్రాంతాలలోనే నివసిస్తున్నారు. ఈ సమస్యల తీవ్రత హెచ్చుగా ఉండటం వలన గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికై స్వాతంత్ర్యం వచ్చిన తదుపరి ఎన్నో కార్యక్రమాలు రూపొందించి అమలు పరచడం జరిగింది. భారతదేశంలో గ్రామీణాభివృద్ధి చరిత్ర "సమాజాభివృద్ధి" కార్యక్రమంలో ప్రారంభమై "అంత్యోదయ" కార్యక్రమం వరకు విస్తరించినది.

అన్ని గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలలోను సంస్థాపరపతికి అత్యంత ప్రాముఖ్యత ఇవ్వడం జరిగింది. ఈ గ్రామీణ పరపతికి సంపూర్ణంగా సంస్థాపరం చేయడం ద్వారా వ్యవసాయదారులను, వ్యవసాయ కూలీలను, పేదలను, వడ్డీ వ్యాపారస్థుల కబంధహస్తాల నుంచి విముక్తులను చేయడం జరుగుతున్నది. ఇది మన గ్రామీణ ఋణ విధానం యొక్క ప్రధాన లక్ష్యం కూడా. సంస్థాగత ఋణ సౌకర్యాలను కల్పించడానికై ఎన్నో రకాల పరపతి సంస్థలను స్థాపించడం జరిగింది. మన దేశంలో సంస్థాపరపతి 1904లో ప్రవేశ పెట్టబడినది. ఇది సహకార సంస్థలతో మొదలవుతుంది. ఇప్పటికి సుమారు 8 దశాబ్దాలు గడిచినా గత కొద్ది సంవత్సరాలలో వ్యవసాయరంగం కొన్ని విప్లవాత్మకమైన మార్పులకులోనై ఆధునిక ఉత్పాదకాలను వాడటం జరుగుచున్నది. దీనితోబాటు వ్యవసాయదారుల పరపతి అవసరాలు కూడా పెరుగుతూ వచ్చాయి.

సంస్థా పరపతి ప్రధానంగా వాణిజ్య బ్యాంకులు, సహకార సంస్థలు, గ్రామీణ బ్యాంకుల ద్వారా సమకూర్చబడుచున్నది. మొట్ట మొదట కేవలం ఒక సహకార సంస్థద్వారా వ్యవసాయదారులకు కావలసిన అన్నిరకాల - స్వల్పకాలిక, మధ్యకాలిక మరియు దీర్ఘకాలిక పరపతిని సమకూర్చవలెనని తలపెట్టబడినది. కాని చాలా ప్రాంతాలలో సహకార సంఘాల యొక్క నిర్వహణ సక్రమంగాను మరియు సమర్థవంతంగానూ లేక పోవడంవల్ల అవి బలహీన రూపాన్ని సంతరించుకొన్నవి. అంతేకాక వీటి యాజమాన్యం ఎక్కువగా పెద్ద భూస్వాముల చేతుల్లో ఉండడంవల్ల కేవలం సంపన్న వర్గాలు మాత్రమే వీటిద్వారా లాభాలు పొందడం జరిగింది. సన్న, చిన్నకారు రైతులు, వ్యవసాయ కూలీలు మరియు చేతి వృత్తులవారు ఈ సంస్థల పరిధిలోకి రాలేదు. సంస్థాపరపతిని విస్తృత పరచడం ద్వారా బలహీన వర్గాలకు లాభం చేకూర్చవలెననే ఉద్దేశ్యంతో జులై 19, 1969లో 14 పెద్ద వాణిజ్య బ్యాంకులను జాతీయం చేయడం జరిగింది. కాని 1971 నాటికి సంస్థాపరపతి మొత్తం అవసరాలలో కేవలం 31 శాతం మాత్రమే సమకూర్చ గలిగినది. జాతీయం చేసిన తదుపరి వాణిజ్య బ్యాంకులు తమ శాఖలను కొంతవరకు గ్రామీణ ప్రాంతాలలో తెరచినప్పటికి సంస్థాపరపతి ఎక్కువగా ఆర్థికంగా సంపన్నమైన ప్రాంతాలకు మరియు సంపన్న వర్గాలకు మాత్రమే చేకూరింది. సన్న, చిన్నకారు రైతులు మరియు వ్యవసాయ కూలీలు మొదలైన బలహీన వర్గాలకు సమకూరలేదు. ఇట్టి లోటును భర్తీ చేయడానికై ప్రభుత్వం వారు నియమించిన 'బ్యాంకింగ్ కమీషన్' 1972 లోని తన నివేదికలో ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులను స్థాపించవలెనని ఉద్దేశపడింది.[1] కాని 1975లో యం. నర్సింహం కమిటీవారు చేసిన ప్రత్యేక సూచన ననుసరించి గ్రామీణ బ్యాంకుల ఏర్పాటుకై ప్రభుత్వం పూనుకొన్నది.[2] ఈ క్రొత్త సంస్థలు ముఖ్యంగా పరపతి పరంగా ఏర్పడిన ప్రాంతీయ లోటులను భర్తీ చేయవలెనని ఉద్దేశింప బడినవి.

గ్రామీణ బ్యాంకుల ఏర్పాటుకు సంబంధించిన ఉత్తర్వును కేంద్ర ప్రభుత్వం సెప్టెంబరు 26, 1975లో జారీ చేసింది. ఈ ఉత్తర్వే 1976లో గ్రామీణ బ్యాంకుల చట్టంగా మారింది. ఈ చట్టం ప్రకారం గ్రామీణ బ్యాంకుల ఏర్పాటులో రెండు ప్రధాన ఉద్దేశ్యాలున్నవి.

1. వెనకబడిన ప్రాంతాల పరపతి అవసరాలను తీర్చుటకై ఈ ప్రాంతాలలో శాఖలను విస్తరించడం.
2. సన్న, చిన్నకారు రైతులు, వ్యవసాయ కూలీలు, చేతి వృత్తి పనివారల మరియు చిన్న ఉద్యమదారుల పరపతి అవసరాలను తీర్చడం.
3. గ్రామీణ బ్యాంకులు సహకార సంస్థలకు పూరక సంస్థలుగా మాత్రమే పని చేయటం, కాని వాటితో పోటీ పడరాదు.

ఇట్టి బ్యాంకుల స్థాపన వాణిజ్య బ్యాంకులు చేపట్టడం జరుగుతుంది. ప్రతిపాదించిన వాణిజ్య బ్యాంకులు వాటా ధనంలో 35 శాతం, కేంద్ర ప్రభుత్వం మరియు ఆ ప్రాంతానికి సంబంధించిన రాష్ట్రప్రభుత్వం వరుసగా 50 శాతం, 15 శాతం సమకూరుస్తవి. నవంబరు 1976 సంవత్సరం నుంచి ఈ బ్యాంకులు

రిజర్వుబ్యాంకు దగ్గర నుండి "రీఫయినాన్స్" సౌకర్యాన్ని కూడా పొందుచున్నవి. దీని ప్రకారం ఇవి ఇచ్చే మొత్తం ఋణాలలో 50 శాతం వరకు తిరిగి రిజర్వుబ్యాంకు నుండి పొందవచ్చు. ఇవి సహకార సంస్థలకు, వాణిజ్యబ్యాంకులకు మధ్యంతరంగా ఉంటాయి. సహకార సంస్థల మరియు జాతీయమైన బ్యాంకుల సలక్షణాలను ప్రాతిపదికగా తీసికొని సమగ్రంగానూ, సమర్థవంతంగానూ గ్రామీణ ఋణ సమస్యను పరిష్కరించడానికి ఇవి కృషిచేస్తాయి. కేవలం బ్రాంచీలను నెలకొల్పడమే కాకుండ ఇవి కర్షక సేవా సహకార సంఘాలను కూడా ప్రతిపాదించవచ్చు.

ఈ బ్యాంకుల స్థాపన మొదట వాణిజ్య బ్యాంకులు మరియు సహకార సంస్థలు బలహీనంగా ఉన్న ప్రాంతాలలోనే జరుగుతుంది. 1975 నుండి ఈ బ్యాంకుల స్థాపన మరియు విస్తరణ చాలాచురుకుగా కొనసాగింది. మొదటి సంవత్సరంలో కేవలం 6 బ్యాంకులు మాత్రమే స్థాపించబడినాయి. జూన్ 1980 నాటికి దేశం మొత్తంలో 73 బ్యాంకులు స్థాపించబడినవి. ఇవి 17 రాష్ట్రాలలోని 130 జిల్లాలకు విస్తరించి ఉన్నవి. ఈ బ్యాంకులు మొత్తం 2,678 శాఖలను తెరచినవి. ఈ క్రింది పట్టిక ద్వారా వివరాలను తెలుసుకోవచ్చు.

పట్టిక - 1

రాష్ట్రాల వారీగా ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు

క్రమ సంఖ్య	రాష్ట్రం పేరు	గ్రామీణ బ్యాంకుల సంఖ్య	బ్రాంచీల సంఖ్య	వ్యాపించిన జిల్లాల సంఖ్య	మొత్తం జిల్లాలు
1.	ఆంధ్రప్రదేశ్	4	265	9	23
2.	అస్సాం	1	42	3	10
3.	బీహార్	14	448	22	31
4.	గుజరాత్	2	39	2	19
5.	హర్యానా	2	76	4	11
6.	హిమాచల్ప్రదేశ్	1	27	3	12
7.	జమ్మూ, కాశ్మీర్	2	54	8	10
8.	కర్నాటక	4	211	7	19
9.	కేరళ	2	150	3	11
10.	మధ్యప్రదేశ్	9	203	15	45
11.	మహరాష్ట్ర	1	70	4	26
12.	ఒరిస్సా	6	186	8	13
13.	రాజస్థాన్	4	208	8	26
14.	తమిళనాడు	1	75	2	15
15.	త్రిపుర	1	30	3	3
16.	ఉత్తర్ప్రదేశ్	15	447	18	56
17.	పశ్చిమ బెంగాల్	4	147	11	16
	మొత్తం	73	2,678	130	346

ఆధారం : రిజర్వ్ బ్యాంక్.

మొదట ఈ బ్యాంకుల స్థాపన కేవలం వాణిజ్య బ్యాంకులే చేపట్టినప్పటికి రాను రాను వాణిజ్య మరియు సహకార బ్యాంకుల సంయుక్త స్థాపనను కూడా ప్రోత్సహించడం జరిగింది. ఈ బ్యాంకుల నడవడిక తీరు తెన్నులను పరిశీలించడానికై 1977 లో ఆచార్య యం. యల్. దంత్‌వాలా అధ్యక్షతన ప్రభుత్వం ఒక కమిటీని నియమించింది. ఇవి చాలా సంతృప్తికరంగా పని చేయుచున్నందున వీటిని గ్రామీణ పరపతి వ్యవస్థలో అంతర్భాగంగా పరిగణించాలని ఈ కమిటీవారు అభిప్రాయపడ్డారు. బ్యాంకులు ఇంకా సమర్థవంతంగా నడవడానికై ఈ కమిటీ కొన్ని సూచనలను కూడా చేసింది. వాటిలో ముఖ్యమైనవి :

1. సాధారణంగా ప్రతి గ్రామీణ బ్యాంకు పరిధి 10 నుండి 15 లక్షల జనాభాకు మించకుండా ఉండవలెను.
2. నిర్వహణా సామర్థ్యం పెంచడానికై ఒక్కొక్క బ్యాంకు శాఖలు 50 నుండి 60 మధ్య మాత్రమే ఉండవలెను.
3. ఈ బ్యాంకులను రిజర్వుబ్యాంకు పర్యవేక్షణ క్రిందకు తీసుక రావలెను.
4. సన్న, చిన్నకారు రైతులకు పరపతిని విస్తరింపజేస్తూ ఋణాలను ఇచ్చేటపుడు వారు తిరిగి చెల్లించే సామర్థ్యాన్ని కూడా దృష్టిలో ఉంచుకోవలెను.
5. బ్యాంకుల సిబ్బంది శిక్షణా సౌకర్యాల కొరకై ప్రతిపాదించబడిన బ్యాంకులు "గ్రామీణ పరపతి సిబ్బంది శిక్షణాకేంద్రాలను" కలిగి ఉండాలి.
6. నిర్వహణా వ్యయాలను తగ్గించడానికై ప్రయత్నం చేస్తూ సామర్థ్యం పడిపోకుండా చూసుకోవాలి.

మన దేశంలో రిజర్వుబ్యాంకు అంచనా ప్రకారం 182 జిల్లాలలో కేంద్ర సహకార బ్యాంకులు బలహీనంగా ఉన్నవి. 1978 జూన్ నాటికి పై 182 జిల్లాలలో ఈ బ్యాంకులు 55 జిల్లాలను ఆవరించినవి. ఇక ముందు స్థాపించబోయే బ్యాంకులనుకూడా మిగతా 127 జిల్లాలలో ప్రాధాన్యత ప్రాతిపదికగా స్థాపించడం జరగవలెను. పై పట్టిక ప్రకారం బీహార్, మధ్యప్రదేశ్, త్రిపుర, జమ్మూ – కాశ్మీర్, ఒరిస్సా, పశ్చిమ బెంగాల్ మొదలైన రాష్ట్రాలలో ఎక్కువగా విస్తరించినవి. ఈ రాష్ట్రాలలో సంస్థా పరపతి లోటు ఎక్కువగా ఉన్నందున ఇచ్చట వీటి విస్తరణ హర్షించదగిన విషయమే. కాని అస్సాం మరియు హిమాచల్ప్రదేశ్ మొదలైన బ్యాంకింగ్ వ్యవస్థ ఎక్కువగా విస్తరించనటువంటి రాష్ట్రా

లలో ఈ బ్యాంకుల స్థాపన చాలా మందకొడిగా ఉన్నది. దేశం మొత్తంలో 32 శాతం జిల్లాలు వీటిచే ఆవరింపబడి ఉన్నవి. సగటున ప్రతి గ్రామీణ బ్యాంకుకు సుమారు 37 బ్రాంచీలు ఉన్నవి. తమ ప్రగతి నివేదికలను అందజేసిన 57 గ్రామీణ బ్యాంకులు వరుసగా రూ. 133 కోట్ల డిపాజిట్లను మరియు రూ॥ లు 167 కోట్ల ఋణాలను 1979 నాటికి మంజూరు చేసినవి. ఇందులో రూ॥లు 154 కోట్లు సన్న, చిన్నకారు రైతులు, వ్యవసాయ కూలీలు మరియు చేతివృత్తుల వారికిచ్చిన ఋణాలు. అనగా మొత్తం ఋణాలలో 92 శాతం బలహీన వర్గాలకు చేరినవి. రిజర్వుబ్యాంకు వారి రిపోర్టు 1978 - 79 ప్రకారం వీటి బ్రాంచీలు చాలా వరకు ఇంతకు ముందు బ్యాంకు శాఖలు లేని ప్రాంతాలలోనే ఏర్పాటు చేయడం జరిగింది. ఈ క్రింది పట్టిక ద్వారా వివరాలు తెలుసుకోవచ్చు.

పట్టిక - 2

సంవత్సరం	తెరచిన కొత్త శాఖలు	తెరచినశాఖలలో బ్యాంకులు లేని ప్రాంతాలలో తెరచిన శాఖలు
జులై - డిసెంబరు 1977	394	346
జనవరి - జూన్ 1978	233	214
జులై - జూన్ 1978 - 1979	561	524

ఆధారం : రిజర్వ్ బ్యాంకు

గ్రామీణ బ్యాంకులు ఇంత ప్రగతి సాధించినప్పటికి కొన్ని అధ్యయనాల వల్ల ఈ క్రింది విషయాలు వెల్లడి అయినవి.

1. వ్యవసాయ శ్రామికులు మరియు చేతివృత్తులవారు ఈ బ్యాంకుల వల్ల చాలావరకు లాభపడలేదు.
2. పరపతితోపాటు ఉత్పాదకాల సప్లయ్ మొదలైన సౌకర్యాలు కల్పించవలెనని వీటిని ఏర్పాటు చేసినప్పటికి ఆచరణలో ఇవి కేవలం ఒక్క పరపతి మాత్రమే కల్పించుచున్నవి.
3. వినియోగ పరపతి ఋణాలు ఇవి కల్పించడం లేదు.
4. సహకార బ్యాంకులు మరియు వాణిజ్య బ్యాంకుల మధ్య ఎక్కువ పోటీ ఉండడంవల్ల వీటి బ్రాంచీలు ఎక్కువ ప్రగతిని సాధించలేక పోవుచున్నవి.
5. కొండలు, గుట్టల ప్రాంతాలలోకి ప్రజలు మరియు గిరిజన ప్రదేశాలలో వీటి శాఖలు తెరువబడలేదు.

పై సమస్యలను దృష్టియందుంచుకొని ఇక ముందు శాఖలను ఏర్పాటు చేయడం జరగాలి. లేనిచో వీటిని ఏర్పాటు చేయడంలో నున్న ఉద్దేశ్యాలనే విస్మరించిన వారమవుతాము. చాలా పెద్దదైన మన దేశంలో ఎన్నో రకాల వైవిధ్యం గల కొత్త సంస్థలు ఏర్పాటు చేయాల్సిన అవశ్యకత ఉన్నప్పటికి వాటిని సక్రమంగా నడిపే బాధ్యతకూడా మనపై ఉన్నదని మరువరాదు.

సహాయపడిన రచనలు

1. డా. ఎన్. కె. తింపాలయా : "ది రీజనల్ రూరల్ బాంక్స్ ఎండ్ అగ్రికల్చర్" - ఆగష్టు 18-30, 1980లో హైదరాబాదు లోని "ఎన్ ఐ ఆర్ డి" వారు జరిపిన "రోల్ ఆఫ్ బాంక్ ఆఫీసర్స్ యాస్ యాక్సిలరేటర్స్ ఆఫ్ రూరల్ డెవలప్మెంట్" అనే శిక్షణ కార్యక్రమంలో చదివిన వ్యాసం.
2. డా. హర్పాల్ సింగ్ : రీజనల్ రూరల్ బాంక్స్, "యోజన", సం. 23, సంచిక 23, డిసెంబరు 16, 1979, పు. 138.
3. - అదే - పుట 138
4. రి. బాం. ఇం. : రిపోర్ట్ ఆన్ ట్రెండ్ ఎండ్ ప్రోగ్రెస్ ఆఫ్ బాంకింగ్ ఇన్ ఇండియా, 1979-80, పు. 52
5. డా. హర్పాల్‌సింగ్ : - అదే - పు. 14
6. రి. బాం. ఇం. : పయిన ఉదహరించిన రచన.

[రచయితలు కాకతీయ విశ్వవిద్యాలయం యొక్క అర్థిక విభాగంలో పరిశోధన చేస్తున్నారు.]

తెలుగు వాల్మీకి

డాక్టర్ దాశరథి

త్రెలుగు జాహ్నవీ జల హిమాచల బిలమ్ము
తెనుగు పారిజాత సుమ నందన వనమ్ము
ఆంధ్ర భారతావతరణాహవన తలము
ఆది కవి నన్నపార్యుని అమృత గళము.

ప్రజల భాషన్ పురాణమ్ము వ్రాయుటన్న
తిరుగుబాటుగా భావించు తరుణమందు
తెలుగులో భారతమ్ము వ్రాయ గలిగినట్టి
నన్నయ మహాకవిన్ సదా సన్నుతింతు.

ప్రజ లే భాషను మాటలాడెదరొ తద్భాషన్ పురాణావళుల్
సృజియింపం గలమన్న గుండెబల మిచ్చెన్ నన్నపార్యుండు, కో
ట్ల జనుల్ పల్కెడు పల్కులందె కవితల్ కల్పించుటే సత్కవి
ప్రజ కర్తవ్య మటన్న సత్యమును చెప్పంజాలె ధీమంతుడై.

దేవ భాష తెచ్చి దేశ భాషను చేర్చి
క్రొత్త అందములను కూర్చినాడు;
తెలుగునకు గలట్టి బలమును తెలిపెడి
వెలుగు మేడ నొకటి నిలిపినాడు.

గీర్వాణమ్మున కావ్య మల్లుటయె అంగీకారమౌ రోజులన్
పూర్వ ప్రక్రియ వీడి, తెల్గు వెలుగుల్ పొంగారగా సాహితీ
సర్వస్వమ్మగు భారతమ్ము రచియించం బూని నన్నయ్య మా
యుర్విన్ నవ్యత నిల్పె భావి కవులత్యుత్సాహులై వ్రాయగా.

రెండవ వాల్మీకికి మా
గుండెల కుసుమాల మాల కూర్చి యొసంగన్
రండో! తెలుంగులారా !!
నిండగు వెయ్యేండ్ల పంట నిలువగ సతమున్.

[ఆదికవి నన్నయ్య జయంతి వత్సరమున నివాళి]

స్వేచ్ఛా సమ సమాజమై

శ్రీ మాదిరాజు రంగారావు

ఈ జనతా సందోహం
గుండెల్లో రవి బింబం
రవి బింబం ప్రతి రూపం
కన్నుల్లో ధమనుల్లో.

ఆరనిదీ మాయనిదీ
ప్రతి ఒక్కరి గాథల్లో
బాధామయ రూపంతో
కణ కణలాడే క్షణమై.

బిక్క బీద గుడిసె చుట్టు
తిరిగి తిరిగి కిరణ కణం
వాడి గుండె బండపైన
కూర్చున్నది తిష్ఠవేసి.

ఆతప పద చిహ్నాల్లో
మన బ్రతుకుల అంగారం
అంగారపు అంచుల్లో
దాహంతో ఆకాశం.

ఆకాశం మండిందీ
ఆలోచన రేగిందీ
నేలపైన ప్రజా గణం
గ్రీష్మం వేసే చరణం.

నిప్పు రగిలి మండేందుకు
సిద్ధంగా ఉంది కొమ్మ.
జీర్ణ శీర్ణ పర్ణాల్లో
కదలుతూంది మరణ ధ్వని.

సంధ్యా పద చిహ్నాల్లో
నిశా హృదయ వాటికలో
అగ్నులు ! నీలో నాలో
ఊపిరిలో, చూపులలో.

తరగలుగా ఊపిరిలో
చూపులలో తీవెలుగా
ఇంటినుండి ఇంటిలోకి
నీడల్లో వేదనగా.

వచ్చేస్తే ఏ మేఘం ?
మొలుస్తుంది ఉష్ణపంక్తి ?
ఎంతధార వర్షిస్తే
మనోవీధి సరిస్తుంది ?

రా, రానీ ఆ మేఘం
పిడుగులతో మెరపులతో
రసధుని సంగీతంతో
నవ సృష్టికి సంకేతం.

పెనుతుఫాను బీభత్సం
జలార్ణవం దిగ్వలయం,
అగ్ని ఘోష ! అవని ఆర్తి !
తప్పదు, నేమి క్రమణం.

రా, రానీ రవి హర్షం
మానవతా కిరణంతో.
మనుషుల్లో చివుళ్ళతో,
స్వేచ్ఛా సమ సమాజమై.

కలగూరగంప

తెలుగు రంగస్థల చరిత్రలో అపూర్వ ప్రయోగం

"సులతానీ నాటకం"

ఆధునిక రంగస్థల చరిత్రలో 'సుల్తానీ' నాటకం ఒక అపూర్వ ప్రయోగం. ఇది నటుడూ, దర్శకుడూ అయిన శ్రీ పామర్తి కీర్తిధ్వజం! ఈ నాటకం రాష్ట్ర రాష్ట్రేతర ప్రాంతాలలో దాదాపు నూరుమార్లు ప్రదర్శింపబడింది. అంతేకాదు. అసంఖ్యాక రసజ్ఞుల, విజ్ఞుల మన్ననలు పొందింది. అంతేకాదు. ఆంధ్రనాటక కళాపరిషత్తు పోటీలలో ఉత్తమ బహుమతి గెల్చుకొన్నది. అంతేకాదు, మొదటి ప్రపంచ తెలుగు మహాసభల వైభవానికే "సుల్తానీ" నాటక ప్రదర్శన శిఖరప్రాయమైంది. అంతేకాదు. విజయవాడ ఆకాశవాణివారు ఇటీవల నిర్వహించిన నాటకోత్సవాలలో ఏలూరులో మళ్ళీ ప్రదర్శితమైంది. అదే నాటకం 17-1-8.వ తేదీ ఆదివారం మధ్యాహ్నం విజయవాడ కేంద్రం నుండి ప్రసారమైంది. ఇన్నిసార్లు, ఇన్ని రకాలుగా రసికజన మనోరంజనం కావించిన ఈ నాటిక విశిష్టతను సమీక్షిద్దాం:

సులతానీ పాత్రకులాగానే ఈ నాటిక చరిత్ర అతి విచిత్రమైంది. మూలకథ శతావధాని వేలూరి శివరామశాస్త్రిగారిది. ఈ కథానిక మొట్టమొదట 1930 అక్టోబరు 'భారతి'లో ప్రచురింపబడింది. శ్రీ బందా కనకలింగేశ్వరరావుగారి కోరికమీద 1965 లోనో, 1966 లోనో ఆ కథను శాస్త్రిగారే రేడియో నాటికగా మలిచారు. ఆ రేడియో నాటికలో ప్రధానపాత్ర నిర్వహణకై ఆహ్వానితులైన శ్రీ పామర్తి ఇతివృత్తంలో ఉదాత్తతను గమనించాడు. మళ్ళీ మళ్ళీ కథను చదివాడు. కవి హృదయం అర్థంచేసుకున్నాడు. శిల్పదృష్టితో పాత్రలలో సన్నివేశాలలో భాషలో కొలది మార్పులు చేసి శ్రవ్యాన్ని దృశ్యంగా తీర్చిదిద్దాడు కళా తపస్వి శ్రీ పామర్తి. గుడివాడలో ఆ నాటకం చూసిన శివరామశాస్త్రిగారే ఆనంద పరవశులై "నేను మట్టి బొమ్మను చేసి వుంచితే బంగారపు బొమ్మ చేశాడు మా సుబ్బారావు" అని సభాముఖంగా శ్లాఘించారు. అంతేకాదు- 'నటప్రభాకర' బిరుదంతో శ్రీ పామర్తిని ఆశీర్వదించారు. కీర్తిశేషులు కె. వెంకటేశ్వరరావుగారి వంటి మహానటుడు "ఈ నాటకం వేయడానికి నీ కొక్కడికే సాధ్యమైంది" అన్నాడు. ఈ నాటక ప్రదర్శనలోని ప్రతిభకు ఇంతకంటె యోగ్యతా పత్రం ఇంకేం కావాలి?

తెలంగాణా ప్రాంతంలో కలవారి ఇంటిలో రాత్రింబవళ్లు రెక్కలు ముక్కలు చేసుకొని బ్రతుకు వెళ్ళబుచ్చే కష్టజీవి కరుణ గాథ ఇందులో ఇతివృత్తం. అందువల్ల సహజత్వం వుట్టిపడాలంటే సంభాషణలు ప్రాంతీయ భాషలో వుండాలనుకున్నాడు. నటీనటులు రంగులు (మేకప్‌లు) వేసుకోకుండా స్టేజిమీదకు రావాలనుకున్నాడు తెలంగాణా గ్రామీణులు నిత్య వ్యవహారంలో మాట్లాడే 'యాస'ను పాత్రధారులు అనుకరించితీరాలని పట్టుపట్టాడు. అందుకోసమై తెలంగాణాలో కొంతకాలం పర్యటించవలసి వచ్చింది. ఈ కళారాధనలో ఇంటినీ వొంటినీ మరిచిపోయాడు పామర్తి. సోదర నటీనటులు ఆయన సూచనలు తు. చ. తప్పకుండా పాటించారు. ఇంతమంది చేసిన ఇన్నిరకాలైన సమష్టికృషి ఫలితం ఈనాడు ప్రదర్శింపబడుతున్న "సులతానీ" నాటకం!!

కథా పరమార్థం

సులతానీ శాంతయ్య గారింట్లో పనిమనిషి. ఒళ్లు దాచుకోవడమంటే ఏమిటో దానికి తెలీదు. 'కృష్ణా, రామా' అంటూ వూరిబయట తోటలో ప్రశాంతంగా కాలక్షేపం చేస్తున్న శాంతయ్య దంపతులకు సులతానీ అంటే వల్లమాలిన ప్రేమాదరాలు - వారికి సులతానీయే కన్నబిడ్డ!

అందం కొందరిపట్ల శాపం! ఆ అందానికి మంచితనం కూడా కలిస్తే జీవితం కారాగారమే ఒకరకంగా! ఇందుకు ఉదాహరణ సులతానీ! సులతానీ అసలు పేరు. కానీ, తల్లిదండ్రుల పేరుకానీ మనకు తెలీదు. కవి చెప్పలేదు. చిన్నపిల్లగా వున్నపుడే దాన్ని పరమానందచేతిలో పెట్టి ఈలోకం వీడిపోయారు తల్లీ - తండ్రీ. తరువాత పరమానంద తాళిగట్టాడు. కాని వారి దాంపత్యం ఎంతోకాలం సాగలేదు. కుండలమీద గుర్రాలు తోలుతూ కూర్చుండే పరమానంద పరస్త్రీలోలుడై భార్యను ఇంటినుంచీ వెడలగొట్టాడు. ఒంటరిగా వున్న సులతానీని, దగ్గరకు తీశాడు సుల్తాన్. [వీడి అసలు పేరుకూడా మనకు తెలీదు.] వీడొక తాగుబోతు. మొదటి భర్తకు తిండి సంపాదించి పెడితే సరిపోయేది-ఈ రెండోవాడికి తాగడానికి డబ్బుకూడా ఇవ్వవలసి వచ్చింది. ఏక్షణం అది వీలుకాకపోతే - ఆ క్షణంలో సుల్తానీ వొళ్లుగుల్లే! 'జోగులక్క' అనే ఒక గుంటనక్క సుల్తాన్‌కు సలహాదారు. దాని చెప్పుడు మాటలే సులతానీ ఇంటిలో మంటలను రగిల్చాయి. జోగులక్క

దుర్భోధలు బాగా తలకెక్కి, శాంతయ్యగారి దగ్గర దాచి వుంచిన కాసులూ, పైసలూ తనకు తెచ్చిమ్మని బలవంత పెడ్తాడు సుల్తాన్. ఆ పైసలూ, కాసులపేరు తాను మొదటి భర్త దగ్గర వున్నపుడు సంపాదించినవి – అందువల్ల వాటిని ఎప్పటికైనా వాడిముఖానే కొట్టాలంటుంది సుల్తానీ. తనను చేరుకున్న మరు నిముషం నుంచీ అంతా తనదే నంటాడు సుల్తాన్. చచ్చినా ఆ డబ్బు సుల్తాన్‌కు ఇవ్వనంటుంది సుల్తానీ!

ఇది ఇలావుండగా మొదటి భర్త పరమానంద కులంలో వెలివేయబడి, పిచ్చివాడయిపోయి, మళ్ళీవచ్చి, సుల్తానీని తన వెంట గూడెం రమ్మని ప్రాధేయ పడతాడు. 'ఛీ! పో' మ్మంటుంది సులతానీ. శాంతయ్యగారి వద్దవున్న పైసలు తనకు ఇవ్వననడమూ, తనగుడిసె దగ్గరకు పరమానంద రాకపోకలు సాగించడమూ – ఈ రెండింటివల్ల సుల్తాన్ మనసులో అనుమానం ఏర్పడుతుంది. ఆ అనుమానం పెనుభూతం అవుతుంది. రగడ ఆరంభమయింది. కొట్లాటలూ – ఏడుపులూ పెడబొబ్బలూ!

సుల్తాన్ పగ పాము పగ! చివరకు పరమానందను హత్య చేయడానికై ప్రయత్నిస్తాడు. కత్తితో సహా సుల్తాన్‌ను బంధించి, ఇరవై కొరడాదెబ్బలు శిక్ష విధిస్తాడు గ్రామపెద్ద పటేల్! సుల్తాన్ తనను కొట్టి చంపుతున్నప్పటికీ, వాడి దెబ్బలు కూడా తానే తింటుంది సుల్తానీ! కట్టుకున్న మనిషికి శ్రమనూ శరీరాన్ని అంకితం చేసినా – తనకు తగిన నేస్తం దొరకనందుకు జీవితంపై విరక్తిపుట్టి ఏడుకొండలవానిలో లీనమైపోతుంది సుల్తానీ! ఇదీ సంక్షిప్తంగా శివరామశాస్త్రిగారి కథాసారం.

నీతినిజాయితీలకూ ప్రేమానురాగాలకూ కులంతోటీ అంతస్తుతోటీ పొత్తులేదనీ, మమత కేవలం మనసుకు సంబంధించిందనీ, స్త్రీ నమ్ముకున్న వాడికోసం సమస్తం త్యాగం చేస్తుందనీ చాటి చెపుతుంది ఈ కథానిక. సన్నివేశ గర్భితంగా భార్యాభర్తల అనుబంధాన్ని – వివాహ వ్యవస్థలో మంగళసూత్ర ప్రాధాన్యాన్నీ సూచించారు శ్రీ శాస్త్రిగారు.

మార్పులూ - చేర్పులూ

ప్రదర్శన దృష్టితో ఈ కథలో కొన్ని మార్పులూ చేశాడు పామర్తి. శాస్త్రిగారి రేడియో నాటికలో ఏడురంగాలుండగా,పామర్తి నాటికీకరణలో రెండే రంగాలు. శాస్త్రిగారు, కథలోవున్న పాత్రలన్నింటికీ రేడియో నాటికలో ప్రవేశం కల్పించారు. కాగా రంగస్థల నాటికలో శాంతమ్మ పాత్రలేదు. శాస్త్రిగారి కథలోనూ,రేడియోలోనూ మునసబు పాత్రవుంటే, దానిస్థానే రంగస్థల నాటికలో 'పటేల్' పాత్రను ప్రవేశపెట్టారు. తెలంగాణా ప్రాంతంలో గ్రామమునసబు బాధ్యతలను నిర్వహించే వ్యక్తిని 'పటేల్' అంటారు. అంతేకాదు – రంగస్థల నాటికలో వున్న రాంగిరి, దేముడన్న, గాలెన్న, మల్లన్న పాత్రలు శాస్త్రిగారి కథలోలేవు. ఇవన్నీ పామర్తి సృష్టించినవే! సుల్తాన్‌ను కొట్లోపెట్టి దెబ్బలు కొట్టే సన్నివేశం తొలగించారు. 'లంకాదహనం' అనే పదం చేర్చారు నాటికలో – ఇది సంపూర్ణంగా పామర్తి చేసిన కల్పనమే!

ఇక భాష విషయం: శాస్త్రిగారి కథానిక సరళగ్రాంథికంలో సాగింది. "నీ బాంచన్. నీ కాల్ మొక్త" అనే రెండు మాటలను బట్టి ఇది తెలంగాణాకు చెందిన కథానికని వూహించవలసినదే! రేడియో నాటికలో మాత్రం సంభాషణాదులలో చాలావరకు తెలంగాణా ప్రాంతీయ భాషా వాసనను రుచి చూపించారు శాస్త్రిగారు. కాగా రంగస్థల నాటికలో ప్రతిపాత్రలో ప్రతిమాటలో ప్రతి కదలికలో తెలంగాణామయమే! దానికితోడు ఆ మాండలికాన్ని అనుకరించడంలో నటీనటులు చూపే కౌశలం ప్రశంసనీయం. వేషంలో భాషలో సర్వేసర్వత్రా ఇంతగా మాండలికత్వం వున్న రంగస్థల నాటిక బహుశా 'సులతానీ' ఒక్కటేనేమో! మచ్చుకు కొన్ని ఉదాహరణలు:

1. పరమానంద :- [సుల్తానీతో] కుంచెడు దినటం మరవలేదేమె! నిన్ను మెకం దినిపోను. నిన్నా గుట్టమీని నరసిమ్మసామెన్నను యిరసక దింటదె! నిన్ను మారెమ్మ మింగిపోను....

2. రాంగిరి :- పరమనందా! ఎందుగిట్ల పాపం మూట గట్కుంటవ్? ఎదో జెరా తిప్పు జేసెన్నని లెంప లేస్కుంటున్నది, కాల్ మొక్తున్నది, నీవు కొడ్తే కొడ్తదా, తిడితే తిడ్తదా? నీ పెండ్లమయ్య, పెండ్లము. "పెండ్లాన్నిగొట్టిన, గోవును గొట్టిన ఒక్కటే"నంటరు. ఆ పాపం పది జల్మలకుబోదు, ఏమనుకుంటున్నవొ?

3. సుల్తానీ :- [శాంతయ్యతో] నీ బాంఛను. నీ కాల్ మొక్తా.

4. సుల్తానీ :- [చింతయ్యతో] గెట్ల బత్కుతనయ్య? ఎవల్ బత్కనిస్తరయ్య? నన్నెవల్ బత్కనిస్తరు?

5. శాంతయ్య :- [సుల్తానీతో] అబ్బా! అలా దుఃఖపడకే!ఎందుకే అలా ఏడుస్తావు? ఏడవకు. నామాట వినుతల్లీ! ఇప్పటికైనా ఆ తాగుబోతు వెధవ సుల్తాన్ని విడిచిపెట్టు.

6. జోగులక్క :- [సుల్తాన్‌తో] ఏమన్నా! సుల్తానీ సూడసక్కని దన్నవ్, పెద్దలకూ సుద్దుల్ జేస్తదన్నవ్, మాట తప్పదన్నవ్, మూటల్ గట్టదన్నవ్, బొల్లకు బొరలూ తూర్లకు మూరబాజెప్పినవ్?

* * * *

ఇక రంగస్థల అలంకరణలో వస్త్రధారణలో సహజత్వం వుట్టిపడుతూ వుండడం ఈ నాటికలో కనిపించే మరొక విశిష్టత. సుల్తానీ గుడిసెను తాటాకులతో రంగస్థలం మీదనే నిర్మిస్తారు; అంతేకాని చాలామందిలాగా 'గుడిసె కర్టన్' వేయించరు. అలాగే పంచెమీద నడుముకు బిళ్ళల సొట్టెడ (బెల్టు) బిగించడం - పూసల మొలతాడు - ఇత్యాదులు తెలంగాణా గ్రామీణ వాతావరణం ప్రస్ఫుటం చేస్తాయి.

అసలు ఒక అంశంతోనే పనిమనిషిలోదివ్యత్వాన్ని దర్శించి శివరామశాస్త్రిగారి వంటి మహావిద్వాంసుడు ఒక కథానిక వ్రాయడం అది ఆయన చేతిమీదగానే రేడియో నాటికగా ఆకృతి ధరించడం - దానిని నటుడు శ్రీ పామర్తి ఒక తపస్సుగా ఒక అద్భుతమైన దృశ్యంగా తీర్చిదిద్దడం - అంతేకాదు - వంద పర్యాయాలకు పైగా ప్రదర్శించడం - ఇదీ 'సులతానీ' చరిత్ర! 'సులతానీ' సహృదయ హృదయాలలో కలకాలం నిలిచివుండే సజీవ కళాఖండం!

శ్రీ మహతీశంకర్

భారతీయ ప్రేమసుధ

"ప్రేమ" అనేది రకరకాలుగా ఉంటుంది. మాతృప్రేమ, పితృప్రేమ, ప్రేయసీప్రేమ, ఇలా ఎన్నో రకరకాల ప్రేమ లున్నాయి.

"ప్రీఞ్ తర్పణే" అనే ధాతువు నుండి ప్రేమ శబ్దం పుట్టింది. అంటే, మానవుల సర్వేంద్రియాలకూ సంతృప్తిని కలిగించేదే "ప్రేమ" అనబడుతుంది.

భౌతిక ప్రేమ

ఈ ప్రేమ - భౌతికం, ఆధ్యాత్మికం అని రెండు రకాలు. వానిలో మొదటిది, మన మనస్సులకు వికారాన్నీ, చాంచల్యాన్నీ, ఉద్రేకాన్నీ కలిగించేదిగా ఉంటుంది. ఇక "ఆధ్యాత్మిక ప్రేమ" అనేది, మన మనోబుద్ధులకూ సర్వేంద్రియాలకూ, నిర్మలమైన - నిత్యమైన - నిరవధికమైన - ఆనందాన్ని అందజేస్తుంది. మనం ప్రస్తుతంలో "భౌతిక ప్రేమ"లోనే జీవిస్తున్నాం. ఈ ప్రేమ లౌకికంగా, ఆనందప్రదమౌతూ ఆకర్షకంగానే అగుపిస్తుంది. కానీ పరమార్థ దృష్టిలో ఇది "ఏవగింపు"నే కలిగిస్తుంది. దాని అసలు స్వభావమే అంతకదా! ఈ సత్యాన్ని స్పష్టంజేస్తూ పెద్దనార్యుడు తన "మనుచరిత్ర"లో ప్రవరాఖ్యుడనే పాత్రద్వారా జవరాలైన వరూధినికి —

"... చెప్పకు మిట్టితుచ్ఛసుఖముల్ మీసాలపై తేనియల్" అని చెప్పిస్తాడు. ఎందుకనగా అప్పటికి వరూధిని కాముకురాలు. కనుక, కామాన్నే రేకెత్తిస్తున్న ఆమె ప్రేమ "భారతీయప్రణయ తత్వానికి" విరుద్ధమై పరిణామంలో అనర్థప్రదమై ఉంది. గృహస్థ ధర్మాలను, పరస్త్రీ సంసర్గంవల్ల కలిగే అనర్థ పరంపరను బాగా తెలిసినవాడు కనకనే ప్రవరాఖ్యుడు, తనయెడ ఆ కామిని చూపిన సరస సమ్మోహనకర శృంగార చేష్టలనూ, చేసిన మోహనకర ప్రయత్నాలనూ ధైర్యంతో త్రోసిపుచ్చి వెళ్ళిపోయినాడు. పరస్త్రీల తోడి పొత్తు, శ్రేయస్కాములకు ఏమాత్రమూ పనికిరాదనేదే ఇచ్చటి సందేశం. ద్రౌపదియెడ కీచకుడు చేసిన ప్రేమకలాపం, వాని బలవన్మరణానికే పరమ కారణమయిందికదా! ఇట్లు ధర్మ రహితమైన కేవల కామ సేవనం వలన కలిగే మహాఉనర్థాలను బాగా ఎరిగిన వారు కనుకనే మన మహర్షులు లోకశ్రేయస్సుకోరి "ధర్మంతో కూడిన అర్థకామాలను మాత్రమే మానవులు సేవించాలి. కాని, ప్రత్యేకంగా అర్థాన్ని కాని కామాన్నికాని సేవించరాదు."

"ధర్మాఽర్థ కామాస్సమమేవసేవ్యాః, యోహ్యేక సక్తస్స జనో జఘన్యః" అంటూ వివాహ సంస్కారం ద్వారా మానవాళిని ప్రబోధించారు. ఈ మహర్షుల పుణ్యమా అని, కామోద్రేక ప్రవాహాల వేగాన్ని వారి ధార్మికాఽనుశాసనాలు ఆపగల్గుతూన్నాయి. ఇంతకంటె ప్రపంచానికి మరోమేలు ఏముంటుంది? ఇట్లు సర్వ ప్రపంచానికీ సర్వవిధ శ్రేయస్సులనూ సమకూర్చగల్గిన ఆమహర్షి మార్గాన్ని విడిచి, యథేచ్ఛగా కామాన్ని మాత్రమే సేవించినవారు, వారెంతటి వారైనా సరే, రావణ చక్రవర్తివలెనూ, కీచకుడివలెనూ పరిణామంలో బలవన్మరణానికి గురికాక మానరనేది పరమసత్యం. ఇట్లు ప్రపంచానికే సర్వాఽనర్థప్రదమగుచున్న "కామము"ను "ధర్మం"తో కలిపి, శుద్ధిచేసిన నాభివివలె దానిని మంగళకరంగానూ, మానవాళికి శ్రేయోదాయకంగానూ మార్చిన మహర్షి పుంగవుల దూరదృష్టి - వారి శ్రేయస్సంపాదన దృష్టీ, వారిని స్వార్థదృష్టీ ఆచంద్రతారకంగా సర్వులకూ అభివంద్యములౌతూనే ఉంటాయి.

వివాహానికి ముందు ఏవిధంగానూ సంబంధంలేని ఇద్దరు వ్యక్తులకు శాస్త్రీయంగా వివాహ సంస్కారం జరుపుట వలన, ఎప్పటికీ విడిపోని స్నేహం, ఎప్పటికీ తగ్గని ప్రేమాఽనుబంధం, అడ్డంకులులేని అన్యోన్యం అనేవి వారిలో ఏర్పడి, అవి వారి భావా

లను ఐక్యం చేస్తాయి. దీనితో వారి ప్రేమలోని భౌతికం పోయి అది ఆధ్యాత్మిక ప్రేమగా పరిణితి చెందుతుంది. అట్టిదే

"భారతీయ ప్రేమ సుధ"

గా పేర్కొన బడుతుంది. "సుధ" అనగా "అమృతం" అని అర్థం. మృతం కానిది అమృతం, అంటే ఎప్పటికీ చావులేనిది. అంటే ఆధ్యాత్మిక ప్రేమ నాశం లేనిదన్నమాట. ఈ విశిష్ట విషయాలను, పార్వతీ పరమేశ్వరుల ప్రణయగాథ ప్రస్ఫుటం చేయజాలి ఉంది. నిజానికి పార్వతీదేవి యొక్క ప్రాథమిక సౌందర్యం ముల్లోకాల వారిలో మరెచ్చటా గానరానిది. ఆ భౌతిక సౌందర్య శక్తివల్లనే మహేశ్వరుణ్ణి పతిగా చేసి కొందామని గిరిజాకుమారి సంకల్పించింది. కాని ఆ అద్వైత మూర్తి ఆమె భౌతిక సౌందర్యానికి వశుడు కాలేదు సరికదా, ఆ సౌందర్యాన్ని వృథాచేసి వెళ్ళిపోయినాడు. "ఆధ్యాత్మిక శక్తిముందు భౌతికశక్తి ఎందుకూ పనికిరానిది." అనే సత్యాన్ని ఈ సన్నివేశం రుజువు పరిచింది. ఇట్లు తన మొదటి సౌందర్యమంతా శక్తి రహితమైనదని తెలుసుకొని గిరిజా కుమారి, తనరూపాన్ని శక్తిమంతంగా చేయదలచి కఠోరమైన తపస్సు చేసింది. ఆ "గౌరీ తపస్సు"తో ఆమె సౌందర్యం "ఆధ్యాత్మిక సౌందర్యం" గా మారింది. వెంటనే మహేశ్వరుడు ఆకర్షితుడై, తన ఆధ్యాత్మిక ప్రేమమయ శరీరంలో ఆమెకు అర్థ భాగం ఇచ్చేసినాడు. అప్పటి నుంచీ లోకంలో భార్యకు "అర్ధాంగి" అనే సార్థకనామం సంప్రాప్తమయింది. ఇంకా - అలనాటి ఆ "గౌరీ తపస్సే" మన కన్యకాజనం వారి వివాహానికి ముందు చేసే "గౌరీ తపస్సు"గా పరిణమించి, అది నేటికీ వారి సౌభాగ్య జీవిత లాభానికి "శ్రీరామ రక్ష"గా పని చేస్తూంది. ఇట్లు స్త్రీల జీవితానికే శిరోభూషణమైన "సౌభాగ్యం" వారి "గౌరీ తపస్సు" వల్లనూ, శాస్త్రీయ వివాహ సంస్కార నిర్వహణం చేతనూ సిద్ధించునే కాని, నేటి "లా మేరేజీల" చేతనూ, ఇట్లే "రిజిష్టరు మేరేజీల" చేతనూ సిద్ధించదు కదా! ఇంకా ఈ తపస్సు యొక్క ప్రభావం వలన గౌరీదేవి, "మృత్యుంజయుడు" అనిపించుకున్న మహేశ్వరునంత వానిని పతిగా చేబట్టింది కనుకనే ఆమె, "సర్వ మంగళాదేవి" నిత్య సౌభాగ్యవతి, గానూ "జగజ్జనని" గానూ ప్రపంచ ప్రసిద్ధి పొందగలిగింది. ఈ మహాభ్యుదయాలన్నిటినీ సిద్ధింప జేసినది. "గౌరీ తపస్సే" అనేమాట మరువరానిదే. విశేషంగా-దంపతులలో అద్భుతమైన "అన్యోన్యం" - అంటే పరస్పరానురాగం సిద్ధించడానికి కూడా ఈ "తపస్సే" కారణమయిందని, పార్వతీ పరమేశ్వరులను గూర్చి చెప్పిన "పరస్పర తపస్సంపత్ఫలాయిత పరస్పరౌ!........" అనే స్తవ వాక్యం వ్యక్తం చేస్తూంది. ఇట్టి సంస్కారాలను మానేసి అభ్యుదయాలు కావాలంటే ఎక్కడ నుంచి, ఎలా వస్తాయి? కర్మ భూమిలో పుట్టిన మనం "స్వకర్మాచరణం" చేతనే అభ్యుదయాలను పొందవలసి ఉందని, "కర్మణైవహి సంసిద్ధి మాస్థితా జనకాదయః...." అనే గీతా సూక్తి చాటుతూంది.

ఇంతకూ చెప్పేదేమంటే - నేడు వివాహానికి ముందు మన కన్యకామణులు చేసే "గౌరీపూజ" వలన తమ భర్తలు కూడా, వారి అర్ధ శరీరంలో తమకు స్థానం కల్పించేటంత అనురాగం తమ యెడ చూపాలనీ, తమ చిరంతన సౌభాగ్యాన్ని కొనసాగించాలనీ, తమపాలిటి సౌభాగ్యదేవత అయిన ఆ గౌరీదేవతను అర్థిస్తూ వారు శ్రీగౌరిని పూజించాలనేదే. ఈ సద్భావనతో చేసిన పూజ సత్ఫలితాలనే ప్రసాదిస్తుంది. కనుక ఈ సంస్కారాలతో వధూవరులకు "భారతీయ దంపతీ ప్రణయసిద్ధి" కూడా ప్రాప్తించి, అది వారి సత్సంతాన ప్రాప్తికీ, అది క్రమంగా సాంఘిక శ్రేయస్సునకూ పరంపరా కారణమౌతుంది. ఇట్లు శాస్త్రీయ వివాహ సంస్కార నిర్వహణం అనేది సాంఘిక శ్రేయస్సుగా పరిణమించినపుడు, "సంస్కార లోపం" అనేది సాంఘిక శ్రేయః పతనానికి మూలమౌతుంది కదా!

ఇక, భారతీయ ప్రేమామృతాస్వాదన భాగ్యమునకు ప్రత్యేక లక్ష్యమైన శ్రీ సీతారాముల దాంపత్య వైభవాన్ని సంగ్రహంగా సంస్మరించుకొని, ఈ రచనను ముగిస్తాను.

సీతారాముల ఆదర్శ దాంపత్య సిద్ధికి, వారి ఆధ్యాత్మిక ప్రేమ మకరంద మాధుర్యాలే మూలమని అంగీకరించక తప్పదు. కారణం, వారి కామ పురుషార్థం, వారి ధర్మ పురుషార్థంలో విలీనమై, వారి జీవితాన్ని ధర్మమయంగా మార్చింది. కనుకనే ఈ ఆదర్శ దంపతుల సామ్రాజ్యం పోయినా, వీరు అడవుల పాలైనా, వీరి "నిర్మల ప్రేమ" మాత్రం చెక్కు చెదరలేదు. శ్రీరాముడు అడవులలో ఉన్న తన ప్రాణేశ్వరిని గూర్చి ఆమె పరోక్షంలో ఇలా అంటాడు. "సీత నా గృహలక్ష్మి, నా నేత్రాలకామె అమృత దీప లక్ష్మి, ఆమె స్పర్శ నా అంగాలకు ఆనందలక్ష్మి, ఆమె నాకులాభ్యుదయలక్ష్మి, నా జీవిత సౌభాగ్యలక్ష్మి. ఇట్లు సీతకు చెందిన వన్నీ నాకు ఆనంద ప్రదాలే కాని, ఆమె విరహం మాత్రం నాకు దుర్భరమౌతుంది." అంటూ వాపోతాడు. ఇకనిందు చూలాలై ఉండగా అడవులలో దిగపెట్టబడి దుఃఖాలలో చిక్కుకొన్న సీతామాత, లక్ష్మణునిద్వారా శ్రీరామునకు పంపిన సందేశ సారమిది.

"శ్రీరాముడు నాకై దుఃఖించక తన రాజ కార్యాలను సక్రమంగా నెరవేర్చుకోమని లక్ష్మణా! నా మాటగా నా ప్రాణేశ్వరునికి తెలుపుము. ఈ అరణ్య వాసానికి నా దురదృష్టమే మూలం కాని శ్రీరాముడు కాదు" ఈ సందేశంలోని పరమార్థమిది.

"ప్రజానురంజనం" అనే శ్రీరాముని ముఖ్యధర్మంలో అతడి "కామం" విలీనమై అతడి ధర్మాచరణాని కది దోహద మైనట్లే. సీతాదేవి పాతివ్రత్య ధర్మం యొక్క అడుగు జాడల్లో నడుస్తూన్న ఆమె కామం, భర్త యొక్క 'ప్రజారంజన' రూప ధర్మంలో సీతాదేవిని (అడవులలో ఉన్నా) పాల్గొనేటట్లు చేసింది. వ్యాసమహర్షి ఒక్క "ధర్మ" సేవనంవలన ప్రజలకు అర్థకామ పురుషార్థాలు సిద్ధిస్తాయి. "ధర్మార్థశ్చ కామశ్చ...."అని చెప్పిన సూక్తి సీతారాములయెడ సార్థకమయింది. కనుకనే త్రేతాయుగం లోని సీతారాముల "ప్రేమసుధ"ను "జానక్యా...."అనే శ్లోకం ద్వారా నేటికీ స్మరించుకొని ఆనందిస్తున్నాం "స్వస్తి ప్రజాభ్యః".

శ్రీ ఖండవిల్లి సూర్యనారాయణ శాస్త్రి

పట్టుకారు అన్యదేశ్యము గాదు

డాక్టరు శ్రీ కొర్లపాటి శ్రీరామమూర్తిగారు జూన్ నెల భారతిలో కవిజనాశ్రయకర్తృ కాలమును నిరూపించుచు ప్రసక్తముగా "పట్టుకారు" "పత్‌కార్" అను పారసీక శబ్దమునుండి నిష్పన్నము కావచు నన్నారు కాని అది యచ్చముగా తెలుగు పదమే. కారు అనగా పనిముట్టు కనుక పట్టుకారనగా వస్తువులను పట్టుకొను సాధనమని యర్థము.

శకట రేఫాంతమైన "కాఱు" నకు ఆంధ్ర భాషార్ణవకర్త 'గి' - మీను సందంశకము పేరు కాఱనంగ - 2-298 అని పట్టుకారను అర్థమిచ్చెను గాని ప్రాచీనుగున కాఱు-కల్లు - పదములు కేవలముపకరణ వాచకములుగనే కనిపించును. తెలుగు నందలి ఈ పదము సంస్కృత మందలి కార్ముక శబ్దము వంటిది. "కర్మణే ప్రభవతి కార్ముకః" అని దానికి వ్యుత్పత్తి యుండగా నేడది ధనురర్థమున రూఢి యైనట్లు "కాఱు" పదము గూడ వివిధార్థములలో నిలిచినది. విశ్వబ్రాహ్మణుల కొలిముల్లలో నేడు మొనగాఱు, నీరుకాఱు అని ఇంకను కాఱు వాచకములున్నవి. మొనయనగా సన్నని మూతి గనుక సన్నని మూతి గలిగిన పట్టుకారును మొనగాఱందురు. నీరుకాఱనగా నిప్పును బట్టు సాధనము. శకట రేఫాంతమైన నీఱు పదమునకు నిఘంటువు బూడిద యని యర్థమిచ్చును. (అసలు నీరు గూడ హైడ్రోజన్ కాలుట చేత యేర్పడును గనుక అది గూడ బూడిద యనియే సైన్సు వారి మతము). దీనికి పూర్వ రూపము నివురు. నివురు "నిగనిగలాడు" అను నర్థమున ఏర్పడిన పదమునినుడి నానుడిలో శ్రీతిరుమల రామచంద్రగారు చెప్పిరి గనుక పూర్వమీ 'నీఱు' నకు బూడిద యనుట గాక "నిప్పు" అనియే యర్థమున్నట్లు దోచును. తెలంగాణమున అక్కడక్కడ నింకను నివురునకు "అగ్గి" యను నర్థముచావలేదు. వారు పొయ్యిలో "నివురులున్నవి. నివు రాజు కుంటున్నది". అని నిప్పురవ్వల పరముగా దానిని వాడుదురు కనుక ఈ నిప్పులను పట్టుకొను కాఱు నీరు కాఱగును. కాఱు పదమునకు దీని చేతనే గాక

మ. ప్రతి సూర్యుండను కమ్మటంబు మఘవద్బాణాసనమ్కాఱు రో
హిత మస్సేరిటి యూదు గ్రోవి - (4-17)

అను పైడిపట్టి వెంకటపతి చంద్రికగద చరిత్ర ప్రయోగమును బట్టి గూడ ఉపకరణమను అర్థమే పొసగును. చూడుడు. కవిగారు పై పద్యమున జెప్పినవి కమ్మటము - కాఱు - యూదు గ్రోవి కనుక నిచట కారనగా పట్టుకారు గాదు. కంసాలి వారి కమ్మటము జతనుండునది నీఱు కారు గనుక నీ కాఱు నీఱుకాఱగును. కవి యిందు మఘవ బాణాసనమును కాఱుగా రూపించెను గనుక పోలికలను బట్టి యిచట నతడీ పేరు పట్టు కాఱును గాక నీఱు కారునుద్దేశించియే ప్రయోగించెననుట స్పష్టము. అందువలన 'కాఱు' వెంకనార్యుని మతమున పట్టుకారైన వెంకటపతి మతమున నీరు కాఱగును కనుక దీని నుపకరణార్థమున గ్రహించుటే సబబు.

ఇది గాక వారు 'కార్ఖానా'లోని 'కారు'నకు యంత్రమని గూడ యర్థము జెప్పిరి కాని అది గూడ పొసగునట్లు దోచదు. తెలుగులోని 'కారు'నకు శిల్పియని నైఘంటి కార్థము. పనివాడని లోకపు వాడుక. ఇక పారశీకమైన కారునకు అమోకార, కుంభకారాదులందు వలె పని చేయువాడనియే యర్థము. జర్‌గర్, ధన్‌గర్, పేష్‌కార్, సర్‌కార్, హర్‌కారా ఇత్యాది పారసీ నామములలోని ఉత్తర పదమున కాభాషలో చేయువాడనియే యర్థము గనుక కార్‌ఖానా యనగా పనివారుండెడు స్థలము. యంత్రశాలలో పనివారెక్కువ రుందురు గనుక నేడా పేరు యంత్రాగారములకు పర్యాయ మైనది.

ఈ కార శబ్దముతో ఏర్పడిన ప్రయోగములు తెలుగు యింకను విచిత్ర పరిణామ మందినవి. మూలాకార శబ్దము 'మూకరి' యైనది. ఇందలి కరి శబ్దము చేయువాడు అను నర్థమున దేశ ములందు కకారపు పొల్లు లోపించి పూజ + అరి = పూజ కమ్మ + అరి = కమ్మరి, ఉప్పు + అరి = ఉప్పరి ఇటులే దాసరి దొమ్మరి, మేదరి, వడ్డెరి మున్నగు జాతివాచకములందు కనిపించు పారశీకమున గూడ ఈ 'కార్' శబ్దము తెలుగునందు వలె కకారపు పొల్లు లోపించి కుమ్హార్, చమార్, లుహార్, అను జాతి వాచకములలో కనిపించును.

ఈ కార - కరి శబ్దములే గాక వీనిచే నేర్పడిన 'కారము' అను రూపము గూడ చేయబడినది అను నర్థమున తెలుగున వెలిగారము, గురిజకారము, సురేకారము మున్నగు పదములందు గనిపించును. చిత్రమేమన ఇవి గూడ విశ్వబ్రాహ్మణుల పదములే. వెలిగారమనగా తెల్లగా చేయబడిన శిలా విశేషము. ఇది నేడొక వీధి ద్రవ్యము. గురిజ కారమనగా గురివెంద పలుకులు నూరి సిద్ధము చేయు ఒక విధమైన జిగురు పదార్థము. సురేకారమనగా సోరుప్పుకాల్చి సున్నము కలిపి చేసేడు ఒక పదార్థము.

ఇటుల విశ్వబ్రాహ్మణుల పనిముట్లలో ఈ పట్టుకార్లేగాక పట్టుకొనవలసిన అపురూపనామము లింకెన్నియో యున్నవి. వానిని గురించికూడ పరిశీలించిన యెడల భాషా శాస్త్రమునకు మరికొన్ని కొత్త విశేషములు తెలియును.

శ్రీ కపిలవాయి లింగమూర్తి

శాస్త్రీయ దృక్పథం - ఒక పరిశీలన

డా. గుమ్మనూరు రమేష్‌బాబుగారు శాస్త్రీయ దృక్పథాన్ని లేదా శాస్త్రీయతను వివరించడానికి ఒక బృహత్ప్రయత్నం చేశారు (భారతి, మార్చి 1982). ఆయన శాస్త్రీయతకు ఇచ్చిన నిర్వచనం చూస్తే అది ఒక మత ప్రబోధకుని ప్రవచనంగా ఉన్నదిగాని శాస్త్రీయ భాషకుండే స్పష్టత దానిలోలేదు. గీతాకారుని స్థిత ప్రజ్ఞత్వాన్ని శాస్త్రీయతతో పోలుస్తూ "స్వయం విమర్శతో కూడిన సమన్వయ పారమార్థిక (పారమార్శిక ?) అభిజ్ఞతను ప్రదర్శించడమే శాస్త్రీయత" అన్నారు. ఈ నిర్వచనం కూడా గీతాప్రవచనాలవలెనే ఉన్నది. 'సంస్కార బద్ధమైన శాస్త్ర పరిజ్ఞానానికి అతి నిర్దుష్టమైన ప్రయోజనాత్మకమైన ప్రజాభ్యుదయ ప్రయోగాత్మక పథకానికి మరో పేరే శాస్త్రీయత' అన్నారు. తేలిక మాటలతో తక్కువ విశేషణాలతో చేసే నిర్వచనాలే శాస్త్రీయమైనవని తెలుసుకోవడం చాల అవసరం.

ఏదైనా ఒక విషయాన్ని శాస్త్రజ్ఞులు సరిగా వివరించలేక పోయినచోట్ల, శాస్త్ర సిద్ధాంతాలు విషయ విశదీకరణ చేయజాలనిచోట్ల, శాస్త్రానిదే లోపంగా భావించి ఆయాచోట్ల అజ్ఞాతశక్తులకు, ఈశ్వరవాదానికి తావు కల్పించడమే రచయిత ఆశయంగా కనిపిస్తున్నది. ప్రకృతికి అతీతమై, అజ్ఞాతమైన శక్తిని ప్రకృతి శాస్త్రాల పరిశోధనా విధానంలోనే నిరూపించడానికి పూనుకొన్నాడాయన. తన వాదానికి బలంగా కొన్ని ప్రధానశాస్త్ర సిద్ధాంతాలలోని లోపాలను ఎత్తి చూపారు. డార్విన్ ప్రకృతి వరణ సిద్ధాంతం, జీవ పరిణామ సిద్ధాంతం, న్యూటన్ గురుత్వాకర్షణ సిద్ధాంతం మొదలైన వాటిని విమర్శించారు. ఆయా సిద్ధాంతాలలో రచయిత చూపిన లోపాలు, చేసిన విమర్శలు ఏనాడో చర్చకువచ్చాయి. విజ్ఞాన శాస్త్ర చరిత్రను జాగ్రత్తగా పరిశీలిస్తే ఆ విమర్శలకు జవాబులు దొరుకుతాయి. ప్రస్తుతం ఒక గురుత్వాకర్షణ సిద్ధాంతాన్ని తీసికొని చర్చించి మిగిలినది వదిలేస్తాను.

"లోకజ్ఞానం ఉంటేచాలు కాయ భూమిమీద పడుతుందని తెలుస్తుంది. దానికి భూమ్యాకర్షణ సిద్ధాంతాన్ని వర్తింప జేయడం సిల్లీగా ఉండదా ?"- అని ప్రశ్నించారు వ్యాసకర్త. పైగా, న్యూటన్‌కి పూర్వం భూమికి ఆకర్షణ లేనేలేదని భావించే మహానుభావులు భారతదేశంలో రీసెర్చి చేస్తున్నారట ! అసలు న్యూటన్ సిద్ధాంతం ఏమిటి ? అది ఎలా ఆవిర్భవించింది ? అని కొంచెం పరిశీలిస్తే రచయిత ప్రశ్నలలోని సిల్లీతనం గోచరిస్తుంది.

న్యూటన్ యాపిల్‌పండు ఎందుకు భూమిపైన పడుతుంది ? అని ఆలోచించనేలేదు. న్యూటన్‌కుపూర్వం కోపర్నికస్, గెలీలియో, కెప్లర్ మొదలైన శాస్త్రజ్ఞులు సౌరకుటుంబంపైన, గ్రహగతులపైన పరిశోధనలు జరిపి కొన్ని విషయాలను తెలియపరచారు. గ్రహాలు సూర్యుని చుట్టూ తిరగడానికి గల కారణమేమిటి? భూమికి ఉపగ్రహమైన చంద్రుడు భూమిచుట్టూ పరిభ్రమించడానికి కారణమేమిటి ? మొదలైన ప్రశ్నలు నాటి శాస్త్రవేత్తలనందర్నీ వేధించినాయి. యాదృచ్ఛికంగా, యాపిల్‌పండు భూమిపైన పడడాన్ని చూచిన న్యూటన్ ఈ విధంగా తర్కించాడు. "యాపిల్‌పండు భూమిపైన పడడానికి గల కారణమే, భూమిచుట్టూ చంద్రుడు తిరగడానికి, సూర్యుని చుట్టూ గ్రహాలు తిరగడానికి గల కారణం అయి ఉంటుంది." ఈ తర్కమే విశ్వగురుత్వాకర్షణ సిద్ధాంతానికి దారితీసింది. న్యూటన్ కనిపెట్టింది భూమ్యాకర్షణ సిద్ధాంతంకాదు. విశ్వ గురుత్వ సిద్ధాంతాన్ని అతడు రూపొందించాడు. ఆ సిద్ధాంతం నేటికీ అదే విధంగా నిలబడి ఉండలేదు. ఎన్నో మార్పులకు గురియై నేటికీ పరిణామం చెందుతూ అభివృద్ధి చెందుతోంది. శాస్త్రీయత అంటే ఇదే.

మరి, శాస్త్రీయ దృక్పథం అంటే ఏమిటి? అనవసరమైన వాగాడంబరాన్ని కట్టిబెట్టి, ప్రవచన ధోరణిమాని స్పష్టమైన నిర్వచనాన్ని ఇచ్చుకోవాలి. శాస్త్రీయ సిద్ధాంతాలను గూర్చి వ్యాసకర్త అన్నమాటలలోనే చెప్పాలంటే, స్పష్టమైన నిర్వచనాలు కూడా "ఏ విధమైన లోపాలకూ అవకాశం లేకుండా, ఎటువంటి బలహీనతలకూ చోటివ్వకుండా అందరికీ ఆమోద యోగ్యమైన ఆచరణా

సమ్మతమైన అతి నిర్దుష్టమైన శ్రేష్ఠమనదగినవై ఉండకపోవచ్చు. ఆయనే అన్నట్లు "ఒక సిద్ధాంతం సర్వకాల సర్వావస్థలయందూ ఒకేవిధంగా ప్రతిపాదించబడాలని ఊహించడంకూడా అనుచితం". అందువలన, ప్రతిపాదనా రూపకంగా చర్చాకర్షకమైన నిర్వచనాన్ని ఈయవచ్చు.

మరొక విషయాన్నికూడా ఇక్కడ గమనించాలి. శాస్త్రీయ దృక్పథానికి, శాస్త్రీయ పద్ధతికి తేడా ఉన్నది. 'శాస్త్రీయదృక్పథం' విస్తృతార్థం కలిగిన సమాసం. శాస్త్రీయపద్ధతి శాస్త్ర పరిశోధనా వ్యాసంగానికి అవసరమైన ఆచరణా విధానం. శాస్త్రీయదృక్పథం అన్నా హేతుదృష్టి అన్నాఒకటే. ఏవిషయాన్ని గుడ్డిగా, మూర్ఖంగా నమ్మకపోవడమే శాస్త్రీయ దృక్పథం. భూమి గుండ్రంగా ఉంది అని చెపితే కిమ్మనకుండా నమ్మడం శాస్త్రీయ దృక్పథానికి విరుద్ధ లక్షణం. సముద్రతీరానికి చేరుకొనే ఓడ, చంద్ర గ్రహణ సమయంలో చంద్రునిపై పడే నీడ ఆకారం మొదలైన ఆధారాలు చూపించి భూమి గుండ్రంగా ఉంటుందని చెప్పడం శాస్త్రీయ లక్షణం. అంటే, ప్రమాణ రహితంగా ఒక విషయాన్ని ఎవరో చెప్పారని నమ్మడం శాస్త్రీయ దృక్పథానికి విరుద్ధమన్నమాట.

మరి, శాస్త్రీయ పద్ధతి అంటే ఏమిటి? ఒక శాస్త్రీయ సిద్ధాంతాన్ని నిర్మించడానికి, నిలబెట్టడానికి లేదా త్రోసిరాజనడానికి శాస్త్ర వేత్తలు అవలంబించే విధానాన్ని శాస్త్రీయ పద్ధతి అనుకోవచ్చు. పైన ఉదహరించిన గురుత్వసిద్ధాంతాన్నే తీసుకొందాము. ఎందరో శాస్త్రవేత్తల పరిశోధనల ఫలితాలను క్రోడీకరించి, సమన్వయించి, న్యూటన్ తన సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. ఐ. బెర్నార్డ్ కోహెన్ వ్రాసిన 'ది బర్త్ ఆఫ్ న్యూ ఫిజిక్స్' అనే చిన్న పుస్తకం చదివితే గురుత్వ సిద్ధాంతావిష్కరణ ఎలా జరిగిందో తెలుస్తుంది. ఈ శతాబ్దంలో ఐన్‌స్టీన్ మొదలైన శాస్త్రజ్ఞులు ఆ సిద్ధాంతాన్ని మార్చి వ్రాస్తున్నారు. న్యూటన్ అనంతరం లభ్యమైన ప్రయోగ ఫలితాలు ఆయామార్పులకు అవసరాన్ని కల్పిస్తున్నాయి. శాస్త్రీయ పద్ధతి అంటే "మానవానుభవంలోని ప్రకృతి విశేషాలను క్రోడీకరించి, సర్వత్రీకరించి, సిద్ధాంతీకరించే తార్కిక విధానం"గా నిర్వచించవచ్చు. కాలం గడచిన కొద్దీ, మానవానుభవం పెరుగుతుంది. సిద్ధాంతాలను పునర్నిర్మించుకోవలసిన అవసరం వస్తుంది. అందువల్ల గత సిద్ధాంతాలు పూర్తిగా పనికి మాలినవని, వర్తమాన సిద్ధాంతం సంపూర్ణ సత్యమని భావించడం అవివేకం, అశాస్త్రీయం.

ఒక సిద్ధాంతం ఎలా నిలదొక్కుకుంటుంది? ఆ సిద్ధాంతం ఆధారంగా కొన్ని సంఘటనలను ఊహిస్తాము. ఊహించిన సంఘటనలు జరక్కపోతే ఆ సిద్ధాంతంలో దోషమున్నదన్నమాట. జరిగితే సిద్ధాంతం నిలబడుతుంది. సాపేక్ష సిద్ధాంతంలో $E=mc^2$ అనే సమీకరణం ఉన్నది. అదిఆధారంగా పరమాణు సాధనాల నిర్మాణం జరుగుతున్నది. ఆ సాధనాలు ముందుగా ఊహించిన విధంగా పనిచేస్తున్నాయి. అందువల్ల, ఆ సమీకరణాన్ని, సాపేక్ష సిద్ధాంతాన్ని నమ్ముతున్నాము. సాపేక్షసిద్ధాంత విరుద్ధమయిన విషయ సేకరణ జరిగినపుడు, ఆసిద్ధాంతం ప్రకారం ఊహించిన సంఘటనలు జరగనపుడు దాని సత్యత్వాన్ని శంకిస్తాము, దానిని మార్చుకోవలసి వస్తుంది. కాని, రమేష్‌బాబు సిద్ధాంతాలను పరీక్షలద్వారా, ప్రయోగాల ద్వారా నిరూపించడానికి అవకాశాలు ఉండకపోయినా; "నిర్ధారీకరించటానికి తగిన అవకాశం లేనంతమాత్రాన సిద్ధాంతాన్ని తీసి పారేయకూడదు" అంటారు. ఇది అశాస్త్రీయమైన వాదన. నిర్ధారించడానికి తగిన అవకాశం లేకపోతే అది సిద్ధాంతం కాజాలదు, ప్రతిపాదన మాత్రమే అవుతుంది.

సిద్ధాంతాన్ని నిర్ధారించ లేనపుడు, విషయ విశదీకరణలో మెటాఫిజికల్ సిద్ధాంతాలు బయలుదేరాయని కార్ల్ పాపర్ అనడం సమంజసమేనని రమేష్‌బాబు అభిప్రాయం. మెటాఫిజికల్ సిద్ధాంతాల గురించి చెప్పడంగాని, 'సైంటిఫిక్ ఎప్రోచ్'కు 'ఫిలసాఫిక్ టెన్షన్' ఉండాలనుకోవడంగాని శాస్త్రీయతాపరిధిలోలేని అంశాలు. 'ఫిలసాఫిక్ టెన్షన్'లు కారణంగా, మెటాఫిజికల్ సిద్ధాంతాల ఆసరాతో ఏశాస్త్రీయ సిద్ధాంతమూ ఆవిర్భవించ లేదన్నది చారిత్రకసత్యం. ప్రధానమైన శాస్త్ర సిద్ధాంతాలవెనుక వాటిని చూడాలనుకోవడం వ్యర్థాయాసం.

రక్తం రంగుకు, వర్ణకోత్పత్తికి, పరిణామ వాదానికి, జంతు ప్రవర్తనకు గల సంబంధాల పరిశీలనంలో అనుమానాస్పదమైన వాదనలు ఉండవచ్చు. అయితే, ఈ విషయం ఇంతటితో ముగుస్తుందా? శక్తివంతమైన అధునాతన వర్ణవిశ్లేషక పరికరాలతో ప్రయోగాలు జరిగి ఫలితాలు క్రోడీకరింపబడి, ప్రమాణీకరింపబడిన తర్వాత ఏదో ఒక సిద్ధాంతం రూపుదిద్దుకొంటుంది. కాని, ప్రస్తుత అనుమానాస్పదమైన స్థితియే సత్యమనుకొని, ఇక్కడ అనుమానం ఉన్నది కాబట్టి ఏదో అజ్ఞాతశక్తి దీనికి కారణమై ఉంటుందనుకొనడం అశాస్త్రీయం. ఈ విధంగా అనుమానాస్పదమైన విషయాలను అజ్ఞాత శక్తులకు అంటగట్టుతూ ఉంటే శాస్త్ర పురోగమనం జరిగేదికాదు. ప్రయోగాత్మక పరీక్షలు ఒక సిద్ధాంతాన్ని ఋజువు చేయడానికన్నా, దానిలోని లోపాలు కనుగొనడానికి జరిగినపుడే నూతన శాస్త్రీయ సిద్ధాంతాలు ఆవిష్కరింపబడతాయి. ఉదాహరణకు, విశ్వవ్యాప్తమై ఈథర్ అనే పదార్థం ఉన్నదన్న ఊహ పైన కాంతి తరంగ సిద్ధాంతం ఆధారపడింది. ఈథర్

అస్తిత్వాన్ని శంకిస్తూ ఎన్నో ప్రయోగాలు జరిగాయి. తత్ఫలితమే సాపేక్షతా సిద్ధాంతం.

మరొక విషయమేమంటే శాస్త్రజ్ఞులు వేరు, తత్త్వవేత్తలు వేరు. ఒక శాస్త్రవేత్త తత్త్వవేత్తగా రూపొందవచ్చు. అది వేరే విషయం. విజ్ఞాన శాస్త్రంలో ప్రధాన సిద్ధాంతాలను రూపొందించిన డార్విన్, ఫ్రాయిడ్, హక్స్లీ, ఐన్‌స్టీన్, బోర్, హైసెన్‌బర్గ్ మొదలైనవారు తాత్త్విక చింతనలు కూడా చేశారు. అయితే, వారి శాస్త్రీయ సిద్ధాంతాలకున్న ఖచ్చితత్వం తాత్త్విక ప్రతిపాదనలకులేదు. ఉదాహరణకు, హైసెన్‌బర్గ్ అనిశ్చితత్వ సూత్రం భౌతికశాస్త్రంలో ప్రధానమైనది. కాని, అతని తాత్త్వికచింతనలు వివాదగ్రస్తమైనవి. శాస్త్రీయ పరిధులువేరు, తాత్త్విక పరిధులు వేరు. రెండూ ఒకదానితో నొకటి ముడివడి ఉన్నవేకాని సర్వసమానాలుకావు. శాస్త్రపరిశోధనకు ఒక విలక్షణమైన, ప్రత్యేకమైన విధానం నిర్దిష్టంగా ఉన్నది. తాత్త్విక చింతనా విధానం సమగ్రమైనది. ప్రకృతి శాస్త్రాలే కాక, కళలు, సాహిత్యం, చరిత్ర, సామాజికశాస్త్రాలు తాత్త్వికునికి అవసరం. విజ్ఞాన సమాచారమే కాక మానవుని భావాలు, అనుభూతులు, ఉద్రేకాలు, బాధలూ సర్వమూ తత్త్వచింతనకు సామగ్రియే. మానవ నాగరికత ప్రారంభ దశలో ప్రకృతి విజ్ఞానమూ, తత్త్వశాస్త్రమూ ఒకటిగానే ఉండేవి. చరిత్రగమనంలో రెండుగా విడిపోయి, తిరిగి ఆధునికయుగంలో చేరువకాసాగాయి.

శాస్త్రీయ మార్గంలో ప్రకృతికి అతీతమైన అజ్ఞాతశక్తిని ప్రతిపాదించేందుకు రచయిత చేసిన ప్రయత్నాన్ని క్లుప్తంగా పరిశీలించి ముగిస్తాను. ప్రకృతేవరణ సిద్ధాంతాన్ని విమర్శిస్తూ రమేష్ బాబు ప్రకృతికి ఆశక్తి ఎక్కడనుండి వచ్చిందని ప్రశ్నించారు. ఈశ్వరుడు ఆ శక్తిని ప్రకృతికి ప్రసాదించాడనేది ఆయన భావం. మరి, ఈశ్వరునికి ఆశక్తి ఎక్కడనుంచి వచ్చింది? ఇలా ప్రశ్నిస్తూ పోతే ఎక్కడో ఒక చోట ఆగవలసివస్తుంది కదా! ఈశ్వరవాదులు ఈశ్వరుని వద్ద ఆగిపోతే, ప్రకృతి వాదులు ప్రకృతి వద్ద ఆగిపోతారు. అనుమాన ప్రమాణాలు ఆధారంగా ఎన్నో విషయాలను నమ్ముతాము కాబట్టి (ఆక్సిజన్ వంటి కంటికగుపించనివి), అజ్ఞాత శక్తిని నమ్మడానికి కూడా అనుమాన ప్రమాణం ఆధారం కాకూడదా? అని ప్రశ్నించారు వ్యాసకర్త. అనుమాన ప్రమాణం మాత్రమే శాస్త్రజ్ఞులు ఏ విషయాన్ని ఖచ్చితంగా విశ్వసించరు. అనుమాన ప్రమాణం ఆధారంగా కొన్ని విషయాలను 'ఎస్యూమ్' చేసుకుంటారు. ప్రయోగాత్మక పరీక్షలో, ఆచరణలో నిర్ధారింపబడిన ఎసంప్షన్స్ సిద్ధాంతాలుగా, ప్రకృతి నియమాలుగా రూపుదాలుస్తాయి. ఉదాహరణకు, అనుమాన ప్రమాణాల ఆధారంగా పరమాణువులోని కణవిన్యాసానికి ఒక 'నమూనా' ను మాత్రమే రచించగలిగారు. అంతే. ఈ విధంగా అనుమాన ప్రమాణాలు ఆధారంగా అజ్ఞాత శక్తులను ఎస్యూమ్ చేసికొంటే ఎవరికీ అభ్యంతరం లేదు. శాస్త్రీయమైన పరీక్షలకు గురిచేయకుండా వాటిలో దృఢవిశ్వాసాన్ని పెంచుకోవడమే అశాస్త్రీయత! ఆ శక్తుల అజ్ఞాతత్వాన్ని శాశ్వతీకరించడం ప్రమాదం!

శ్రీ భట్టిప్రోలు కామేశ్వరరావు
నల్గొండ

తిక్కనకు ఔచిత్యం తెలియదా?

శ్రీ వి. యస్. రాఘవన్ (రిటైర్డు సంస్కృత అధ్యాపకులు, వి. ఆర్. కళాశాల, నెల్లూరు) రచించిన గ్రంథం ''తమిళాంధ్ర భారతముల తులనాత్మక పరిశీలన''1 రెండు భిన్న భాషా కావ్యాలను తులనాత్మకంగా చూసి, ఈ గ్రంథాన్ని రచించిన రాఘవన్ కృషిని జాతీయ సమైక్యతాదృష్టి గల ప్రతి పౌరుడూ అభినందించవలసిందే. అఖిల భారత సంచారం చేసి ఈ గ్రంథాన్ని రచించినట్లు రచయిత చెప్పుకొన్నారు. ప్రధానంగా తమిళంలో విల్లి, తెలుగులో తిక్కన రచించిన భారతాలను పరిశీలించారు రచయిత.

రెండు భిన్న భాషా కావ్యాలను పరిశీలించేటప్పుడు పరిశోధకుడు రెండెద్దుల గానుగ వాడి వంటి పాత్ర వహించవలసి వుంటుంది. పరిశోధనకు సంయమనం, సమదృష్టి అవసరం. రెండు భాషా ప్రజల జీవన విధానం, ఆలోచనా విధానం, సాహిత్యం తీరుతెన్నులు, అప్పటికే ఆయాభాషా కావ్యాల మీద వచ్చిన పలు విమర్శలు - వీటినన్నింటిని దృష్టిలో పెట్టుకోవాలి తప్పకుండా. భాషా దురభిమానం - ద్వేషం - ఈ రెంటిని దూరంగా వదిలి పెట్టాలి పరిశోధకుడు.

విల్లి, తిక్కనకు 80, 90 సంవత్సరాలు తరువాతి వాడు. ఆయన వ్యాసునే గాక నన్నయ, తిక్కనలను కూడా ఆదర్శప్రాయంగా చేసికొని, వారి అడుగు జాడల్లో నడచినట్లు రాఘవన్ అభిప్రాయం. అయినా తిక్కనను గురించి చెప్పిన చాలా చోట్ల, తిక్కన రచనలో ఔచిత్యం లేదని అభిప్రాయ పడుతూ వచ్చారు రాఘవన్, ప్రత్యేకించి విరాట పర్వంలో. రాఘవన్ చేసిన కొన్ని నిర్ణయాలు, రాసిన కొన్ని వాక్యాలు అస్తవ్యస్తంగాను, పునరాలో

1. ప్రచురణ : ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, హైదరాబాదు, 1982, వెల రూ. 7-25

చించ వలసినవి గాను ఉన్నాయి. (ఆ సందర్భాలను పేర్కొని చర్చించడం ప్రస్తుతం ఈ వ్యాసకర్త ఉద్దేశ్యం.)

విరాటపర్వం మీద రాఘవన్ 55 పేజీల (3-అధ్యాయాల) విమర్శ రాశారు. మొట్ట మొదటనే 262 పేజీలో వ్యాసుని గురించి చెబుతూ, "విరాటపర్వ రచనమున వ్యాసుడు మహాకవులందరిని తల దన్నెను ఆదికవి వాల్మీకిని గూడ గెలిచెను" అని అన్నారు. ఎవరైనా ఒక సాధారణమైన వ్యక్తి, ఇటీవలి కాలం వాడు అంతను ముందు ఎవరూ చెయ్యనంత గొప్పపని చేస్తే, అప్పుడు ఇటు వంటి మాట అనడం పరిపాటి. కాని వ్యాసునికి ముందు ఈ కవులెవరున్నారు? వాల్మీకి తప్ప. వాల్మీకిని గెలిచినట్లు రచయిత ప్రత్యేకంగా చెప్పనే చెప్పాడు. ఇంక మిగిలిన వాళ్ళెవరు?

ఆ పేజీలోనే "నేటి ప్రపంచ మందలి నవలలకును మర్మ కథలకును విరాట పర్వమే మూలము" అనడం అందం లేని అతిశయోక్తి. ఇలాంటి నిర్ణయాలు విమర్శను పలచన చేస్తాయి. అలాగే, అక్కడే, విరాట పర్వం రాసినందు వల్లనే తిక్కనకు కవిబ్రహ్మ బిరుదం వచ్చిందనడం కూడా అసంబద్ధం అవుతుంది.

263 పేజీలో కీచక వృత్తాంతం బోధించే నీతిని పేర్కొంటూ, "పతివ్రతలైన భారత నారీమణులు తమ్ముకోరు దుష్టులను సంకేత స్థలమునకు రప్పించి తమ భర్తలచేత దండితుల గావింతురనుటను కీచక వృత్తాంతము చాటు చున్నది" అన్నారు. చాలా హాస్యాస్పదమైన వాక్యధోరణి యిది. ఇది కథాసారాంశం తప్ప నీతికాదు.

263 పేజీలో విల్లి భారతంలో "ధర్మరాజాదులు వసించునట్టి దేశమున సుభిక్షము గలుగు"నని భీష్ముడు చెప్పెనని పేర్కొని, దానికి సమర్థనగా "నేడు కూడా తమిళ దేశమున విరాట పర్వపారాయణము చేత సుభిక్షము నొందుచు సుఖించు చున్నారు" అన్నారు. విరాటపర్వం చదివితే వానలు కురుస్తాయనేది ఒక విశ్వాసం. వానకోసం విరాట పర్వం చదవడం ఒక ఆచారం. అది నూటికి నూరుపాళ్ళు నిజమైనట్లు రచయిత పేర్కొనడం సహేతుకంగా లేదు.

ఇటువంటి అసంబద్ధ వాక్యాలు ఈ గ్రంథంలో చాలా ఉన్నాయి. అవి పరీక్షకు నిలవవు. పుస్తకానికి న్యూనతనుతెస్తాయి.

ఇక కథావిషయానికి వద్దాం -

(267 పేజీ) పాండవులు విరాట నగరంలో ప్రవేశించడానికి ముందు, తమ ఆయుధాలను శ్మశానంలో శమీ వృక్షంలో దాచిపెట్టి సమీపంలో ఉన్న గోప బాలురతో "ఇది మా జనని శవం. దానిని మూటగట్టి పెట్టడం మా ఆచారం. దహనం చేయ"మని చెప్పినట్లు తిక్కన రాశారు. విల్లి భారతంలో శవం విషయం లేదు. "శమీ వృక్షములు పాండవులు చూచిరి. దాని సమీపమునగల కాళికాదేవికి నమస్కారము చేసిరి. ఆ శమీ వృక్ష కోటరమున తమ ఆయుధములను దాచిరి. అజ్ఞాతవాసము పూర్తియై తరలి వచ్చు వరకు ఆయుధములను గాపాడుమని కాళికాదేవిని ప్రార్థించిరి." అని వున్నట్లు రాఘవన్ పేర్కొని, తిక్కన, విల్లి రచనలలోని తారతమ్యాల్లోని ఉచితానుచితాలను చర్చిస్తూ, విల్లి ఇట్లు మార్పు చేయుటకు హేతువేమి? విల్లికవి తిక్కన భారతములోని అనౌచిత్య పరిహారమునకై యిట్లు వ్రాసెను. పాండవులాయుధములను మూటగట్టిచెట్టుకు వ్రేలాడగట్టిరి. అది తమ జనని శవమని చెప్పిరి. ఇయ్యది యుచితమా? కుంతీదేవి బ్రతికియే యున్నది. ఆమె చచ్చినదని, ఆమె శవమిదియని చెప్పుట సముచితమా? బ్రతికిన వారిని చచ్చినదని చెప్పుట అనుచితము. అందులో తల్లి విషయమన్న మహాపాపము. కాన విల్లికవి అనౌచిత్యము పరిహరించి ఈ భాగమునకు మెఱుగులు దిద్దెను- అని తీర్మానించిరి. ఈయన ప్రకారం తిక్కన రచనలో ఔచిత్యం లేదు. దానిని విల్లి పరిహరించారు. ఈఘట్టంలో తిక్కన రచన ఆయన సొంతం కాదు. అది వ్యాస భారతంలో అలాగే వుంది. కాబట్టి ఆ సందర్భంలో అలా రాయడం ఉచితమైనా, అనుచితమైనా వ్యాసునికి చెందుతుంది తప్ప, తిక్కనకు చెందదు. (మూలాన్ని తిక్కన ఇక్కడ కొంత మార్చి రాశారు- అది వేరే విషయం) వ్యాసుడు ఎంత ఆధ్యాత్మిక వాదో అంత భౌతిక - వాస్తవికవాది. సరిగ్గా తిక్కనది ఈ తత్త్వమే. పోనీ రాఘవన్ పరిశోధన తమిళాంధ్రుల పరిశీలన కాబట్టి ఇది తిక్కన రచనే అనుకొందాం.

ఆయుధాలు మూటగట్టి, దాన్ని శవం అని, అది తమ తల్లిదని, కాల్చడం అలవాటు కాదని చెప్పడం పాపంతో కూడుకొన్న అనౌచిత్యం అని రాఘవన్ గారి అభిప్రాయం. కాని ఇక్కడ వారు పాండవులు కారు. ఆ శవం కుంతీదేవిది కాదు. వాళ్ళ పాండవులు అన్న సంగతి ఎవరికీ తెలియదు. వాళ్ళు కుంతీదేవిని దృష్టిలో పెట్టుకొని ఆ మాట చెప్పలేదు. గోప బాలురను భయపెట్టడానికి అన్నమాట అది. తెలిసే అబద్ధం చెప్పారు. అంతమాత్రం చేతఅది మహాపాపంగాని, అనౌచిత్యంగాని కాదు. తిక్కన కూడా వాళ్ళ తల్లి శవం అని చెప్పినా, తర్వాత దేవతా పితృ స్తుతి చేసినట్లు చెప్పినాడు. దేవతా ప్రార్థన వాళ్ళ వ్యక్తిగత విషయం - శవం - తల్లిది - అని చెప్పడం లోక విషయం. ఈ రెండూ ముఖ్యమైనవే ఆ సన్నివేశంలో. విల్లి లోక విషయాన్ని వదిలిపెట్టి, కేవలం

కాళికాదేవిని ప్రార్థించినట్లు చెప్పడం - అద్భుతం అవుతుంది. దేవతా ప్రార్థనే సర్వస్వం కాదు. లోకం -మానవయత్నం అన్నది కూడా ముఖ్యం. ఈ ఆధ్యాత్మిక భౌతికజీవితాల సమన్వయం వుంది తిక్కన రచనలో. అంతేగాని శవాన్ని బతికిన తల్లి అని చెప్పడం అనౌచిత్యం కాదు. విల్లి తిక్కన రచనకు పెట్టిన మెరుగు అసలే కాదు. ఈ మాట అనడానికి ముందు రచయిత దృక్పథం, సన్నివేశ తత్త్వం, శిల్పవిశిష్టతలను గమనించాలి. ఇక్కడ తిక్కన రచనను చూసి కొన్ని దక్షిణ భారత (సంస్కృత) ప్రతుల్లో తరువాతి కాలంలో శ్లోకాలు కలుపుకొన్నట్లు శ్రీ కోరాడ రామకృష్ణయ్య[1] పేర్కొనడం చూస్తే, తిక్కన రచన అనౌచిత్యం అనడం పరమ అనౌచిత్యం, అనాలోచితం అనిపిస్తుంది.

తెలుగు సాహిత్య విమర్శకుల్లో ఇటీవలి కాలం దాకా ఒక జబ్బు వుండేది. కవిత్రయం మీద పరిశోధన చేసేవాళ్ళు, వాళ్ళను పైకెత్తడానికి - మూల భారత చర్చను చేసేటప్పుడు - వ్యాసుని అకవిగా ఏ మాత్రం ఔచిత్యం తెలియని వాడిగా చిత్రించడం ఆ జబ్బు. ఒక్కొక్క అంశాన్ని తీసుకోవడం, ఇక్కడ మూలం 'ఇలా' వుంటే, తిక్కన 'ఇలా' మార్చాడు. కారణం వ్యాస రచన అసంగతంగానో, అనుచితంగానో ఉందనడం వాళ్ళ ఆనవాయితీ. కవిత్రయం వాళ్ళు వ్యాసుని కళ్ళ కద్దుకుని పూజిస్తే పరిశోధకుల దృష్టిలో మాత్రం వ్యాసుడు బుద్ధిలేని వాడయినాడు. రాఘవన్ ప్రత్యేకత ఏమంటే ఔచిత్యం తెలియని వాళ్ళ లిస్టులో వ్యాసుని ప్రక్కన తిక్కనకు కూడా పీఠం వేయడం.

రాఘవన్ మరొక అధిక్షేపం. (268 పేజీలో) సుదేష్ణ మదువును తీసుకొని రావడానికి సైరంధ్రిని పంపడం - వ్యాస తిక్కన భారతాల్లో ఉన్న ఈ సంఘటన "ఉచితముగా కనబడలే"దట. అందుని విల్లి సుదేష్ణ మరునాటి ఉదయం పూలమాలని తన తమ్ముని ఇంటిలో ఇచ్చిరమ్మని సైరంధ్రిని ఆదేశించినట్లు కల్పించడం ఉచితంగా వుందట.

అసలు ఆమాటకొస్తే, ఒకసారి సైరంధ్రిని తనకళ్ళముందు అవమానించడాన్ని చూచిన సుదేష్ణ, తర్వాత మరే పనికిగాని ఆమెను కీచకుని యింటికి పంపకూడదు. కాని మరల సైరంధ్రిని పంపడం సుదేష్ణ కావాలని చేసినపని. కారణం కీచకుని మాటకాదన లేక వాడి కండబలం మీద ఆధారపడి నడుస్తున్న రాజ్యం అది. కీచకుడే ఆ మాట సైరంధ్రితో అంటాడు. కాబట్టిసుదేష్ణ సైరంధ్రిని పంపడం ఇష్టంలేకపోయినా, పంపక తప్పలేదు. ఇక సైరంధ్రిని ఏదో ఒక సాకుతో పంపించాలి. వ్యాసుడు మధువు సాకు చెప్పాడు. తిక్కన దానిని అనుసరించాడు. విల్లి మధువు స్థానంలో మాలను వుంచాడు. కారణం సైరంధ్రి నీచపు పనులకు తాను ఒప్పుకోనని ముందే చెప్పింది. సైరంధ్రి కీచకుని యింటికి మదిరకోసం పొమ్మన్నప్పుడు కూడా సైరంధ్రి ఆ మాటను గురించి చెప్పింది. అప్పుడు తిక్కన "అనవి యనుచితంబున కనయము శంకించియును లతాంగి (సుదేష్ణ) మదిం దమ్ముని వలవంత దలచి" (విరా. 2-97) మరల సైరంధ్రిని ఒప్పించి పంపినట్లు పేర్కొన్నాడు. వ్యాస తిక్కనలు ఇక్కడ పాత్రల మధ్య సంఘర్షణను సృష్టించినారు. సుదేష్ణకు సైరంధ్రిని కీచకుని యింటికి పంపడం అనుచితమని, అపాయమని తెలుసు. కాని తన తమ్ముని బాధ చూడలేకపోతున్నది. వాడు చస్తానన్నాడు. ఇటు స్త్రీ, సేవకురాలు — అటు తమ్ముడు. సైరంధ్రిని పంపిస్తే వాడికి ఆనందం. పంపినా, వాడు ఏదైనా అఘాయిత్యానికి ప్రయత్నించినా, సైరంధ్రి తప్పించుకుని రావచ్చు. అసలు పంపకపోతే వాడు ఆత్మహత్య చేసుకొంటే అందుకు కారణం తాను కావలసి వస్తుంది గదా అని సుదేష్ణ భయం. పైగా సైరంధ్రి భర్తల చేతుల్లో వాడికి చావుతప్పదన్న విషయం ఆమెకు మనస్సులో వుంది. ఇక సైరంధ్రిని పంపినప్పుడు మధువుతేవడం- అనే నీచపుపనికి నియోగించడం అనుచితమని కదా ఆక్షేపణ. ఏనాడు అటువంటిది ఎరుగని మహారాణి - ద్రౌపదికి, ఇప్పుడు ఇటువంటి నికృష్టపు స్థితి వచ్చింది కదా అని సామాజికుడు - పాఠకుడు సానుభూతి చూపాలి. ఇట్టి పాత్రీకరణలో తిక్కన చేయి తిరిగిన తనం అనన్యం. ద్రౌపది మనకు పవిత్రమైన పాత్ర అని ఆమెను కథలో నీచపు పనులకు నియోగించ కూడదనుకోవడం అనుచితం. ఒక వ్యక్తికి కష్టం వచ్చినప్పుడు ఎదుటివాళ్ళు అప్తులైన వాళ్ళు కూడా - మన కష్టాలను ఇనుమడింప జేయడానికే తోడ్పడతారు. అలాంటి పాత్ర సుదేష్ణ-ఇదంతా మానవ స్వభావంలోని వైవిధ్యం. ఇది తెలిసిన రచయిత తిక్కన.[1, 2]

1. ఆంధ్ర భారతి కవితా విమర్శనము - 150-156. గంగాధర పబ్లికేషన్స్, విజయవాడ - 2.

1. ఈ విషయానికి కోరాడ రామకృష్ణయ్యగారి 'ఆంధ్ర భారత కవితా విమర్శన'ములో మరికొంత సమాధానం దొరుకుతుంది. పేజి : 223.

2. రాఘవన్ వాదం ఇలా వుందండి : సినీ నటులకు కొందరు అభిమానులు వుత్తరాలు రాస్తుంటారు : మీరు భిక్షగాడి వేషం, తండ్రి తాతల వేషం, అమ్మ, అమ్మమ్మల వేషాలేస్తే మేము చూడలేక పోతున్నాం. మీరు 16 ఏండ్ల యువకులుగానే నటిస్తే మాకు ఆనందం - అలా వుంది.

"ద్రౌపదీ పరాభవ ము" అనే 3వ అధ్యాయంలో విల్లి భారతాంలో సైరంధ్రిని సుదేష్ణ ప్రాధేయపడి పూలమాలను తీసుకు పొమ్మన్నట్లు చెప్పగా, తిక్కన భారతంలో సుదేష్ణ మధువు తీసి కొని రమ్మని ''రాచఠీవితో, పొగరుతో" చెప్పినదట. (294 పేజి) తిక్కన భారతాన్ని సరిగా జీర్ణించుకోకుండా అన్నమాట యిది. సుదేష్ణ పొగరు బట్టిన మాటలేవో చూపిస్తే పరిశీలించవచ్చు. ఆమె అసలు 'తృష్ణ భావించు' కొని, సైరంధ్రి లోపలికి వచ్చినట్లు చెప్పాడు తిక్కన. ఆమె చాలామర్యాదగానే చెప్పింది సైరంధ్రికి. (చూ : విరా : 2-88, 89) 'పెక్కు భంగుల ప్రార్థించి'నట్లు తిక్కన పేర్కొన్నాడు (2-100) కాబట్టి రాఘవన్ అభియోగం ని ధారం.

కీచకుడు సైరంధ్రిని విరాటుని సభకు తరుముకొని వచ్చి పడ్రతోసి తన్నినట్లు తిక్కన భారతంలో వుండగా విల్లి వ్రత చారిణి (సైరంధ్రి)కి అపాద ఘాతాలు తప్పించాడట. ఇందుకు కారణం "తమిళులకు ద్రౌపది ఉపాస్య దేవతగదా" అని రాఘవన్ సమర్థన. (302 పేజి) తమిళులకు ఆమె ఉపాస్య దేవత అయితే, తెలుగు వాళ్ళకు భోగ్యవస్తువా ? ద్రౌపదీ కీచకులు ధర్మాధర్మాలకు ప్రతినిధులు కథలో. మంచికి, చెడుకు సంఘర్షణ పరాకాష్ఠను చేరుకొంది ఆ సంఘటనలో. మంచికి కష్టాలు, చెడు దుర్మార్గాలు రెండూ చివరి అంచులకు చేరుకోవాలి. అప్పుడుకాని మంచి తిరగబడి చెడును నాశనం చెయ్యదు. ఇది కళా రహస్యం. స్త్రీని పవిత్రంగా భావించే చోటనే, కాలితో తన్నే దశ వచ్చిందంటే, పాపం పరిపక్వానికి వచ్చిందన్నమాట. ఇక ఆ పాపం బద్దలుకాక తప్పదు. అందుకే కీచక వధ జరిగింది. కాబట్టి తిక్కన రచనే వాస్తవికంగా వుంది. తమిళులకు ద్రౌపది ఒక ఉపాస్య దేవతే కావచ్చు. కీచకునకు ఒక అందమైన ఆడదే. రామస్వామి నాయకర్‌కు రామ విగ్రహం - ఉపాస్యదైవం - శత్రువు కాలేదా !

తన భార్య కీచకునితో తన కళ్ళముందే పరాభవము పొంది, ఆ రాత్రి తన దగ్గరకు వచ్చినప్పుడు "ఏమి పని మీద వచ్చావు" అని అడిగి, ఆమె ద్వారా మరలా పరాభవాన్ని చెప్పించుకోవడం (తిక్కన రచనలో) అనుచితమని రాఘవన్ అభిప్రాయం. భారతంలో చాలా మధురమైన ఘట్టం ఇది. జీవిత వాస్తవికత మూర్తి భవించిన సమయమిది. ద్రౌపది పరాభవం పొంది అక్కడికి వచ్చింది. ఆమెతోపాటు భీముడుకూడా ఆవేశంతో తందాన పలికితే సన్నివేశం రసాభాసం అవుతుంది. అక్కడ వారిద్దరూ దంపతులు. భీముడు ఎంత ఆవేశపరుడో అంత సంయమి. ఆమె ఎందుకు వచ్చిందో తెలిసే అలా అడిగాడు. ఆమెను కొంత ఏడిపించాలనే అడిగాడు. అప్పుడుగాని ఆమె కోపానికి పరిపక్వతరాదు. భీమునికి కూడా ఆమె బాధలో పాలుపంచుకోవానికి వీలుకల్గుతుంది. అందుకే సైరంధ్రిని తన బాధల నన్నింటిని వివరించిన తర్వాత తిక్కన చిత్రణ ఇలా వుంది -

> ''....తరుణుడు నళ్ళిల
> మునిగిన మోమతని వక్షమున జేర్చిన వ
> వ్వనిత యవస్థయ తెల్పుచు
> ననిల సుతుండడలె డెందమలమట బొందన్
> అట్టి యెడఁ దన్నుఁ దానయూరాల్చి కొనుచు,
> నంబు జానన నెమ్మొగమెల్ల దుడిచి
> యనునయించి తత్కారములు తన మొగంబు
> దరియ జేర్చుచు నిట్టూర్పు గాడ్పు నిగుడ
> చింతా క్రాంతుడైన కౌంతేయునకు'' ఏదో చెప్పింది.

(విరా. 2-222, 223, 224) ఓదార్పుకోసం వచ్చిన సైరంధ్రి-భార్య, తానే భీముని - భర్తను ఓదార్చవలసి వచ్చింది. ఇది దాంపత్య జీవితంలో అనుభవైక వేద్యమైన ఘట్టం. ఇక్కడ ద్రౌపది తెలుగు వాళ్ళకు ఉపాస్య దేవతగాక మరేమౌతుంది ?

ఇలాగే వున్నాయి రాఘవన్ చేసిన అభియోగాలన్నీ కూడా. చివరికి రాఘవన్ మాటలు చూడండి. "తిక్కనగారు సుమారు 400 పద్యములలో విపులముగ వర్ణించిన ఈ కథాభాగమును విల్లి 103 పద్యములలో సంగ్రహ సుందర ముగ జెప్పెను. తిక్కనలోని అనౌచిత్యములను పరిహరించి నాల్గవ వంతునకు తగ్గించె నని తమిళుల ఆశయము'' (316 పేజీ) మొత్తంమీద రాఘవన్ దృష్టిలో తిక్కన ఔచిత్యం అంటే ఏమిటో తెలియని కవి అన్నమాట. తిక్కనకే ఔచిత్యం తెలియక పోతే ఇక తెలిసిన వాడెవడో.

రాఘవన్ పుస్తకం చదివిన తర్వాత విల్లికవి చాలా 'మడి' రకంగా కనబడుతున్నాడు. ఆ 'మడి' నే రాఘవన్ ఔచిత్యంగా భావిస్తున్నాడు. తిక్కన 'మడి' రకం కాదు. వాస్తవిక వర్గానికి చెందిన కవి జీవితంలోని వాస్తవికతకు ఎక్కడా భంగం కలగకుండా రచనా శిల్పాన్ని చెక్కడం తిక్కన కళాసూత్రం.


ఇతర భాషా రచయితలను గురించి రాసేటప్పుడు రాఘవన్ లాగా రాస్తే జాతి సమన్వయం దెబ్బతింటుంది. పైగా రాఘవన్ తిక్కన మీద తెలుగులో వచ్చిన విమర్శలను చూచారా అని సందేహం - ఎక్కడా ఉదహరించలేదు కాబట్టి.

శ్రీ రాచపాళెం చంద్రశేఖరరెడ్డి

జైన క్షేత్రం గుమ్మిలేరు

అక్టోబరు "భారతి"లో "బౌద్ధ తామ్ర కరండము" అను వ్యాసములో శ్రీ మునునూరి సాంబశివరామమూర్తిగారు "దుళ్ళ", "ఏడిద" మున్నగు పరిసర గ్రామాలు ఒకనాడు బౌద్ధ వాటికలనీ, దుళ్ళలో లభించిన తామ్ర కరండము వాటి వివరాలూ తెలిపారు. చాలా సంతోషం. అయితే వారి వ్యాసంలో కేవలం బౌద్ధ విహారాలూ, శైవ తీర్థాలూ గురించి మాత్రం చెప్పారు. అదే పరిసర ప్రాంతములందు పైవాటితోపాటు అహమహమికగా పరిఢవిల్లిన జైన వైభవాన్ని గుర్తించకపోవడం చాలా విచారకరం.

అంతేగాక వారు, వ్యాసంలో మరొక పెద్ద పొరపాటు బడ్డారు. "గుమ్మిలేరు" గ్రామ సమీపమునందు (గుమ్మినేరు కాదు) సుమారు 1 ఒక మీటరు ఎత్తుగల పాషాణ బుద్ధవిగ్రహము పబ్లిక్ రోడ్డును చేరిన అధునిక కట్టడమందున్నదనీ, దీనిని గమనింప ఈ ప్రదేశమంతయూ నాడు బౌద్ధ వాటికయే యనక తప్పదనీ విషయ పరిశీలన చేయకయే తొందర బడ్డారు.



వారు పేర్కొన్న విగ్రహము, బుద్ధ విగ్రహము కాదు అది జైనవిగ్రహము. జైనుల ద్వివిధ కాలములలో మొదటిదైన "ఉత్సర్పిణీ" కాలమున, నాభి మహారాజు మన్వంతరంలోని 23 మంది తీర్థంకరులలో 22వ వాడైన "పార్శ్వనాథు"నిది. ఈ విగ్రహము మా మండపేట గ్రామమునకు (తూ॥ గో॥ జిల్లా) 2 కి॥మీ దూరంలో నున్న గుమ్మిలేరు గ్రామ సరిహద్దులో పంట కాలువ వెడల్పుచేయు సందర్భమున 8 సం॥ల క్రిందట లభించినది. అక్కడి స్థానిక రైతులు దానిని రోడ్డువారనే భద్రము చేసిరి. ఈ విషయము కర్ణాకర్ణి విని రాజమండ్రి జైన మహాసంఘము వారు వచ్చి పరిశీలించి అది పార్శ్వనాథునిగా గుర్తించారు. ఇది జైనులకు అపురూపమైన శిల్పం. ఇక్కడ నుండి తరలించుటకు ప్రయత్నము చేయగా, స్థానికులు అంగీకరించలేదు. అక్కడ అనే శిల్ప మునుంచి స్థానిక రైతులు, జైనులు కలిసి మందిరం నిర్మించారు.

ఈ శిల్పవిశిష్టత గూర్చి ప్రముఖ జైన చారిత్రిక పరిశోధకులు డా॥ జి. జవహర్‌లాల్, 3.4.1981న నాకు లేఖ వ్రాస్తూ ఇలా పేర్కొన్నారు. "..........వక్షస్థలంపై డైమండ్ చుక్క ఉన్నదని తెలిపారు. దీనిని 'శ్రీ వాత్సవ' గుర్తు అంటారు. ఆంధ్రలో లభ్యమైన జిన ప్రతిమలలో ఈ గుర్తున్నవి చాలా అరుదు. అందుచే చారిత్రికులు ఈ శ్రీ వాత్సవ గుర్తు ఉత్తర భారత జిన ప్రతిమలకే పరిమితమైనదని వ్రాసిరి. ఇటీవల దొరికిన వాటిలో ఈ గుర్తు కాన్పిస్తుంది ...."

ఈ లేఖలోని విషయంవల్ల విగ్రహం గూర్చి సంపూర్ణ అవగాహన ఏర్పడుతుంది. ఈ విగ్రహం యొక్క ఫొటో కూడా పంపిస్తున్నాను. పరిశీలించగలరు. ప్రతీవారం ఇక్కడకు జైనులు వచ్చి పార్శ్వనాధుని సేవించి వెళతూ ఉంటారు. విగ్రహానికి వస్త్రము లేకుండునట్లు నిర్మించుటచే దిగంబర జైనశాఖగా భావించవచ్చు. ఈ జిన ప్రతిమ లభించిన కారణాన నాడు ఇది జైనక్షేత్రమై యుండుననుకొనుట సుసంగతమే. ఇంకనూ ఏ జినావశేషములు కాలపురుషుని, కరకు కాలి ఘట్టనమునకు ఈ ధరిత్రి యందు అణగారినవో. జిన తీర్థంకర ప్రతిమలను గుర్తించుటకు వీలుగా పూర్వ జైన లాక్షణికులు కొన్ని చిహ్నములు ఏర్పరిచినట్లు శ్రీ జవహర్ లాల్ తెలిపి యున్నారు. ఈ విషయమై ఆంధ్రపత్రిక దుర్మతి నామ సం॥ పంచాంగమునందు ఒక వ్యాసమును కూడా వారే రచించి యున్నారు. ఇందలి విషయమును సహృదయంతో స్వీకరిస్తారని భావిస్తాను.

శ్రీ మేడవరపు సంపత్‌కుమార్

హిరణ్య హరిణం : ఒక పరిశీలన

"జగమే మారెనుగా ఈవేళ" అని ఊహాగానం చేసి, ఆరు నెలలు తిరగకముందే "వర్తమానం ఒక మోడు మ్రోక" అని విస్పష్టంగా ప్రకటించటం స్వీయాత్మక భావవాది అయిన శ్రీ సోమసుందర్‌కే చెల్లునని తోస్తుంది.

ఆయన "ఆగామి శతాబ్దానికి సాహిత్య పురోగమనం" అనే శీర్షిక క్రింద 'భారతి' (మార్చి, 82) లో ఒక వ్యాసం వ్రాస్తూ, "సామాజికంగా, వైయక్తికంగా మన కళ్ళముందే ఎంతో వేగంగా నిరంతర పరిణామాలు జరిగిపోతున్నాయి" అని వర్తమాన వ్యవస్థ పట్ల పూర్తి సంతృప్తిని వెల్లడించినారు. కాని ఆరునెలలు తిరగక ముందే "హిరణ్య హరిణం" అనే శీర్షిక క్రింద అదే పత్రిక (ఆగస్టు, 82)లో ఒక గేయం వ్రాస్తూ, "వర్తమానం ఒక మోడు మ్రోక" అని విస్పష్టంగా ప్రకటించినారు. కవి అప్పుడు దక్షిణ ధ్రువానికి యాత్ర చేస్తే, ఇప్పుడు ఉత్తర ధ్రువానికి యాత్ర చేసినారు. దీనికంతటికీ స్వీయాత్మక భావవాద ధోరణి కారణం అని చెప్పవలసి ఉంది.

"హిరణ్య హరిణం" గేయాన్ని బట్టి శ్రీ సోమసుందర్ "తెలుగునేల వేల్పుగామాటవులు" తిరిగినారట. అవి "పురాతన కంటక పూరితాలు"గా, "పరిత్రాణా లెరుగని బాటలు"గా అగపించినాయట. "పల్లె మొగాల ఏ బాసి పసులు కురిగి పంట నవ్వులు వెలిగించే వాన కానరాద"ని కవి దుఃఖించినారు. వాస్తవ పరిస్థితిని ఆయన కొంత వరకైనా గ్రహించినందుకు సంతోషమే. కాని "మన కళ్ళముందే ఎంతో వేగంగా" జరిగిన సామాజిక పరమైన మార్పులు ఆరునెలలు తిరగకముందే ఎట్లు అదృశ్యం అయినాయి? ఆయనకు "వర్తమానం ఒక మోడు మ్రోక"గా ఎట్లు అగుపించింది. కవి అప్పుడూ, ఇప్పుడూ భావవాద ధోరణితో కూడిన ఉందుకుకు తనాన్నే వెల్లడించినారు. ఇది పాఠకులను గందరగోళం పరచటం కాదా?

"వైయక్తికంగానూ" "నిరంతర పరిణామాలు జరిగిపోతున్న"ట్లు కవి తన వ్యాసంలో పేర్కొన్నారు. వైయక్తిక "పరిణామం" అంటే అర్థం ఏమిటి? ఆయన "మానవ పరిణామ సిద్ధాంతం" (థియరీ ఆఫ్ హ్యూమన్ ఎవల్యూషన్" గురించి మాట్లాడినారా? నేటి సమాజంలో మనుష్యులకు ఉన్న తోకలు పొట్టిగా అయినాయా? లేని తోకలు మొలిచినాయా? అని అడుగవలసి వస్తుంది. శ్రీ సోమసుందర్ రచనలో ఇదొక పెద్ద వైరుధ్యం. "పరిణామం" అంటే "అభివృద్ధి" (డెవలప్‌మెంట్) అని ఆయన అభిప్రాయం కాబోలు. సామాజికాభివృద్ధిలో వైయక్తికాభివృద్ధి కూడ భాగమే కదా! ఇప్పుడు శ్రీ సోమసుందర్ వశం తప్పిన "అభివృద్ధి" ఏదో సెలవిస్తారా?

శ్రీ సోమసుందర్ సామ్యవాద ప్రభంజనం భారతదేశం వైపు వీచిన కొత్తలో పుట్టినారు. ఆ కాలంలో "అగ్ని పర్వతం-భుగభుగలు" అనే శీర్షిక క్రింద "ఆనందవాణి" (ఏప్రిల్, 49) లో ఒక కథ వ్రాస్తూ, "అరేపు వస్తుంది"తో దానిని ముగించినారు. నాటినుండి మొన్నటిదాకా ఆయన ఆశావాదిగానే కనబడతారు. "ఆగామి శతాబ్దానికి సాహిత్య పురోగమనం" వ్యాసం (భారతి, మార్చి, 82)లో డి. హెచ్. లారెన్స్ నిరాశావాదాన్ని (సాహితీ రంగంలో) ఖండించినారు. "ఆగామి నవశతాబ్దారంభానికైనా ఏదో ఒక కల కూజితం అమృత విహంగమై సాక్షాత్కరింప వలసే వుంది" అన్నారు. కాని ఆరునెలలు తిరుగకముందే అకస్మాత్తుగా మారిపోయి, నేడు అత్యంత నిరాశావాదిగా సాక్షాత్కరిస్తున్నారు. దీనికి ప్రధాన కారణం ఆయన మాటలలోనే 'అరుణోదయం' కానరాకపోవటం.

"అరుణోదయం తప్పక పొడుస్తుందనీ, తరుణ హృదయంతో చేతులు చాపుతుందనీ," "నవజీవన క్రాంతి కూరుస్తుందని" ఆయన "మూడు దశాబ్దాలుగా నిరీక్షించా"రట. కాదు, ఆయన ఇట్లు నిరీక్షించబట్టి వాస్తవంలో మూడు దశాబ్దాలపైన, మూడేండ్లు అయింది. తాను "విన్నదంతా నమ్మి", ఆ గమ్యం - అలనాటి "అమృత గమ్యం" (వజ్రాయుధం) కనుచూపు మేరలోనైనా కానరాకపోయే సరికి, హతాశులైనారు. "అరుణోదయం"తో వర్గ శత్రుత్వం మాత్రమే అదృశ్యం అవుతుంది. ఆ వ్యవస్థలో కూడ వర్గ వైరుధ్యాలు నిలిచే ఉంటాయని, "అరుణోదయం" జరిగిన ఉత్తర క్షణంలోనే ఏ దేశమూ "అమృతగమ్యం" చేరుకొనలేదని శ్రీ సోమసుందర్ గ్రహించవలసి ఉంది. ఈ వాస్తవాన్ని తెలిసికొనకుండా, "విన్నదంతా నమ్మి" తాను ఏదో చెడిపోయినట్లు చింతించటం ఏల?

ఈ సుదీర్ఘకాలం అంతటా శ్రీ సోమసుందర్ ప్రేక్షకుడుగా ఉండిపోయినారని "విన్నదంతా నమ్మి" అనే మాటనుబట్టి తెలుస్తుంది. "మన కళ్ళముందే ఎంతో వేగంగా నిరంతర పరిణామాలు జరిగిపోతూ" ఉండటంకూడ కవి ప్రేక్షక స్థానంలో నిలబడటానికి కారణం అయింది కాబోలు. "మన కళ్ళముందే ఎంతో వేగంగా నిరంతర పరిణామాలు" జరిగిపోతూ ఉంటే, మరి, "అరుణోదయం" ఏల? "నవజీవన క్రాంతి" ఏల? "అమృతగమ్యం" ఏల? వర్తమాన వ్యవస్థతోనే- ఎంతో వేగంగా పరిణామాలు జరిగే

ఈ వ్యవస్థతోనే ఆయన సంతృప్తి పడరాదా? కాని ఆయన ఆ విధంగా సంతృప్తి పడటం లేదు. అది అట్లు ఉండనియ్యండి.

ఇప్పుడు మనం శ్రీ సోమసుందర్ కవిత్వం గూర్చి మాట్లాడుకొందాం. ఆయన నూనూగు మీసాల నూత్నయవ్వనంలోనే కవిగా గొప్ప కీర్తిని గడించినారు.' 'కళలూ-భాషలూ' అనే శీర్షిక క్రింద 'రాంషా' 'ఆనందవాణి' వారపత్రిక (1949)లో ఒక వ్యాసం వ్రాస్తూ, 'ఆంధ్ర సాహిత్య రంగంలో తమతమపాత్రల్ని అతి నైపుణ్యంతో నిర్వహించి కొత్త అధ్యాయాన్ని సృజించిన' అరుగురిని పేర్కొన్నారు. వారిలో శ్రీ సోమసుందర్ ఒకరు అని పాఠకులు గుర్తు పెట్టుకొనటం అవసరం. ఏ జగన్నాటక సూత్రధారుడో ఈ ఆరుగురు కవులనూ ఆంధ్ర దేశానికి పంపినాడా అన్నట్లు, వీరి నాయకత్వాన 'తెలుగు కవిత్వం నలబైల్లో విపరీతమైన అభివృద్ధి పొందింద'ని ఆ వ్యాసకర్త తెలిపినారు. ఇట్లు 'విపరీతమైన అభివృద్ధి' పొందిన నాటి 'ఆంధ్ర కవిత్వాన్ని చూసి మేధావులు మెటికలు విరిచినార'ట! 'సామాన్యులు తెల్ల తెల్లబోయి' నారట! ఈ కీర్తి కౌముది తెలుగుదేశం దశ దిశలా వ్యాపించింది. పద్దెదు ఏండ్ల తర్వాత 'కునుకు తున్న సప్తర్షి మండలం' అనే శీర్షిక క్రింద 'హిమాంశం' సాహిత్య త్రైమాసిక పత్రిక 'నవత' (తృతీయ సంచిక - 1964)లో ఒక గేయం వ్రాస్తూ, శ్రీ సోమసుందర్‌ను 'సప్తర్షి మండలం'లోనికి ఎక్కించి, తన 'బాధ్యత'ను నెరవేర్చినారు. ఇది రాష్ట్రపతి పదవికంటే ఉన్నతమైన పదవి. 'హిమాంశు' ఈ ఏడుగురు కవుల 'నిస్తబ్దత'ను మాత్రమే హేళన చేసినారుగాని, వీరి ప్రతిభావ్యుత్పత్తుల జోలికి పోయినవారు కారు. ఇట్లు గత కాలం అంతా నిర్మాణాత్మక విమర్శ - ఆత్మ విమర్శ లేక, స్తోత్ర పాఠాలతోనే గడిచిపోయింది. శ్రీ సోమసుందర్ 'సప్తర్షి మండలం'లో శాశ్వత స్థానం సంపాదించి, ప్రేక్షకుడుగానే ఉండిపోయినారని చెప్పవలసి ఉంది.

శ్రీ సోమసుందర్ స్వీయాత్మక భావవాది అనటానికి అనేక దృష్టాంతలు ఇయ్యవచ్చు. భూమికి చలనం ఉందిగాని "సప్తర్షి మండలాని"కి లేదు. అందువల్ల అది "కునుక" నేరదు అని ఋజువు చేయటానికా అన్నట్లు శ్రీ సోమసుందర్ కార్యరంగంలోనికి దూకినారు. దాని ఫలితమే "ఆగామి శతాబ్దానికి సాహిత్య పురోగమనం" వ్యాసం. కొందరు రచయితలు ఏటేటా 'ఉగాది' శుభాకాంక్షలు తెలుపుతూ ఉంటే, శ్రీ సోమసుందర్ ఆగామి శతాబ్దానికి - మనం దాటి పోవలసిన ఉగాదులు ఇంకా పద్దెనిమిది ఉండగానే - శుభాకాంక్షలు తెలిపినారు. "రెండు దశాబ్దాల లోపుగా మునిగి పోతున్న ఈశతాబ్దపు చరమ సంధ్యలో" మనం ఉన్నాం అని కల్పాంత సమయంలో బ్రహ్మదేవుని వలె మనకు గుర్తు చేసినారు. పునఃసృష్టి తర్వాత - "ఆగామి నవశతాబ్దారంభానికైనా ఏదో ఒక కల కూజితం అమృత విహంగమై సాక్షాత్కరించవలసే వుంది" అన్నారు. ఆయన ఏదైనా కలగన్నారా? ఆయన భావాలు ఎంత సుకుమార సుందరాలు!

"హిరణ్య హరిణం" గేయంలో సైతం ఇదే భావవాద ధోరణి వెల్లడించినారు. తన "మనో చాంచల్యాన్నీ, హృదయ సౌందర్యాన్నీ కలిపి" శిల్పీకరించినదే "హిరణ్య హరిణం" అట! తాను "మానవతా లాలిత్యాల మధుకోశాల కోసం, ప్రేమామృత సురధునుల రుచిర-తరంగాలకోసం వెదికే కన్నులతో" ఇంత కాలం సాగిపోయినారట. "అరుణోదయా" నంతరంఏర్పడే వ్యవస్థకు ఇవి ప్రధాన లక్ష్యాలుగా ఉంటాయి. జరిగిన ఉత్తర క్షణంలో సైతం ఇవి సాధ్యమేనని కవి భావించినారా? మరి ఇవే సన్నివేశాలు ఎదురైనప్పుడు కవి వైరాగ్యం చూపినారు, ఏలనో? "అనురాగ కుసుమాల మాలలల్లి మధుమాసాల అతిథి దేవునికోసం" ఎదురుచూచేవారు ఎవరై ఉంటారు? "రస హృదయినులు" అని కవి స్వయంగా సమాధానం ఇచ్చినారు. వారు "తల వాకిట నిలిచి దిక్కులు వెదకు" తున్నారట. వారివి "మధురాకృతులు" అని కూడ కవి వర్ణించినారు. అట్టి తరుణంలో వారి గడపవద్ద అడుగు పెట్టిన పురుషుడు (కవి) ఎట్టివాడై ఉండవలెను? "పదు మాస హాసాలు" కలవాడై ఉండవలెను. వరూధిని ముందు ప్రవరునివలె ప్రవర్తింపరాదదు. కాని "మధుమాసోహాసాలు" గల పురుషుడు (కవి) "రసహృదయినుల" కు "నమస్కరించి" నాడట! నడిమి వయస్సులో ఉన్న పురుషుడు (కవి) అంత కంటె ఏమి చేస్తాడు అని అడుగవచ్చు. నడిమి వయస్సుగల పురుషులందరూ జితేంద్రియులు కాగలరేమో తెలియదు. మరి, జితేంద్రియుడు అయిన పురుషుడు (కవి) "రసహృదయినుల" గడప వద్ద అడుగు పెట్టవలసిన పని ఏమి? అంతేకాదు: "అనురాగధారలకోసం నిరీక్షించే అరుణాధర కోమలాంగులను" కవి - "అనురాగధారల"ను కురిపించగల పురుషుడు - "ఆశీర్వదించి" నాడట! "అనురాగ ధారలను" ఒలికించ గలవాడే "అరుణాధర కోమలాంగుల" గడప త్రొక్కవలెను. జితేంద్రియుడనని చెప్పికొంటూ, ఆ ప్రదేశంలో ఏల సంచరించవలెను? "ఆశీర్వాదాల"కు పాత్రలు ఆ "అరుణాధర కోమలాంగులే" నా? "నమస్కారాని"కి పాత్రలు ఆ "రస హృదయినులే" నా?

శ్రీ సోమసుందర్ ఇట్టి అసహజమైన, పరస్పర విరుద్ధమైన భావాలతో "హిరణ్య హరిణం" రచించినారు. "అరుణోదయా" నంతర వ్యవస్థలో ఇట్టి సన్నివేశాల కోసరం, జితేంద్రియుడుగా మారిన ఆయన ఎదురు చూస్తున్నారా? వాస్తవంలో అట్టి నూతన

వ్యవస్థలో ఇంద్రియ లోలురకూ, జితేంద్రియులకూ – ఉభయులకూ స్థానం ఉండదు. శ్రీ సోమసుందర్ చెప్పినట్లు ఆ వ్యవస్థలో "పల్లె మొగాల ఏబ్రాసి పుసులు'' కడగటం, దరిద్రుల "మలినాశ్రువులు'' తుడుపటం కద్దు.

శ్రీ సోమసుందర్ నేటి రచయితలకు శాస్త్రీయ దృక్పథం, లోపించిందని 'ఆగామి శతాబ్దానికి సాహిత్య పురోగమనం' వ్యాసంలో ఎట్టి ఉదాహరణలు ఇయ్యకుండానే విమర్శించినారు; కాని తన రచనల ద్వారా ఎట్టి ఆదర్శాన్నీ స్థాపించటం లేదని ఆయన తెలిసికొనవలసింది ఇంకా ఎంతో ఉందని స్పష్టంకాగలదు. శ్రీ సోమసుందర్ ఏ జైనతీర్థం కరుడో అయిపోయి, 'గత జన్మల అవిచ్ఛిన్న చిహ్నాల కోసం గాలించారట – వెర్రిగా (హిరణ్య హరిణం). ఆయన ఇంక పునర్జన్మల "అవిచ్ఛిన్న చిహ్నాలకోసం'' నిరీక్షించటం మిగిలి ఉంది అనిపిస్తుంది. ఆయన తన వ్యాసంలో ఆధునిక రచయితలలో 'మూఢ విశ్వాసాలు శేష ప్రశ్నలుగా మిగిలి పోవటం మిక్కిలి శోచనీయమే కాగలదు' అని సెలవియ్యటం ఎంత హాస్యాస్పదం!

సెలయేళ్ళకు గమ్యస్థానం సముద్రం. అవి సముద్రం చేరే వరకు అన్ని అవాంతరాలనూ తట్టుకొని ఉత్సాహంతో పరుగిడుతూనే ఉంటాయి. నిజమే, శ్రీ సోమసుందర్ చెప్పినట్లు, అవి 'అలసి సొమ్మసిల్లినా పాడటం, పారటం' తప్పవు. ఇంత ఉత్సాహంతో ఉరకలు పెడుతున్న సెలయేళ్ళను కవి, 'నిరుపేద సెలయేళ్లు' అన్నాడు (హిరణ్య హరిణం). సూర్యుడు వెలుగును చిమ్ముతాడు. అతడు కనబడకపోవటమే చీకటి. చీకటిని చిమ్మటానికి ప్రత్యేకం ఏ తంతూ అక్కరలేదు. 'అరుణోదయం' కోసరం కవి నిరీక్షించటంలో అసహజత్వం ఏమీలేదు. కాని 'కారడవులు చిమ్మ చీకట్లను చిమ్ము' తాయా? అరుణోదయం 'పొడుస్తుందా?' 'పొడుపు'అన్నా, 'ఉదయం' అన్నా ఒకటే గదా?

శ్రీ సోమసుందర్ 'వజ్రాయుధం' రచించిన కాలంలో శిల్పం 'తక్కువైంద'ని విమర్శలు వచ్చినట్లు 'రాంష' వ్యాసం 'కళలూ – భాషలూ' (ఆనందవాణి-1949) వెల్లడిస్తుంది. కాని శిల్పం పేరిట, నాడు అర్థంలేని తెలుగు సమాసాలను కూర్చితే, నేడు అర్థంలేని సంస్కృత సమాసాలను సంఘటిస్తున్నారు. 'భగత్సింగు' (వజ్రాయుధం) గేయం పరిశీలించండి. ఆ శీర్షిక తొలగించి, గలత్సింగు అని పెట్టినా, ఆ శిల్పం, ఆ భావాలు అతనికి కూడ అన్వయిస్తాయి. 'భగత్సింగు'కు ఆ గేయంలో ప్రత్యేకత ఏమీ లేదు. 'కోటి కోట్ల తారలు! బారులు తీసిన తారలు....'లో భగత్సింగు కూడ ఒకరని చెప్పి, ఆ వెంటనే 'ఒక వీరుడు .... ఒక తారక .... ఒకటే కాంతిరేఖ!' అన్నారు. కోటి కోట్ల వీరులలో భగత్సింగు ఒకరైతే, ఆయననే ఎందుకు చంపవలెను? దీనికి సమాధానం లేదు. భగత్సింగును 'ఏదో' చీకటి చంపిందట, 'ఏదో' పిశాచి పీక నులిమిందట. ఇది కవిత్వమా? పదాడంబరమా? మరల 'చీకటి పిశాచి వచ్చెను, తాటకివలె, పూతనవలె, మేరువుగా శవం పడెను' అన్నారు. భగత్సింగును శ్రీరామునితో, శ్రీ కృష్ణునితో పోల్చినారు. తాటకను, పూతనను చంపినవాడు బ్రదికి ఉండవలెను గదా! ఆయన నేడులేడు. ఆయన కీర్తికాయం మాత్రమే ఉంది. కవి బ్రిటిష్ ప్రభుత్వాన్ని తెరలోనికిపంపి, దానికి మాఱుగా 'చీకటి'ని. 'పిశాచి'ని, 'తాటక'ను, 'పూతన'ను తెరమీదికి తెచ్చినారు. 'వజ్రాయుధం'లో శిల్పం 'తక్కువైంద'ని విమర్శలు వచ్చినాయట. 'చీకటి కడుపున చిల్లులు, చీకటి గుండెకు తూటులు'— ఇది ఏమి 'తక్కువ' శిల్పమా? తారలు స్వయంప్రభ కలవి. ఆకసం అనే తెరపై నిత్యమూ వెలుగుతాయి. దీనిలో వింతఏమి? ఇది తెరకు చిల్లులు, తూట్లు పడటాన్ని సూచిస్తుందా? కోటి కోట్ల తారలలో భగత్సింగు ఒకరు ఎట్లు అవుతారు? ఆయన విశిష్టత పాఠకునికి స్ఫురిస్తుందా? వాస్తవంలో ఆయనను చండభానునితో పోల్చవలసి ఉంది. 'తొలితారక' అని మరల ఉపమానం మార్చినారు. 'తొలి తారక తేజం' 'లోకం ముంచెత్తు'తుందా? 'అంతలోనె ఆకాశం అరుణోదయమై వెలిగెను' అని కవి సంతృప్తిచెందినారు. అరుణోదయానికి కారణం సూర్యుడు కాదా? ఇట్లు 'భగత్సింగు'గేయంలో ఒక భావానికి, ఇంకొక భావానికి సమన్వయమే కుదురదు. కాని, నాడు వచ్చిన విమర్శ శిల్పం 'తక్కువైంద'ని మాత్రమే.

శ్రీ సోమసుందర్ నేడు శైలి పేరిట, శిల్పం పేరిట 'హిరణ్య హరిణం'లో కూర్చిన సంస్కృత సమాసాలలో అత్యధిక భాగం అర్థరహితమైనవి. 'సునిశిత నేత్రాల సుదృఢగాత్రం' అంటే పాఠకుని ఊహకు అందగలదా? 'మలినాశ్రుకాలుష్యాలు'లో మాలిన్యానికీ, కాలుష్యానికీ అర్థభేదం ఉందా?

కవి తన 'చిరవాంఛిత గమ్యం' —'అరుణోదయం' కానరాలేదని, అది తన 'దృక్కేంద్రాన్ని దాటిపోతున్నది' అని 'హిరణ్య హరిణం'లో పూర్తిగా నిరాశ చెందినారు. ఆయన నేటి వ్యవస్థతో సంతృప్తి చెందటం లేదని కూడ తెలుస్తుంది. 'వర్తమానం ఒక మోడుమ్రోక' అని చెప్పిఉండటమే దీనికి దృష్టాంతం. కాని మఱొక ఆరు నెలలు గడిచిన తర్వాత 'మన కళ్ళ ముందే ఎంతో వేగంగా' మార్పులు జరిగిపోతున్నాయని దండోరా వేసి, ఆయన తన పాఠకులను మభ్యపెట్టే అవకాశం కూడా ఉంచుకొన్నారు. ఆయన వర్తమాన వ్యవస్థతో రాజీపడటానికైనా సిద్ధపడవలెను! లేదా నూతన వ్యవస్థకోసరం జరిగే కృషిలో సక్రి

యాత్మకంగా అయినా సహకరించవలెను. ఎప్పటివలె "నిరీక్షించటం"తో ప్రయోజనం లేదు.

శ్రీ సోమసుందర్ వర్తమాన వ్యవస్థలో "రసహృదయులు"కు ఒక వైపున "నమస్కరిస్తు"న్నారు. "పల్లె మొగాల ఏబ్రాసి, పుసులు" ఇంకొక వైపున "కటుగ" జూస్తున్నారు. "అరుణాధర కోమలాంగుల"లను ఒక వైపున "ఆశీర్వదిస్తు"న్నారు;–దరిద్రుల "మలినాశ్రువుల"ను ఇంకొక వైపున "తుడువ" జూస్తున్నారు. ఆయన తెలుగు దేశాన్ని కమ్యూనిజంగా మార్చజూస్తున్నారా? ఆయన తాను చెప్పినవన్నీ నిజమేనని నమ్మ బలుకుతున్నారు. ఈ సందర్భంలో ఆయన ప్రవేశ పెట్టిన "హిరణ్య హరిణం" అలనాడు సీతారామలక్ష్మణుల పర్ణశాల ముందు సంచరించిన "మాయామృగం" కాదు గదా! అనుమానం ఎందుకు అంటే ఆయనది ఒక రహస్య భాష: "ఉప్పెన"కు మారుపేరు "పరిణామం". "పరిణామా" నికి అర్థం "అభివృద్ధి". "హిరణ్య హరిణం" కూడ ఇట్టి శిక్షణలో పెరిగింది. దీనికే అనుమానం. అంతకంటే మరేమీ లేదు.

"రెడ్డి"

లేఖలు

మనవి

"ప్రబంధ పరమేశ్వర" బిరుదాంకితుడును, కవిత్రయంలో ఒకడగు ఎఱ్ఱన మహాకవి పాదధూళిచే పునీతమైంది ప్రకాశం మండలం. దాని కేంద్రమగు ఒంగోలు పట్టణంలో, ఈ కవి చేసిన సాహిత్య సేవకు స్మృతి చిహ్నంగా వారి పేర "ఎఱ్ఱన పీఠము" స్థాపింపబడినది.

ఎఱ్ఱన జయంత్యుత్సవములు డిశంబరు 24, 25, 26 తేదీలలో జరపాలని కార్యవర్గం నిర్ణయించింది. ఆ సందర్భంగా, ఈ సంవత్సరం "ఎఱ్ఱన ప్రబంధ పరమేశ్వరుడు–బిరుదౌచిత్యము" అను అంశము పరిశోధనకై ఈ పీఠము వారు నిర్ణయించిరి. ఈ పరిశోధన వ్యాసము సుమారు 120 ఫుల్‌స్కేప్ పుటలు కలిగియుండవలెను. ఉత్తమ వ్యాసకర్తను రూ. 3000/–లతో సత్కరించాలని ఈ పీఠ ప్రధానాశయము. కవి పండిత విమర్శకాగ్రేసరులు, తమ పరిశోధనా వ్యాసాన్ని 15-11-'82లోగ (మూడుప్రతులు) ఈ పీఠమునకు పంపి, విజేతలై, సత్కారమును అందుకొన ప్రార్థన.

జయంత్యుత్సవ సందర్భంగా వెలువడు ప్రత్యేక సంచికకు విమర్శకులు ఎఱ్ఱన సాహిత్యముపై వ్యాసములు కూడ పంప కోరిక.

డాక్టర్ అకొండి విశ్వనాథం
కార్యదర్శి, ఎఱ్ఱన పీఠము,
జిల్లా పరిషత్ కార్యాలయము, ఒంగోలు – 523 001.

కవితల పోటీ

గతములో సుమారు వందమంది కవుల యొక్క కవితలతో అరుపులు అనే కవితా సంకలనము వెలువరించిన క్రాంతి కళానికేతన్ వారు రెండవ ప్రయత్నంగా కవితలు పోటీ జరిపేందుకు నిర్ణయము తీసుకున్నారు. ఈ కవితల పోటీలో మూడు బహుమతులు ఉంటాయి. బహుమతులు గెలుపొందిన వారికి క్రాంతి కళానికేతన్ వారు ప్రత్యేకముగా తయారు చేయించిన మెమెంటోలు ఇవ్వడము జరుగుతుంది. కాబట్టి కవులు, కవయిత్రులు పదిహైనులు మించకుండా మినీ కవితలూ వీలైనంత త్వరగా పంపించి మా ద్వితీయ ప్రయత్నాన్ని జయప్రదము చేయగలరని కోరుతున్నాము.

మీ కవితలు ఈ అడ్రసునకు పంపవలెను :

వి. వి. డి. రమేష్, క్రాంతి కళానికేతన్,
గాంధీనగరము, యలమంచిలి – 531 055
విశాఖ జిల్లా.

విజ్ఞప్తి

నేను "ఉత్తరాంధ్ర స్వాతంత్ర్య సమరయోధుల జీవిత చరిత్ర" అను పుస్తకం వ్రాయుచున్నాను. వీలును బట్టి యిప్పటికే చాలా విషయసేకరణ చేయగలిగాను. చేయవలసింది ఇంకా ఉన్నది. అవకాశమున్న స్వాతంత్ర్య సమరయోధులు తమ జీవితచరిత్రను వ్రాసి ఈ క్రింది చిరునామాకు పంపించి నా ప్రయత్నం విజయవంతంచేయ ప్రార్థన. దీనిని తమ సహచరులకుకూడ చూపించ ప్రార్థన.

రచయిత చిరునామా: –

రామించెట్టి వెంకటరావు
శ్రీ వాణీనిలయం,
ఇలిసిపురం వీధి, శ్రీకాకుళం – 532 001.

గ్రంథ విమర్శలు

వేణుస్వరాలు

[విట్టు వేణుగోపాల్. వెల : రు. 6.00 లు. ప్రతులకు : శ్రీ వేంకటేశ్వర జనరల్ అండ్ బుక్ సెల్లర్స్, నాగర్‌కర్నూలు-509 09, మహబూబ్ నగర్ జిల్లా]

ఈ సంకలనంలో వచన గేయాలు అధికభాగము, కందం, తేటగీతి మొదలైన పద్యాలు అల్పంగానూ ఉన్నాయి. ఈ తరం కవులుకూడా వచన గేయంతో పాటు పద్యరచన కూడా చెయ్యగలరని నిరూపించడానికేమో అన్నట్లుగా సంకలనం చివర ఈ పద్యాలున్నాయి.

సంఘంలో ఉన్న అసమానతలు, సమాజంలో ప్రతిరోజూ జరుగుతున్న అన్యాయాలూ, అక్రమాలూ, కొద్దిమంది సుఖపడటం, చాలామంది కష్టపడటం, అల్పసంఖ్యాకులు ఆనందాన్ని అనుభవించటం, అధిక సంఖ్యాకులు దుఃఖాన్ని భరించటం మొదలైన అంశాలన్నీ ఆయన కవితకు పద చిత్రాలయ్యాయి. కనుకనే కవి తన కవితా ధ్యేయాన్ని ఈ విధంగా చెబుతున్నాడు.

"నా గీతం చెమటోడ్చే శ్రామికుల
ఘర్మజలాల విలువలు చిత్రించాలి
నా గీతం ధనమదాంధ
మత్త గజాలను మేపే
దీన జనుల పాలిటి
క్రాంతి మార్గం కావాలి
నా గీతం దానిసత్వపు
బందిఖానాను బద్దలు చెయ్యాలి"

కవి ఇలా ఆశించడం దోషంకాదు కాని అక్షరానికి అమోఘమైన శక్తి రావటానికి అప్రతిహతమైన ప్రతిభ అవసరం. అట్టి ప్రతిభతో ముందు ముందు వేణుగోపాల్‌గారు ఇంకా మంచి కవిత్వాన్ని అందివ్వాలి.

చలంగారి శ్రీశ్రీ

[సలాం. వెల : రు.20.00 లు. ప్రతులకు : షేక్ సిలార్ సాహెబ్, కేరాఫ్ వేంకట రమణ బుక్‌హవుస్, మాచెర్ల-522426 గుంటూరుజిల్లా, ఎ. పి.]

ఈ పుస్తకానికి 'చలంగారి శ్రీశ్రీ' అని పేరు పెట్టడంలో ఔచిత్యం ఎంత మాత్రం లేదు. రచయిత సలాం గారికి అనేక జీవన సిద్ధాంతాల అవలోకన గట్టిగా ఉంది. ఇందులో వారు శ్రీశ్రీ కవిత్వాన్ని గురించి చేసిన విశ్లేషణ చాలా అల్పం, సిద్ధాంతాల వివరణ అధికం. వారు అనేక ఉద్గ్రంథాలు చదివినట్లుగా ఈ పుస్తకం సాక్ష్యం చెబుతోంది. శ్రీశ్రీ కవిత్వాన్ని ఎప్రిషియేట్ చెయ్యాలనే వారి కోరిక మెచ్చదగినది. వారి కృషి లోపభూయిష్టమైందని చెప్పటానికి విచారిస్తున్నాను. ఈ పుస్తకానికి ఇంత ఖరీదు పెట్టడం ఆశ్చర్యకరమైన విషయం. పుస్తకం నిండా, ప్రతి పేజీలోనూ అచ్చు తప్పులు అసంఖ్యాకం.

"అకస్మాత్తుగా ఆ దీపం
ఆకాశతారను చూసింది
రాకాసి కేకలు వేసింది
(నీకు నాకు చెవుల సోకని కేకలు)
ఆకాశతార ఆదరపు చూపులు చూసింది
దీపం ఆరిపోయింది
తారగా మారిపోయింది"

ఈ పాదాలకు మార్క్సిస్టు దర్శనానికి ఏమిటి సంబంధం? "మార్క్స్ దర్శనంతో ప్రభావితుడైన శ్రీశ్రీ 'ఆకాశదీపం' అనే గేయంలో ఇలా అన్నాడు" అని పై పాదాలు రచయిత ఉదహరించారు. ఇక్కడ సందర్భం దుర్గ్రాహ్యం. అట్లాగే— 'ధనికవర్గ ప్రయత్నాలు, ఎత్తుగడలు సాగవని, అదంతా వృథా ప్రయాసని ధనిక వర్గాన్ని హెచ్చరిస్తూ శ్రీశ్రీ యిలా అన్నాడు' అంటూ 'ది స్నోస్ ఆఫ్ ది ఎస్టర్ ఇయర్' అనే గేయంలోని పాదాలు ఉదహరించారు.

"జగద్గురువులు, చక్రవర్తులు
సత్కవీశులు. సైన్యనాథులు
మానవతులగు మహారాజ్ఞులు
కానరారేమి?
పసిడి రెక్కలు విసిరి కాలం
పారిపోయిన జాడలేవి
ఏవి తల్లీ నిరుడు కురిసిన
హిమ సమూహములు"

రచయిత వ్యాఖ్యానం సందర్భ శుద్ధి లేకుండా సాగింది. పై గేయంలో శ్రీశ్రీ చెప్పదలచుకున్నది పురావైభవం. కొంపెల్లజనార్దనరావు కోసం అనే వచన గేయం వీరరౌద్ర రస ప్రధానం అని చెబుతున్నారు రచయిత. మరోసారి సలాం గారు శ్రీశ్రీ వచనల్ని

క్షుణ్ణంగా అధ్యయనం చేస్తే వారి విమర్శనా పద్ధతిలో మార్పు రావచ్చు. రచయితే అన్నట్లుగా 'సాధారణ పరిజ్ఞానంగల వారికి సత్యరూప సాక్షాత్కారందుర్లభం.' చలంగారి శ్రీశ్రీ, సాహిత్యము-శ్రీశ్రీ, దర్శనము - శ్రీశ్రీ, కవిత్వము - శ్రీశ్రీ, మహాప్రస్థానం-శ్రీశ్రీ, కవిగా శ్రీశ్రీ ఎలా జీవించాడు అన్న ఆరు వ్యాసాల సంకలనం ఇది.

శ్రీశ్రీ కవితా వైభవం

[డా॥ మిరియాల రామకృష్ణ. వెల: రు. 5-00 లు. ప్రతులకు: 5 కింగ్సువే, సికిందరాబాదు-500 003 లేదా యువ భారతి కార్యాలయం, ఆంధ్ర సారస్వత పరిషత్ భవనములు, తిలక్ రోడ్డు, హైదరాబాదు-500 001]

యువ భారతి సంస్థవారు తెలుగు సాహిత్య రంగానికి చేస్తున్న సేవ గణనీయమైనది. వారి కార్యక్రమాల్లో ప్రసిద్ధులైన వారితో అంతకంటె ప్రసిద్ధులైన కవులపై, రచయితలపై వ్యాసాలు, విమర్శ గ్రంథాలు రాయించటం, ప్రచురించటం ప్రధాన భాగం. ఆ కోవలోదే ఈ పుస్తకం. మిరియాల రామకృష్ణగారు శ్రీశ్రీ రచనలపై సిద్ధాంత వ్యాసం రాసి పిహెచ్. డి. పట్టం పొందిన వారు. వారి సిద్ధాంత గ్రంథంలో చిన్న చిన్న కత్తిరింపులే శ్రీశ్రీ కవితా వైభవం అనే ఈ పుస్తకం.

శ్రీశ్రీ కవిత్వ ప్రారంభ కాలం నుంచీ వి. ర. సం. ఆవిర్భావం వరకూ శ్రీశ్రీ కవితల్లో పరిణామాన్ని సూచించే విధంగా ఖండికల్లోని ఖండాలను తీసుకొని విశ్లేషణ సాగించారు రామకృష్ణగారు. వారి సిద్ధాంత గ్రంథం మహాప్రస్థానంతో ఆగిపోతే ఈ గ్రంథం మరో ప్రస్థానం దాకా సాగింది.

వీరి వ్యాఖ్యలు శ్రీశ్రీ కవిత్వ జీవ లక్షణానికి దూరంగా ఉంటున్నాయని మరోమాట విధిలేక చెప్పవలసి వస్తోంది.

ఉదాహరణకు :-

"సంపెంగ విరిపైడి చాయలో నాకేమో
వంపు తేరిన కత్తివలె నుంటివీ రేయి"

అనే పాదాలకు వీరు వ్యాఖ్య చెబుతూ పైడిచాయ ధనానికి, వంపు తేరిన కత్తి క్రౌర్యానికి ప్రతీకలు. భవిష్యత్కవితాధ్యాయంలో ఈ కవి ధన స్వామ్య వ్యవస్థమీద విరుచుకు పడతాడు. దానికిది ఒకవిధంగా 'ప్రాతిపదిక' అని చెబుతున్నారు. ఈవ్యాఖ్యలో గల నిజాన్ని పాఠకులు గ్రహించగలరని నా ఆశ. మన కళ్ళలోంచి, మేధలోంచి కవిని చూట్టంకాదు. కవి అక్షరాల్లోంచి కవిని దర్శించాలి.

'ఆట వెలది ద్విపద కర్తగారు
5, 3, 2 ఆముక్త మాల్యద'

'5, 3, 2 ఆముక్త మాల్యద అనే పాదంలో అక్షరాలకు బదులు అంకెలు వాడటం వినోదక్రీడ. 5, 3, 2 అనేది ఒక పేకాట పేరు. ఆంధ్ర కవిత్వం అముక్త మాల్యద దగ్గర నారికేళపాకంగా మారిపోయింది. ఈ స్థాయీ పతనం అంకెల అవరోహణ క్రమం ద్వారా సూచింపబడుతోందా?' అని వ్యాఖ్యానించి వారికి వారే ప్రశ్నార్థకపు గుర్తు వేసుకొన్నప్పుడు సమాధానం పాఠకుడు చెబుతాడా ?

మొత్తం అరవయి మూడు ఖండాలకు వ్యాఖ్యానం యిది. శ్రీశ్రీని ఎట్లా అర్థం చేసుకోవడమో తెలుసుకొనటానికి ఇట్లాంటి పుస్తకాల అవసరం ఎంతైనా ఉంది.

నది కదిలొస్తే

[అన్నపురెడ్డి విజయభాస్కరరెడ్డి. వెల: రు. 6-00 లు. ప్రతులకు : 1. నవోదయ పబ్లిషర్సు, విజయవాడ - 2 లేదా 2. అన్నపురెడ్డి విజయభాస్కరరెడ్డి, అనుపాలెం, (పి.ఒ) వయా పిడుగురాళ్ళ గుంటూరుజిల్లా.]

నాగార్జున సాగర్ ప్రాజెక్టు దాని పుట్టు పూర్వోత్తరాలను ఆధారంగా చేసుకొని రాసిన కావ్యమిది. కావ్యంలో చాలా భాగం మాత్రాచ్ఛందస్సులో సాగింది. అక్కడక్కడ వచన గేయం ప్రయుక్తమయింది. ప్రధాన కథను ఆధారంగా చేసుకొని అనాటి (స్వాతంత్ర్య పోరాటం నాటి) ఒక పల్లె గాథను కూడా కావ్యస్తం చేశారు.

"పచ్చని ఊహల సాగిన
పైరగాలి పరిమళమది
కోటి కోటి శ్రమ జీవుల
కష్టానికి ఫలితమ్మది"

అని నాగార్జున సాగర్ ప్రాజెక్టును గురించి చెబుతారు.

రెడ్డిగారి శైలి సహజ సుందరం, అతి సరళం అయినది.

"హృదయాలను
వందించే మధువని
ఉదయాలకు
కదలించే రసధుని
తెలుగు జాతి ప్రాంగణాన
వెలిగిన మణి దీపమ్మది
దాహతప్త జనత కొరకు
తరలి వచ్చు మేఘమ్మది"

కావ్యం ఇట్లాంటి మధురమైన శైలిలో నడుస్తుంది. ఈ కావ్యంలో నాగార్జున జలాల మళ్ళింపు వలన, రమణీయమైన ప్రకృతి, పంటపొలాలు. పల్లెసీమల వాతావరణం శోభాయమానంగా వర్ణించడం జరిగింది.

దర్పణం

[విరజాజి రామిరెడ్డి. వెల : రు. 6-00 లు. ప్రతులకు : 1. వికాస భారతి, సాహిత్య సాంస్కృతిక సంస్థ, అలంపురం, మహబూబ్‌నగర్ జిల్లా. 2. శ్రీ శ్రీనివాస జనరల్ స్టోర్, బాదేపల్లి, మహబూబ్‌నగర్ జిల్లా]

ఈ కవితా సంకలనానికి కుందుర్తి 'భగవానువాచ' అంటూ పెద్ద పీఠిక రాశారు. ఆ పీఠికలో కావ్యాలలో కథాంశ యొక్క అవశ్యకతను అలవాటు ప్రకారం మరోసారి వక్కాణించారు. కుందుర్తి ప్రధానంగా ఆశించే అంశాలు రెండు. మొదటిది కవిత్వంలో సామాజిక స్పృహ, రెండవది కథాంశం. ఈ రెంటిని గురించి ఈ కావ్యాన్ని ఆధారంగా చేసుకొని పీఠిక రాశారు.

రామిరెడ్డిగారి కవిత్వంలో నేటి సమాజాన్ని గురించిన ఆవేదన పుష్కలంగా ఉంది. అవగాహన కొంచెం లోపించింది.

'ఇంతేలే ఈ జనం
ఇదొక గొర్రెదాటు రకం అనుకోకు
నటించే నాయకుడు
నడుంకట్టి ముందు నడిచినపుడు
ఈ జనమే
విశ్రమిస్తుంది'

అని ఆశావాదాన్ని బోధిస్తున్నారు కాని వారి అవగాహన లోపం సమస్యను సక్రమంగా ఆలోచించలేక పోవడంలో ఉంది.

'అన్న వస్త్ర సంపాదనయే
మనిషి జీవిత పరమావధి కాకపోవచ్చు
మనిషికి అవిలేనినాడు
ముందుగడ సాగించలేడు'

అని చెప్పిన కవిగారు

"ఇల్లిల్లు తిరిగి తిరిగి
ఇంతింత అడుక్కుతిని
తల్లీ పిల్లలు హాయిగా మైమరచి
నిద్రించిన బిచ్చగాళ్ళు
ఎల్లోరా శిల్పాల్లా కనిపించారు
....
మనిషికి, మానవ సంఘానికి
సంపద కన్నా
శాంతి ఎంత అవసరమో
అప్పుడు నాకర్థమైంది"

అని అంటున్నారు. సంపద, స్వార్థం, అడుక్కుతినటం, ఒకణ్ణి ఒకడు దోచుకు తినటం ఏ వ్యవస్థ లక్షణమో, ఆ వ్యవస్థ నిర్మూలనలో కవి బాధ్యత ఏమిటో తెలుసు కుంటే రామిరెడ్డిగారికి కావ్య పరమార్థం బోధపడుతుంది; ఒక [illegible]ంతో కూడిన కవిత్వం ఆవిర్భవిస్తుంది.

భీతాంగన

[దుర్గానంద్. వెల : రు. 20-00 లు. ప్రతులకు : 1) డ్రీమ్స్ కాలనీ, నూజివీడు, కృష్ణాజిల్లా; 2) సి. అంబికానాథ్, కమలా నగర్, (ఇ. సి. ఐ. ఎల్) హైదరాబాద్.]

దుర్గానంద్ అంతర్గోళాలు, చిరంతన మధూలిక మొదలైన అనేక కావ్యాలు రాసి ప్రసిద్ధులైనవారు. భీతాంగన అనే ఈ సుదీర్ఘ కావ్యం సంప్రదాయ మార్గంలో సాగిన వారి ఇటీవలి రచన. ఇతి వృత్తం అతి చిన్నది. దానిని నిర్వహించిన తీరులో ఈ కావ్యం 1200 పద్యాల వరకు పొడిగింప బడింది.

కొల్లేటి కోట చుట్టూ విస్తరించిన ఒక జీవితకథ ఆధారంగా ఈ కావ్యం రాయబడింది. గౌరి-సాగరం, గంగమ్మ - అప్పన్న, సంగయ్య - నారయ్య, హిమకరుడు - రజని ఈ పాత్రల చుట్టూ అల్లిన కథ ఇది. గౌరిని కొల్లేటి కోటలో కాపురముంటున్న సంగయ్య కొడుకు సాగరుడికిచ్చి పెళ్ళి చెయ్యటం, గౌరికి హిమకరుడు పుట్టడం, సాగరుడు అతని తల్లి ముంపువాత పడటం హిమకరుడు వరదలో కొట్టుకు పోవటం, గౌరికి ఉన్మత్త స్థి[illegible] రావటం, రజని చదువుకొనటం, హిమకరునకు మాతృమమకార[illegible] కలుగ చెయ్యటం మొదలైన అంశాలతో కథాగానం సాగుతుం[illegible]

ఇట్లాంటి కథను వచనంలోనో, వచన కవితలోనో రా[illegible] కథ చెడిపోతుందని దుర్గానంద్‌గారి అభిప్రాయం. అందుచేత ఆయన సంప్రదాయ ఛందస్సులను ఎన్నుకున్నారు. సాహిత్యం[illegible] రూపాన్ని గురించి ఎవరికుండే అభిప్రాయాలు వారి కుంటాయి[illegible] పద్యంలో రాసినంత మాత్రంలో గానీ, వచన కవితగా రాసిన[illegible] మాత్రంలో గానీ అది కవిత్వం అవుతుందని ఎక్కడా రూలులే[illegible] కవిత్వం నియమాలకు అతీతమయినది. "దాని రహస్యం క[illegible] తెలుసు" "కథ గానీ, నవలగానీ వ్రాయాలంటే యుద్ధం అవుస[illegible] లేదు. అది యుద్ధరంగం కాదు. క్రీడారంగం మాత్రమే." అ[illegible]

న్నారు దుర్గానంద్‌గారు. ఒక గొప్ప తెలుగు కథనో, తెలుగు నవలనో చదివితే అది రాయడం యుద్ధరంగమో, క్రీడారంగమో. తెలుస్తుంది. అసమర్థుని చేతిలో ఏ సాహిత్య ప్రక్రియ అయినా క్రీడారంగమే అవుతుంది. "నేను ఆంధ్రదేశంలో ఎవరికీ ఏమీ కృతజ్ఞతలు చెప్పవలసిన అవసరం లేదు. ఎందుకంటే ముప్పై ఏళ్ళ సాహిత్య శ్రమ ఫలితంగా నా చుట్టూ అసహనం, అసూయ. అభి శంసనం, ధిక్కారం, విభీషికలు తప్ప నాకు మిగిలింది ఏటూ లేదు" అని వేదన పడ్డారు దుర్గానంద్.

"రసవత్కావ్యము లెన్ని వ్రాసితివి వో
రా! నీకు నేమయ్యెనో!
కుసి వింటేల్ బడి నేల మాశిగపు ది
క్కున్నక్కి దాగుంటివా?
పసి కూనల్ దిను కైతలో పెరిగినా
ర్బ్రహ్మాండ మంతెత్తువాల్
బసి కూనై తి వినీవమోఘ కృతులు
ద్భాషించి యీ వాడలన్"

అన్న దుర్గానంద్‌గారి అభిప్రాయాలే అందుకు కారణం కావచ్చు. గౌరవించటం చేతకానివాడు గౌరవాన్ని ఆశించ కూడదు.

దుర్గానంద్‌గారి పద్యరచనాశక్తికీ, రసానుగుణమైన శైలికీ ఈ క్రింది పద్యం మంచి ఉదాహరణ.

''వితతో దగ్రజల ప్రవాహ చరణా
విద్ధ క్రియాకర్షితో
న్నత కుడ్య ప్రకరాశ్మబంధ రచనల్
నగ్నీ కృతానేక గుం
ఫితో సౌఖ్యప్రద గృహ్య వస్తుచయముల్
భీతిల్లి ఏ దిక్కు ర
క్షితమై కానక బుర్రగుసెన్ మునుగు నా
సీమన్ గటా! పక్షులన్!''

నారాయణరెడ్డి సాహితీమూర్తి

[డా॥ తిరుమల శ్రీనివాసాచార్య. వెల: రు. 30-00లు. ప్రతులకు: 1) యువభారతి, 5, కింగ్సువే, సికిందరాబాద్-500 003; 2) యువభారతి కార్యాలయము, ఆంధ్ర సారస్వత భవనములు, తిలక్ రోడ్, హైదరాబాద్ - 500 001]

నారాయణరెడ్డి అక్షర జగత్తు ఆరంభ కాలం నుంచీ ఈనాటి విశ్వంభర వరకు ఆయన రాసిన నాటికల, గేయ నాటికల, మాత్రా ఛందస్సుల, వచన కవితల, కథాకావ్యాల, పరిశోధనా గ్రంథాల, విమర్శనా వ్యాసాల, యాత్రానుభవసారాల, సినిమా కవిత్వ పాటలపై సమీక్షా గ్రంథం ఇది.

తిరుమల శ్రీనివాసాచార్యగారు నారాయణరెడ్డిగారిపై, ఆయన సాహిత్యంపై మిక్కిలి ఎక్కువ కలవారుగా ఈ గ్రంథం చెప్పక చెప్పుతున్నది. ఈ గ్రంథంలో ప్రత్యేకత నారాయణరెడ్డిగారి రచనలుఎప్పుడు ఎవరు అచ్చువేసినదీ తేదీలతో సహా అందివ్వడంలో ఉంది.

నారాయణరెడ్డిగారు హృదయ దఘ్నంగా భావకవి; కాల ధర్మంగా అభ్యుదయకవి; మానవత దృష్ట్యా తీవ్రవాద కవిత్వంపై సానుభూతి దృక్పథం కలిగిన కవి. కరుణ శృంగార, రౌద్ర రసాలు ఏకకాలంలో, ఏక కలంతో త్రి దిక్కులా ప్రవహింప చేయగల త్రివిక్రముడు శ్రీ నారాయణరెడ్డి. సృజన శక్తి, పరిశోధన శక్తి, పరిశీలనశక్తి ముప్పేటలా ముడవేసుకొన్న సాహితీ సౌజన్య మూర్తి శ్రీ నారాయణరెడ్డి. సృజనలోనూ, అను సృజనలోనూ అందెవేసిన చేయి ఆయనది.

ఆయన సాహితీ మూర్తిమత్వంమీద ఆచార్యగారు రాసిన సమీక్షా గ్రంథాన్ని యువభారతి వారు ప్రకటించటం అభినందనీయం. ఆచార్యగారు నారాయణరెడ్డిగారి పేరు చెప్పి నప్పుడల్లా పరవశమైపోయి ''మహా కవి నారాయణరెడ్డి'' ''నారాయణరెడ్డి మహాకవి'' "అభ్యుదయ కవి నారాయణరెడ్డి" "నారాయణరెడ్డి అభ్యుదయకవి'' అని అనటం జరిగింది. ఇట్లా చెప్పటంవల్ల అది దండకంగా మారే ప్రమాదం ఉంది.

రచయితపై ఆయన రచనలపై అభిమానాన్ని అక్షరబద్ధం చేసేటప్పుడు సమీక్షకుడు సంయమనంతో ఉండటం ఉత్తమలక్షణం. కవిత్వాన్ని విశ్లేషించేటప్పుడు 'ధ్వని తరముగానున్నది' 'రమ్యతరముగా నున్నది' "రసరమణీయముగా నున్నది" ఇత్యాదులైన మాటలు వీలైనప్పుడల్లా చొప్పించి వదలి వేయటం చౌకబారుపద్ధతి. రాసేందుకు ఏమీ లేకపోతే చేయతగ్గ పని ఇది.

ఆచార్యులవారు ప్రత్యక్షర పరిశీలనకు మళ్ళి ప్రతి గ్రంథాన్నీ విడివిడిగా తీసుకొన్నారు, మంచిదే. కాని రెడ్డిగారి కవితా తత్వాన్ని మొత్తంగా కొన్ని అంశాలుగా వింగడించుకొని ఒక్కొక్క అంశంపై చక్కగా విశ్లేషణ ఇచ్చి ఉండేబాగుండేది. ప్రస్తుత సమీక్షాగ్రంథం అట్లా లేకపోవటంవలన కేవల సమాచార గ్రంథంగా మాత్రమే తయారయిందని చెప్పటానికి విచారిస్తున్నాను.

శ్రీ టి. ఎల్. కాంతారావు

రస సిద్ధాంతము - ఆంధ్రుల వరివస్య

[రచన : డాక్టర్ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి (భాషా ప్రవీణ), తెలుగు లెక్చరర్, ఆంధ్రప్రదేశ్ గురుకుల కళాశాల, విజయపురి సౌత్. 522 439 డెమ్మీ 16+440 పుటలు. వెల రు. 25 లు. ప్రతులకు 1) శ్రీ వి. ఎస్. గంగాధర కుమార్, ఎ-58, విజయపురి సౌత్-522 439 (లేక) 2) నవోదయ పబ్లికేషన్స్, ఏలూరురోడ్డు, విజయవాడ.]

అందరూ ఆనందాన్నే కోరుతారు. సామాన్యంగా అందరూ కోరేది లౌకికానందం. ఐహిక సుఖాలు అశాశ్వతాలని గ్రహించిన తత్త్వవేత్తలు కోరేది పారలౌకికమైన బ్రహ్మానందం. అదే శాశ్వతమైనది. లౌకికమైన ఆనందం కావ్యామృత రసాస్వాదం వల్ల కలుగుతుంది. అది బ్రహ్మానంద సబ్రహ్మచారి. ఆ ఆనందానికి ముఖ్య కారణం రసమే! సాహిత్యలక్షణ వేత్తలు తమ గ్రంథాలలో రస స్వరూపాదులను గురించి వివరంగా తెలియజేశారు. భరతముని తన నాట్యశాస్త్రంలో తొలిసారిగా రస స్వరూప లక్షణాదులను వివరించాడు. కావ్యాత్మను గురించి లక్షణ వేత్తలతో విభిన్నాభిప్రాయాలు ఉండినా, అందరూ రసానికి తగిన స్థానాన్నే ఇచ్చారు. ఆనందవర్ధనుడు ధ్వనియే కావ్యాత్మ అని నిరూపించగా, అభినవ గుప్తుడా వాదాన్ని సమర్థించాడు. తర్వాత మహిమభట్టు, కుంతకుడు మున్నగువారు వేర్వేరు అభిప్రాయాలను తెలిపినా ఆవరకు ధ్వనివాదమే నిలిచింది. మమ్మటాచార్యుడా వాదాన్ని బలపరిచాడు. తర్వాతి ఆలంకారికు లందరూ అతని మార్గాన్నే అనుసరించారు. వస్తు - అలంకార - రసభేదాల వల్ల ఆ ధ్వని ముప్పేధా లయినా రసధ్వనియే ప్రధానమైనదని అందరూ ఏకగ్రీవంగా సమ్మతించారు. ఆనందానికి అదే ప్రధానం గదా! ఆ రస సిద్ధాంతాన్ని గురించి యీ గ్రంథంలో విపులంగా చర్చించబడి, ఆ విషయంలో ఆంధ్రులకు గల స్థానం విశదీకరించ బడింది.

తెలుగులో ఛందో వ్యాకరణ గ్రంథము లెక్కువగా ఉన్నవి. కాని అలంకార గ్రంథములు ఎక్కువగా లేవు. ఈ శతాబ్దిలోని తొలిపాదం నుంచి సంస్కృతాలంకార గ్రంథములకు అనువాదాలు మాత్రం వెలువడ సాగాయి. ఎన్నో గ్రంథాలకు అనువాదాలు, అనుసరణలు వచ్చాయి. కాని ప్రాచీన సాహిత్య సంప్రదాయాన్ని అనుసరించిన పరిశీలన గ్రంథాలు ఎక్కువగా రాలేదు. అందులోను, రసచర్చకు సంబంధించిన బృహద్గ్రంథాలు వచ్చినట్లు నాకు తెలియదు. ఈ గ్రంథం కేవలం రసవిషయాన్నే గ్రహించి విస్తృతంగా పరిశీలించి పెక్కు విషయాలను అందిస్తున్నదని చెప్పవలసి ఉన్నది.

దీన్ని రచించిన డాక్టర్ రామకృష్ణమూర్తిగారు తొలుత గురుకులవాసం చేసి సంస్కృతాంధ్రాలలో మంచి పాండిత్యం సంపాదించి, భాషాప్రవీణులై, ఆంగ్లభాషతోసహా ఎం. ఏ. పట్టాన్ని గడించి డాక్టర్ పట్టా కోసం పరిశోధనకు రస విషయాన్నే గ్రహించారు. వీరి సిద్ధాంత వ్యాసం ముగ్గురు పర్యవేక్షకుల ఏకగ్రీవామోదాన్నీ, ప్రకటనకు ప్రోత్సాహాన్నీ పొందిందట. పరిశోధనలో ఆయనకు తోడ్పడిన డాక్టర్ ఎస్వీ. జోగారావుగారు, రాంభట్ల లక్ష్మీనారాయణశాస్త్రిగారు ఆయన ప్రయత్నాన్ని అభినందించారు.

ఈ సిద్ధాంత వ్యాసరచనలో రామకృష్ణమూర్తిగారు సంస్కృతాంధ్ర కావ్య నాటకాలంకార గ్రంథాలను నూటయిరవైకి పైగా పరిశీలించారు. ఆంగ్లంలోని కొన్ని గ్రంథాలను చూచారు. ఈ విషయం వీరిచ్చిన గ్రంథపట్టిక వల్ల తెలుస్తున్నది.

రససిద్ధాంత ప్రాశస్త్యము, రససామగ్రి, రసానుభూతి, రససిద్ధాంతము - ఉత్పత్తి వికాసములు, రససంఖ్య, రసవాదము, రసభేదములు. రసాభాసము, ఆంధ్రుల వరివస్య - సంస్కృతము, ఆంధ్రుల వరివస్య-తెలుగు, తెలుగు కవుల రసదృష్టి, ఉపయుక్త గ్రంథములు-అనునవి ఇందలి ప్రధాన శీర్షికలు. ఆయా శీర్షికలకు సంబంధించిన విషయాలన్నీ వాటి ఉపశీర్షికలలో ఇయ్యబడినవి.

రస విషయక చర్చలో రచయిత ప్రాచీనాలంకారికుల అభిప్రాయాలను వివరిస్తూ, ఆంధ్రుల అభిప్రాయాన్ని విస్తృతంగా వివరించదలచినట్లు గ్రంథనామాన్ని బట్టియే తెలుస్తున్నది. ఆంధ్రులలో ప్రసిద్ధాలంకారికులైన విద్యానాథుడు, విశ్వేశ్వర పండితుడు, సింగభూపాలుడు, జగన్నాథ పండితుడు మున్నగువారు మమ్మటాదుల మార్గాన్నే అనుసరించారు. వారి సిద్ధాంతాలు, పరిశీలనదృష్టి ఇందులో వివరించబడింది. సంస్కృతాలంకారికులలో, ఆంధ్రులు ఉన్నత స్థానాన్నే ఆక్రమించారు.

తెలుగులో అలంకార శాస్త్ర గ్రంథాలని చెప్పుకోదగినవి విన్నకోట - పెద్దయకవి కావ్యాలంకార చూడామణి, మూర్తికవి నరస భూపాలీయం మాత్రమే! వాటిలో చూడామణి ప్రాచీనం. అందులో ఛందో వ్యాకరణ భాగాలు కూడా ఉన్నవి. అలంకార శాస్త్రాంశాలలో అవ సిద్ధాంతాలు చాలా ఉన్నవి. పెద్దిరాజు చాలా వరకూ దండికావ్యాదర్శాన్ని అనుసరించాడు. రసచర్చ తావన్మాత్రమే! నరస భూపాలీయం ప్రతాప రుద్రయశోభూషణాన్ని అనుసరించినట్లున్నది. రసాన్ని గూర్చి అందులో స్పష్టంగా చెప్పిన విషయాలు ఇందులో అస్పష్టంగా కానవస్తాయి. రసాభరణాదులు రసమంజరిని అనుసరించినవి! అందువల్ల తెలుగులో వ్రాసిన గ్రంథాల్లో ప్రత్యేకత కానరాదు. ఛందో వ్యాకరణ గ్రంథాల్లో

అలంకార శాస్త్ర విషయాలు, సందర్భాను సారంగా స్పృశించబడి నవి. అవి కావ్య భాషకు, పద్య రచనకు సంబంధించినవి కాబట్టి యీ విషయంకూడా కొంచెం ప్రస్తావించబడినది. కాని రామకృష్ణ మూర్తిగారు రస విషయంలో చింతామణి, అహోబల పండితీయ, అప్పకవీయాదులనుకూడా ఇచ్చి ఆ రచయితలను అందలం ఎక్కించారు.

బహుగ్రంథాలను పరిశీలించి కూర్చబడిన యీ గ్రంథం వల్ల - పాఠకులు వాటిలో ఉన్న విషయాలను శ్రమలేకుండా తెలిసి కొనుటకు అవకాశం కలుగుతున్నది. ఈ విషయంలో వీరిపరిశ్రమ ప్రశంసనీయం. రస విషయంలో భట్టలోల్లట, భట్ట నాయకాదుల సిద్ధాంతాలను గురించి సాహిత్యాభిమాను లందరూ ఈ గ్రంథంవల్ల తెలుసుకోవచ్చును. కావ్యతత్త్వాన్నీ, రసతత్త్వాన్నీ తెలుసుకొన దలచిన వారికి ఈ గ్రంథం మిక్కిలి ఉపయోగిస్తుంది.

"ఆంగీరస"

భూమి

(కథల సంపుటి)

[రచయిత : అల్లం రాజయ్య, ప్రచురణ : కరీంనగర్ బుక్ ట్రస్ట్, కరీంనగర్-2. పేజీలు : 87. వెల : ఏడు రూపాయలు ప్రాప్తిస్థానం : సృజన, కుమార్‌పల్లి, హన్మకొండ - 506001 మరియు పీస్ బుక్ సెంటర్, సుల్తాన్‌బజార్, హైదరాబాదు]

సమసమాజ ఆవిర్భావం కోసం, సాటిమనిషిని గుర్తించాలని కోరుతూ, ప్రతీ అక్షరంతో స్టెన్‌గన్‌లు పేలుస్తూ, ఎర్రబావుటా కోసం, రక్తపుష్పాలు పరిచిన బాటలో, తెలుగు కథ నడవటం మొదలు పెట్టింది. ఈ కథల రచయితలు చీకటికీ, ఆకలికీ, దౌర్జన్యానికీ, దోపిడీకీ, విరోధులు. మార్క్సిజానికీ, మానవతకీ సన్నిహితులు. వాళ్ళకు జీవితం ఒక పోరాటం, సమాజం బాధ వీరిబాధ. ఆ బాధలగాథలే ఈ కథలు.

ఈ కథలు భూసారాన్ని నించుకుని, భూగర్భాన్ని చీల్చుకుని వచ్చిన ప్రాణపూర్ణమయిన మొలకెత్తిన బీజాల వంటివి. వీటి నుంచే వస్తుంది ఫలసంపద. ఈ ఫలసంపద ప్రజాపరం కావాలి. ప్రజలను చేరుకుని వారిని వెన్నుదట్టి నిలబెట్టాలి. దోపిడీకీ, దగాకీ, అన్యాయానికీ, అక్రమానికీ వ్యతిరేకంగా ప్రజలను జాగరితంచేసి సంఘటితుల్ని చేయాలి. అందుకోసం ఈ కథలు కొత్త పద్ధతుల్ని వెతికి పట్టుకోవాలి. ఈ కోవకు చెంది — భూమి, చేపలు అడివిపసిషి, మార్పు, శత్రువు నేర్పిన పాఠం — అన్న పేరుగల అయిదు కథలు చోటుచేసుకున్న ఈ పుస్తకం నిరంతరం పేల్తున్న బాంబులాంటిది. ఈ కథలలో పదును వున్నది. దృష్టిలో నైశిత్యం వున్నది. శైలిలో జవం, జీవం, ఆవేదన వున్నాయి. భాషలో పటిమా, దేశికలూ వున్నాయి. పుష్కలంగా ఆవేశం వున్నది.

కేవలం రాయటం గాక ప్రజలకు చెప్పబూనటం ఈ కథల లోని విశిష్టత. వీటిలో ఒక మనిషిని గురించిగాక, చాలా మంది మనుషుల్ని గురించిన కథనం వున్నది.

వీటిల్లో శిల్పం వున్నది. ప్రతిపాదించబడిన వస్తువు చివరకు అందించవలసి వున్న ప్రభావం గురించిన ఆలోచన వున్నది. ప్రయత్నమూ వున్నది.

ఈ కథలలోని పాత్రలు, ఘర్మ జలాన్ని పోసి, భూమిలో విత్తనాలు నాటి, పంటలు పండించాలని తహ తహలాడే కష్ట జీవులు. కానీ, వ్యవస్థలోని పద్ధతులు వారినుంచి భూమినీ, న్యాయాన్నీ, దుర్మార్గంగా వేరు చేయ బూనటంతో - ఆ ఆవేదన తిరుగుబాటుగా రూపు దాల్చబూనటం వీటిల్లోని ప్రధాన వస్తువు.

తెలంగాణా మాండలికంలో సాగిన కథలలోని భాష సజీవమై, ఒక ఏరులాగా, వాగులాగా, వడిగా పరవళ్ళతో సాగుతుంది. పాఠకుడ్ని ప్రభావితుడ్ని చేస్తుంది.

గంగన్న, నక్కలాలు, వీరయ్య, సారయ్యలు వంటి, ఎందరో దగాపడిన, దౌర్జన్యాలకిగురయిన సామాన్యులు, వ్యవస్థా పద్ధతులలో నలిగిపోయి, నిట్టూర్చి, జాగృతులయి, ఒక్కసారిగా తలెత్తి కొత్త వ్యవస్థకోసం బుసలు కొట్టటం, ఆ గుండెలలో సంచలనం చెలరేగటం ఈ కథలలో శక్తిమంతంగా చెప్పబడింది.

ఈ పుస్తకంలో చోటుచేసుకున్న రమణారెడ్డిగారి మాటలూ, రామకృష్ణారెడ్డిగారి ముందుమాటా రచయితలకు అవశ్యం శిరోధార్యాలు.

ఈ కథలకు తీసుకున్న వస్తువులో వైవిధ్యం కొరవడి నట్లనిపించినా, అవి నిస్సందేహంగా తెలుగు కథకు ఎదుగుదల నివ్వగల కథలు.

ఈ పుస్తకాన్ని తీసుకుని రావటంలో చేయివున్న అందరూ రచయితతోపాటు అభినందనీయులు. పుస్తకాన్ని కొని, దాచుకుని మళ్ళీ మళ్ళీ చదవాలనిపించే లక్షణం ఈ పుస్తకంలోని కథలకు వున్నది.

రెండో మనిషి
(కథల సంపుటి)

[రచయిత : ఖాసిం యూసుఫి. ప్రచురణ : నిశి పబ్లికేషన్స్, చిత్తూరు. పేజీలు : 40. వెల : ఆరురూపాయలు. ప్రతులకు : నిశి పబ్లికేషన్స్, రాగిమానువీధి, మిట్టూరు, చిత్తూరు వారికి వ్రాయాలి.]

"అనంత 'స్థల-కాలం'లో పరిణామాంతర్గతమయిన మార్పు అనంతరం మార్పు మన సమస్య. మారని విలువల పునాదులపై సామాజిక సంబంధాలు వృద్ధి చెందుతూ, మారుతూ, యీ విలువలకు దూరమవుతున్నాయి (!) కాబట్టి విలువలు మృతప్రాయమయి పోతున్నాయి. యీ నిరంతర మార్పులలో ఏది సరియయింది? యెందుకు తాత్కాలికాల మధ్య వైరుధ్యం? ఏమిటిది?" అంటూ, అయోమయంగా అల్లించిన ఒక నిర్వచనం, అర్థంగాని ఒకప్రశ్నా మొదటి పేజీలలో ఇవ్వబడిన ఈ పుస్తకంలో, రెండోమనిషి, ఆత్మహత్యకు ముందు, నిరీక్షణ, చీకటి నీడలు, అన్న పేర్లుగల నాలుగు చిన్న చిన్న రచనలున్నాయి.

ఈ రచనల్లో కథలు అన్పించుకోగల లక్షణాలు మృగ్యం.

-దుర్వాసన, వాంతి ప్రబోధితంగా వుంది. అతను ఆడవాళ్ళ శరీరాన్ని నాకుతుంటాడు. పళ్ళతో మెల్లమెల్లగా కొరుకుతుంటాడు. యిలా నాకించి కొరికించు కోవటంలో వున్న తృప్తీ హాయీ, వారికి తమ భర్తలతో బిడ్డల్ని పుట్టించు కోవడంలోనూ కలగడం లేదు. అందరూ తమ తమ బురల్లలో నిమగ్నులై, యితరుల పుర్రెలను నాకుతున్నారు. రెండు వేర్వేరు పదార్థాలు యెప్పుడూ ఓ బిందువు వద్ద నిలబడవు. నా చిన్న ప్రేవుల్ని, పెద్ద ప్రేవుల్ని, కాలేయాన్ని, మలినాన్ని లోపల వేసుకున్నాను. బయట మేఘాలుండి కూడ, చంద్రుడు తన భయంకర వెలుగులో నా మెదడు నాకుతున్నాడు. మేమిద్దరం మౌనాన్ని బాహువుల్లో ముడుచుకొని పోతున్నాం. పంది నాకడంతో దుర్వాసన ఎక్కువ కాసాగిందే కాని, దుర్గంధం బయటికి రాలేక పోయింది-మొదలయిన అసహ్యమైన, విచిత్రమైన వర్ణనలుగల ఈ రచనలు ఏ ప్రయోజనాన్ని ఆశించి చేయబడినాయో అర్థం కాదు.

ఇంచుక మానసిక సంఘర్షణతో, శక్తిమంతంగా సాగిన ఈ రచనలు, స్పష్టతనీ, శిల్పాన్నీ, పరమార్థాన్నీ వదలిపెట్టి, అయోమయాన్ని సృష్టిస్తాయి. మనిషిలోని అంతస్సంఘర్షణను, మానసిక వైక్లబ్యాన్ని చిత్రించబూనిన ఈ రచనలు, అస్పష్టత ఎక్కువయిపోయి, తగిన ప్రయత్నం కొరవడి, ఘోరంగా ఫెయిలయినట్లనిపిస్తుంది.

వస్తువు గురించీ, శిల్పం గురించీ, మరింత కృషి జరిగిన నాడు, ఈ కలం నుంచి శక్తిమంతమయిన మంచి రచనలు రాగల అవకాశం వున్నదన్న విషయం, ఈ పుస్తకం బోధ పరుస్తుందని అనాలి.

క్లుప్తంగా ముగియటం ఈ రచనల్లోని ఒక ప్రత్యేకత.

ఏ ప్రయోజనాన్నీ ఆశించకుండా అర్థాంతరంగా ముగియడం అసహజమయిన, అస్పష్టమయిన వర్ణనలూ, వీటిల్లోగల ఒక స్పష్టమయిన లోపం. ఏ కారణం వలన వీటిని కథలుగా పేర్కొనటం జరిగిందన్నది అర్థం కాని విషయం.

కేవలం నాలుగు చిన్న రచనలతో, నలభయి పేజీలు గలిగిన ఈ పుస్తకాన్ని, ఆరు రూపాయల వెలకు, పాఠకుని ముందుపెట్టి కొనుక్కోమనటం న్యాయంగా అనిపించదు.

పాఠకుని సహనాసక్తిని ఈ పుస్తకం పరీక్షకు పెడుతుందని అనటంలో అన్యాయం ఏ మాత్రంలేదు. పుస్తకం ముద్రణ బాగుంది. ముఖచిత్రం ఏమంత బాగా వున్నట్లనిపించదు.

శ్రీ పొలడుగు వెంకటేశ్వరరావు

కథంబం
(మినీ కథల కదంబం)

[సమర్పణ : గుంటూరు సాహితి, 6/5, హెచ్. నెం. 6-6-6, అరండల్‌పేట, గుంటూరు - 522 002. వెల : అయిదు రూపాయలు, పేజీలు : 86.]

బులుసు వెంకట కామేశ్వరరావుగారి సంపాదకత్వంలో. వివిధ రచయిత(తు)లు వ్రాసిన 'మినీకథల' కూర్పు యిది సంపాదకులు వారి 'మాటల్లో' ఇట్లా చెప్పారు :

"ప్రస్తుతం మనమంతా 'స్పీడ్' యుగంలో పరుగెడుతున్నాం. మన జీవితాలు యాంత్రికమై పోయాయి .... జీవన పోరాటంలో మనకి చాట భారతాలు చదివే తీరికలేదు. ఇది 'మినీ' యుగం. ఈ 'మినీ' యుగనీతి ననుసరించే ఈ సంకలనం వెలుగు చూసింది. ఎంత చెట్టుకు అంతగాలి అన్నట్టు మినీకథ ప్రయోజనం మినీకథ కుంది."

మినీకథల ప్రయోజనం చాలా తక్కువనే చెప్పాలి. వడ్లగింజ మీద విష్ణుమూర్తినో, లేక సీతారామాంజనేయస్వామినో

శిల్పంగా చెక్కడం ఎంత కష్టమో, మినీకథ కూడా రాయడం అంతే కష్టం. చాలా మంది ఇది చాలా తేలికైన ప్రక్రియ అనుకుని చేపట్టడం సహజం. కానీ పాఠకుడి హృదయాన్ని తాకటానికి కథకు కొంత నిడివి అవసరం. ఎంతో ప్రతిభతో వ్రాస్తే తప్ప, మినీ కథలు జోకులుగానో, పత్రికల్లో వార్తగానో, కాలక్షేపం కబుర్లుగానో కనిపిస్తాయి.

ఈ సంకలనంలో ఇరవైమూడు మినీ కథ లున్నాయి. పైన చెప్పినట్టు, అన్నీ కాకపోయినా, కొన్ని కథలు జోకులుగా, కొన్ని వార్తలుగా వున్నాయి. ఏమైనా ఇటువంటి పుస్తకాలు రావడం అభినందించదగ్గ విషయమే.

— బాబు

గ్రంథ స్వీకారాలు

కథ మంచి కథలను ప్రచురిస్తున్న 42 పేజీలు గల ఈ పుస్తకం వెల రూపాయి. వివరాలకు: లిపారియా, ట్రెజరర్, 41/ఇ, బ్రహ్మానంద నగర్, మలక్‌పేట. హైదరాబాదు - 500 036.

వ్యాయామ శతకము రచన: స్వర్గీయ కర్ణ వీర నాగేశ్వర కవి. పేజీలు: 20. మూల్యము: రు. 1-50, ప్రతులకు: శ్రీమతి కర్ణశ్రీ శ్యామలాంబ, ఎమ్. ఐ. జి ఐబి/33, తులసి సదనము, మువ్వల వాని పాలెం, విశాఖపట్నం - 530 017.

ఉద్యమం రచన: ఎస్వీ. సత్యన్నారాయణ. వెల: రూ. 2-50, పేజీలు 6, ప్రతులకు: ఆంధ్ర ప్రదేశ్ ప్రజా నాట్య మండలి కార్యాలయము, హిమయత్‌నగర్, హైదరాబాదు.

ఎక్స్‌రే: ఆధునిక కవితా వేదికలోంచి ప్రచురించిన కవితలుగల 14 పేజీల ఈ పుస్తకం సాలు చందా రూ. 6/-. ప్రతులకు: ఎక్స్‌రే పబ్లిషర్స్, కొల్లూరి హవుస్, అమలాపురము-533 212.

ప్రజాసాహితి లూషన్ శత జయంతి ప్రత్యేక సంచిక. వెల: రూ. 2-50. పేజీలు: 114. ప్రతులకు: మేనేజర్, "ప్రజాసాహితి", ఇంటి నెం. 29-12-13, వెంకటరత్నం స్ట్రీట్, సూర్యారావుపేట, విజయవాడ-2.

ఎర్రగులాబి (బల్గేరియా ప్రజా రిపబ్లిక్ చరిత్ర) రచన: జె. నరేంద్రదేవ్. పేజీలు: 100. వెల: రూ. 5/-. ప్రతులకు: పి. భీమారావు, ప్రధాన కార్యదర్శి, భారత-బల్గేరియా మిత్రమండలి, ఆంధ్రప్రదేశ్ కమిటి, 2వ లైను, జూట్‌మిల్, గుంటూరు - 522 006.

సద్గురు ఆధ్యాత్మిక మాసపత్రిక. సంవత్సర చందా 15 రూపాయలు పేజీలు 25. వివరములకు: "సమర్థ సద్గురు" మాసపత్రిక, శ్రీ కాళీగార్డెన్స్ 522 508, గుంటూరు జిల్లా.

వెల్లువ కథా, కవితా సంచిక. పేజీలు: 12. వెల: 30 పై. ప్రతులకు: నూతన సాహితి, సిరిసిల్ల - 505 301.

స్పృహ పేజీలు: 22. వార్షిక చందా 6 రూపాయలు. వివరాలకు: స్పృహ, కేరాఫ్ రమేష్ రాజు, ఆకులవీధి, బరంపురం - 1.

శ్రీరామ రక్షాస్తోత్రమ్ ప్రతులకు: పి. రాధా కృష్ణమూర్తి, 29-6-13 డి, జయశ్రీ టాకీస్‌రోడ్డు, లక్ష్మీవారపుపేట, రాజమండ్రి - 4.

ఎక్స్‌రే లోంచి ఆధునిక కవితా వేదిక ఈ పుస్తకంలో 14 పేజీలు కలవు. సాలు చందా రూ. 6/-. ప్రతులకు: ఎక్స్‌రే పబ్లిషర్స్, కొల్లూరి హవుస్, అమలాపురం - 533 212.

చైతన్య దీపికలు (ఆధునిక కవితా వేదిక). సాలు చందా రూ. 5/-. ప్రతులకు: అద్దేపల్లి భరత్‌కుమార్, గవర్నమెంటు హాస్పిటలు రోడ్డు, బాపట్ల - 522 101.

ఏది మినీ కవిత? రచన: రావి రంగారావు, వెల: రూ. 25/-. వివరములకు రచయిత పేరుతో, స్పందన సాహితీ సమాఖ్య (రిజిష్టర్డ్), 26-162, బుట్టాయి పేట, మచిలీపట్టణం - 521 001.

Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd., by S. Radhakrishna at the Andhra Patrika Press, Gandhinagar, Vijayawada-3. Editor: S. Radhakrishna, Vijayawada. Phones: 75667 & 61247.